ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 450
వెల : రూ.25/-
ఆగస్టు &
సెప్టెంబర్ 2022




జనసాహితి ప్రచురణ

కవిత

# వేచి చూడకు - కలిసిపో

- ఛాయరాజ్

కాస్త శక్తులను సమీకరించు
గుండెలను బాణాలను చేసి సారించు
కండల ఈటెలతో కొట్టు - అటు చూడు
అరుణార్కుని చప్పట్లకు తుళ్లిన
రక్తతేజచ్ఛటల నావాహించి ఎర్రగించు
సాహసాలను వికేంద్రీకరించి చూడు
పాలకుల ఆగడాలు -
బక్కవాని మెడలో బండల దండలేసి పరిహసిస్తున్నవి.
శ్రమజీవుల నెత్తురు కన్నీళ్లను
చండశాసన రుమాళ్లతో చెక్కిళ్ల మీదకు రక్కుతున్నవి -
శాస్త్రీయంగ ఆలోచించి చూడు....
భూస్వాముల పొలాలలో రైతుకూలీలు పెరగరు -
పుట్టి చస్తారు
భూములకై పోరాడుతున్న రైతులను మిగల్చరు -
కాల్చి చంపేస్తారు.
అప్ప చెల్లెల్లను ఆయిల్ కంట్రీలకమ్మేస్తారు
కాకపోతే కామాంధులు -
పట్టపగలు శీలాన్ని భంగపరచి శవాలను
పోస్టుమార్టం చేస్తారు.
నరహంతల కడుపులు కాల్చి - చూడు
ధరాధిపతుల దురాగతాలను పేల్చి చూడు.
మిల్లులో పనిచేసే ఒళ్లు రేపటి పనికే మిగులుతుంది,
ఫ్యాక్టరీలో వికలాంగులైన కార్మికులు
భిక్షమెత్తుకొనే భవిష్యద్బతుకులు,
యింజనుకు బలిపడ్డ తండ్రికి బిడ్డలు
దిక్కులేక రెక్కలులేని సరికొత్త భారతం పక్షులు,
ఇవన్నీ పారిశ్రామిక పిల్లులకు మేతలు -
నేతలైన వ్యాపారస్తుల గుండెలు దిగ్గురనగచూడు
పాపిస్టులైన ఫాసిస్టులను కూల్చచూడు.
నా దేశం నడిబొడ్డున ఆర్థిక సంక్షోభాల
సుడిగుండాలు తెరచి,
నా సమాజం కళ్లలో పెట్టుబడుల నలుసులు పోసి,
శ్రమజీవుల జబ్బలను హైపోథికేట్ చేసి
నుదుళ్ల మీద తీరని అప్పు ముద్రికలు కాల్చి,
స్వదేశీ పీడకుల పునాదులను పదిలపరుస్తూ
కోటివిధాల మనబతుకులకు బీటలుకొడుతున్న
సామ్రాజ్యవాదుల కుదుళ్లు కూల్చి - చూడు
జనాంతక స్నేహ సంబంధాల సూత్రాలను త్రెంచిచూడు.
నిన్నటి పెరడులో మొలకేసిన చింత నిప్పుల విత్తులు
రేపటి ప్రచండ జ్వాలావృక్షజాలాలు
నేడు పెంచిన మహోత్తుంగ తరంగాల అంచుల మీద
సానబట్టిన కష్టజీవుల ఆలోచనలే కత్తులు
తెగేసిన చీకటి శకలాలను పేర్చి దురంతాలను తగలెట్టిజూడు
ప్రతిఘటనల ఊపుకు ఊగిపోతున్న అధికారాలకు
దన్నెట్టిన తుపాకులను మేపేవే నల్ల చట్టాలు
కూలిపోతున్న సింహాసనాలను నిలుపుకునే
ప్రయత్నాలే నిర్బంధ శాసనాలు
ప్రజల చూపులకు ప్రెస్‌బిల్ కాటరాక్టులు
వారసత్వాలు పోగొట్టుకుంటూ పిచ్చెక్కిన నియంత
చేతిరాత్లే సవరించిన 'లా'లు
బందిపోట్లకు కిరీటాలు తగిలించడం
పోలీసులను న్యాయనిర్ణేతలను చేయడం
అనాలోచితంగాదు - మానవత్వాలకు చితులు పేర్చడం
గతితార్కికంగా ఆలోచించి బలంగా చూడు
గుమిగూడి సమిష్టిశక్తిగా ఒకే ఒక ఆలోచన చెయ్యి
దుర్బలులెత్తిన దివిటీలలో బలవంతుల చట్టాలు
భస్మీపటలమవుతాయి
బలహీనులెత్తిన బాణాకర్రలకు బలవంతుల తుపాకులు
బందీలవుతాయి
అణగారిన జనం ఆవేశంలో 'అందలం' నెర్రలేస్తుంది
కార్మికుల కడుపుమంట, నడుస్తున్న కథకు
నాయకత్వం వహిస్తుంది
కర్షకుల కలేజా, పోరురథానికి యిరుసు
నిర్భయంగా ప్రకటించు వర్గపోరాటాన్ని
సహస్ర హస్తాలలో దీక్షను బిగించిన పిడికిళ్లు
సమరోత్సాహంలో సాచిన గుండెలు
విజయగర్వంతో ముందుకేస్తున్న అడుగులు
సరికొత్త యుగావిష్కరణకు స్వాగత సంకేతాలు
ఇంక ఆలోచించకు,
వేచిచూడకు - కలిసిపో....

(సెప్టెంబర్ 20 ఛాయరాజ్ 9వ వర్ధంతి (2013) సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాం....)

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

450

సంపుటి : 46

సంచిక : 1, 2

ఆగస్టు & సెప్టెంబర్ 2022

## ఈ సంచికలో...

website : www.prajaasaahithi.com

| | | | |
|---|---|---|---|
| ✦ ముఖచిత్రం : | విభజన – స్వాతంత్ర్యం | – చిత్రకారుడు : చిత్తప్రసాద్ | .....01 |
| ✦ రెండవ అట్ట : | వేచి చూడకు – కలిసిపో (కవిత) | – ఛాయరాజ్ | .....02 |
| ✦ మూడవ అట్ట : | అనృత మహోత్సవం (కవిత) | – చల్లా రామఫణి | .....59 |
| ✦ నాల్గవ అట్ట : | మహోజ్జ్వల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం | – చిత్రకారుడు : చిత్తప్రసాద్ | .....60 |
| ✦ సంపాదకీయం : | అమృతాన్ని బడా కుబేరులకు, గరళాన్ని పేద–మధ్యతరగతివర్గానికి...... | | .....05 |
| ✦ కథలు : | సజీవ సాహిత్యం – స్వాతంత్ర్య స్వరూపం | – శారద | .....08 |
| : | యెర్రి సంద్రాలుగోరు ఉరఫ్ కమ్మిస్టు బుగతగోరు | – సౌరవ్ | .....18 |
| ✦ వ్యాసాలు : | స్వాతంత్ర్యం – సాహిత్యం – సామాజిక మార్పు | – బి. సూర్యసాగర్ | .....09 |
| : | అమృతోత్సవ వేళ – జాతీయోద్యమ మదింపు | – వకుళాభరణం రామకృష్ణ | .....14 |
| : | త్యాగాల కోన – వీర తెలంగాణ | – మహమ్మద్ అబ్బాస్ | .....23 |
| : | దళితుల జీవన, స్థితిగతుల్లో ఎటువంటి మార్పులూ... | – జి.వి. భద్రం | .....29 |
| : | పాలకవర్గాల చేతిలో పాచికగా మతం | – ప్రసన్న | .....40 |
| : | 75 ఏళ్ళ రాజకీయ భారతం 'అమృతాన్ని' ఎవరిచేత.... | – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | .....45 |
| ✦ ధారావాహికలు : | వ్యాసం – దేశ విభజన వస్తువుగా సాహిత్యం | – కొత్తపల్లి రవిబాబు | .....16 |
| : | దీర్ఘకవిత – రంగు వెలసిన చిత్రం | – శీలా సుభద్రాదేవి | .....44 |
| ✦ జాతీయ అక్షరయోధులు : | స్వేద నారాయణ్ సుర్వే | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....28 |
| ✦ పుస్తక పరిచయం : | 'స్వీయచరిత్రలు : వలసకాలపు ఆంధ్ర సమాజం' | – రవి | .....36 |
| ✦ పాట : | అజాదీకా అమృత్ మహోత్సవం | – వెంకట్. జి | .....39 |
| ✦ కవితలు : | దారల విజయలక్ష్మి (17), పినాకిని (51) | | |
| ✦ ఖండన ప్రకటనలు : | బిల్కీస్ బానో నేరస్థుల క్షమాభిక్షను రద్దుచేయాలి! (07)<br>ఇంద్రకుమార్ మేఘ్వాల్ మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలి! (35) | | |
| ✦ స్పందన : | విరాటాచార్యల అరాచక పర్వం | – మనస్విని | .....49 |
| ✦ వివిధ : | ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (22); చైతన్యవాహిని (54); ఈ పుస్తకాలు అందాయి (57) | | |
| ✦ సంతాపాలు : | ఘంటా మారుతి (13); బి.డి. చటోపాధ్యాయ, అజ్మీరు వీరభద్రయ్య, పువ్వాడ తిక్కన సోమయాజి, కొయ్య శివరామరెడ్డి, రెడ్డి రాఘవయ్య, సి.వి.ఎన్. పట్నాయక్ నందాఖరే (53) | | |
| ✦ శాశ్వతనిధి : | చెన్నూరి సుబ్రహ్మణ్యకుమారి, భాగవతుల సాక్షమ్మ (04) | | |

ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

**చందాలు పంపవలసిన చిరునామా :**

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

**రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :**

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

**'ప్రజాసాహితి'**
**కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు**
**"అకౌంట్ నెం.**
***0680101004936***
***IFSC No. CNRB0000680***
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
**మనియార్డర్లు, డి.డి.ల. ద్వారా పంపండి.**
**చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.**
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

## శాశ్వతనిధి



**చెన్నూరి సూర్యచంద్రరావు, సుబ్రహ్మణ్యకుమారి** దంపతులు గుంటూరులో వామపక్ష ప్రజాసంఘాలకు అండదండగా వుంటున్నారు. సూర్యచంద్రరావు మంచి గాయకుడు. క్రియాశీల కార్యకర్త. 'ప్రజాసాహితి' పత్రిక అభిమానులు.

సూర్యచంద్రరావుది చేబ్రోలు దగ్గర పాతరెడ్డిపాలెం. సుబ్రహ్మణ్యకుమారిది తెనాలి. సూర్యచంద్రరావు కొన్నాళ్ళు బంగారపు కొట్లో పనిచేశారు. ఆ తరువాత వాయిదాలపై వస్తువుల అమ్మకం కొనసాగించారు. వీరికి ఇద్దరు కుమారులు. కాగా చిన్న అబ్బాయి అనిల్ కుమార్ 22వ ఏట 2-6-2007న అకాల మరణం చెందారు. దీర్ఘ అనారోగ్యంతో సుబ్రహ్మణ్యకుమారి 25-6-2022న మరణించారు. ఆమె 25-6-1951న జన్మించారు.

అనిల్ జ్ఞాపకార్థం వీరి కుటుంబం 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి రెండు వాయిదాలుగా ఏభైవేలు విరాళం ఇచ్చారు. సుబ్రహ్మణ్యకుమారి జ్ఞాపకార్థం ఆమె భర్త సూర్యచంద్రరావు, వారి పెద్దకొడుకు కలసి ఇటీవల ఏభైవేలు 'ప్రజాసాహితి'కి విరాళంగా ఇచ్చారు.

చెన్నూరి సుబ్రహ్మణ్యకుమారి, అనిల్‌కుమార్‌లకు సంతాపం ప్రకటిస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు మా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

## శాశ్వతనిధి



**భాగవతుల సాక్షమ్మగారు** 21-8-2021న తెనాలిలో తన 80వ యేట మరణించారు. వీరిది కృష్ణాజిల్లా ఉంగుటూరు దగ్గర లంకపల్లి గ్రామం. తెనాలికి చెందిన 14 ఏళ్ళ దక్షిణామూర్తిశాస్త్రిగారితో ఆమె ఏడవయేట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులు – ఇద్దరు కూతుళ్ళు. దక్షిణామూర్తిగారు కరణంగా పనిచేస్తూ 1969లో మరణించారు.

ప్రముఖ జర్నలిస్టు, విప్లవకారుడు ఎస్.వి.ఎస్. సుబ్బరాయుడు సాక్షమ్మగారి అన్న. ఆయన ప్రభావంతో సాక్షమ్మగారు కూడా వామపక్ష భావజాలంతో పనిచేస్తున్న విప్లవకారులను ఆదరించేవారు. తాను సంప్రదాయ ఆచారాలు పాటిస్తూనే తమ ఇంటికి వచ్చినవారికి కుల, మత భేదాలు పాటించకుండా ఎంతో ప్రేమపూర్వకంగా ఆదరించేవారు.

వారి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు 'ప్రజాసాహితి' పత్రికకు 25 వేలు విరాళం ఇచ్చారు.

సాక్షమ్మగారి మరణానికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

**సంపాదకీయం**

# అమృతాన్ని బడా కుబేర్లకు, గరళాన్ని పేద - మధ్యతరగతికీ పంచుతున్న పాలకుల ఆత్మవంచనాత్మక ప్రదర్శన, ఆజాదీకా అమృత మహోత్సవ్!

**75వ** స్వాతంత్ర్య దినోత్సవం పేరిట దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను ఉద్దేశించి, మహిళా సాధికారతపై కూడా ప్రసంగించిన ఆగస్టు 15 నాడే, బిల్ కీస్ బానొ కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన 11 మంది క్రూర నేరస్తులకు జైలు నుండి ఆజాదీ లభించింది. 2002లో గుజరాత్ రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలపై జరిగిన దాడులు విధ్వంసాలతో పాటు సంఘపరివార శక్తులు జరిపించిన ఘోర అత్యాచారాలలో హంతకులు, అత్యాచార ఘాతకులు అయిన నేరస్తులకు శిక్ష పడిన కేసులే అతి స్వల్పం. దహోడ్ జిల్లాలో బిల్ కీస్ బానొ అనే 21 ఏళ్ల మహిళపై సామూహిక అత్యాచారాలు జరిపి ఆమె మూడేళ్ల బిడ్డను రాతిపై మోది చంపేసిన, ఆమె ఎదుటే తల్లి తోబుట్టువులపై అత్యాచారం జరిపి సమీప బంధువులు పద్నాలుగుమందిని హత్య చేసిన కేసులో ఎంతో పోరాడగా పోరాడగా 11 మంది నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఇలాంటి కేసుల గురించి సాక్ష్యాలు చెప్పిన పోలీసు ఉన్నతాధికారి సంజీవ భట్‌ను ఇతర కేసులలో ఇరికించి ఇప్పటికే జైలు పాలు చేశారు. న్యాయస్థానాలలో వాదించిన, తీస్తా సెతలవాడ్ లాంటి న్యాయవాదిని, శ్రీ కుమార్ అనే ఆనాటి అధికారినీ తప్పుడు కేసులు పెట్టారనే సాకుతో కొద్ది రోజుల క్రితమే బెయిలు లభించకుండా అరెస్టు చేసి జైలుకు పంపారు.

75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా చట్టంలో లొసుగులను అడ్డం పెట్టుకుని బిల్ కీస్ బానొ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్నవారిని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు విడుదల చేసింది. విశ్వహిందూ పరిషత్ నాయకులు తదితర మతోన్మాద కార్యకర్తలు ఈ నేరస్తులకు గౌరవ సత్కారాలు కూడా చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి పత్రిక "కొంచెం సిగ్గుండాలి!" అనే తన 19.8.2022 నాటి సంపాదకీయలో ఇలా వ్యాఖ్యానించింది.

"ఎటువంటి విచక్షణలూ లేని దేనినీ ఖాతరు చేయని ఏ వ్యవస్థకూ గౌరవం ఇవ్వని పరిపాలనలను చూస్తున్నాము. ఇదొక రకమైన బరితెగింపు. ముసుగులు తీసేసిన దిగంబరత్వం కాదు. సిగ్గూ లజ్జా వదిలేసిన నగ్నత్వం. జనసమ్మతిని ఆసరాగా చేసుకుని ఆడుతున్న ఆట. సంఘభయం ఉండాలి లేదా ధర్మభయం ఉండాలి, ఆత్మసాక్షి అయినా ఉండాలి."

దాదాపు ఏ పత్రికా బిల్ కీస్ బానో కేసులోని హంతక నేరస్తుల విడుదలను సమర్థిస్తూ రాయలేకపోయింది. అయినా ఎలాంటి నైతిక అభిశంసననూ ఖాతరు చేసే పరిస్థితిలో పాలక ప్రభువులు లేరు. నిజానికి ఇంతే నిస్సిగ్గుగా సమస్త ఇతర సామాజిక రంగాలలో కూడా వారు వ్యవహరిస్తున్నారు.

ఉదాహరణకు ఆర్థిక రంగంలో దేశీయ బడాకుబేర్లకు, విదేశీ కార్పొరేట్లకు అడ్డు అదుపు లేని దోపిడీ రంగస్థలంగా భారత గడ్డను మార్చేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రజల ఉమ్మడి సంపదలను (Public sector Unitsను) అత్యంత కారుచౌకగా బడాకుబేర్లకు, విదేశీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. కృష్ణా గోదావరి బేసిన్‌లోని ఆయిల్ గ్యాస్ నిక్షేపాలను రిలయన్స్ కంపెనీ వారికి ఏనాడో దఖలు పరిచారు. ఇటీవల విశాఖ ఉక్కు కర్మాగారాన్ని, గంగవరం పోర్టుని కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అదే పని చేస్తున్నారు. అంతేకాకుండా బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, రైళ్లు, బ్యాంకులు, ఓడరేవులు, విమానాశ్రయాలు మొదలైన లాభదాయక సంస్థలను కారుచౌక వేలం పాటలకు అప్పచెబుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ గ్రహించవలసింది ఏమిటంటే ప్రజల సంపదలను కొద్దిమంది బడా కుబేర్లకు కట్టబెట్టడానికి వారు మహా గర్వపడుతున్నారు తప్ప ఇసుమంత సిగ్గుపడటం లేదు.

ఈ క్రమంలో గత కాలపు ఆర్థిక వ్యత్యాసాలను మరింత విపరీత స్థాయిలో పెంచి పోషిస్తున్నారు. 1930వ దశకం చివర భారత జనాభాలోని ఒక శాతం (1%) అత్యంత సంపన్నులైనవారి ఆస్తులు, మొత్తం దేశస్తులలో నూటికి 21 వంతుల మంది సంపదతో సమానంగా ఉంటే, ఇప్పుడు (2019) నూటికి 22 మందికి గల మొత్తం సంపదతో సమానంగా ఉందనీ, అట్టడుగు 50 శాతం మంది వాటా నాటికి నేటికి నూటికి 14వంతులు మాత్రమే ఉందని థామస్ పికెట్ & లూకాస్ అనే ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్తలు భారత ఆర్థిక పరిస్థితులపై 2019లో చెప్పారు. 1980-2015 సంవత్సరాల నడుమ దేశంలోని అట్టడుగు 50 శాతంమంది ఆదాయాలు 90 శాతం పెరిగితే ఒక్క శాతం పై వారి ఆదాయాలు 435 శాతం పెరిగాయని చెప్పారు.

కరోనా సంక్షోభానికి ముందు 2020 మార్చినాటికి భారత సంపన్నులలో మహా కుబేరులు (సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల కంటే ఎక్కువ సంపద కలవారు) 102 మంది ఉంటే అదే సంక్షోభ కాలంలో అంటే 2021కి 142 తరువాత సంవత్సరం 166 మంది మహా కుబేరులు (40 నుండి 60 శాతం మంది) పెరిగిపోయారు.

ఇదే కాలంలో అట్టడుగు 50 శాతం ప్రజల ఆదాయాల వాటా 2000 సంవత్సరంలో 8.3% నుండి 2021 నాటికి 5.9 శాతానికి దిగజారింది.

'బిజినెస్ టుడే' వారు ఇచ్చిన వివరాల ప్రకారం 2000వ సంవత్సరంలోని ఆస్తులలో పది శాతం అత్యంత సంపన్నుల వాటా 54 శాతం ఉంటే 2021 నాటికి పై వారి వాటా 64 వంతులకు

పెరిగింది. ఇవన్నీ ఇలా ఉండగా బడ్జెట్లలో పన్నుల రకరకాల రాయితీలతో పాటు బాకీల పేర్లతో ఎన్పీఏ బడాకుబేరుల 10 లక్షల కోట్ల రూపాయల అప్పులను గడిచిన ఐదు సంవత్సరాలలో రద్దు చేశారు. కోటానుకోట్లకు పడగలెత్తుతున్న ఆదాని గ్రూపుకున్న 13,500 కోట్ల రూపాయల అప్పును ఏమాత్రం సిగ్గుపడకుండా రద్దు చేశారు.

పెరిగిపోతున్న ఆర్థిక వ్యత్యాసాల వల్ల, ఒకవైపు సంపద కేంద్రీకరణ పెరుగుతుంటే మరోవైపు దరిద్రీకరణ వేగంగా సాగుతోంది. పైన పేర్కొన్నవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

జూన్ 2022 ఆర్బిఐ నివేదిక ప్రకారం మొత్తం కేంద్ర ప్రభుత్వం అప్పులు 152 లక్షల కోట్ల రూపాయలు ఉంటే అందులో సుమారు 50 లక్షల కోట్లు విదేశీ అప్పులే ఉన్నాయి.

గడచిన 30 ఏళ్లలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పేరుతో సమస్త విదేశీ దోపిడీ వర్గాలకు భారతదేశపు గేట్లు బార్లా తెరిచిన పిదప సుమారు 40 లక్షల కోట్ల రూపాయలు (50 వేల కోట్ల డాలర్లు) విదేశీ పెట్టబడులు భారతదేశంలోకి ప్రవహించాయి.

పారిశ్రామిక అభివృద్ధిని పెంచడం కంటే అప్పటికే ఇక్కడ ఉన్న లాభదాయక రంగాలను అవి ఆక్రమించాయి. మానవ జీవన విధ్వంసకర విధానాలకు, ఉపాధి రహిత అభివృద్ధికీ, సహజ వనరుల దోపిడికి, పర్యావరణ కాలుష్యానికీ అవి కారణమైనాయి.

27 జూలై 2022 నాడు 'ది హిందూ' పత్రికలో రాసిన ప్రవీణ్ చక్రవర్తి ప్రకారం "1980–1990 సంవత్సరాల నడుమ జిడిపిలో ఒక శాతం అభివృద్ధి కనుక ఉంటే సుమారు రెండు లక్షల ఉద్యోగాలు అదనంగా లభించేవనీ, 1990–2000 నడుమ ఒక శాతం జిడిపి అభివృద్ధికి ఒక లక్ష ఉద్యోగాలు మాత్రమే దొరికాయని అదే 2000 నుండి 2010 నడుమ ఒక శాతం జిడిపి అభివృద్ధికి 50 వేల ఉద్యోగాలు మాత్రమే లభించాయని చెప్పవచ్చు." ఉపాధి రహిత అభివృద్ధికి ఇది చక్కని ఉదాహరణ.

విదేశీ దోపిడీదారుల వ్యాపారానికి సులువు దారులను చూపగలిగిన వారినే గొప్ప పరిపాలకులుగా కార్పొరేట్ మీడియా ఆకాశానికి ఎత్తుతోంది.

సంపదలు కొద్దిమంది దగ్గర పోగుబడటం మనకు కనిపించినంత స్పష్టంగా మన దేశ సంపద విదేశాలకు ఎన్ని రూపాలలో ఎన్నెన్ని లక్షల కోట్ల రూపాయలలో తరలిపోతుందో తెలుసుకోలేని అంతుచిక్కని చిక్కుముడిగా తయారయింది.

దేశంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందంటే గడిచిన ఏడు సంవత్సరాలలో 7 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కొరకు మొత్తం 22 కోట్ల మంది దరఖాస్తులు చేసుకున్నారని పార్లమెంటు సాక్షిగా మంత్రి ఇటీవల ప్రకటించారు. అంటే సుమారున ప్రతి 300 మంది నిరుద్యోగులలో ఒకరికి మాత్రమే ప్రభుత్వరంగంలో ఉపాధి కల్పిస్తున్నారన్నమాట!

వివిధ ప్రభుత్వాలన్నీ ప్రకటించిన అధికారిక ఖాళీ పోస్టులు దాదాపు 60 లక్షలు ఉంటే వాటిని భర్తీ చేయకుండా ఉన్నారు. తప్పనిసరయి చేయవలసి వస్తే తాత్కాలిక జాగాలుగా చూపించి దినసరి కూలీలుగాను, ఎదుగు బొదుగు లేని వెట్టి చాకిరీ కార్మికులుగాను, ఎన్ని దశాబ్దాలు అయినా తాత్కాలిక ఉద్యోగులుగాను నియమించుకుంటున్నారు.

మనదేశంలో ఎక్కువమందికి ఉపాధిని అందజేసే వ్యవసాయ రంగం నానాటికి సంక్షోభంలో కూరుకు పోయి ఆధునికం పేరిట కార్పొరేట్ల దోపిడీమయం కావిస్తున్నారు. కనీసం సంవత్సరానికి 135 రోజుల పని కల్పిస్తామని పాతికేళ్ల క్రితం ప్రారంభించిన, గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇప్పుడు అందులో సగం రోజులు కూడా కల్పించడంలేదు. గ్రామాల నుంచి వలస పోయిన వారిని ఇముడ్చుకునే విధంగా దేశంలో పారిశ్రామిక అభివృద్ధి జరగకపోగా, చిన్న మధ్య తరగతి పరిశ్రమలు లక్షలాది మూత పడిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగానికి రహదారుల నిర్మాణానికి కారు చౌక కూలీలను అందించే విధంగా పాలకులు ఈ సంక్షోభాన్ని వాడుకుంటున్నారు.

రాజకీయ వ్యవస్థను ఫాసిస్టు పద్ధతులలో నిర్మించడానికి భాషకు అందనంత ఘోరంగా రూపొందించే ప్రయత్నంలో ఉన్నారు. చట్టాలను, నిరంకుశ రాజ్యవ్యవస్థలో భాగమైన వివిధ నిఘా విభాగాలను, సమస్త పాలనా అంగాలను అందుకు వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల నుండి భిన్నాభిప్రాయాల సంస్థలు, వ్యక్తుల దాకా, చట్టబద్ధ చట్ట విరుద్ధ పద్ధతులలో వీరి దాడులకు గురవుతున్నారు. ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలను కూలగొట్టడానికి, లొంగదీసుకోవడానికి చరిత్రలో ఎరగని అత్యంత అప్రజాస్వామిక పద్ధతులను అనుసరిస్తున్నారు.

రాజకీయ ఆయుధంగా విద్వేషపూరిత మతోన్మాదాన్ని వ్యాప్తి కావించడానికి దాని విస్తరణకు మీడియా ప్రచారాలను అంతకుమించి అబద్ధాల ఫ్యాక్టరీ ద్వారా ఊహకందని విపరీత విద్వేష పద్ధతులను దేశంపై రుద్దుతున్నారు.

ఒక్క మాటలో... ప్రజల నిరసనను కోలుకోలేని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న అర్ధవలస అర్ధఫ్యూడల్ వ్యవస్థను, అందులో భాగమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణను రక్షిస్తూ కొనసాగించటానికే ఆత్మ వంచనాత్మక పద్ధతులన్నీ పరమ నిరంకుశ రూపాలలో "నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు" అన్నట్లు అమలుపరుస్తున్నారు.

జాతీయోద్యమ చరిత్ర లేనివారు, బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కుమ్మక్కు అయినవారు, ప్రతిపక్షంలో ఉండగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు పూర్తి మద్దతుగా నిలిచి, అధికారంలోకి వచ్చాక దాన్ని నిస్సిగ్గుగా నిరంకుశంగా అమలుపరుస్తున్నవారు, అమెరికా సామ్రాజ్యవాద ప్రపంచ ఆధిపత్య వ్యూహంలో జూనియర్ భాగస్వాములుగా కుదురు కోవడానికి అత్యుత్సాహం ప్రదర్శించేవారు, మతోన్మాద వ్యాప్తి ద్వారా తప్ప అధికారాన్ని సాధించలేని, కొనసాగించలేని, నిలబెట్టుకోలేని వారు, జాతీయోద్యమ వీరులను త్యాగధనులను, మొత్తానికి మొత్తంగా జాతీయ, లౌకిక, సామ్యవాద పోరాట చరిత్రను హైజాక్ చేయాలనే దుష్ట పన్నాగంలో వున్న సందర్భానికి తాజా ఉదాహరణే "ఆజాదీ కా అమృత మహోత్సవ్".

మన ప్రాచీన పురాణాలలోని క్షీరసాగర మధనం కథ మనందరికీ తెలుసు. మనుషుల ప్రాణాలను నిలిపే ఆహార ఉత్పత్తే మధనం ద్వారా సాధించిన అమృతం.

సమష్టి శ్రమ ద్వారా ఉత్పత్తి చేసిన సంపదను కొద్దిమందికే పంపిణీ కావించిన కథలోని మహాశక్తే రాజ్యవ్యవస్థ. నేటి ఆర్థిక రాజకీయ సాంఘిక అసమానతల సామాజిక వ్యవస్థను సిగ్గుఎగ్గులను వీడి కాపాడటానికే ప్రశ్నను, భిన్నాభిప్రాయాలను, నిరసనను, ఆందోళనలను

వెరసి సమస్త ప్రజా పోరాటాలను అణచివేసే సర్వం సహాధికారాలను పొందటానికి భాజపా పాలకులు సర్వసిద్ధంగా ఉన్నారు. అందులో భాగంగా ప్రజలను మోసగించే కళలో కూడా వివిధ రకాల కళలను ప్రదర్శిస్తున్నారు.

అదే సమయంలో వారి పాలన ఏ స్థితికి చేరిందంటే.. ఇక ఎలాంటి నైతిక, ధార్మిక, కనీస మానవీయ విలువలను కూడా ప్రదర్శించలేని చివరి అంచులకు సమీపించింది.

ఇలాంటి పరిస్థితులలో సత్యమనే నిప్పుపై నివురులా కప్పుకున్న అబద్ధాలను ఊదటానికి సాహిత్యకారులు సిద్ధపడాలి. అమృతం లాంటి దేశ సంపదలను, దాన్ని సృష్టించిన శారీరక మేధో శ్రమజీవులకు వారిలో భాగమైన మహిళలూ, ఆదివాసి, దళిత, మైనారిటీలు సమస్త భారత జాతులూ తమ మౌలిక ప్రజాతంత్ర హక్కులను సాధించుకునే వైపుగా నిరంతరాయ భావ విప్లవ కృషి కొనసాగించాలి.

75 ఏళ్ళ ఉత్సవంలో ప్రధాని మోడీ అవినీతి గురించి కూడా ప్రస్తావించిన సందర్భంగా సరిగ్గా 25 సంవత్సరాల క్రితం అనగా 1997 ఆగస్టు 'ప్రజాసాహితి'లో "అవినీతి వ్యవస్థకు కోట్ల వేళ్ళు! విద్రోహ చరిత్రకు ఏభై ఏళ్లు!!" అనే సంపాదకీయం చివరి వాక్యాలను గుర్తు చేసుకుందాం!

"బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సమస్త వర్గాల భారతీయులు వివిధ రూపాల్లో పోరాడారు... సహజంగానే అత్యధికులైన శ్రమజీవులు స్వదేశీ విదేశీ దోపిడీ పీడనలు లేని రాజ్యం రావాలని కోరుకున్నారు.

అందుకై కోట్లాదిమంది ఉద్యమించారు. లక్షలాదిమంది చిత్రహింసల పాలయ్యారు. వేలాదిమంది ప్రాణాలను కూడా లక్ష్య పెట్టకుండా జీవితాలు త్యాగం చేశారు. నిజమైన స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యం సిద్ధిస్తాయని ఆశించారు....

భౌతికంగా సామ్రాజ్యవాదులకు తాబేదారులుగా తయారైన కేంద్ర రాష్ట్ర పరిపాలకులు, అవినీతి సంస్కృతిలో పీకలదాకా కూరుకుపోయిన ప్రభుత్వాలు నిర్వహించే స్వర్ణోత్సవాలు ప్రజలకు సంబంధించినంత వరకు విద్రోహోత్సవాలు గానే మిగిలిపోతాయి. స్వాతంత్ర్య పోరాటంలో అశేష త్యాగాలు చేసిన వేలాది అమరుల వారసత్వాన్ని అందిపుచ్చుకొని అవినీతివ్యవస్థపై, దోపిడీ పరిపాలకులపై, సామ్రాజ్యవాదంపై పోరాడటమే నిజమైన ఉత్సవంగా చరిత్రలో నిలుస్తుంది."

**28-8-2022**

# బిల్కిస్ బానో కేసులో నేరస్థుల క్షమాభిక్షను రద్దుచేయాలి!

**- జనసాహితి**

**విలువలకు** తిలోదకాలిచ్చిన ప్రజావ్యతిరేక పాలనకు నిదర్శనమే బిల్కిస్ బానో కేసులో నేరస్థులను విడుదల చెయ్యటం. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి, ఇప్పటి దేశ ప్రధాని మోదీ ఎర్రకోట నుండి స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకలను ప్రారంభించి, అతివలపట్ల వాత్సల్యాన్నీ, ప్రేమనీ, కరుణనీ కురిపిస్తూ మాట్లాడుతున్న సమయంలోనే 2002 గుజరాత్ అల్లర్లలో అత్యాచారాలు, హత్యలకు పాల్పడిన 11 మంది హంతకులను విడుదల చేశారు.

2002లో గుజరాత్‌లో జరిగిన గోద్రా అల్లర్ల సమయంలో ముస్లిం మైనారిటీలపై అఘాయిత్యాలకు పాల్పడిన సందర్భంలోనే బిల్కిస్ బానో అనే 21 సంవత్సరాల వయసు గల మూడు నెలల గర్భిణీపై ఆమె వూరికి చెందినవారే, ప్రేరేపించబడిన మతోన్మాదంతో వెంటబడి తరుముతూ అత్యాచారం చేశారు. ఆమె మూడు సం॥ల కూతురిని నేలకేసి బాది హత్యచేశారు. ఆమె కళ్ళ ముందే ఆమె తల్లిని, ఆమె ఇద్దరి చెల్లెల్లను అత్యాచారం చేశారు. ఆ హత్యాకాండలో బిల్కిస్ బానో కుటుంబంలోని 14 మంది సభ్యులు హత్యగావించబడ్డారు.

న్యాయం కోసం బిల్కిస్ బానో కేసు నమోదు చేయటానికి వెళ్ళినప్పటి నుండి అనేక బెదిరింపులను ఎదుర్కొంది. 2004 నుండి ఈ కేసు విచారణ ప్రారంభం కాగా 6 సం॥లు తర్వాత ప్రత్యేక సిబిఐ న్యాయస్థానం 11 మందిని దోషులుగా నిర్ధారిస్తూ జనవరి 21, 2008న జీవితఖైదును ఖరారు చేసింది. 15 ఏళ్ళ తర్వాత అందులోని ఒక దోషి సుప్రీంకోర్టును క్షమాభిక్షకై వేడుకొనగా – ఆ విజ్ఞప్తిని పరిశీలించమని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది సుప్రీంకోర్టు. దీనిపై ప్రభుత్వం ఒక కమిటీ వేసింది. కమిటీ సిఫారస్ చేశారనే పేరుతో గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష పెడుతూ న్యాయ నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేశారు. విడుదలైన ఈ నేరస్థులకు విశ్వహిందూ పరిషత్ నాయకులు పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించి ఊరేగించారు. నేరస్థులను ఊరేగిస్తూ, ప్రజాతంత్రవాదులను జైళ్ళల్లో ఏ విధమైన విచారణలు జరపకుండా నిర్బంధిస్తున్న 'స్వతంత్ర భారతం'లో నేడు మనం ఉన్నాం.

కనుకనే గుజరాత్ అల్లర్లలో బాధితుల పక్షాన నిలబడిన సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌నూ, గుజరాత్ అల్లర్ల ప్రేరకులు ఎవరో నిజాయితీగా ప్రకటించిన పోలీసు అధికారులు సంజీవ్‌భట్, శ్రీకుమార్‌లనూ లాకప్‌లలో బంధించారు. ఈ అల్లర్లపై ప్రత్యక్ష సాక్షులతో, బాధితులతో విచారణ జరిపి 'గుజరాత్ ఫైల్స్' అనే పుస్తకాన్ని రాసిన రాణా అయ్యూబ్ అనే జర్నలిస్టును రకరకాల కేసులతో వేధిస్తున్నారు. ఇక సామాన్య ప్రజలైన బాధితులు కేసులు పెట్టినందుకు – ధైర్యంగా నిలబడినందుకు ఎన్ని అగచాట్లను, వేధింపులను అనుభవిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. న్యాయం కోసం వారు చేస్తున్న పోరాటాలకి అండగా నిలబడదాం! న్యాయవ్యవస్థనూ, స్వాతంత్ర్య భారతంలో సగటు మనిషి బ్రతకటాన్ని అపహాస్యం చేస్తూ క్రూర, పాశవిక చర్యలకు పాల్పడిన నేరస్థులకు క్షమాభిక్ష పెట్టి విడుదల చేయటాన్ని రద్దు చేయాలని, తిరిగి జైలుకు పంపాలనీ డిమాండ్ చేస్తున్నాం!

సజీవ సాహిత్యం

# స్వాతంత్ర్య స్వరూపం

- శారద

'స్వతంత్రం' వచ్చి పూర్తిగా ఒక ఏడాది కూడా నిండకుండానే 1948 జులై 'విశాలాంధ్ర' మాసపత్రికలో శారద (ఎస్. నటరాజన్) ఈ కథ రాశారు. ఆనాడు సాధించామని చెప్పుకుంటున్న నేటి స్వాతంత్ర్య చిత్రాన్ని 75 ఏళ్ళకు ముందే శారద మన కళ్ళముందు నిలిపారు. ఆగస్టు 17 (1955) శారద వర్ధంతి సందర్భంగా మరోసారి పునర్ముద్రిస్తున్నాం. - సం॥

**ఒకప్పుడు,** ఒక పిల్లదేశం ఇంకో పెద్దదేశం నించి నానా అవస్థలు పడి స్వతంత్రం సంపాయించింది. ఆ పిల్ల దేశంలో ప్రజలు స్వతంత్రం వొచ్చినందుకు గుర్తుగా ఓ స్వతంత్ర విగ్రహం చేయించి రాజధాని నగరంలో ప్రతిష్ఠించుదామని తమ స్వతంత్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కూడా తమ ప్రజల ఆలోచన బాగానే వుందని ఒప్పుకుని, ఒక శిల్పిని పిలిపించింది. ఆ శిల్పి అఖండమైన కళోపాసకుడు. అదివరకు చాలా విగ్రహాలు చేశాడు. అతను చేసిన విగ్రహాలు జీవకళ వుట్టిపడుతూ ఉండేవి. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం ఆ శిల్పి ఒక సుముహూర్తంలో, మంచి చలువరాయితో విగ్రహం చేసేందుకు వుపక్రమించాడు.

స్వతంత్రాన్ని ప్రజలు పోరాడి తెచ్చుకున్నారు గనుక, స్వతంత్ర విగ్రహం, తమ పోరాటాల చరిత్రని ఎల్లప్పుడూ జ్ఞప్తిచేస్తూ, తమ సుఖవంతమైన స్వతంత్ర భవిష్యత్తును చూపుతూ వుండే ఒక మహావీరుని విగ్రహంగా చెక్కమని వాళ్ళు శిల్పికి తీర్మానాలు చేసి పంపారు. శిల్పి అలాగేనని ఒక మహావీరుని విగ్రహం చెక్కడం ప్రారంభించాడు.

కాని మొదట్నుంచీ, సామాన్య ప్రజలు పోరాటాలు చేసి స్వతంత్రం సంపాయిస్తే, తమ ప్రాబల్యం ఎట్టాగు మంటగలుస్తుందని భయపడుతూ వచ్చిన డబ్బుస్వాములు, తమ మీద అధికారం చెలాయిస్తున్న పరాయి దేశం డబ్బుస్వాములతో గుసగుసలూ, వికవికలూ చేసి అధికారం తమ హస్తగతం చేసుకున్నారు. ఈ డబ్బుస్వాములు, "స్వతంత్ర విగ్రహం, ప్రజలకి నూతనంగా వచ్చిన స్వతంత్ర ప్రభుత్వం యెడ నమ్రత, విధేయతా నేర్పే చిహ్నంగానూ, అల్లరీ ఆగం చేయకూడదని బోధించే గురువులాగూ ఉండాలి. అందుకని ఆ విగ్రహం ఓ ప్రశాంత తపస్వి లాగానో లేక సన్యాసిలాగో వుండాలి" అని శిల్పికి ఆజ్ఞాపించారు. శిల్పి "చిత్తం" అని మహావీరుడి విగ్రహం చెక్కినంతవరకు ఆపి, దాన్నే ఓ సన్యాసి రూపంలో చెక్కుతున్నాడు.

ఆ దేశంలోని డబ్బుస్వాముల్లోనే ఇంకా కొందరు మహాత్ములు, దేశాన్ని, దాన్ని ఆర్థికపరిస్థితినీ తమ జేబుల్లోనూ, భోషాణాల్లోనూ ఇరికించుకొని వున్నారు. వాళ్ళకి ఈ సలహాలేవీ నచ్చలేదు. వాళ్ళందరూ కలిపి, ఆ విగ్రహం, "మన విశాలమైన దేశం యొక్క స్వతంత్ర వ్యాపార ప్రతిపత్తిని విస్తరింపజేసేదిగా ఒక గొప్ప ఓడల వర్తకుని రూపంలో వుండాలి" అని శిల్పికి ఆదేశం పంపారు. శిల్పి ఆ ఆదేశం వెనుక వుండే ఆర్థిక బలాన్ని వూహించుకొని "అలాగే బాబు" అని తను తయారుచేస్తోన్న సన్యాసి విగ్రహాన్నే ఓ గొప్ప వ్యాపారస్థుడి విగ్రహంగా మారుస్తున్నాడు.

కాని అసలు ప్రభుత్వంలో వుండే ప్రముఖులు ఇవన్నీ పనికిరావని రెండు మూడు సబ్ కమిటీలూ, నాలుగైదు సంఘాలు వేసి, వాటి రిపోర్టులన్నీ కలేసి చదివి, వాటినన్నిట్నీ తీసేసింతర్వాత "స్వతంత్ర విగ్రహం ప్రభుత్వం ఎడ భక్తినీ, నమ్రతనీ నేర్పేట్టు వుండవలసిందేకాని అది సన్యాసిలాగు, ప్రజలకి ప్రభుత్వం యెడల భయమూ, భక్తినీ, శ్రద్ధా, గౌరవాల్నీ నేర్పే సాయుధ సైనికుడి విగ్రహంగా వుండాలని ప్రభుత్వం భావిస్తోంది. నిజమైన ప్రజాశాంతినీ, ప్రజాస్వామికాన్ని కాపాడేది ప్రభుత్వ సైన్యమే. అదీకాకుండా ప్రజలలో కొందరు ఎల్లప్పుడూ ఆకలనీ, గుడ్డలనీ అల్లర్లుచేస్తూ ఆర్థిక సమానత్వం అని లేనిపోని ప్రచారం చేస్తూ, ప్రజల ప్రశాంత జీవితాలని భగ్నం చేస్తున్నారు. అటువంటివాళ్ళకి స్వతంత్ర ప్రభుత్వంలోనైనా వాళ్ళ ఆటలు సాగవని హెచ్చరికలు తెల్పుతూ స్వతంత్ర విగ్రహం ప్రభుత్వ సాయుధ సైనికుడి రూపంలో వుండాలి" అని బహిరంగ ప్రకటన ఒకటి చేసి, శిల్పికి హుకుం ఇచ్చారు, సైనికుడి విగ్రహం చెక్కమని. "అట్లానే" అని శిల్పి తను ఇదివరలో చెక్కుతున్న వర్తకుడి రూపాన్నే సాయుధ సైనికుని రూపంలోకి మార్చుతున్నాడు. ప్రభుత్వం సలహాని డబ్బుస్వాములు హర్షించారు, వ్యాపారస్తులు ఆహ్వానించారు. అటూ ఇటూ మాట్లాడే పెద్దమనుషులు ఆమోదించారు, ప్రజలు మాత్రం ప్రభుత్వ ధోరణికి ముక్కుమీద వేలేసుకున్నారు.

అయితే శిల్పి మాత్రం ఎడతెరిపి లేకుండా శ్రమించి స్వాతంత్ర్య విగ్రహాన్ని తయారుచేశాడు. ఒక సుదినమున స్వాతంత్ర్య విగ్రహాన్ని రాజధాని నగరంలో ప్రతిష్ఠించడానికి తీసుకువచ్చారు. అదివరకే తయారైన శిలావేదికపై స్వతంత్ర విగ్రహాన్ని వుంచారు. ప్రభుత్వ అధ్యక్షుడు స్వతంత్రాన్ని గూర్చి ఒక మహోపన్యాసం జేసింతర్వాత స్వతంత్ర విగ్రహానికి వున్న మొఖమల్ గుడ్డని తొలగించాడు. స్వాతంత్ర్య విగ్రహం ఆధునిక ఆయుధాలతో సాక్షాత్కరించింది. భయంకరమైన దయ్యం రూపంలో.

**(జులై 1948, 'విశాలాంధ్ర')**

వ్యాసం

# స్వాతంత్ర్యం - సాహిత్యం సామాజికమార్పు

- బి. సూర్యసాగర్

**స్వాతంత్రోద్యమంలో** ప్రముఖ నాయకుడు, గొప్ప విద్వత్తు కలిగిన మేథావి, సోషలిస్టు భావాల అభిమానిగా పేరొందినవాడు, దేశ ప్రథమ ప్రధానమంత్రి అయిన జవహర్‌లాల్‌నెహ్రూ 1947 ఆగస్టు 15 నాడు "మనమెక్కడికి వెళతాం, మనం సాధించాల్సినదేమిటి" అనే ప్రశ్నవేసి ఇలా సమాధానం చెప్పాడు : "భారతదేశంలో సామాన్యుడికి, కర్షకులకు, కార్మికులకు స్వేచ్ఛను, జీవనావకాశాన్ని కల్పించాలి. పేదరికం, అజ్ఞానం, అనారోగ్యం అంతం కావడానికి పోరాడాలి. సంపద్వంతమైన, ప్రజాస్వామికమైన, ప్రగతిశీలమైన దేశాన్ని నిర్మించడానికీ, ప్రతి పురుషుడికీ, మహిళకూ న్యాయమైన, నిండైన జీవితాన్ని ఇవ్వడానికీ అవసరమైన ఆర్థిక, రాజకీయ సంస్థలను నిర్మించుకోవాలి." అంతేగాక, "గాంధీజీ ఆశించిన ఎవరి కంటిలోనూ కన్నీరు లేని దేశాన్ని మనం నిర్మించుకోవాలి" అని కూడా ఆయన అన్నాడు.

ఈ ఆశయం, లక్ష్యం ఎవరి హృదయాన్నైనా గొప్పగా పులకింప జేస్తాయి. రెండున్నర శతాబ్దాల పీడక వలస పాలన నుండి విముక్తికై సాగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో అనేక తీవ్ర కష్టనష్టాలకు, ప్రాణ త్యాగాలకు సిద్ధపడి పోరాడిన అశేష ప్రజానీకం ఆశలు, ఆకాంక్షలకు నెహ్రూ మాటలు ప్రతిధ్వనులు. అయితే ఈ లక్ష్యాలు నెహ్రూ ప్రభుత్వ పాలనలోనే కాదు ఈ 75 సంవత్సరాల కాలం గడచినప్పటికైనా సఫలమయినాయా అనే ప్రశ్న వేసుకుంటే వేదనాత్మక సమాధానం మాత్రమే మిగుల్తుంది. నెహ్రూ తన మాటల్ని నిజాయితీగానే చెప్పి వుండవచ్చు. అయితే ఆయన భారతదేశ దోపిడీ పాలకవర్గాల ప్రతినిధిగా చేయగలిగిందీ, చేసిందీ ఏమంటే దేశ మౌలిక స్థితిగతుల్లో మార్పు తీసుకురాలేదు. నెహ్రూ మాటలు అద్దం పట్టిన ప్రజల ఆకాంక్షలు వమ్మయినాయి. అభివృద్ధి, ప్రజాస్వామ్యం ఎండమావి అయినాయి. ఆర్థిక సామాజిక అసమానతలు అణచివేతలు తొలగలేదు. ప్రజల జీవితాల్లో అశాంతి, అభద్రత, ఆందోళన తాండవిస్తున్నాయి. జరిగిన పైపై మార్పులను ప్రస్తావిస్తూ ఇంతకుమించి వ్యవస్థను మార్చే సాహసం నేను చేయలేను అంటూ తనపై వర్గ వత్తిడులు రీత్యా నెహ్రూ అంగీకరించాడు.

ఈ 75 ఏళ్ళ ప్రస్థానానికి కలల దారి తెరచిన 1947 ఆగస్టు 15 ఒక ఒయాసిస్‌గా తలపించి 2022 నాటికి పీడక వాస్తవికతగా తయారైంది.

1930లలో "మహాప్రస్థానం" కావ్యంలో విప్లవ కామనను అపూర్వకంగా కవిత్వీకరించిన మహాకవి శ్రీశ్రీ స్వాతంత్ర్యానంతరం "ఖడ్గసృష్టి" కావ్యంలో ప్రజల ఆకాంక్షల పరిపూర్తిని ఆశిస్తూ, అవి నెరవేరే అవకాశాలపట్ల అనుమానం వ్యక్తపరుస్తూ, పరిపూర్తి కాకుంటే ఆయుధం అలీనం కాదని హెచ్చరించాడు.

వలసానంతర భారతదేశం వలస పాలన నాటికన్నా మౌలికంగా భిన్నంగా లేదనీ, వివిధ సామ్రాజ్యవాద దేశాల ద్రవ్య పెట్టుబడి గుప్పిట్లో అర్థవలసగా మనుగడ సాగిస్తున్నదనీ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులు తిరుగులేనివిధంగా నిరూపిస్తున్నాయి. నేటి అభివృద్ధి చెందిన దేశాలు వాటి ఆధునిక ప్రస్థాన తొలిదశల్లో చేపట్టిన విప్లవాత్మక భూసంస్కరణలు భారత ప్రభుత్వాలు చేపట్టనందువల్ల, జాతీయ వ్యావసాయిక పారిశ్రామిక ఉత్పత్తి విధానాలు అవలంబించ నందువల్ల అర్ధభూస్వామ్య వ్యవస్థ కొనసాగుతూ గ్రామీణ జీవన సంక్షోభానికి, పారిశ్రామికరంగ సంక్షోభానికి దారితీసింది. 1947 పంద్రాగస్టునాడు జరిగింది వలస పాలకుల నుండి భారత దళారీ బూర్జువావర్గం మరియు బడా భూస్వామ్యవర్గం చేతుల్లోకి అధికార మార్పిడి మాత్రమేననీ జాతీయ స్వాతంత్రం కాదని 75 ఏళ్ళుగా జరుగుతున్న పరిపాలన నిరూపించింది. ఆ విద్రోహాన్ని కవి చెరబండరాజు తన 'వందేమాతరం' కవితలో కళ్ళకు కట్టించాడు. "ఆగస్టు 15 విద్రోహాన్ని విప్పి చెప్పనిరోజు అన్నమయినా సహించదునాకు" అని తన ఆగ్రహావేదనని ప్రకటించాడు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే "మాకొద్దీ తెల్లదొరతనం" అని కవి గరిమెళ్ళ సత్యనారాయణ కదం తొక్కితే, "మాకొద్దీ నల్లదొరతనం" అని కవి కుసుమ ధర్మన్న దళిత చేవను చాటి చెప్పాడు.

అధికారమార్పిడి జరిగిననాడు నెహ్రూ 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి రాజ్యాంగసభనుద్దేశించి చారిత్రాత్మక 'లక్ష్యం కోసం దీక్ష' (Tryst with Destiny) ప్రసంగం చేసిన సమయంలోనే తెలంగాణాలో చారిత్రాత్మక నైజాం వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాగుతున్నది. 1946-51 కాలంలో సాగిన ఆ మహత్తర పోరాటం ప్రపంచ ప్రజాపోరాట చరిత్రలో చోటుచేసుకుంది. నాలుగు వేలమంది పోరాటయోధులు ప్రజలు ప్రాణత్యాగం చేశారు. మూడువేల గ్రామాల్లో పదిలక్షల ఎకరాల భూమిని భూకామందుల నుండి స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచిపెట్టారు.

నైజాం అధికారచ్యుతుడవుతాడని, కమ్యూనిస్టుల పాలన నెలకొంటుందని గ్రహించిన నెహ్రూ ప్రభుత్వం 1948లో కమ్యూనిస్టు పార్టీని నిషేధించి, పోలీసు చర్య పేరుతో సైనిక చర్య జరిపి రైతాంగ పోరాటాన్ని పాశవికంగా అణచివేసి భూములను తిరిగి భూస్వాములకు

అప్పజెప్పింది. స్వాతంత్ర్యమెవరికో, బానిసత్వం ఎవరికో ప్రజలకర్థమయింది. 1951లో కమ్యూనిస్టు పార్టీ పోరాట విరమణను ప్రకటించవలసి వచ్చింది.

ప్రజలు నెహ్రూ నిజరూపాన్ని ఎండగడుతూ పాటలు కట్టి పాడారు. ఆ పోరాట క్రమంలో ఉన్నతోన్నతమయిన ప్రజాసాహిత్యము, ప్రజాకళారూపాలు సృజింపబడినాయి. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రజానాట్యమండలి మహత్తర పాత్ర నిర్వహించాయి. ఎన్నో కథలు, పాటలు, 'కష్టజీవి' వంటి బుర్రకథలు ప్రజలను పోరాటోన్ముఖులను చేస్తూ వారి పోరాటాన్ని, త్యాగాలను, సాహసాన్ని గానం చేశాయి. సుంకర వాసిరెడ్డి రచించిన "మా భూమి" నాటకం జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిగావించింది. ఆ గొప్ప నాటకాన్ని 120కి పైగా కళాబృందాలు రెండు సంవత్సరాల కాలంలో వేయికి పైగా ప్రదర్శనలిచ్చాయి. అదొక అద్భుతమని ప్రజాకళాకారుడు, మేధావి కె.ఎ. అబ్బాస్ ప్రశంసించాడు. ఆ పోరాట నేపథ్యంతో దాదాపు 25 పోరాట నవలలు వచ్చాయి. అందులో 20 నవలలపై సమీక్షా వ్యాసాలను 'జనసాహితి' సంస్థ పుస్తకంగా ప్రచురించింది". వట్టికోట ఆళ్వారుస్వామి "ప్రజల మనిషి", "గంగు", తిరునగరి "సంగం", సరిపల్లి కృష్ణారెడ్డి "ఉప్పెన", కిషన్‌చందర్ "జైత్రయాత్ర" (అనువాదం), దాశరథి రంగాచార్య "చిల్లర దేవుళ్ళు", పి. చంద్ "శేషగిరి", మహీధర రామమోహనరావు "ఓనమాలు", లక్ష్మీకాంతమోహన్ "సింహగర్జన", గొల్లపూడి నారాయణరావు "తెలుగు గడ్డ", తదితర నవలలపై వ్యాసాలు అందులో వున్నాయి. "తెలంగాణాపోరాట కథలు" అను కథాసంకలనాన్ని "జనసాహితి" ప్రచురించింది. తెలంగాణా పోరాట సాహిత్యం ఇతివృత్తంగా "ప్రజాసాహితి" ప్రత్యేక సంచిక (1981 జూలై – ఆగస్టు) కూడా వెలువడింది.

ప్రఖ్యాత కవి కళాకారుడు అన్నాబావు సాఠే తెలంగాణా పోరాటాన్ని ఒగ్గు కథ కళారూపంలో అద్భుతంగా మలచి ప్రదర్శించాడు. చిత్తప్రసాద్ కుంచెలోంచి మహత్తర చిత్రాలు జాలువారినాయి. సునీల్ జానా కెమెరా కన్నులోంచి సజీవ దృశ్యాలు సాక్షాత్కరించాయి. 'తెలంగాణా' పేరుతో హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ్ ఆంగ్లంలో దీర్ఘకావ్యం రాశాడు. ఆరుద్ర దాన్ని తెలుగులోకి అనువదించాడు. ఆ పోరాటానికి సంఘీభావంగా కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉద్యమాన్ని నిర్మించింది. ఆ ఉద్యమంపై కూడా ప్రభుత్వం పాశవిక అణచివేతను అమలుజరిపింది. కాటూరు, ఎలమర్రు (కృష్ణాజిల్లా) గ్రామాలపై మలబార్ పోలీసులు నీచమైన అణచివేతకు పాల్పడింది. పురుషులను నగ్నంగా గాంధీ విగ్రహం చుట్టూ తిప్పారు. ఈ అకృత్యంపై హరీంద్రనాథ్ తీవ్ర నిరసనతో కవిత రచించాడు.

1951లో పోరాట విరమణ అనంతరం కమ్యూనిస్టుపార్టీ పోరాట పంథానొదిలి పార్లమెంటరీ పంథాను చేపట్టింది. 1952 సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ గణనీయమైన అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు గెలిచింది. వర్గపోరాటంలాగా జరిగిన మే 1955 మధ్యంతర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాభవం కోల్పోయింది. ఈ క్రమంలో అభ్యుదయ రచయితలు, కళాకారులు ఉద్యమ అండ కోల్పోయి సినిమారంగంలోకి, ఇతరత్రా వ్యాపకాల్లోకి మళ్ళారు. అరసం సంస్థాగతంగానూ, ఉద్యమపరంగానూ స్తబ్దతకు నిర్వీర్యతకు గురైంది. "అభ్యుదయ" సాహిత్య మాసపత్రికను కూడా క్రమబద్ధంగా తీసుకురాలేకపోయారు. సంస్థను, పత్రికను నిలబెట్టాలనే ప్రయత్నంలో తుమ్మల వెంకట్రామయ్యగారి నిబద్ధత, కృషి గొప్పది.

ఆ నిస్తబ్ద కాలంలో కూడా సి.వి. (చిత్తజల్లు వరహాలరావు), కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావు, చాగంటి సోమయాజులు మార్క్సిస్టు సామాజికావగాహనతో గొప్ప ప్రగతిశీల సాహిత్యాన్ని సృజించారు. జీవితం మధ్యతరగతి భావిస్తున్నంత సాఫీగా ఏమీ లేదని వైరుధ్యాలు తీవ్ర ఘర్షణ స్థాయికి చేరాయని మనల్ని ఆలోచింపచేశారు.

అదే కాలంలో యద్దనపూడి సులోచనా రాణి, కోడూరి కౌసల్యాదేవి రాసిన కాలక్షేప వ్యాపార నవలలు మధ్యతరగతి పగటి కలలుగా, వ్యాపార వారపత్రికలకు పెద్ద ఆసరాగా, సినిమాలకు చద్దిమూటగా పుంఖానుపుంఖంగా వెలువడినాయి. 'సెక్రటరి', 'జీవనతరంగాలు', 'డా॥ చక్రవర్తి', 'ప్రేమనగర్' ఆ కోవకి చెందినవే. నేడు వివేక రహిత యువతకు, అట్టడుగు ప్రజలకు ఆరాధనీయమైన కల్తీలేని కలల సినిమా రాజ్యమేలుతోంది. ఆనాడు అరాకొరా చదువరులకు డిటెక్టివ్ సాహిత్యం మరొక కాలక్షేప దినుసుగా వుండేది. దాన్ని గేలిచేయడానికి డిటెక్టివ్ ఖయ్యూస్ పేరుతో కొడవటిగంటి కుటుంబరావు ఒక వ్యంగ్య డిటెక్టివ్ రచన రాయవలసి వచ్చింది.

నెహ్రూ హయాంలో ఆయన 1964లో చనిపోయేంతవరకు ఆయనకున్న ప్రతిష్ట రీత్యా భారత సమాజం నెమ్మదిగానైనా తన కొరతలను తీర్చుకుంటూ అందరికీ మంచి భవిష్యత్తునిచ్చే వైపుగా సాగుతున్నదనే భ్రమలను ఆకాశవాణి (All India Radio), వార్తాపత్రికలు, కమ్యూనిస్టుపార్టీ ప్రజలను నమ్మిస్తూ వచ్చాయి. పంచవర్ష ప్రణాళికలు, ప్రభుత్వరంగ పరిశ్రమల స్థాపన (అవి ప్రయివేటు పరిశ్రమరంగ పోషణకు తోడ్పడేవే అయినా), సేవారంగాలు కొన్ని నీటిపారుదల ప్రాజెక్టులు ఆ నమ్మకానికి రుజువుగా భావించబడినాయి. ఇదంతా ప్రభుత్వరంగ ఉద్యోగాలు కల్పించి మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి ఆధారాన్ని విస్తృతపరిచాయి. వ్యాపార సాహిత్యం, పగటికలల సినిమా, 'చందమామ' కథలు వాళ్ళకి చెందినవే. కుదుపులు లేని వాళ్ళ పట్టణ నాగరికత సార్వత్రికమైనదనే భ్రమల్లో వుండిపోయారు.

అయితే భారత సమాజంలో అంతా సవ్యంగా లేదనీ, ముఖ్యంగా చిన్నరైతులు, గ్రామీణ శ్రామిక కులాల ప్రజల జీవితాలు ఊహకందని క్షోభ, కటిక పేదరికం, శ్రమదోపిడి, భూస్వామ్యం, రాజ్యం అణచివేతలో మగ్గిపోతున్నాయన్న నిజం నివురుగప్పిన నిప్పులా వుందన్నది 1960 దశాబ్దాంతానికి స్పష్టమైపోయింది. వాళ్ళు గరళకంఠుడిలా వున్నారు. పంచవర్ష ప్రణాళికలు, విదేశీ సహాయాలు, పెట్టుబడులు ఎవరికి మేలు చేశాయో, ఎవరికి కీడు చేశాయో స్పష్టమైంది. కారా మాస్టారి "యజ్ఞం" కథ ఈ పరిణామాన్ని ఆవిష్కరించింది. 1967–70లో పెల్లుబికిన శ్రీకాకుళ రైతాంగ పోరాటం యాదృచ్ఛికం కాదన్నది సుస్పష్టమే. కవి ఛాయరాజ్ ఆ పోరాటం ఆద్యంతాలను తన 'శ్రీకాకుళం' కావ్యంలో అనన్య ప్రతిభతో వాస్తవికంగా చిత్రించాడు.

1960లలో దేశంలో తీవ్ర ఆహార కొరత ఏర్పడి అమెరికా నుంచి పిఎల్–480 ఒప్పందంతో ఆహారధాన్యాలను (గోధుమ) దిగుమతి

చేసుకోవలసి వచ్చింది. “Ship to Mouth” అని పిలవబడిన అవమానకర స్థితికి భారతదేశం చేరింది. రెండు పంచవర్ష ప్రణాళికల అమలు తరువాత అదీ పరిస్థితి. అయినా వాస్తవ పరిష్కారమైన విప్లవాత్మక భూసంస్కరణలు చేపట్టకుండా “ఆకుపచ్చ విప్లవ” చిట్కాను ప్రవేశపెట్టారు. అది సామ్రాజ్యవాద దేశాల ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించింది. 1997 ప్రాంతం నుండి రైతులను ఆత్మహత్యలపాలు చేసింది. 2022 నాడు కూడా వంటనూనెలు, పప్పుధాన్యాలు తదితర ఆహారోత్పత్తులకు విదేశీ దిగుమతులపై ఆధారపడిన పరిస్థితి వుంది. ఆకలి సూచికలో అట్టడుగు దేశాల సరసన మనదేశం చేరింది. రైతులు ఆత్మహత్యలవైపు నెట్టబడినారు.

ఈ పరిస్థితికి తోడుగా వ్యాపార సాహిత్యం, సినిమా పలాయన సంస్కృతి, సర్వవ్యాపిత అవినీతి, పాలకవర్గ కంపు రాజకీయాలు, బూటకపు ఎన్నికలు, అకాడమీల, ప్రభుత్వాల ప్రాపకాలు, అవార్డుల కోసం రచయితలు సొల్లు కార్చడం, అసహ్యకర బాబాలు, స్వాముల వీరంగాలు సామాజిక సంస్కృతిని జుగుప్సాకరంగావించాయి. ఈ నేపథ్యంలో 1965–68లో దిగంబర కవిత్వం అవశ్యక సాహిత్య పరిణామంగా దూసుకొచ్చింది. వారి కవితాసంపుటాల కోపోద్రిక్త కవిత్వం కుష్టులాగా తయారైన జుగుప్సాకర సామాజిక చిత్రాన్ని నూతన ఉద్రిక్త భాషాప్రయోగాలు, కొన్ని అభ్యంతరకర కవి సమయాలు ప్రయోగించి తీవ్ర సంచలనం రేపారు. సమాజం ఎంత తీవ్రంగా పతనమయివుందో అంత తీవ్రమైన ఖండనతో దిగంబర కవిత్వం వెలువడింది. రా.రా. వంటివారు దాన్ని తీవ్రంగా ఆక్షేపించినా, శ్రీశ్రీ ఆహ్వానం పలికి ఆ కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించి ప్రచారమిచ్చాడు. నిజానికి 1990ల నుండి ఉధృతంగా అమలవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సామాజికార్థిక రాజకీయ విధానాలు తెచ్చిపెట్టిన సామాజిక విధ్వంసం, వికృత సంస్కృతి, మతతత్వ రాజకీయాలు కల్పించిన సర్వవ్యాపిత అసాంఘిక అమానవీయ, క్షుద్ర పరిస్థితులు మరొక దిగంబర కవిత్వ శకాన్ని అవసరం చేస్తున్నాయనిపిస్తుంది. తెలుగు సమాజంలో దిగంబర కవిత్వం వెలువడిన కాలంలో భారతదేశ ఇతర భాషా సాహిత్యాల్లో కూడా దిగంబర కవిత్వాన్ని పోలిన నిరసన కవిత్వం వెలువడడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. భారతదేశంలోని పరిస్థితుల సాధారణీకరణే కావచ్చు. దిగంబర కవిత్వం నిర్మాణాత్మకమైన పరిష్కారాలను ఎత్తిపట్టక పోయినా శక్తివంతమైన నిరసనగా దానికదే ఒక సామాజిక విలువను కలిగివుందన్నది వాస్తవం. ఇదే కాలంలో సి.వి. మార్క్సిస్టు దృక్పథంతో రచించిన నిరసన ప్రతిఘటన కవిత్వం. సాహితీపరుల్లో, యువతపై నెరపిన గొప్ప ప్రభావాన్ని కూడా గుర్తించుకోవాలి. ఈ నేపథ్యంలో శ్రీశ్రీ కవిత్వ ప్రభావం మరింత శక్తిని నిరూపించింది. ఇదంతా ప్రగతిశీల సాహిత్యానికి గల సామాజిక శక్తిని నిరూపించింది.

తెలుగు సమాజంలో దిగంబర కవిత్వం సంచలనం కలిగించిన కాలంలోనే పశ్చిమబెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లాలో నక్సల్బరి గ్రామంలో ఆదివాసీ రైతాంగం తమకు గల కొద్దిపాటి భూమిపై హక్కుల కోసం పోలీసు కాల్పులను ప్రతిఘటించి సాయుధ తిరుగుబాటు చేశారు. అది దేశాన్ని ఉలికిపాటుకు గురిచేసి పీడిత ప్రజల్లో నిద్రాణంగా వున్న విప్లవ కాంక్షల్ని మేల్కొలిపింది. ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన విప్లవ కమ్యూనిస్టులు సిపిఎం పార్టీ నుంచి తెగతెంపులు చేసుకొని సిపిఐ(ఎం–ఎల్) పార్టీగా నిర్మాణమయ్యారు. నక్సల్బరి స్ఫూర్తి దావాలనం మాదిరి దేశాన్ని చుట్టుముట్టింది. యువత దానికి ఎలా ఆకర్షితమై బలిదానాలు చేశారో మహాశ్వేతాదేవి నవల “ఒక తల్లి కథ” గొప్పగా చిత్రించింది. ఆమె రచించిన ‘ఎవరిదీ అడవి’ నవల ఝార్ఖండ్ ప్రాంతంలో 1890–1900 కాలంలో ముండా తెగ ఆదివాసీ ప్రజలు బిర్సాముండా నాయకత్వంలో తమ అటవీ హక్కుల కోసం వలస పాలకులపై జరిపిన మహత్తర ‘ఉల్‌గులాన్’గా ఖ్యాతిగాంచిన గెరిల్లా పోరాటాన్ని గొప్పగా చిత్రించింది. బ్రిటీష్ పాలకులు ఆ పోరాటాన్ని పాశవికంగా అణచి బిర్సాముండాను జైలులో బంధించి ఉసురు తీశారు. ఆదివాసీ ప్రజలు నాడూ నేడూ కూడా బిర్సాముండాను దేవునిగా భావించి స్మరిస్తున్నారు. ఆదివాసీ అటవీ హక్కులను మరింత పాశవికంగా అణచివేయటమే ఈ 75 ఏళ్ళ పాలకవర్గాల వంచనాత్మక చరిత్ర. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి ఎందరో విప్లవకారులను బలిగొన్నాయి. తర్వాత కాలంలో విప్లవ పంథా గురించి వాదవివాదాలతో ఎం.ఎల్ విప్లవ పార్టీలు చీలికలకు గురై బలహీనపడడం జరిగింది. అయినా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్బరి సాయుధ తిరుగుబాటు స్ఫూర్తి రగులుతూనే వుంది.

1970 ఫిబ్రవరిలో విశాఖపట్టణంలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తి సభ సందర్భంలో విశాఖ విద్యార్థులు “రచయితలారా! మీరెటువైపు” అను కరపత్రంతో సవాలు విసిరారు. అది యువతరంలో నూతన జాగృతిని సూచిస్తూ, నక్సల్బరి నేపథ్యంలో రచయితల వైఖరులను నిలదీసింది. 1970 జూలై 4న హైదరాబాద్‌లో శ్రీశ్రీ అధ్యక్షతన “విప్లవ రచయితల సంఘం” (విరసం) ఏర్పాటు ఒక పతాక ఘటన. మార్క్సిజం, ప్రాతిపదికగా భారతదేశంలో విప్లవ సాధనకు సాహితీ సాంస్కృతిక రంగాలలో కృషిచేయడం లక్ష్యంగా విరసం ప్రకటించుకుంది. దిగంబర కవులలో జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, నగ్నముని, చెరబండరాజు విరసంలో కలిశారు. విరసం రచయితలపైన నిర్బంధాలు, కొన్ని రచనలపై నిషేధాలను ప్రభుత్వాలు అమలుజరిపాయి. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలంలోను, ఆ తరవాతా, నేడు బిజెపి పాలన కాలంలోనూ నిర్బంధాలు సాధారణ విషయమైపోయినాయి.

నూతన ప్రజాతంత్ర విప్లవ దశలో రచయితల సంస్థల్లో ఎం–ఎల్–ఎం ఆలోచనావిధానాన్ని రచయితలకు షరతుగా పెట్టడం సరైన పంథా కాదనీ, భూస్వామ్య సామ్రాజ్యవాద వ్యతిరేక చింతననూ, ఆచరణను కలిగిన రచయితలు, కళాకారులు అందరినీ కూడగట్టి ఉద్యమించాలనే వాదనతో ఒక వర్గం రచయితలు విరసం నుంచి విడగొట్టుకొని ఆ తరువాత జనసాహితి సాంస్కృతిక సమాఖ్యగా నిర్మాణమయినారు. రవిబాబు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ తదితరులు అందులో వున్నారు.

మొత్తంమీద విప్లవోద్యమ అవసరాల మేరకు ఎంతో విప్లవ సాహిత్యాన్ని విప్లవ రచయితలు సృజించారు. శ్రీశ్రీ ‘మరోప్రస్థానం’ కావ్యం రాశాడు. సాహిత్య విమర్శతో కొత్తదారులు వేశారు. జననాట్యమండలి, జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య, అరుణోదయ సంస్థలు విప్లవ కర్తవ్యాల అవసరాలకు జానపద కళారూపాలను మలచుకొని ప్రజాకళారంగంలో ఉన్నత ప్రమాణాలు సాధించి విప్లవ

రాజకీయాలను పీడిత ప్రజానీకానికి చేరవేయడంలో ఘనమైన కృషి సాగించాయి. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట కాలంలో వెల్లివిరిసిన సాంస్కృతికరంగ వైభవాన్ని గుర్తుకు తెచ్చాయి. గొప్ప గాయకులు గద్దర్, వంగపండు, అరుణోదయ రామారావు పేర్లు విననివారు లేరు. జనసాహితి వారి 'నరమేధం', "అప్పుల భారతం", జననాట్య మండలివారి "సిక్కోలు యుద్ధం" వీధిభాగవత రూపకాలు వందల ప్రదర్శనలు జరిగాయి.

పంథా విభేదాలతో మా–లె పార్టీలు చీలికలకు గురై విప్లవోద్యమం బలహీనపడినా విప్లవ సాహిత్యరంగం ఒకమేరకు ఆశావహ భావనతో కొనసాగుతున్నది. ప్రజాకళారూపాల రంగం వెనకడుగు వేసింది.

విప్లవోద్యమం బలహీనపడిన నేపథ్యంలో వివిధ అస్తిత్వవాదాలు 1980–90 నుండి బలంగా ముందుకొచ్చాయి. స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, బహుజనవాదం, ప్రాంతీయవాదం ఆ విధంగా ముందుకొచ్చినవే. వాటికి సంబంధించిన సామాజిక ద్వితీయ వైరుధ్యాల ఘర్షణ స్థాయి తీవ్రం కావడమే అవి ఉత్పన్నం కావడానికి ప్రధాన కారణం. ఉదాహరణకు మహిళల విద్య, ఉద్యోగాలు, ప్రజాస్వామిక ఉద్యమాల అండ, ఉద్యమాల్లో వారి ప్రమేయము పెరగడంతో పితృస్వామ్య అణచివేతను, అహంకారాన్ని ప్రశ్నించి ఎదిరించే చైతన్యం కూడా పెరిగింది. ఈ క్రమంలో స్త్రీవాద సాహిత్యం పురుషస్వామ్య అణచివేతలోని స్థూల, సూక్ష్మ అంశాలను వివరంగాను, శక్తివంతంగాను నమోదుచేసింది. విప్లవోద్యమం నేపథ్యంలో ఆదిమ తెగల సమాజాల్లో మహిళల జీవితాన్ని చిత్రించిన "ఎల్లి" వంటి నవలల్లో కూడా ఈ చర్చను గమనించగలం.

పై అస్తిత్వ చైతన్యాలకు ఇతర కారణాలు : 1. పలు ప్రాంతాల్లో విప్లవోద్యమ చైతన్యం విస్తరించి వుండడం., 2. ఇందిరాగాంధి హయాంలో కాంగ్రెస్ పార్టీలోపలే ఎమర్జెన్సీకి ముందు, తరువాతి కాలంలో తన రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడంలో పాపులిస్టు విధానాలు చేపట్టడంతో కింది వర్గాల్లోకి, కులాల్లోకి పార్లమెంటరీ రాజకీయాలు చేరువై స్వతంత్ర చైతన్యం పెరిగింది., 3. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల విస్తరణ క్రమంలో వివిధ చిరువ్యాపారులు, చిరుద్యోగాలు, ఎన్జీవోల కార్యకలాపాలు పెరిగి డబ్బు చెలామణి ముమ్మరం అయింది. ఆ బృందాల్లో అస్తిత్వ చైతన్యం పెరిగింది.

ఇదంతా ఆయా సామాజిక బృందాల ఆత్మవిశ్వాసము, ఆత్మాభిమానము పెరగడానికి దోహదం చేశాయి.

వర్గసమాజంలో వర్గ అస్తిత్వమే ప్రాథమికమైనది. తక్కిన అస్తిత్వాలు దీనికి లోబడి వుంటాయి. వివిధ అస్తిత్వవాదాలు ద్వితీయ, తృతీయ స్థాయి వైరుధ్యాలకు చెందినవిగా వుంటాయి. అవి వర్గవైరుధ్య పరిష్కారముతో సంబంధం లేకుండా పరిష్కారం కావు. వర్గ వైరుధ్య పరిష్కారం ద్వితీయ వైరుధ్యాల పరిష్కారానికి దారి వేస్తుంది. అట్లాగని ద్వితీయ వైరుధ్యాలు ఘర్షణ లేకుండా పరిష్కారమవుతాయని నిర్ధారణ కాదు. రష్యా, చైనా విప్లవాలు అవి కొనసాగిన కాలంలో దీన్నే నిరూపించాయి. ద్వితీయ అస్తిత్వాలు వైరుధ్యాలను వర్గ అస్తిత్వానికి వర్గ వైరుధ్యానికి పోటీగానో, సమాంతరంగానో భావించడం నిరుపయోగమైన వైఖరి.

అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యతిరేక నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమ చైతన్యాన్ని పక్కదారి పట్టించడానికి ఆధునికానంతర వాదాన్ని కొందరు ముందుకు తెచ్చారు. దాన్ని "పుట్టుకలోనే మరణమున్న వాదమ"ని కె.కె. రంగనాథాచార్యులు ఎండగట్టారు. సారధిగారి "ఆధునికానంతరవాదం" రచన దాని అసంగతత్వాన్ని గతితార్కికంగా బయల్పరచింది. దాని శకలీకరణ సూత్రాన్ని అస్తిత్వ ఉద్యమాలకు అన్వయించి నిరూపించే వృధా ప్రయత్నం కూడా జరిగింది. దాని వాగాడంబరాన్ని అలా వుంచితే, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ తన వైరుధ్యాలను తాను పరిష్కరించుకోలేని దశే ఆధునికానంతర దశ. శ్రామికవర్గ విప్లవమొక్కటే దానికి పరిష్కారం. ఆధునికానంతర సాహిత్యాన్ని నిజాయితీగా సృజిస్తే అది సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ మీద విమర్శగా, మిగులుతుంది.

ఆ మధ్య, బహుశా రెండేళ్ళనాడు, 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక 'వివిధ' ఆధునికానంతరవాదాన్ని సమర్థించే తిరుపతిరావుగారి "మన కాల్పనిక సాహిత్యం – యాంత్రిక ఆలోచనా చట్రాలు" వ్యాసం వచ్చింది. అందులో ఆయన ఉద్యమ సాహిత్యానికి చట్రాలుంటాయని అందువల్ల అది యాంత్రికంగా వుంటుందని సూత్రీకరించాడు. ఇది చాలా అన్యాయమైన ఆరోపణ – ఉద్యమేతర సాహిత్యానికి చట్రాలుండవని అందువల్ల అది స్వతంత్ర వివేచన చేస్తుందని అన్నారు. ఇదొక అసత్యం. ఉద్యమేతర రచయితలకు కూడా రాజకీయాలుంటాయి. ఉద్యమ సాహిత్యంలో జీవితము అందులో భాగంగా రాజకీయాలు స్పష్టంగా వుండడమేగాక అవి సాహిత్య విస్తృతికి గాఢతకు తోడ్పడతాయేగాని అడ్డంకి కావు. ప్రతి రచయితా తెలిసో తెలియకో ఒక రాజకీయ చట్రంలోనే ఆలోచిస్తాడు. ప్రగతిశీల పరివర్తనను కోరే శక్తులు, యథాతథ స్థితిని కోరే శక్తుల మధ్య జరిగే సంఘర్షణను రాజకీయాలు ప్రతిబింబిస్తాయి. మనం సమాజాన్ని నడుపుకొనే లేదా నడుపుకోవాలనుకొనే విధానమే రాజకీయాలు. రచయితకైనా ఉద్యమానికైనా ఈ సంఘర్షణ తీవ్రంగా అనుభూతమవుతుంది. "రాజకీయాలు నుంచి కవిత్వ విషయాలు ఎంచుకోవాలి", కవి గరిమెళ్ళ సత్యనారాయణ సూటిగా చెప్పాడు.

రెండవ ప్రపంచయుద్ధానంతరం సామ్రాజ్యవాద కూటమిలోని దేశాలు తమ మధ్య సంఘర్షణలు అధిగమించడానికి తగిన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు ఏర్పరచుకొనే క్రమంలో బ్రెటన్ ఉడ్స్, గాట్, అంతిమంగా డబ్ల్యుటివో (ప్రపంచ వాణిజ్య సంస్థ) ఒప్పందం రూపొందినాయి. నేడు రష్యా, చైనాలతో సహా ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలు డబ్ల్యుటివో సభ్యత్వం కలిగి వున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు వెనుకబడిన మూడవ ప్రపంచ దేశాలపై తమ వాణిజ్య షరతులను రుద్ది ద్రవ్య పెట్టుబడిని స్వేచ్ఛగా ప్రవేశపెట్టి వాటి సహజ వనరులను, మానవ వనరులను, మార్కెట్‌లను దోపిడీ చేసే సాధనమే డబ్ల్యుటివో. ఈ క్రమాన్నే ప్రపంచీకరణ పేద దేశాలను దోపిడీచేసి పరిష్కరించుకొనే మార్గమే డబ్ల్యుటివో. సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) పేర్లతో ఇదంతా సాగుతున్నది. వెనుకబడిన దేశాల్లో దళారీ బూర్జువా పాలకవర్గాలు ప్రజాస్వామ్యాన్ని బూటకపు ఎన్నికలకు పరిమితం చేసి ఏర్పరుస్తున్న ప్రభుత్వాలు, దేశ ప్రజలపై

నియంతృత్వ పాలన సాగిస్తూ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అమలులో కిరాయి పాత్ర నిర్వహిస్తాయి. 70 కోట్ల మందికి కనిష్ట జీవనాధారంగా వున్న వ్యవసాయరంగాన్ని, చిన్నా, పెద్ద జాతీయ పారిశ్రామిక రంగాన్ని దివాలా తీయించే చట్టాలు, చర్యలు చేపడుతూ అశేష ప్రజానీకం జీవితాల్ని అంతులేని సంక్షోభంలోకి నెట్టారు. ఆర్థిక అసమానతలు, సంపద కేంద్రీకరణ సామాజిక రుగ్మతలను ఈ చర్యలు పెంచాయి. ఇదంతా 1990ల నుండి ఉధృతమైన ప్రపంచీకరణ విధానాల అమలు ఫలితమే.

సామ్రాజ్యవాద దేశాల కార్పొరేట్ కంపెనీల ద్రవ్యపెట్టుబడి, సరుకులు ప్రపంచమంతటా స్వేచ్ఛగా విహరిస్తూ ప్రపంచాన్ని కుగ్రామం చేసుకుంటూ మనుషుల మధ్య మానవీయ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. విచ్చలవిడి ప్రవర్తనలు, వస్తువ్యామోహ సంస్కృతి మనిషికి సరుకులకి మధ్య సంబంధాన్ని ప్రధానం చేసింది. మనుషులు పౌరులుగా కాకుండా వినియోగదారులుగా భావించబడుతున్నారు. దైవభక్తి ఆధ్యాత్మికతలేని సరదా వ్యాపార రాజకీయ సరుకుగా మార్చబడింది. సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతులు కలివిడిగా మానవ వ్యక్తిత్వాన్ని దొల్లబార్చాయి. ఒకరి కన్నీళ్ళను మరొకరు పట్టించుకొనే మానవీయ పరిస్థితులు లేవు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తెచ్చిపెట్టిన సామాజికార్థిక సాంస్కృతిక విచ్ఛిత్తిని పాటిబండ్ల ఆనందరావు నాటకం "పడమటిగాలి" అద్భుతంగా దృశ్యీకరించింది. ఎందరో రచయితలు కథా, కవిత్వ సాహిత్యాన్ని సృజించారు. ఆ విచ్ఛిత్తి పునాదుల్ని ఎత్తిచూపి పరిష్కారాలను ఆవిష్కరించడం తగినంతగా జరగలవసి వుంది.

మరి, భారత సమాజ ప్రగాఢ పరివర్తన, అంటే నూతన ప్రజాస్వామిక విప్లవ పరివర్తన ఎలా సాధ్యమవుతుంది? ఒక సందర్భంలో 1850లో కారల్‌మార్క్స్ చెప్పిన మాటలు గుర్తించుకోవడం అవశ్యం. "ఆలోచించగలవాళ్ళు బాధలు పడగల శక్తి సంతరించుకున్నప్పుడు, బాధిత మానవాళి ఆలోచించడం ప్రారంభించినప్పుడు మాత్రమే ప్రగాఢమైన సామాజిక పరివర్తన సంభవిస్తుంది". అయితే ఇవాళ ఆలోచించగల వాళ్ళు సుఖాన్వేషణలోను, బాధిత ప్రజలు ఆలోచించలేని స్థితిలోను వున్నారు. ఈ పరిస్థితి బద్దలుకావడం మాత్రమే మన సమాజాన్ని ముందడుగు వేయించగలం. అది ఆలోచనాపరులతోనే ప్రారంభం కావాల్సి వుంది. స్వాతంత్ర్య ఉత్సవాలు ఈ ఎరుకను కలిగించగలగాలి.

# ప్రొఫెసర్ ఘంటా మారుతికి జోహార్లు



**వరంగల్** ఆర్.ఇ.సి. సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఘంటా మారుతి 28-3-1948న కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, చోడవరంలో జన్మించారు. 28-8-2022వ తేదీన విజయవాడలో అనారోగ్యంతో తన ఇంటిలో మరణించారు.

మారుతి సాహిత్యాభిలాషి. ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూనే వుండేవారు. ఆమె ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థిగా వున్నప్పుడు కొండమొదలు గిరిజన రైతాంగ ఉద్యమానికి సంఘీభావంగా చేసిన కృషిలో 1969, '70లలో రెండుసార్లు అరెస్టయ్యారు. అందరితో ఆత్మీయంగా, స్నేహంగా వుండే మారుతి 'ప్రజాసాహితి' అభిమాని. ఎంతోమంది విద్యార్థులను అభ్యుదయ భావాలవైపు మళ్ళించిన అధ్యాపకురాలు.

మారుతి కాకినాడ ఇంజనీరింగ్ కాలేజిలో ప్రవేశపెట్టిన మహిళల సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ మొదటి బాచ్ విద్యార్థిని. ఇంజనీరింగ్ కాలేజిలో ఆమె విద్యార్థిసంఘ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆమె తండ్రి కలపాల దశరథరామయ్య ప్రభావం ఆమెపై వుండేది. దశరథరామయ్య స్వాతంత్రోద్యమ కాలంలో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. హిందీ భాషలో ప్రావీణ్యత సాధించారు. వామపక్ష భావజాలంతో కొనసాగారు. ఆయన 'లల్లన్' పేరుతో ప్రేమ్‌చంద్ సాహిత్యాన్ని తెలుగులోకి అనువాదం చేశారు.

ఆమె, గుంటూరుజిల్లా రేపల్లె ప్రాంతపు కమ్యూనిస్టు నాయకుడైన ఘంటా సీతారామయ్యగారి అబ్బాయి డా॥ ఘంటా వెంకట్రావులు అతినిరాడంబరంగా 1969లో దండల పెళ్ళి చేసుకున్నారు. డా॥ ఘంటా వెంకట్రావు హనుమకొండలో 50 ఏళ్ళపాటు ఆర్థోపెడిక్ ఆసుపత్రిని నిర్వహించారు. 5, 6 ఏళ్ళుగా విజయవాడలో నవయుగ వైద్య ఆరోగ్య సేవాసంస్థను నిర్వహిస్తున్నారు. మారుతి ఆర్.ఇ.సి. వరంగల్‌లోనే ఎం.టెక్ చేసి, అదే కాలేజిలో రిటైర్ అయ్యేంతవరకు సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేశారు.

మారుతి మరణానికి జనసాహితి సంతాపం ప్రకటిస్తుంది. వారి కుటుంబ సభ్యులు డా॥ ఘంటా వెంకట్రావు, డా॥ మల్లిక, భాస్కర్‌లకు ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తోంది.

**గమనిక :**

**స్థలాభావం వల్ల కొన్ని వ్యాసాలను ఈ సంచికలో ప్రచురించలేకపోయాము. వచ్చే సంచికలో ప్రచురిస్తాము. – సం॥**

వ్యాసం

# అమృతోత్సవవేళ జాతీయోద్యమ మదింపు

- వకుళాభరణం రామకృష్ణ

**స్వాతంత్ర్య** అమృతోత్సవాలను దేశం ఇటీవలనే జరుపుకొన్నది. యావద్భారత జాతి గర్వించాల్సిన సన్నివేశం యిది. 75 సంవత్సరాలు ఒక దేశ సుదీర్ఘ చరిత్రలో తక్కువే అనిపించినా, స్వతంత్ర జాతిగా ప్రపంచంలో తలెత్తుకొని యిన్ని సంవత్సరాలు మనుగడ సాధించడం గర్వకారణం.

నేడు మనం అనుభవిస్తున్న యీ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల నేపథ్యం, వీటిని సాధించుకోడంలో భారతజాతి సాగించిన సుదీర్ఘ పోరాటం, దాని ఆశయాలు, అది మిగిల్చిన వారసత్వం, దేశ భవిష్యద్దర్శనం గూర్చి క్లుప్తంగా చెప్పుకొందాం.

అఖిలభారత జాతీయ కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావంతోనే (1885) జాతీయోద్యమం ఆరంభం కాలేదు. దానికి పూర్వరంగముంది. వాస్తవంలో, ఆంగ్లేయుల పాలనకు ప్రారంభం నుండి ఎదురుదెబ్బలు తగుల్తూనే వున్నాయి. కాని ఆ నిరసనలకొక నిర్ణీతమైన భావజాలం, వివిధ నిరసనలు, తిరుగుబాట్ల మధ్య సమన్వయం లేదు. వారిని పట్టి వుంచే భావజాలం ఆనాడు లేదు. ఈ పరిస్థితికి భిన్నంగా జరిగిన చారిత్రక ఘటన 1857 తిరుగుబాటు. దీన్ని సిపాయిల పితూరి (Sepoy Mutiny)గా ఆంగ్ల చరిత్రకారులు పేర్కొన్నా, వాస్తవంలో, చరిత్రకారుల పరిశోధనల్లో తేల్చిన అంశం అది ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం. (First War of Indian Independence). ఈ తిరుగుబాటు ఆంగ్ల ప్రభుత్వాన్ని ఒక కుదుపు కుదిపింది. ఇందులో గమనించాల్సిన ముఖ్యాంశం హిందూ - ముస్లింల ఐక్యత. భారతదేశం బహుళజాతుల, మతాల, భిన్న సంస్కృతుల సమ్మేళనం. 'It is a museum of races'గా చరిత్రకారులు అభివర్ణించారు. తిరుగుబాటు కేవలం రాజకీయమే కాదు. దేశ ఆర్థిక, సాంఘిక, సంస్కృతులకు సంబంధించి ఆంగ్లేయుల జోక్యం వల్ల ఒకనాటి ఆర్థికపరమైన సంపన్నత, పారిశ్రామిక నైపుణ్యాలను దేశం కోల్పోయి, చితికిపోయింది. రాజకీయంగానే గాక, ఆర్థికంగా, సాంస్కృతికంగా సందర్భాన్ని విప్పిచెప్పి, రానున్న జాతీయోద్యమానికి తెరదీసింది 1857 తిరుగుబాటు. దేశ చరిత్రలోనే ఈ తిరుగుబాటు ఒక అపూర్వ ఘట్టం.

1857 తిరుగుబాటు వారసత్వంగా, విశాలాంధ్రలో ఆ భావజాలపు పొడిగింపే ఆ తర్వాత మూడు దశాబ్దాలకు ఏర్పడ్డ అఖిలభారత జాతీయ కాంగ్రెస్ సంస్థ (Indian National Congress). ఆధునిక జాతీయ భావజాలంతో ఏర్పడ్డ ఈ సంస్థ, ఆంగ్లపాలన వల్ల కలుగుతున్న, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక దుష్ఫలితాలను విడమర్చి వివరించింది. జాతి విమోచనోద్యమానికి దారులు వేసింది. జాతీయోద్యమం ప్రారంభం నుండి హేతుబద్ధమైన, శాస్త్రీయమైన లౌకిక విధానంవైపు దానిని నడిపించింది. లౌకికత్వం, స్వతంత్ర ఆర్థికవ్యవస్థ, ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయం పునాదులుగా, భారతదేశ భవిష్యత్తును ఆకాంక్షించింది. మతపరమైన రాజకీయాలనూ, మతభావజాలాన్నీ ఎదుర్కోవడంలో విఫలమైనా, స్వాతంత్ర్యం తర్వాత ఏర్పాటు చేసుకొన్న రాజ్యాంగ పునాదులకు లౌకికత్వం (Secularism) మూలస్తంభమైంది. స్వతంత్ర, స్వావలంబ ఆర్థికవ్యవస్థను, ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయం పునాదులుగా నిర్మించడం ధ్యేయంగా పెట్టుకొంది. ఈనాటి ప్రమాణాలతో చూసినపుడు అప్పటి జాతీయోద్యమం విప్లవాత్మకంగా వుండింది. పేదల సంక్షేమం, అభ్యున్నతి, మతసహనం, 'సర్వ ధర్మ సంభావ' పునాదులపై దేశ భవిష్యత్తును స్వప్నించింది. నౌరోజీ, భారతీయ సమాజంలోని ఆర్థికపర దారిద్ర్యాన్ని గూర్చి రాసినప్పుడు (Poverty and Unbritish Rule in India) గానీ, గాంధీజీ దరిద్ర నారాయణుడి ప్రత్యక్ష అవతారంగా పరిగణింపబడినపుడు గానీ, 1930, 1940లలో సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ ఆర్థిక, సాంఘిక సమానత్వాలను జాతీయోద్యమ కార్యక్రమంలో చేర్చడానికి చేసిన కృషి చూసినప్పుడు ఇది ద్యోతకమవుతుంది. అన్నిరకాల అసమానతలనూ, వివక్షలనూ, జాతి, మత, కుల, లింగపర పీడనలకు జాతీయోద్యమం తీవ్రంగా ఖండించింది. భారతీయ సమాజంలోని సాంస్కృతిక, భాషా, మత, భౌగోళిక భిన్నత్వాలను గౌరవించాలని వక్కాణించింది. భిన్నత్వం భారతీయ సంస్కృతిలో అనాదిగా వుంటూ వచ్చింది. అయినా, అది ఏకత్వంగానే వర్ధిల్లింది. రాజకీయంగా, స్పర్ధలు, యుద్ధాలు, ఆక్రమణలు జరిగినా, అవి రాజ్యకాంక్షతోనే జరిగాయనీ, మతపర, ప్రాంతీయ ఘర్షణలు కావనీ, వాటిని నేటి స్వార్థపూరిత, మతశక్తులు, వక్రభాష్యం పట్టిస్తున్నారన్న విషయం గ్రహించాల్సి వుంటుంది. అంతేకాదు. జాతీయోద్యమం ఏనాడూ శిష్టులకే (Elites) పరిమితం కాలేదు. బాలగంగాధర తిలక్ మహారాష్ట్రలో చేపట్టిన ఉద్యమాలు, కార్యక్రమాలు;

1905లో జరిగిన స్వదేశీ ఉద్యమం; వందేమాతర గేయం; బిపిన్ చంద్రపాల్ దేశవ్యాప్తంగా చేసిన ఉత్తేజకర ప్రసంగాలు, ఆంధ్ర దేశంలో ఆయన ఉపన్యాసాన్ని చిలకమర్తి అనువదిస్తూ, అల్లిన పద్యం, 'భరత ఖండము చక్కని పాడియావు', మనకు సుపరిచితాలు.

గాంధీ 1920–21లో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించే ముందు, 'చంపారన్ రైతు సత్యాగ్రహం'లో తన సిద్ధాంతాలను, పోరాట మార్గాన్ని అనుసరించి, పరీక్షకు పెట్టి నెగ్గాడు. ఇక అదే మొదలు, 1920–21 నుండి, 1942 ఆగస్టులో చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం వరకు స్వాతంత్ర్య పోరాటం కొనసాగింది. మహాత్ముడు నాయకత్వంలో చేపట్టిన ఉద్యమాలకు పట్టు, విడుపులు వుండేవి. ఒక ఉద్యమం తర్వాత, తర్వాత చేపట్టే కార్యక్రమం – మధ్యకాలంలో, 'నిర్మాణాత్మక కార్యక్రమాలు' (Constructive Programs) చేపట్టాడు. మద్యపాన నిషేధం, గ్రామ పునర్నిర్మాణం, హరిజన అభ్యుదయం, పరిశుభ్రతా కార్యక్రమం – ఇవి మరో ఉద్యమానికి ముందు, ప్రజలకు కావల్సిన వ్యవధిని, ఆత్మస్థైర్యాన్ని కలిగించేవి. ఉద్యమ స్ఫూర్తి ఆగిపోకుండా, నిలబెట్టడానికి ఇవి తోడ్పడ్డాయి.

ఆంధ్రదేశం జాతీయోద్యమానికి ప్రారంభం నుండి వెన్నుదన్నుగా నిలబడింది. గాంధీజీ పర్యటనల్లో స్త్రీలు విశేషంగా పాల్గొని, ఉద్యమ నిర్వహణకు తమ ఒంటిపై వున్న బంగారు ఆభరణాలను తృణప్రాయంగా ఆయనకు సమర్పించడం విశేషం. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో, రాయలసీమలో ముఖ్యంగా, శాసనోల్లంఘనోద్యమం తీవ్రతరమైంది. మద్రాసు నగరంలో టంగుటూరి ప్రకాశం, కాశీనాధుని నాగేశ్వరరావు, దుర్గాబాయమ్మ ప్రభృతులు క్రియాశీలకంగా పాల్గొన్నారు. గాంధీ ఆశ్రమాలు ఏర్పడి, ఉద్యమ కేంద్రాలయ్యాయి. పల్నాడు పుల్లరి సత్యాగ్రహం, పెదనందిపాడు శిస్తునిరాకరణోద్యమం, ఉన్నవ లక్ష్మీనారాయణ, పర్వతనేని వీరయ్యచౌదరి, చీరాల పేరాల ఉద్యమ నిర్వాహకుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యలాంటి ఎందరో దేశభక్తులను రంగంలోకి దింపింది. అరెస్టులు, జైలుశిక్షలు నిత్యకృత్యాలయ్యాయి. 1940 దశకం నాటికి వామపక్ష శక్తులు బలాన్ని పుంజుకొని, ఉద్యమానికి ఆసటగా నిలబడ్డారు. జాతీయోద్యమంతో సైద్ధాంతిక విభేదాలున్నా, దేశ స్వాతంత్ర సాధనలో వామపక్షవాదులు ఉద్యమానికి బాసటగా నిలిచారు. పట్టణాల్లోని మధ్యతరగతి వర్గాలు నాయకత్వం వహించినా, ఉద్యమానికి బలం చేకూర్చింది మాగాణి ప్రాంతాల్లోని అభివృద్ధిచెందిన రైతాంగ వర్గంతోపాటు మధ్య, సన్నతరహా రైతులు కూడ.

1942 క్విట్ ఇండియా ఉద్యమం కోస్తా ప్రాంతంలో ఘర్షణకు, పోలీసు కాల్పులకు దారితీసింది. తెనాలి పట్టణంలో జరిగిన కాల్పుల్లో పలువురు మృతిచెందారు.

1942 తర్వాత ఉద్యమం స్వాతంత్ర్య భానూదయం వైపు నడిచింది. కేరళ, ఆంధ్ర, బెంగాల్, గుజరాత్ ప్రాంతాల్లో ప్రభుత్వ, భూస్వామ్య వ్యతిరేక వామపక్ష తిరుగుబాట్లు జరిగి, అనేకులు ప్రాణాలు కోల్పోయారు. ప్రఖ్యాత నావికా తిరుగుబాటు, ఇంగ్లండ్‌లో కన్సర్వేటివ్ పార్టీ ఓడిపోయి, లేబర్ పార్టీ అధికారంలోకి రావడం, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అజాద్ హింద్ ఫౌజ్ నాయకుడు, భారతమాత ప్రియపుత్రుడు సుభాష్‌చంద్రబోస్ పోరాడి, ప్రాణాలర్పించిన తీరు – వీటన్నిటి ఫలితమే 1947లో జాతీయోద్యమ విజయం, ఆగస్టు 15, దేశ విభజనతో, స్వాతంత్ర్యం సాధించుకొంది. స్వాతంత్ర్యం సంపాదించుకొన్న సంతోషం, 1948 జనవరి 30న జాతిపిత మహాత్ముడి హత్యతో దుఃఖభాజనమైంది.

ఆజాదీ అమృతోత్సవ సందర్భంగా జాతీయ జెండా ఎగుర వేయమని కేంద్ర ప్రభుత్వం యిచ్చిన పిలుపుకు ప్రజలు విశేషంగా స్పందించినా, జాతీయ పతాకాలు ఎగురవేయడం, ఆవేశపూరిత ఉపన్యాసాలివ్వడం, అమలుకు నోచుకోని వాగ్దానాలు చేయడం, దినదినాభివృద్ధి చెందుతున్న జీవితావసరాల ధరలతో, సామాన్యుల జీవితాలు మరింతగా దుఃఖమయం కావడం తప్ప ఒరిగిందేమీ లేదు.

ప్రభుత్వ గణాంకాలను ప్రమాణంగా తీసుకొని దేశ ప్రజల్లో అక్షరాస్యత 74.04 శాతం కాగా అందులో స్త్రీలు 65.46%, పురుషులు 82.4%. నిరక్షరాస్యత నిర్మూలన యింకా సాధించవలసి వున్నది. ఐక్యరాజ్యసమితి గణాంకాలు, దేశ జనాభాలో 80 మిలియన్ల ప్రజలు పేదరికంలో వున్నారు. ఇది జాతీయాదాయం దృష్టిలో వుంచుకొని చేసిన గణన. నీతి ఆయోగ్ (ప్లానింగ్ కమీషన్) లెక్కల్లో 25% ప్రజలు పేదలు. ఈ గణాంకాలు అలా వుంటే, నేడు మనదేశంలో ముఖ్యంగా వెనుకబడిన బీహార్ లాంటి రాష్ట్రాల్లో చూసినపుడు, కటిక దారిద్ర్యంలో అలమటిస్తున్న ప్రజల దీనావస్థలో మార్పు ఇంకా రావాల్సి వుంది.

మహాకవి శ్రీశ్రీ దేశ స్వాతంత్ర్యం సందర్భంలో రాసిన గేయాన్నుండి కొన్ని పంక్తులతో వ్యాసాన్ని ముగిస్తాను.

ఇది నా స్వాతంత్ర్యదిన
మహా సంకల్పం
చరిత్రకొక కృతజ్ఞత
ప్రజలకు నిరాశే, అంటూ సామాన్య మానవుడి
పెదాలపై మాయమయిన చిరునవ్వును తిరిగి తెప్పించి, అతని
యోగక్షేమాలకు బాధ్యత వహించమని చెపుతూ,
స్వాతంత్ర్యం చాల సున్నితమైన పూవు, వాడైన కత్తి,
విలువైన వజ్రం – వాటిని కాపాడండి అంటూ,
భవిష్యదుజ్వల ధర్మయుగానికి ఆహ్వానం అంటూ
మనుష్యుడే నా సంగీతం,
మానవుడే నా సందేశం –

ధారావాహిక

# దేశ విభజన వస్తువుగా సాహిత్యం

- కొత్తపల్లి రవిబాబు

**అది** ఒక భయంకరమైన పీడకల కళ్ళముందు ప్రత్యక్షమైన సందర్భం. అప్పటివరకూ కలిసిమెలిసి ఒకే దేశానికి చెందిన పౌరులుగా బ్రిటీషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడినవారు, తమలో తాము కలహించుకునేట్లు చేసిన ఒక కుట్ర ఫలితం అది. మానవులే రాక్షసులైన వేళ అది. మృత్యువు కరాళనృత్యం చేసిన బీభత్స దృశ్యం అది.

దేశ విభజన సందర్భంగా ముస్లిములు అధికంగా వున్న పాకిస్తాన్ ప్రాంతం నుండి హిందువులు, సిక్కులు; హిందువులు మెజారిటీగా వున్న భారతదేశ ప్రాంతం నుండి ముస్లిములు – అటూ, ఇటూ కాందిశీకులుగా వలసపోయిన ఆనాటి దృశ్యాలు హృదయాల్ని కదలించివేస్తాయి. ఇది కేవలం మొన్న కరోనా కాలంలో వలస కార్మికులు తమ తట్టా, బుట్టా నెత్తిన వేసుకొని పసిపిల్లలతో వేలాది మైళ్ళు నిండు వేసవిలో చెప్పులు కూడా లేకుండా రైలు పట్టాల దారిలో వారి వారి వూర్లకు పోతున్న దృశ్యాల లాంటివి కాదు. తమ తమ కుటుంబసభ్యులను వేరే మతంవారు చంపివేయగా, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయేవారితోనూ, వారి వారి వూర్లలో ఆస్తులు వదిలేసి వట్టి చేతులతో వెళ్తున్నవారితోనూ, లైంగికదాడులకు గురై తప్పించుకు వస్తున్న మహిళలతోనూ, వారి వారి పిల్లలతోనూ కూడిన సమూహాలు ఇవి. సరిహద్దులు దాటి ఆయా దేశాలలో శరణాగతులుగా మారిన ప్రజానీకపు మూకుమ్మడి ప్రవాస ప్రయాణ దృశ్యాలు అవి. ఇరువైపుల నుండి వస్తున్న రైళ్ళ పైకప్పుల పైన ప్రమాదకరమైన ప్రయాణాలు చేసే దృశ్యాలను ఒకవైపు, మరోవైపు ఆయా రైళ్ళలోని ప్రయాణీకులందరూ శవాలుగా మారితే వారిని తెస్తున్న 'దయ్యాల రైళ్ళు' (Ghost Trains) చూచినవారినీ, ఇప్పుడు ఆ దృశ్యాలను వూహించుకునేవారినీ భయభ్రాంతులను చేసాయి, చేస్తున్నాయి.

వివిధ సంస్కృతులు, భాషలు, మతాలతో కూడిన భారత ఉపఖండం శతాబ్దాలుగా శాంతియుతమైన జీవితం గడిపింది. ఇతర దేశాలవారు చేసిన దాడులతో కొంత సతమతమైనా, తమ సొంత ఇళ్ళు, ఆస్తులు, భూములూ వదిలివేసి పారిపోయిన సంఘటనలు ఈ దేశ విభజన సందర్భంగానే చూశాం. "ఒక కోటి ఇరవై లక్షలమంది ప్రజలు తమ తమ ఆవాసాల నుండి ప్రవాసానికి వెళ్ళారు. 10 లక్షలమంది మతపరంగా జరిగిన అల్లర్లలో మరణించారు. 25 వేలమంది స్త్రీలు లైంగిక దాడికి గురయ్యారు. కిడ్నాప్ చేయబడ్డారు. బలవంతంగా ఎత్తుకుపోబడ్డారు. ఇతర మతాలవారిచే బలవంతంగా గర్భిణులయ్యారు. వేలాది కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. ఇళ్ళను తగులబెట్టారు. ధ్వంసం చేశారు. గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయిపోయాయి." (బుటాలియా రచన 'సైలెన్స్' – పుట : 35)

నాలుగైదు మైళ్ళ పొడవున వున్న ఈ కాందిశీకులకు కొన్నిచోట్ల పోలీసులు, సిపాయిలు రక్షణగా వున్నా కూడా, వారి సంఖ్య చాల తక్కువ కావడంతో దారిదోపిడీగాండ్రు, ప్రజలపైబడి దోచుకునేవారు. జులై, ఆగస్టు నెలల్లో సాగిన ఈ వలసలలో వేసవి తీవ్రత వల్ల అనేకులు ఆహారం లేక, దాహాన్ని తీర్చుకోడానికి నీళ్ళులేక వ్యాధులతో, అనారోగ్యంతో, శత్రువుల దాడులతో ప్రాణాలు కోల్పోయారు. రెండు దేశాల ప్రభుత్వాలు మానవతా దృష్టితో సహాయం అందించడంలో విఫలమయ్యాయి.

రోజుకు 15, 20 మైళ్ళ నడకతో అలసిపోయినవారు, తాము తెచ్చుకుంటున్న సామాను మోయలేక వదిలివేసి ముందుకు సాగేవారు. ఆ తర్వాత తమ పసిపిల్లలను వదిలేసారు. తాము ధరించిన దుస్తులతో మిగిలేవారు. దాహమేస్తే మంచినీరు దొరక్క చేలలో వున్న మురికినీరే త్రాగారు.

కొందరు ఈ మతహింస నుండి తప్పించుకోడానికి రెండు మార్గాలు అనుసరించారు. మొదటిది తమ స్వస్థలం వదిలేసి పారిపోవడం. రెండోది శత్రువు మతంలోకి మారిపోవడం. (ఇది హిందువులు ముస్లిములుగా మారడం వరకే పరిమితం. ఎందుకంటే కులవ్యవస్థ అడ్డంకుల వల్ల ఇతర మతాల వారిని హిందువులుగా మార్చే అవకాశం హిందూమతంలో సాధారణంగా లేదు.) ముస్లిములు సిక్కులుగా మారిన సంఘటనలున్నాయి. మహిళలపై ఈ సందర్భంగా దారుణమైన హింస జరిగింది. శత్రువుల నుంచేగాక వీరు సొంత కుటుంబాలనుంచి కూడా హింసింపబడ్డారు. శత్రువులైతే ఎత్తుకుపోవడాలు, అంగ విచ్ఛేదం చేయడం, హత్యచేయడం, లైంగికదాడులు చేయడం చేశారు. సొంత కుటుంబాలవారు ఇతరులచే స్పర్శించబడిన, లైంగికదాడికి గురైన స్త్రీని అగౌరవంగా, నీచంగా చూశారు. కొన్ని సందర్భాలలో ఆ కుటుంబంలోని మగవారే, ఆడవారిని చంపేసారు. కొందరు మహిళలైతే ఆత్మహత్యలు చేసుకున్నారు.

అపహరించిన స్త్రీలను అమ్మివేయడమో, వేరే మతంలోకి చేర్చుకోవడమో చేశారు. వారికి వేరే మతంవారితో వివాహాలు జరిపారు. తమ స్వస్థలాల నుండి విడదీయబడ్డ వీరు తమకు కాని దేశంలో బలవంతంగా జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరుగాక వేలాదిగా స్త్రీలు 'తప్పిపోయారు' (మిస్సింగ్) వారి ఆనుపానులు ఇప్పటికీ తెలియవు.

కొంత శాంతియుత వాతావరణం నెలకొన్న తర్వాత కొన్ని స్వచ్ఛంద సంస్థలు 'తప్పిపోయిన స్త్రీలు' ఎక్కడున్నారో చేసిన పరిశోధన చాల కష్టసాధ్యంగా పరిణమించింది. వారి ప్రస్తుత చిరునామా తెలియదు. అపహరింపబడిన స్త్రీలు ప్రస్తుతం వున్న కుటుంబాన్ని వదలి రావడానికి

ఇష్టపడలేదు. వారు తిరిగి వచ్చిన సందర్భాలలో వారి కుటుంబాలు వారిని స్వీకరించడానికి నిరాకరించారు. ఎందుకంటే వారు పవిత్రత కోల్పోయారు గనుక!

ఈ మతహింసాకాండలో – ఒక మతంవారిని వేరొక మతంవారు – పరస్పరం దాడుల నుండి రక్షించిన మానవతాకోణం వున్న సంఘటనలు కూడా ఆ తర్వాత బయటకు వచ్చాయి.

రెండు దేశాలవారూ సరిహద్దులలో శరణార్థుల శిబిరాలు ఏర్పాటుచేశారు. కాని అక్కడ అందరికీ సరిపోయే స్థలం లేదు – అవసరమైన ఆహారం సరఫరా చేసిన యంత్రాంగం లేదు.

ఆనాటి రాజకీయ నాయకులు ఈ దేశ విభజన సందర్భంగా మతహింస జరుగుతుందన్న అవగాహన వున్నా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు. బెంగాల్ విభజన సందర్భంగా కలకత్తాలో చెలరేగిన మతహింస సంఘటనలు చరిత్రలో వున్నాయి. 1947కి ముందు జరిగిన మతహింస కనులముందు వుంది. ముస్లిములు, హిందువులు శత్రువులన్న భావం ప్రచారం చేసిన వాస్తవం వుంది. అటువంటి సమయంలో ఆగస్టు 15కు ముందే వలసపోయే వచ్చేవారికి శాంతియుతంగా వారికిష్టమైన దేశానికి గౌరవప్రదంగా వెళ్ళే ప్రయాణ సౌకర్యాలు ఏర్పాటుచేసి వుండాలి. వారికి రక్షణగా సైన్యాన్ని నియమించాల్సి వుంది. అలా శాంతియుతంగా మార్పిడి జరిపి, స్వాతంత్ర్యం ప్రకటించాల్సి వుంది. బ్రిటీషువారికి ఎటూ బాధ్యతలేదు – మరి మన రాజకీయ నాయకులు ఎందుకు ముందుచూపుతో వ్యవహరించలేదు? ఆ భావజాలానికి వారసుడుగా ఇప్పటి ప్రధాని నరేంద్రమోడి అకస్మాత్తుగా లాక్‌డౌన్ ప్రకటించి, లక్షలాది వలస కార్మికులను గాలికి వదిలేసిన వాస్తవం మన కళ్ళముందు వుంది.

1947 ఆగస్టు 14న పాకిస్తాన్, ఆగస్టు 15న ఇండియా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్నాయి. 75 సంవత్సరాలు గడిచాయి. 'అఖండ భారత్' నినాదం వల్లించే భారతీయ జనతాపార్టీ (పూర్వాశ్రమంలో జనసంఘం) నరేంద్రమోడీ నాయకత్వాన 'స్వాతంత్ర్య అమృతోత్సవా'న్ని జరుపుకోమని ప్రజలకు పిలుపు ఇచ్చింది. మరోవైపు పాతగాయాలను రేపుతూ సి.ఎ.ఎ., ఎన్.పి.ఆర్. మొదలైనవాటి ద్వారా ముస్లిముల పౌరసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. హిందూమతాన్ని గౌరవించని ముస్లిములందరూ నేడు దేశద్రోహుల జాబితాలో వున్నారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం అంటే 2021, ఆగస్టు 15న మోడీ తన సందేశంలో వచ్చే ఏడాది నుంచి ఆగస్టు 14న 'విభజన నాటి భయానక జ్ఞాపకాల దినం'గా జరపాలని పిలుపు ఇచ్చారు. ఆ రోజు భారతదేశ ప్రజలు చేసిన పోరాటాలు, త్యాగాలు జ్ఞాపకం చేసుకునే రోజుగా ప్రకటించారు. ఈ పిలుపుకు అనుగుణంగా మొన్న ఆగస్టు 14న ఢిల్లీలోని రాజీవ్ చౌక్, కాశ్మీర్ గేట్ మెట్రో స్టేషన్లలో లాహోర్, అమృతసర్ పట్టణాలలో దేశ విభజన కాలంలో ధ్వంసం చేయబడిన భవన శిథిలాల చిత్రమాలికను ఏర్పాటుచేశారు. ఇటువంటి పాతగాయాలను చూపి, ఈనాటి మెజారిటీ ప్రజలనాకర్షించడమే దీని లక్ష్యమా అని ప్రజల్లో అనుమానం వుంది. భారతదేశాన్ని హిందూమత రాజ్యంగా మార్చడానికి చేసే కృషిలో ఈ ఎగ్జిబిషన్ కూడా పరోక్షంగా బిజెపికి ఉపయోగపడుతుందేకాని – ప్రజల్లో హిందూ – ముస్లిం సోదరత్వాన్ని వికసింపచేయడానికి ఉపయోగపడదు.

ప్రపంచంలో 20వ శతాబ్దంలో జరిగిన అతిపెద్ద వలసగా గుర్తింపబడిన ఈ వలస ప్రభావం సమాజంలో వ్యక్తులపై, సంస్థలపై ఎలా వుందో, చిత్రించిన సాహిత్యం బెంగాలీ, ఉర్దూ, హిందీ, పంజాబీ, ఇంగ్లీషు, సింధీ, డోగ్రీ, గుజరాతీ, మరాఠీ భాషల్లో వచ్చింది. పంజాబీ భాషలో 1947 నుండి ఈనాటివరకు 500కు పైగా రచనలు దేశ విభజన కథావస్తువుగా వచ్చాయి. 200 పైగా కవితలు, 200 పైగా కథలు, 40 నవలలు, కొన్ని నాటకాలు పంజాబీలో వచ్చాయి. అలాగే పాకిస్తానీ రచయితలు కూడా ఈ కథావస్తువుతో రచనలు చేశారు. అమర్‌జిత్ చందన్ ఈ సాహిత్యంపై 1997లో ఇంగ్లండ్‌లో జరిగిన ఒక గోష్టి కోసం రాసిన పత్రంలో "పంజాబీలకు 1947 అంటే స్వాతంత్ర్యం కాదు – "పెద్ద మత హింస ఏడాది" అన్నారు.

వివిధ భారతీయ భాషల్లోనూ, ఇంగ్లీషులోనూ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ మనదేశ విభజన వస్తువుగా వున్న నవలలను, కథలను, కవితలను, చలనచిత్రాలను, సినిమా పాటలను, డాక్యుమెంటరీలను, సిద్ధాంత గ్రంథాలను స్థూలంగా పరిచయం చేయడం ఈ వ్యాస లక్ష్యం. ముందుగా 1956లో ఇంగ్లీషులో కుశ్వంత్‌సింగ్ అనే రచయిత రాసిన 'ట్రైన్ టు పాకిస్తాన్' నవలను పరిశీలిద్దాం. **(ఇంకా వుంది)**

## బుడగల అ(బు)వ్వ

**పేదరికానికి**
ప్రత్యేక లక్ష్యం ఏముంటుంది..?
ఆకలి పేగులకు అన్నం తెచ్చివ్వడం తప్ప

బతుకు తెరువుగా ఊపిరూదిన బుడగలే..
బువ్వగా మారే ప్రక్రియను
ఆమె అభ్యాసం చేసింది

ఉపగ్రహాలను కక్ష్యలోకి పెట్టగలిగే కాలంలో..
ఇంకా.. పక్షి లాగే
పొట్ట చేత బట్టుకుని
కడుపాత్రాన్ని మెడపై వేసుకుని..తిరుగుతూ మనిషి

సమాజపు సందుల్లోనే..
సంచరించే మనుష్యులకు
సాకారం కాని సమ భాగాలు

ఆకాశం దాకా..
అవని అంచెలంచెలుగా ఎదిగినా..
ఆకలి దగ్గరే ఆపబడి..
అలమటింతల పాల్జేస్తున్న శక్తులు

జవసత్వాలను ఎంతగా కూడగట్టుకున్నా
జరుగుబాటు అంతంతే..!

ఎత్తులకు
ఎగబాకనీయని తనమే..
దోపిడీ దారుల ఆయుధం

నీ దేశానికి ఎపుడో..
స్వాతంత్ర్యం వచ్చిందని చెబితే..
బహుశా ఆమె నవ్వుతుంది..!

**దారల విజయకుమారి**

కథ

# యెర్రి సంద్రాలు గోరు ఉరఫ్ కమ్నిస్టు బుగతగోరు

– సౌరవ్

**ఆడి** పేరు సంద్రాలండీ. ఆడినే కమ్నిస్టు బుగతని కూడా అంటారండీ! ఆడ్ని కమ్నిస్టు అని ఎందుకంతారో ఏ సిన్న గుంటడ్నడిగినా సెప్పేస్తాడు గానీ యెర్రి సంద్రాలుగోడని ఎందుకంటారో తెలుసుకోడం అంత సులువైన యిసయం కాదండీ! పైగా ఆ బాబు ఎవుల్తోనైనా "నాది ఎడం సెయ్యిగిరీ" అని దర్జాగా సెప్పుకుంటాడండీ! తవరికి బోధకెక్కినట్టు లేదు. యెడమ సెయ్యి వాటం అంటారు గదండీ అదన్నమాట.

ఉప్పుడు సెప్పండి నాకొచ్చిన అనుమానం మీకూ వొచ్చింది గదూ! సూసారా సెటాల్న పట్టీసినాను. వొవ్వడైనా ఆవులిత్తే పేగుల్లెక్కెడతాడు గానీ నాను ఆవలించకుండానే పేగుల లెక్కలు తీసి గుణకారాలు, భాగారాలు సేసీసి ఆ పేగులు గలోడికే ఆ లెక్క అప్పజెప్పీ గల్నండీ!

మరి మీ డౌటేటో సెప్పీసి సేతిలో యెట్టీమంటారా!" ఆడు కమ్నిస్టోడైతే మరి బుగతెలాగైనాడు. ఆడికి యెర్రి యెలాగొచ్చింది అనే కదా. అందుకే నాను సెప్పేది పూర్తిగా ఇంటే తిరిగి తవరే నాకు సెప్పేస్తారు కమ్నిస్టుల్లో ఉన్న ఈ బుగతోడి సంగతేటో!

అందుకే నాను సెప్పేది నింపాదిగా ఇనండి. ఆనాక నాను సెప్పిందాంట్లో ఆవగింజంత పొరపాటుంటే మీ యెడంకాలి సెప్పిచ్చుకొట్టండి. బాబూ! ఎందుకిలా అకారనంగా నన్ను కొట్టారు అనడిగితే మరోటి కొట్టండి. నాను కిక్కురు కక్కురు మంటే ఒట్టు.

ఇయ్యన్నీ నాకెలా తెలుసంటారా? నాను ఎఱ్ఱజెండా నీడన కూసింత పెరిగినోడినేనండీ. ఇంక అసలు కథకి యెల్దాం.

★ ★ ★ ★ ★

మా వూరి గడప మూడొందలుంటాదండీ. యెవసాయం మూడేలెకరాలండీ. ఈ భూమ్మీద యెంతమంది మారాజులు పుట్టినారో యెంతమంది మారాజులు అదే భూమిలో కలిసిపోనారో మనకి తెలీదండీ. కానీ బూదేవి తల్లి మాత్రం అలాగే సెక్కు సెదరకుండా వున్నాదండీ. ఆ బూదేవత కూడా ఈ పెపంచకంలోని ముక్కోటి దేవతల్లో ఒక్కర్తే గదండీ. కానీ ఆవిడా ఆ ముక్కోటి దేవతల్లాగే డబ్బున్న మారాజుల్ని కనికరించి పేదల్ని సాదల్ని యెడం కాలితో తన్నీడం ఏకాలంలోనైనా జరిగినట్టుగానే ఈ కాలంలో జరుగుతూ వుందండీ. కంనిస్టోడు యేదాంతం మాట్లాడ తన్నాడని సూస్తన్నారు కదూ బాబూ! యెవస్తలో వున్న దుర్లచ్చనాలన్నీ దేవుడిమీదకు తోసీడం మన మనుషులకు బాగా అలవాటు. మరేమీ అనుకోకండి జెనాంతికంగా వున్న మాటనే నానూ సెప్తున్నాను.

అయితే ఈ మూడేలేకరాలలో మెజాల్టీ బూవి ఎవుల సేతుల్లో వుందో నాను యిడమరిసి సెప్పక్కరలేదు తవరికి. వూళ్ళో ఒక యాభై వందమంది దగ్గర సిక్కొడిపోయింది. నాదారోల్లకి గుట్టలు మెట్టలే మిగిల్నాయి.

అలాటి సోట ఒక కొండ పెడన మా వూరి మాలమాతికోల్లకి కూసింత బూవి వుందండి. ఒక్కొక్కళ్ళకీ ఏపాటి వుంటాదో వూహిచ్చగలరా, ఒక్కడికి కూడా పది పదిహేను సెంట్ల కంటే ఎక్కువ వుండదండీ. అక్కడ, అందులోనే మొక్కా మోడు యేసుకొని గీదల్ని గొఱ్రిల్ని మేపుకొని బతుకుతున్నారు. పనులున్నప్పుడు కూలికి పోయి పనుల్లేనపుడు ఆ కొండపెడన దేవులాడతా బతుకుతారండీ ఆళ్ళందరూ. మీకు సెపితే అబద్ధము నాకు నిజం గానీ ఒక్కడంటే ఒక్కడికీ ఒంటి మీద సరైన గుడ్డముక్క వుంటే ఒట్టండీ!

ఆ కొండ్రల్లో యేటి పండుతాయంటే, యేటీ పండవండీ. ఒకవేళ ఏ మొక్కో మోడో ఏసుకుందావన్నా ఆ మెట్టకింద ఒక మారాజున్నాడండీ. ఆ మారాజంటే మారాజు కాదండీ. పూర్వం సిల్మాల్లో పిల్లికళ్ల సెలపతిరావని ఒకడుండీవోడండీ ఆడిప్పిడికీ వున్నాడండీ. అయితే ఇప్పుడు ఆడు మంచోడైపోనాడండీ!

అప్పుడు మాత్రం ఆడ్ని సిలిమాల్లో సూసినోలికి ఆల్లు పాల్దాగే గుంటలు కానియ్యండి, అప్పుడే ఫుల్ పేంట్లు తొడిగి కొత్తగా సినిమాలు మరుగొడిన కాలేజీ గుంటలు కానియ్యండీ. ఆడు, ఆడంటే యెవుడు?! సెలపతిరావుగోడు! తెరమీదకి రాడవే తరువాయి పేంట్లు తడిసిపోకపోతే నన్నడగండి! పిల్లలు 'ఖేర్' పెట్టేస్తే అల్లమ్మలు ఆళ్లని వూరుకోబెట్టలేక ఆళ్ళ పెనిమిట్లని తీసుకొని సిల్మా మద్దిలో ఇంటికి పోయి ఆ గుంటడికి గాలీ ధూళీ పట్టుకుందని దిష్టులు, దిగదుడుపులూ తీసీవోరండీ! సిల్మాలో ఆడు సేసీ సిత్రాలు అల్లాగ్గ ఉండియ్యండీ!

అయితే మనం సెప్పుకున్న ఈడు అలాటోడు కాదండీ! ఈడు ఏరే జాతి మనిషండీ. కానీ ఈడు సేసీ పనులు అయ్యేనండీ! మెత్తని కక్క అంటారే అలాటోడండీ ఈడు. ఆడి కతంతా ఆడి దగ్గర పంజేసే రైతులు, జీతగాళ్లు నడిపించేస్తారండీ. తగువ ఈడిదాకా రానివ్వకుండా ఆళ్లే చెటిల్మెంట్ చేసేత్తారు.

ఒకవేళ తప్పీ జారీ ఆడిదగ్గరికి తగువెల్లిందనుకొండి. ఆడంత పరమ ధరమ పెబువు ఈ భూపెపంచకం అంతా యెతికినా కనపడడు అన్నట్టుంటాడండీ! ఎంత కోపగొట్టోడైనా ఆడి మాటలకి తెల్లీశ్వరి కాడ వాసన సూసిన నాగసర్పం లాగ అల్లాగ్గ ఆడికి తలొగ్గేస్తాడండీ! చివరాఖరికి ఆడన్న తోవకొచ్చీసి, ఆడు సూపిన దారెంట తిరుగు పయానం కట్టేస్తాడండీ! ఇంకా మీకు సేంపిల్ సూపిస్తే ఇక ఆడి గురించి పాలేటో నీళ్లేటో తెలిసిపోద్ది మీకు.

వుప్పుడు పొరపాట్న, అంటే మనవంతా మనుసులం గదండీ! పొరపాటు సెయ్యని మనిసంటూ నోకమ్మీద ఉండడని మా అయ్య మాటిమాటికీ అంటుండేవోడండీ. మళ్ళా ఇందాకటి ఇసయానికి వస్తానండీ.

పొరపాట్న మీ యెద్దు గానీ పోతు గానీ ఇలా గట్టు దిగి ఆడి పొలంలోకి కాలెట్టిందనుకోండి. పోతన్నా, యెద్దన్నా మనుషులు కాదు గదండీ ఇది పుట్టుపాకలోల్ల గరువు, ఇది పచ్చికారి యెంకన్న గోడి మడి, ఇది ఇందాక మనం సెప్పుకున్న మారాజు గోరి బూవి అని ఆటికి ఏటి తెలుస్తదండీ! అయ్యేటన్నా మనుషులా బూవికి, పుట్టకీ భేదం సూడ్డానికి. ఈ మనిషి కులవేటి ఆ మనిషి అంతస్తేటి అని ఎంచడానికి. అందుకే ఆటిల్ని పసువులన్నారు, మనల్ని మనుసులన్నారు. అందుకని అయ్యి ఎంత అదిలించినా దిగేత్తాయండీ. కొట్టినా మాన్తాయేటండీ! ఆ చెనానికి ఆటి కడుపాకలి తీర్సుకోడం ఆటికి ముఖ్యవండీ! ఇలా దిగిందో లేదో యేమూల్న కాసుకోనుంటాడో యెంటనే ఆడి రైతు పరిగెత్తుకుంటూ వచ్చేత్తాడండీ! మీరు ఆడ్ని సాచ్చాత్తూ భగవంతుడవతారంగా భావించి ఆడి కాళ్ళకు సాట్టాంగ పడి దండం యెట్టినా ఆడికి యీసమెత్తు జాలి కలగదండీ. తిన్నగా దాన్ని తీసుకెల్లి ఆల్ల బందెల దొడ్లో కట్టేత్తాడు.

అక్కడ్నించీ డ్రామా కంపెనీవోడి ఆట సాగుతాది బాబూ! ఆ ఆట మీరు సూస్తే సురభివోల్ల నాటకం దీని ముందు దిగదుడుపే అంటారండీ! ఆ మారాజుగోడు ఆడి రైతులు మాంచి రసవత్తరంగా నాటకాన్ని రత్తి కట్టిత్తారండీ! అది సూడ్డానికి మీ రెండు కళ్ళూ సాలవండీ! అక్కడ జరిగే భాగోతం ఇందానికి మీ రెండు సెవులూ అసలే సాలవండీ. ఆ జగన్నాటకం సూడ్డానికి అక్కడ కూకుంటే మీ ముద్దరిగిపోద్దండీ. మీ ముదుకులు లాగేత్తాయండీ.

రైతు గొడ్డును తోలుకెల్లి దొడ్లో కట్టేత్తాడని సెప్పినాను కదండీ! ఆడు ఇంక ఒగ్గడండీ. ఈడు సచ్చిగీ పెట్టినా ఆడు వదల్డు, తలకిందులు తపస్సు సేసినా వదల్డు! తప్పు కడతానన్నా వదల్డు. ఆ దొరికింది అవనుకోండి ఆ సాయంత్రానికి పాలిప్పీసి కేస్ కేసీసి మారాజుగోరి లెక్కలోకి రాయించేత్తారండీ. ఇదేటి ఈ అన్నేయం, ఇదేటి ఈ అరాచకం అని అడిగినోడు నేడండీ! అదే పోతులు గానీ ఎడ్లు గానీ అయ్యాయను కొండీ ఆటికి పిడికెడు గడ్డెయ్యరు, గుక్కెడు నీల్లివ్వరు. పైగా అటికి జతేసీసి బండి పూన్చీసి పెంటో, పిండి కట్లో తోలించేత్తూ వుంటారు.

ఏటంతారు... తప్పా... అదేకదా బాబూ యింతసేబ్బట్టీ నాను సెప్పేదీను. సపోజుకి ఏ దూడో పెయ్యో మీ పొలంలోకి దిగిందను కొండి. దానికి మీరేం చేత్తారు?! ఒకసారి యెచ్చరిక చేత్తారు. అదే రొండోసారి వచ్చిందనుకోండి. అప్పుడు మీరు తోలుకెల్లి దొడ్లో కడతారు. సివరాఖరికి దాన్ని యేటి సేత్తారు. దొరికింది కదా అని దాన్ని యేపుడు జేసుకొని సట్టకి సట్టా, జెబ్బకి జెబ్బా తినీరు కదా. ఆ వొచ్చిన రైతోడికి నాలుగు సీవేట్లేసి, ఇంకా మీ కోపం దీరకపోతే వందో యాభయ్యో తప్పేసి ఆ గొడ్డుని ఆడికి వొదిలి పెడతారు. నానన్నది రైటా తప్పా!

కానీ ఆడు అలా సెయ్యడండీ! తప్పు కాయనంటాడండీ. తిన్నగా ఈ తగూ ఎక్కడి కెళతాదో తెలుసునా బాబూ. మారాజుగోడి దగ్గరకు ఎల్తాది. అలా ఎల్లిందీ అంటే దానర్థం నాటకం సివరి అంకానికి చేరిందని.

ఆడు.. అదేనండీ ఆ మారాజు గోడు దగ్గరికి ఎల్లాక ఆడు" ఒరేయ్ ఆమాత్రం దానికే కట్టియ్యాల్రా ఆ గొడ్డుని. ఇప్పెయ్.. వదిలేయ్" అంటాడు.

కొత్తగా యెల్నోడు అయితే "హా..హా . యేమి ధర్మపెబువు. కలియుగంలో పుట్టుకొచ్చిన సీరామ చెంద్రుడు" అని నోరావలించుకిని ఆడ్ని చూస్తూ ఆడి కాళ్ళమీద దబ్బున పడిపోతాడండీ!

ఈ లోగా జీతగోల్లు గొడ్డుని ఇప్పడానికి కన్నె పట్టి ముడి తప్పించడానికి చిద్దం అవుతారు. ఈలోగా పెద్ద రైతు దిగుతాడు.

"ఆల్లెరో", అంటూ మారాజు మీద పడతాడు.

"ఏటండీ! మీ పెత్తనం.. పొలంలోకి దిగి ఎంత పంట తినీసిందో మీకు ఎరికేనా... బంగారంలాటి పంట.... నేను యెల్లీలోగా మోపెడు పంట తినేసింది. ఈ తోత్తుకొడుకు అలా సూత్తూ వూరుకున్నాడు గానీ గొడ్డుని యెగ్గొట్టలేదు. మీ సేత్తో మీరు పండించి వుంటే ఆ బాదేదో మీకు తెలిసేది. సొంతపిల్లల్లా పెంచుకున్నాం గాబట్టి ఆ బాధ మాకు తెలిసింది. ఆడికి ఆ సిచ్చ కూడా యెయ్యకూడదంటే ఇక మావెందుకిక్కడ!" అని ఇసురుగా ఆడో మాట అనీసి లేసిపోతాడు.

మళ్లీ ఈ మారాజుగోడి డైలాగ్ "ఒరేయ్ సోములూ! నానేటన్నానని అంత కోపంరా. ఇంతకీ ఏటంటావు సెప్పు. అలా సెప్పా పెట్టకుండా నువ్వు అలా ఎలిపోతే ఎలారా?!

ఇప్పుడు ఆడి డైలాగ్ "ఆడి గొడ్డు రొండు మోపుల గడ్డి తినీసింది. అంటే యేటన్నమాట మనకి నాలుగు కుంచాల గింజలు పోయినట్టే! దాన్నిబట్టి మనకి కట్టవో నట్టవో సూడండి. పోనీ అని ఈ తప్పుకొదిలేత్తే ఇంకో నలుగురు ఇదే నేరుత్తారు. అందుకనీ ఆడ్ని ఓ యెయ్యి తప్పు కట్టీసి ఆడి గొడ్డుని ఇప్పుకు పొమ్మనండి. ఎందుకంటే యెవుడూ సూడకుండా పొలంలోకి పశువుని దింపీసి మేపించేద్దావనుకున్న పెతీ యెదవకీ బుద్ధి రావాల! ఇది మీకు నచ్చలేదా మీకు నచ్చినట్టు మీరు సేసుకొండి", అనేసి తువ్వాల దులిపీసి "నాను మీతో కూకుంటే కుదరదు. అవతల గొడ్లు ఆకలితో సస్తన్నాయి. ఇన్ని బరకలు తెచ్చి వొడియ్యాల" అని, ఆడి పాత్రని ముగిచ్చేసి ఆడు పోతాడు.

ఈడు గొడ్డు గలోడితో "ఏటోరా! మనం రోజూ మొకాలు సూసుకొందే పొద్దు తిరుగదు. అలాటిది ఈ పని యేల సేసినావు. అంతంత పనలు తినీసి వరకూ నిమ్మళంగా వుండి ఇపుడు కుయ్యో మొర్రో అంటే నానేటి సేసేదిరా. పోనీలే అని నిన్నొదిలేద్దామంటే సూసినావు గదా ఆడు కస్సుమని లెగుత్తున్నాడు. మీ ఇద్దరు గొప్ప ఇరుకున పెట్టీసినార్రా నన్ను", అని తలొట్టుకొని ఉండిపోతాడు బాబూ.

ఈ లోగా ఈ పశువు గలోడు" అది ఇలా దిగ్గానే నాను యెగ్గొట్టీ నాను నాన్నా! ఇంతలో ఆడొచ్చి దాన్ని తోలుకు పోనాడు." అంటాడు. పాపం ఈ నాటకంలో ఆడికి ఆ ఒక్క డైలాగే వుంటాది బాబూ!

"ఒరేయ్! నువ్వు ఎన్నైనా సెప్పు ఆడు నా దగ్గర పాతికేళ్లుగా సేస్తున్నాడు. ఈ పాతికేళ్లుగా నాను గమనించిందాన్ని బట్టి ఆడి నోటంట అబద్ధం రాదురా! అదంతా ఎందుగ్గానీ, నువ్వా నాదారోడివే. ఆ సంగతి నాకు తెలుసు. ఆడికి యెయ్యి ఇచ్చానని సెపుతాను నువ్వు మాత్రం ఎనిమిదొందలు ఆనాక తెచ్చి నీ గొడ్డుని నువ్వు తోలుకుపో",

యెనిమిదొందలంటే ఆడికి, ఆడి కుటమానానికీ నాలుగునాళ్ల తిండి కర్సు, ఆ గొడ్డుకి దాణా కర్సు, ఒంట్లో బాగోలేని ఆడి కూతురికి మందుల కర్సు, ఈదిలోకొచ్చి ఇంటిముందాగి సూదిమందిచ్చే ఆరెంపీ డాట్రుబాబు కర్సు. ఇన్ని కర్సులూ కల్లముందు చినిమా రీల్లలా తిరుగుతుంటే "అదికాదు నాన్నా", అని ఈడు సేతులు పిసుక్కుంటుంటే..

"ఒరేయ్! రోజూ మొఖాలు చూసుకునే వోళ్ళం అని జాలిపడితే నువ్వేమో బేరాలాడతున్నావు. ఇదంతా నాకెందుకు అడూ నువ్వు సూసుకోండి. మరి నానెల్తాను అవతల బోల్డు పనులున్నాయి. నీతో ముచ్చట్లాడ్డానికి నాకు తీరిక నేదు", అని ఈడూ పంచే సర్దుకొని లేచి పోబోతుంటే అప్పటికే ఆ గొడ్డుకి ఒక రోజంతా తిండి, నీళ్ళు లేక ఉండిందా, పైగా పన్జేసి.. జేసి అలిసిపోయి వుంటాది. ఇక అది సచ్చేలోపు ఇడిపించుకోవాలని ఆడు గబగబా పరిగెత్తుతాడు.

★ ★ ★ ★ ★

అప్పుడప్పుడే ఈ పేంతాల్లో రంగు రాళ్ళు పడ్డం బాబూ. గొప్ప గోలైపోయింది. ఈ పేద బిక్కీ జనాలంతా ఆ రంగు రాళ్లకోసం ఒకటే ఎతుకులాట. అటు గొలుగొండ, పాడేరు, మాడుగుల ఒక సోటనేటి బాబూ! ఈ జనం ఇరగబడ్డారు. తెల్లారే తోలుకులు, గునపాలు వొట్టుకొని కొండలెక్కీడం సొరంగాలు తవ్వీడం. ఇదే పని బాబూ రోజు రోజంతా. అద్రుట్టం వున్నోడికి బీర గింజంత, ఇంకా దశ వుంటే ఉసిరికాయలంతేసి రాళ్ళు దొరికియ్యండీ. ఆ రాళ్ళు పడ్డంతోటే ఆ యెనకే యాపారస్తులు దిగీసి ఆ రాళ్ళు కొనడం మొదలెట్టారు. ఆ యెనక పోలీసులు, రాజకీయ నాయకులు ఆ తర్వాత ఆళ్ళ వాటాలు అదంతా యేరే కత అనుకోండి. ఆ సంగతటుంచండి అది మరోసారి సెప్పుకుందాం.

అయితే మా వూరి కొండ పెడన ఎస్సీలకు బూవులిచ్చారని సెప్పినాను గదండీ! సూసారా మొదలెట్టిన కాడికే వొచ్చి ఆగింది కత! అది పుకారో మరి యతార్థమో తెలీదండి. ఈల్లకి బూవులు పంచిన కొండ మీద రంగురాళ్ళు పడతన్నాయని ఎవుడో పితూరీ లేవదీశాడండీ! గోలగోల అయిపోయిందండీ! అదే ఆళ్ళ సావు కొచ్చిందండీ. ఈ ఇసయం తెలుసుకున్న పెతీవోడూ ఒక పారో పలుగో వొట్టుకొని ఆళ్ల బూవుల మీద పడి కలదవ్వీడం మొదలెట్టారండీ! ఆళ్లు యేసుకున్న మొక్కేటి మోడేటీ అని సూడకుండా పీకి పారీనారు. కట్టుగొయ్యలకున్న గొడ్లను ఇప్పి కొండలమీదికి వోదిలీసినారు. ఆల్లేసుకున్న పాకలకి రాటలు ఇరిసీసి ఆతలకి ఇసిరీసినారు.

యెవుడన్నా అడ్డుకోబోయినా ఆడి మీదకి పలుగు పార ఒట్టుకొని బయలెల్లినారు. పాపం ఈ బూవులు గల ఎస్సీలంతా ఏవంటే దేనికొస్తాదో అని నోరుమూసుకుని ఉన్నారు. ఆనక తెలిసిన సంగతేటంటే ఇందాక మనం సెప్పుకున్న మారాజు గోరే వూరి జనాల్ని యెగ్గొట్టి రంగురాళ్ల సైజును బట్టి రేటిత్తానని ఉసిగొలిపాడట. యెనకా ముందూ సూడని యెర్రి జెనం పదిమంది కాలేజీ గుంటలు ఒంటరిగా దొరికిన ఆడ పిల్లను సెరిసీసినట్ట ఆ బూవిని సెరిసీసీనారు బాబూ! అలా ఒకరోజు రెండ్రోజులు కాదు నెలల తరబడి ఇదే పని. పోలీసులకు సేపితే ఆల్లు వూల్లోకొచ్చి మారాజుగారి యేటమాసం కూరతో సుబ్బరంగా తిని, కాసేపు ఆయన వాల్చిన నులకమంచాల మీద తొంగోని, ఆనక లేసి ఆయన ఇచ్చిన నోట్లు రెపరెపలాడించుకుంటూ పోయీవోరు.

ఆ మారాజు గోడి దగ్గరకెళ్ళి ఏవడిగినా "మీ బూవులు కసాబిసా తొక్కీసిన లంజికొడుకుల్ని వదిలీసి నా దగ్గరకొస్తే నానేటి జేసేది". అని సెవిలోని సుట్టపీక నోట్లో యెట్టుకొని పళ్ల మధ్దిన ఆడిస్తూ అనీసరికి ఈల్లకి ఏటి సెయ్యాలో బోధపడక తుండుగుడ్డలు దులుపుకొని ఇంటికి పోడం. మల్లా మర్నాడు రాడం. రోజూ ఇదే తంతు.

దాంతో ఇసుగెక్కిపోయిన ఆల్లు ఇక ఆడు తవని ఆ బూవుల్లో బతకనియ్యడని అర్థమైపోయింది. అయితే ఆ మారాజుగోడు తన మనుసుల్తో ఆల్లకి కబురెట్టాడు.

"ఒరేయ్! ఆ బూవులు మీరెలాగూ సేసుకోలేరు. ఒకేళ సేసుకున్నా ఈ జెనాలు మిమ్మల్ని సెయ్యనివ్వరు గాబట్టిక నాకొదిలియ్యండి" అని దాని సులువు గూడా ఆడే సెప్పినాడట

"ఎస్సీలకు గవర్నమెంట్ ఇచ్చిన బూవులు అమ్ముకొడానికి కుదరదు గాబట్టి ఆ బూవుల్ని నాకు తొంబై తొమ్మిది సంవచ్చరాలకి లీజుకి ఇచ్చినట్టు కాయితం రాసేత్తే ఎంతో కొంత ఇచ్చేత్తాను" అని.

ఈల్లు ఒప్పుకోలేదు. దాంతో ఆడు ఆ సుట్టుపక్కలున్న రైతుల్ని కూడగట్టి, ఈల్లు కొండకెల్లే తోవలన్నీ మూయించీసినాడు. ఉప్పుడు ఆల్లు ఆల్ల పొలాల్లోకి యెల్లాలంటే పక్కూరి నుంచి పది కిలోమీటర్లయినా తిరిగి రావాలి. దాంతో ఆల్లకి ఆల్ల మడి సెక్కల్తో బంధాలు తెగిపోనాయి.

★ ★ ★ ★ ★

బాబూ! పిల్లి పులికి అన్నీ సెప్పిందట ఒక్క సెట్టెక్కడం తప్ప. అలా నాను కూడా మీకు అసలు ఇసయం సెప్పకుండా తొక్కిపెట్టి ఉంచినాను. కానీ పిల్లిలా దాయను. సెబుతాను ఇనండి.

మొదాట సెప్పిన ఎర్రి సంద్రాలు గోడు, ఆడేనండీ కంనిస్టు బుగతగోడు. ఆడు కొంతకాలం ఉజ్జమాల్లో తిరిగి పెజలంటే నాకు పేనం, ఆళ్లకోసం ఏమైనా సేత్తానని బీరాలు పలికినోడు ఆ తరాత ఉజ్జెమం గిజ్జెమం యేవీ లేవు. ఈ సమాజం ఇంతే, ఈ యెవస్థ అసలు మారదు అని పిచ్చి రాతలూ యెర్రి కూతలూ మొదలెట్టాడండీ. అందుకనే ఆడిని కొంతమంది పిచ్చి సముద్రాలని కూడా అంటారండీ.

మారాజుగోడి దెబ్బకు అన్నేయమయిపోయిన ఎస్సీలు" అన్నా! మాకు ఏదో దారి సూపించన్నా" అంటే, నాను ఉజ్జెమాల్లో తిరిగిన మాట నిజవే గానీ బొత్తిగా సదువులేని సత్రకాయగోడిని. దానికి రాత కోత తెలిసినోడుండాల అని సముద్రాలుగోడి దగ్గరకు తీసుకెళ్దాం అని ఈళ్లందరినీ బయల్దేరదీసినాను. అయితే ఈడికి ఈ పిచ్చి ముదిరిందని నాకు అప్పటికి ఎరిక నేదండోయ్!

అందరం యెల్లి ఆడి గుమ్మంలో కూకున్నాం. ఆడు బయటకొచ్చి నన్ను గుర్తుపట్టి పలకరించినాడు. మావంతా కిందన కూకున్నాం. ఆడు కుర్సీమీన కాలుమీద కాలేసుకుని కూకున్నాడు. ఒకప్పుడు ఆడు కూడా మాలాగే కిందన కూకుండీవోడు. అజ్జూసి ఈడిలో ఏదో తేడా వచ్చిందిరా అనుకున్నాను.

"యేటిలాగొచ్చారంతా" అన్నాడు. నాను ఇడమరిసి అంతా సెప్పినాను. ఆ సెప్పడంలో నాను మారాజు గోడిని భూసామి అన్నాను.

ఆ మాటకి ఆడికేం పిచ్చి తలకెక్కిందో మరేవి యెర్రి మోకాల్లో దిగిందో సర్రున అంతెత్తున లేసినాడు నామీద. ఆ యెర్రెత్తిన సముద్రాలుగోడ్ని అదే సూడ్డం. తాసుపాములా లేసినాడు, కట్లపాములా ఇసం కక్కినాడు.

ఇంతకీ నాను సేసిన పాపమల్లా ఆ మారాజుగోడిని భూస్వామి అనడం.

"ఏరా! మీరు మారరా! ఆ భాష వొదలరా? మన గ్రామాల్లో భూస్వాములెక్కడున్నారు. ఆళ్ళంతా పోయి పెట్టుబడిదారులోచ్చేసారు. ఇపుడు గ్రామాల్లో పెట్టుబడి ప్రవహిస్తుంది. వ్యవసాయాల్లో ఆధునిక పరికరాలు వచ్చేసినై. ఇంకా భూస్వాములేమిటి. పాత చింతకాయ పచ్చడి అన్నాడు".

ఆడు సెప్పిందిన్నాక ఆడు యేటి సెప్పదలుసుకున్నాడో నాకేవీ బోధపడ్డేదు.

"సంద్రాలు బాబూ! అది పాత సింతకాయ పచ్చడో కొత్త బెండకాయ పులుసో అలా వోగ్గీ! వుప్పుడు నీ దగ్గర సిద్ధాంతాలు, రాద్ధాంతాలు ఇనడానికి కాదు మావు వచ్చింది. ఆడు బూసోమా, బూర్జువాగోడా అని తేల్చుకోవడానికి అసలే రానేదు! ఆ తంగరాపులన్నీ మాకెందుకు. ముందు ఈల్లు యేటి సెయ్యాలో సెప్పు",

"కాదు.. కాదు.... ముందీ విషయం తేలాలి" అన్నాడు.

"యే ఇసయం సంద్రాలు బాబూ" అన్నాను నేను.

"ఆ గొడవ ఎవరెవరికి జరిగిందని అనుకుంటున్నారు. ముఖ్యంగా నువ్వు", అన్నాడు నాకేసిజూసి.

"ఈడికేటి ఈ తిరకాసు మాట్లోస్తన్నయి. కొంపదీసి తెల్లారే మందుగాని యేసినాడేటి" అనుకున్నాను.

నేను తెలివిగా యేవీ ఎరగనట్టు నాను తీసుకొచ్చిన అందర్నీ సూపించి" ఇదిగిదిగో ఈల్లకీ ఆ మారాజు గోడికీ మజ్జిన జరిగింది గొడవ" అన్నాను.

ఆడికి విన్నది సిరాకెత్తినట్టుంది.

"ఆ..ఆ.... అది తెలుసు. నేనడిగింది 'వీళ్ళు అతను ఏ వర్గాలకు చెందుతారూ' అని. వాళ్ళకి తెలీకపోయినా నీకు తెలియాలి కదా", అన్నాడు నావైపు సూసి.

"సూడండి బాబూ! మావేదో సమస్య మీదెల్తే ఆడు మాకు పరీచ్చలెడతున్నాడు"

అప్పుడికీ ఆడితో గొడవెందుకని" అయ్యన్నీ నాకేటి తెలుత్తాయి సంద్రాలు బాబూ" అన్నాను.

పనున్నోడిలాగ నన్ను పక్కకి పిలిసినాడు. పక్కకి పిలిసి ఏదో బెమ్మరహస్సెం సెప్తున్నోడిలాగా

"అది గ్రామీణ బూర్జువాకి, గ్రామీణ కార్మికులికి జరిగిన గొడవ" అన్నాడు.

"ఓరి ఎర్రి సముద్రాలుగే.. నీ తెలివి పాతాళానికి దించుకుపోయి నీ పిచ్చి ఆకాశానికి ఎగబాకీసిందిరా. నువ్వన్నాది నిజవేరా! గేమంలో ఉండి ఆడికీ ఈడికీ తకరార్లెట్టే పరిశ్రమలు, బుర్రలు తీసి బుర్రలు మార్సీ పేట్రీలు యెట్టాడు గాబట్టిక ఆ మారాజుగోడు బూర్జువా. ఆడెట్టిన ఆ పరిశ్రమల్లోనూ, పేట్రీల్లోనూ పంజేసేస్తున్నారు గనక ఈల్లంతా కార్మికులు" అనుకున్నాను మనసులో.

మల్లా ఆ యెర్రిగోడే ఇలాగన్నాడు.

"అసలు బూర్జువాకి కార్మికులకు గొడవ లెందుకొస్తాయి. బూర్జువాకి యేమి కావాలి? తన పనిని అతడు తక్కువ వేతనంతో లేదా వేతనం ఇవ్వకుండానో కార్మికుడితో పని చేయించుకోవాలనుకుంటాడు! కార్మికుడు తనకి ఇష్టం లేకపోతే ఆ పనిని చెయ్యనంటాడు. అక్కడ ఇద్దరి మధ్యా తగాదా వస్తుంది. ఆ పని చేసి పెట్టేస్తే వాడు కార్మికుడిని ఏమీ అనడు. అతను కొట్టడం తిట్టడం వంటివి చేస్తున్నాడంటే అతని పని అతనికి ముఖ్యం. అంతే తప్ప అతను భూస్వామ్య అహంకారంతో చేసిన పని కాదు అన్నాడు."

అహొ! ఇనండ్రా సంద్రాలు గోడి కాదు.. కాదు.. సంద్రాలు అనే బుగతగోరి.. కాదు.. కాదు.. బుగత గోరనే యెర్రిగోరు.. కాదు.. కాదు.. యెర్రిగోరనే సంద్రాలుగోరి పటాసు పాఠాలు ఇనండహొ! ఇనండహొ!

ఇక అలాటోడ్ని కూసింత యెర్రెక్కించి వదలాలగానీ మావూలుగా వదిలేత్తే యెలాగ బాబూ!

"అయితే పల్లెల్లో ఎస్సీల మీద, బడుగుల మీద జరుగుతున్న దాడులన్నీ ఇలాటియ్యేనా?" అని ఆడి మాటని అటకాయించినాను.

యెర్రి సముద్రాలుగోడు సేనా ధీమాగా "ముమ్మాటికీ" అన్నాడు.

"తమ ముందు దళితుడు గుర్రం యెక్కినాడని, అగ్ర కులాలోల్లు కిందకి ఈడ్సి పొడిసి సంపడం, డాబుగా పెళ్లి ఊరేగింపు తీస్తన్నారని ఆల్లని సావగొట్టడం. ఇంకా ఇలాటి దాష్టీకాలు, సంపడాలు, నరకడాలు.. ఇయ్యన్నీ బూర్జువా, కార్మికుల గొడవలేనా సంద్రాలు బాబూ" అని అడిగినాను.

అపుడు సముద్రాలు గోడు ఒకసారి బుర్ర గోక్కున్నాడు, ఇంకోసారి ముక్కు సీదుకున్నాడు. సివరాఖరికి ఆ ముక్కు సీదుకున్న సెత్తోటే మొకం కూడా తుడిసీసుకొని

"నువ్వు ఏమి చెప్పినా నేను వినను. మీరు ముందెళ్ళి ఇది బూర్జువాకి కార్మికులకు మధ్య గొడవో కాదో తేల్చుకురండి"

"పోనీ తేల్చుకొత్తే యేదైనా దారి దొరుకుద్దా"

"తేల్చుకు వచ్చినా జరిగేది ఒరిగేది ఏమీ లేదు. ఈ సమాజం మారదు. ఈ కార్మికులు ఇలా కష్టాలు పడవలసిందే. పడి, పడీ, పడీ, పడిన తర్వాత సమాజం కూడా దానంతటకదే మారిపోతుంది. తప్పదు." అని లేచి లోపలికి పోయాడు బాబు.

ఒకప్పుడు ఈడు తెల్లారి లేసింది మొదలు రేత్తిరి పడుకుండీ వరకూ "ఇప్లవం వర్ధిల్లాలి".. "ఇప్లవం వర్ధిల్లాలి" అని ఒకటే గుండెలు బాదీసుకొని, ఒంటిమీదున్న గుడ్డముక్కలు కూడా సించీసుకొని దోర్లీసీవోడు. ఇపుడు నన్ను పక్కకి పిల్సి "ఒరేయ్ అబ్బీ, యెంకట సుబ్బీ! ఈ గండికోట రహస్సెం.. ఈ రాజుకోట రహస్సెం.. నాకొక్కడికీ తెలిసింది.. నీకొక్కడికీ సెబుతున్నా.. ఈ యెవస్థ మారదుస్మీ! నీ యెనకనొచ్చినోల్లకా అవస్థ తప్పదుస్మీ!" అని సనజన్నగా సెప్పకపోయినా ఆడుద్దేశం అదే అని అర్థమైపోనాది బాబూ! ఆడి రంగు తేలిపోనాది! దీన్ని బట్టి నాకొకటే అర్థమైనాది. ఈడు పగోడి పంచన సేరి, ఆడిసిరిన సిల్లరకాశపడి ఈ కొత్తవతారం ఎత్తాడు! పైకి మాత్తరం మార్కుసు, లెనిన్ అని ఆల్లపాటే పాడతాడు. కానీ ఆట మాత్తరం ఎగస్పార్టీ వోల్లతో సేరి ఆడతాడు.

ఆ చెనాన కమ్మిస్టోడి ముసుగులో పెజా ఉద్దెమాల గొంతు కోరికెద్దావని కాసుక్కూమున్న వరద నక్కలా అగుపించాడు బాబూ ఈడు!

ఒక్క ఇసయం సెబుతాను ఇనండి. ఆ మారాజు గోడు ఈడి మీన వందరెట్లు మెరుగు!

యెలాగ్గ అంటారా? ఆడు పగోడని యెవుడైనా ఇట్టే పోల్చీగలం. కానీ ఈడున్నాడు సూసారూ.. సీవల మజ్జిన తిరిగే సాలెపురుగులాటోడు.

అది మామూలు సాలిపురుగ్గాదండీ! ముమ్మూర్తులా సీవని పోలి ఉంటదండీ. సీవలే దాన్ని పోల్చలేక తవ మనిసనుకుని తవతో బాటు తిప్పుకుంటాయి. అటెనక తిరుగుతూనే అవకాశం దొరికినప్పుడు అదాట్న ఆదమరిసి ఉన్న వంటరి సీవ మీద పడి దాన్ని సప్పరించీసి మల్లా యేవీ ఎరగన్దానిలా మిగిలిన సీవల్లో కలిసిపోద్దండీ!

సీవలు, కనిపించే కొండసిలువతో యెంతైనా పోరాడగలవు గానీ ఆటిల్లోనే తిరిగి ఆటిల్నే నంజుకు తినీసే ఇలాటి పెమాదకరవైన ఇసప్పురుగుని, పోరాటం అటుంచి ముందు అసలు పోల్చుకోనే లేవు బాబూ!

మనం కూడా అంతే బాబూ కాకపోతే మన మజ్జినే తిరుగుతూ మన బాసనే మాట్లాడతా మనకే అన్నేయం చేసే ఇలాటి కంనిస్టు ఋగతల్ని పోల్చుకోడవే మనం ఇప్పుడు సెయ్యాల్సిన జరూరు పని!

## ముప్ఫైఏళ్ళక్రితం ప్రజాసాహితి

### సంపుటి : 15 సంచిక : 11 ఆగస్టు 1992

ఈ 'కన్యాశుల్కం' నాటక ప్రదర్శన శతజయంతి సంచిక ముఖచిత్రాన్ని బాపు గీశారు. రెండవ కవరుపేజీలో ఛాయరాజ్ రాసిన 'మధురవాణి' కవిత, మూడు, నాలుగవ పేజీల్లో నూతన్ రాసిన జనంపాట 'తునికాకు కూలి పోరాట పాట'ను ప్రచురించారు. 'నాది ప్రజల ఉద్యమము. దానిని యెవరిని సంతోష పెట్టటానికి వదులుకోను' అన్న గురజాడ కొటేషన్‌తో సంచిక ప్రారంభమయింది. సంపాదకీయం శీర్షికలో 'కన్యాశుల్కం ప్రదర్శన శతజయంతి (1882–1992)' గురించి రాశారు. శ్రీశ్రీ రాసిన 'కామ్రేడ్ గురజాడ', కొత్తపల్లి రవిబాబు రాసిన 'స'జీవ' కన్యాశుల్కం', కాకరాల రాసిన 'కన్యాశుల్కం – రచనా సంవిధానం – ప్రదర్శన', డా॥ సంజీవదేవ్ రాసిన 'గురజాడ నిపుణవాణి మధురవాణి', డా॥ చప్ప సూర్యనారాయణ రాసిన 'ఎన్ని నెరజాడలున్నా గురజాడకు సాటిరావు(రు)', డా॥ యం.ఎ. నరసింహమూర్తి రాసిన 'గురజాడ నాటకాలు', జి. భవాని రాసిన 'కన్యాశుల్కంలో స్త్రీ పాత్ర చిత్రణ', వి. రామకృష్ణ రాసిన 'గురజాడ (కన్యాశుల్కం) – జాతీయోద్యమం', దివికుమార్ రాసిన 'వేగుచుక్క గురజాడ', కఠెవరపు వెంకట్రామయ్య రాసిన 'కన్యాశుల్కం – చారిత్రక నేపథ్యం' వ్యాసాలను ప్రచురించారు. 'బంగోరె' మొట్టమొదటి 'కన్యాశుల్కం'పై సమీక్షలోని శకలాలు'నూ, 1892 ఆగస్టు 13న జగన్నాథ విలాసినీ నాటక సమాజంవారు 'కన్యాశుల్కా'న్ని విజయనగరంలో తొలిసారి ప్రదర్శించగా విజయనగరం నుండి 1892 ఆగస్టు 26 నుండీ వెలువడే 'ది తెలుగు హార్ప్' అనే ఆంధ్రాంగ్ల పత్రికలో ఇంగ్లీషులో వచ్చిన సమీక్షకు తెలుగు అనువాదం 'కన్యాశుల్కము రచన : ప్రదర్శన : ప్రశంస"లను ప్రచురించారు. గురజాడ సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించిన 'అవసరాల సూర్యారావు జ్ఞాపకాలను' – జయంతి రామలక్ష్మణమూర్తి రచించారు. 1992 జూన్ 27, 28 శని, ఆదివారాల్లో విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో జరిగిన 'కన్యాశుల్కం' ప్రదర్శనపై సమీక్షా వ్యాసాలు పామరుడు రాసిన 'కథ అడ్డంగా తిరిగింది', గోపరాజు నారాయణరావు రాసిన 'నాటకేషు కన్యాశుల్కం....', నవీన్ రాసిన 'గిరీశం పాత్ర విశిష్టత' సమీక్షా వ్యాసాలను ప్రచురించారు. చిత్ర రాసిన 'దేశమంటే మనుషులోయ్' కథనూ, వసీరా రాసిన 'మధురవాణి నవ్వు', అల రాసిన 'పదాలు మళ్ళీ ఊపందుకున్నాయ్', వెన్నెల రాసిన 'ఎర్ర మెరుపు' కవితలను ప్రచురించారు. పి. చంద్రశేఖర్ ఆజాద్ నిర్వహణలో 'పిల్లల ప్రపంచం శీర్షిక'లో 'మన గురజాడ తాతయ్య', క్రాంతి కిరణ్ రాసిన 'జి.వి. అప్పారావు బి.ఎ.బి.ఎల్' కథ, గురజాడ రాసిన 'మిణుగురులు' కవితలున్నాయి. ఐ.యం.ఎఫ్, వరల్డుబ్యాంకు ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా విధానాలను వ్యతిరేకిస్తూ 'విద్యార్థుల ఆందోళనను బలపర్చండి' అనే అరుణోదయ పిలుపును ప్రచురించారు.

1/8 డెమ్మీలో 140 పుటలు. వెల : 10 రూ॥లు.

### సంపుటి : 15 సంచిక : 12 సెప్టెంబరు 1992

'సమస్యల సుడిగుండంలో భారతం' అనే ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. రెండవ కవరుపేజీలో ఛాయరాజ్ రాసిన 'సూర్యుడెప్పుడూ ఉదయిస్తూనే వుంటాడు' కవితనూ, నాలుగవ కవరు పేజీలో చెరుకు సుధాకర్ రాసిన 'అమ్మకడుపు చల్లగా.....' కవితనూ ప్రచురించారు. "ఒక విజ్ఞప్తి! ఒక పిలుపు!" అనే సంపాదకీయంలో పతన సాంస్కృతిక విలువలకూ, వాటిని అదుపు చేయలేని పరిపాలకులకూ వ్యతిరేకంగా ఉద్యమిద్దాం అంటూ, ఇటువంటి ప్రజాఉద్యమంలో పాల్గొని, ప్రజల సంక్షేమం కొరకు కృషి చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆర్. రామకృష్ణ రాసిన 'వర్షం పడింది' కథనూ, వెంకన్న రాసిన 'చదువుకే బేరం' జనం పాటనూ, దివికుమార్ రాసిన 'అంకురం' కవితనూ, డా॥ సుధీర్ రాసిన 'మనల్ని చుట్టుముడుతున్న బూతు' (స్పందన)నూ ప్రచురించారు. కాత్యాయనీ విద్మహే రాసిన 'కన్యాశుల్కంలో కుటుంబ వ్యవస్థ', ఎ.ఎన్. అనుసృజన చేసిన 'పిడికిలెత్తిన కవితాగానం ట్రేసీ చాఫ్‌మన్', ఛాయరాజ్ రాసిన ప్రపంచ ప్రజలకు తెలుగు సాహిత్యపు కానుక. 'గురజాడ గీతం 'దేశభక్తి', ధారావాహిక – సంస్కృతి : ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమం – 'భూస్వామ్య సంస్కృతీ రూపాలు; వర్ణాశ్రమ ధర్మాలు, కులం' అనే వ్యాసాలను ప్రచురించారు. 'గురజాడ రచనల్లో మానవతావాదం' డా॥ బి. భారతి రాసిన పుస్తకంపై కొత్తపల్లి రవిబాబు సమీక్షనూ, దివికుమార్ 'అంకురం' సినిమాపై రాసిన 'ఆ నవ్వుకి అర్థం ఏమిటి?' సినిమా సమీక్షని, పి. చంద్రశేఖర్ ఆజాద్ నిర్వహిస్తూన్న పిల్లల ప్రపంచం శీర్షికలో 'కవిత్వం రాయటం ఎలా?' 'పిట్టపాట', 'కవిత', 'కొన్ని జోక్‌లు'నూ ఉత్తరాలు, స్వీకారం, చైతన్యవాహిని శీర్షికలను ప్రచురించారు.

1/8 డెమ్మీలో 60 పుటలు. వెల : 5 రూ॥.

వ్యాసం

తెలంగాణ రైతాంగ పోరాటపు వారసత్వాన్ని కొనసాగిద్దాం :

# "త్యాగాల కోన - వీర తెలంగాణ"

(సెప్టెంబర్ 17కు ముందు, తర్వాత)

- మహమ్మద్ అబ్బాస్

**తెలంగాణ** అంటేనే త్యాగాలు, బలిదానాలు, వీరుల రక్త తర్పణతో ఎరుపెక్కిన పోరుగడ్డ. ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, ఠానూ నాయక్ లాంటి సాధారణ మట్టి మనుషులు కరుడు కట్టిన క్రూరుడైన విసునూరు దేశముఖ్ రామచంద్రారెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన నేల. నైజాం నిరంకుశ పాలనను తుదముట్టించడమే కాకుండా దున్నే వాడిదే భూమి అని దేశానికి దారి చూపిన మాగాణం నాటి తెలంగాణ పోరాటం.

ఇంతటి ఘన చరిత్ర కలిగిన పోరాటం నడిపిన గడ్డ భారత యూనియన్‌లో విలీనమైన చరిత్ర అసత్యాలు, అర్ధసత్యాలతో వక్రీకరణలకు గురవుతున్నది. తెలంగాణ ప్రజలు ఒక సామాజిక మార్పుకోసం వీరోచితంగా పోరాడారు. ఆ మహోన్నత పోరాటానికి స్వార్ధ రాజకీయాల కోసం మతం మకిలి అంటించే చౌకబారు కపట నాటకానికి మతోన్మాదులు పూనుకున్నారు. అధికారం అండ, ధనం బలంతో చరిత్రను మార్చచూస్తున్నారు. తనకు సంబంధంలేని చారిత్రక ఘట్టంలో తమ పాత్ర ఉన్నట్లు, తామే పోరాటం చేసినట్లు కల్పితాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేటి తరం వాస్తవాలు తెలుసుకోవాలి.

సమాజం పురోగమిస్తున్న కొలది మతమౌఢ్యం, అశాస్త్రీయ భావాలు బలహీనపడి ఆధునిక , పురోగామి భావాలు విస్తరించాలి. కానీ పాలకవర్గాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అలా జరగకుండా అడ్డుకుంటాయి. అశాస్త్రీయ భావాలు, మతమౌఢ్యం ప్రజల నుండి దూరం కాకుండా చూడటానికి తమ శక్తి మేరకు నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉంటాయి. విమోచన దినం పేరుతో బిజెపి నాటకం అందులో భాగమే.

నైజాం సర్కార్ వ్యతిరేక ఉద్యమంలో బీజేపీకి ఎలాంటి పాత్ర లేదు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుండి విముక్తి కోసం ఆనాడు ఉద్యమం జరిగింది. ఈ డిమాండ్లలో బిజెపికి కనీసం ఏ ఒక్క డిమాండ్‌తో సంబంధం లేదు. అయినా బీజేపీ తెలంగాణ విమోచన దినం పేరుతో రాజకీయ ప్రయోజనాల కోసం హడావుడి చేస్తున్నది. తనకు సంబంధమే లేకున్నా కమ్యూనిస్టుల పోరాటాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారు. బిజెపి కపట నాటకాలు, కుటిల బుద్ధి అర్ధం కావాలంటే హైదరాబాద్ విలీన ప్రక్రియను నిశితంగా పరిశీలన చేయాలి.

చరిత్రను నాలుగు భాగాలుగా వర్గీకరించి పరిశీలిద్దాం.

1) మొదటి దశ (1921 ముందు)

2) రెండవ దశ (1921 నుండి 46 వరకు)

3) మూడవ దశ (1946 నుండి1948 సెప్టెంబర్ 17 వరకు)

4) నాలుగవ దశ (1948 సెప్టెంబర్ 17 నుండి1951 వరకు)

**1) మొదటి దశ,(1921 ముందు) :-**

హైదరాబాద్ సంస్థానం 1724లో స్వతంత్ర రాజ్యంగా ఏర్పాటయింది. 18వ శతాబ్దం చివరకి ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంతోపాటు, మహారాష్ట్ర, కర్ణాటకలో కలుపబడిన కొన్ని జిల్లాలతో పాటు హైదరాబాద్ సంస్థానం 1956 జనవరి 26 వరకు మనుగడలో ఉంది. హైదరాబాదు సంస్థానం విస్తీర్ణం సుమారు 1,41,133 చదరపు కిలోమీటర్లు. చివరి నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్. ఆయన కింద 975 మంది జాగీర్దార్లు ఉండేవారు. వారి ఆధీనంలో సాగుకు అనుకూలమైన 53,106 చదరపు కిలోమీటర్ల భూమి ఉండేది. జాగీర్దార్లలో 872 మంది హిందువులు, 103 మంది ముస్లింలు ఉండేవారు. 21 వేల గ్రామాలు ఈ జాగీర్దార్ల చెప్పు చేతుల్లో ఉండేవి. ఈ జాగీర్దార్ల కింద హిస్సాదారులు, పటేల్, పట్వారి, కరణం ఇలా రకరకాల రూపాలలో భూస్వాములు ఉండేవారు. నిజాం రాజు జాగీర్దార్ల చేతిలో కీలుబొమ్మ.

జాగీర్దార్లు తమ కింది భూస్వాములు, పటేల్, పట్వారీలు కలిసి గ్రామాల్లో ప్రజల రక్తం పీల్చి పిప్పి చేసి జలగలలాగా పీడించేవారు. దొరల గడీలు ప్రజల పాలిట యమకూపాలుగా మారాయి. దొరల గడీల పేరు వింటేనే ప్రజల గుండెలు గడగడ వణికిపోయేవి. మహిళలకి కనీస భద్రత లేకుండాపోయింది. గడీలలో దొరలు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగించుకునేవారు. దొరల దోపిడీ పాలనలో తెలంగాణ పల్లెల్లో కౌలు, లెవి, వెట్టిచాకిరి, కులపీడనం, అంటరానితనం, మత మౌఢ్యం రాజ్యమేలేవి. అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యం అయ్యాయి. ప్రజల జీవితాలు దుర్భరంగా ఉండేవి.

1921 కంటే ముందు హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ కార్యకలాపాలు లేవు. నిజాం రాజు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి నమ్మిన బంటుగా ఉన్నందువల్లనే 1919లో దేశవ్యాప్తంగా జరిగిన ఖిలాఫత్ ఉద్యమం తెలంగాణలో జరగలేదు. ఇరుమతాలకు చెందిన జాగీర్దార్లు, భూస్వాములు, పటేళ్లు పట్వారీలు ఐక్యంగా రైతాంగాన్ని, వృత్తిదారులను, ప్రజలను హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా దోపిడి చేసేవారు. ఎవరు ఎదురుతిరిగినా, మారు మాట్లాడినా దారుణంగా హింసించి హతమార్చేవారు.

**2) రెండవ దశ (1921 నుండి 1946, సెప్టెంబరు 11 వరకు) :-**

ఈ కాలంలో మార్పులు చాలా వేగంగా జరిగాయి. 1921

నవంబర్‌లో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. రాజకీయ సంబంధమైన ఒక సంస్థ నిజాం సంస్థానంలో ఏర్పడడం అదే మొదలు. ప్రారంభంలో ఈ సంస్థ ఉర్దూ భాషను బలవంతంగా ప్రజలపై రుద్దడానికి వ్యతిరేకంగా తెలుగులో విద్యా బోధన, కులవివక్షత, దేవదాసి, పరదాపద్ధతి, మహిళా హక్కులు వంటి సామాజిక అంశాలను కేంద్రంగా చేసుకొని సంస్కరణ ఉద్యమాలు నిర్వహించింది. జాతీయ కాంగ్రెసు ఇక్కడ ఎలాంటి శాఖలను ఏర్పాటు చేయలేదు.

1923లో ఆర్య సమాజ్ హైదరాబాదులో తమ శాఖను ఏర్పాటు చేసిన తర్వాత మత ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి. 1924లో మొదటిసారి మత కలహాలు జరిగాయి. భూస్వాములు, పటేళ్ళు, పట్వారీలుగా ఉన్న గ్రామాల్లో మొత్తం భూస్వాములు సాగిస్తున్న దోపిడి, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హింసాత్మక చర్యలను రాజు ముస్లిం అయినందున మతానికి కుదించి ఆర్యసమాజ్ మొత్తం ముస్లింలకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. దౌర్జన్యాలకు, ఆగడాలకు పాల్పడిన వారిలో పెద్ద ఎత్తున హిందూ భూస్వాములు ఉన్నప్పటికీ ఆర్యసమాజ్ కావాలని ముస్లింలపై దుష్ప్రచారం చేసింది. భూస్వామ్య సమాజానికి వ్యతిరేకంగా జరగాల్సిన పోరాటాన్ని మతాల మధ్య తగాదగా దారి మళ్లించారు. దీంతో ఉద్రిక్తతలు పెరిగి మతకలహాలకు దారితీసింది.

1927లో మజ్లీస్ అనే ముస్లిం ఛాందసవాద సంస్థ ఏర్పడింది. ఈ సంస్థ అనల్ మాలిక్ (ప్రతి ముస్లిం రాజే) అనే నినాదంతో ముస్లిం మతతత్వాన్ని రెచ్చగొట్టి నైజాం పాలనను సుస్థిరం చేయడానికి పెద్దఎత్తున ప్రచారం చేసింది. కొంతమంది ముస్లింలు మజ్లీస్ సంస్థ ప్రచారం మాయలో పడి తాము కూడా రాజులమని భ్రమకు గురయ్యారు. ఐక్యంగా పోరాడాల్సిన ప్రజలు మతాల పేరుతో కలహించుకునేలా జరుగుతున్న కుట్రలను గ్రహించిన ఆంధ్ర మహాసభ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేసింది.

"ఒక మతానికి చెందిన వ్యక్తి పాలకుడైనంత మాత్రాన ఆ మతానికి చెందిన ప్రజలందరూ కూడా పాలకులు కారు, కాలేరు" అనే వాస్తవాన్ని ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ ప్రజలలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాయి. జమ్ము కాశ్మీర్ నుండి షేక్ అబ్దుల్లాను రప్పించి ఆలేరు సమీపంలోని కొలనుపాకలో పెద్ద సభ నిర్వహించి ముస్లింలను చైతన్యపరిచాయి. ముస్లింల దైనందిన జీవితంలో జరుగుతున్న ఘటనలు కూడా ఆంధ్ర మహాసభ చెప్పిన దానిని నిరూపించాయి.

విసునూరు రామచంద్రారెడ్డి గుండాల చేతిలో హత్యకు గురైనారు కానువాయి గూడానికి చెందిన షేక్ బందగీ. జఫర్‌గఢ్ జాగీర్దార్ ఖాదర్ అలీ గూండాల చేతిలో హత్యకు గురైనారు తమ్ముడపల్లి(జి) గ్రామానికి చెందిన మహమ్మద్ కాశీం. హైదరాబాద్ నడిబొడ్డున చేతులు నరకబడి, దారుణంగా హత్యగావించబడ్డాడు షోయబుల్లాఖాన్.

ఇలా అనేకమంది ముస్లింలు భూస్వాముల ఆగడాలకు బలైన సంఘటనలు తెలంగాణ వ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నాయి. ముస్లిం లోని ప్రగతిశీలవాదులు, సంస్కరణవాదులు, విద్యావంతులు, సాధారణ ప్రజలు, పేద రైతాంగం, చేతివృత్తులవారు నిజాం వ్యతిరేక పోరాటంలో చేతులు కలిపారు. నైజాం సర్కారు వ్యతిరేక ఉద్యమం ఉద్ధృతం కాసాగింది.

మరోవైపు దేశంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్ 1935 ప్రకారం 1937లో అనేక ప్రావిన్సీలలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలను సాధించి స్థానిక ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. పరిపాలనలో సంస్కరణలపై చర్చ ప్రారంభమైంది. దీని ప్రభావం హైదరాబాద్ సంస్థానంపై పడింది. "బాధ్యతాయుతమైన ప్రభుత్వం కావాలని" ఆంధ్ర మహాసభ మొదటిసారిగా రాజకీయ డిమాండ్‌ను బాహాటంగా ప్రకటించింది. ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో కన్నడ పరిషత్, మహారాష్ట్ర పరిషత్తులు కూడా ఏర్పడ్డాయి. హైదరాబాద్ సంస్థానంలో కాంగ్రెస్ 1938లో ప్రారంభమైంది. కాంగ్రెస్‌కు నాయకత్వం వహించిన స్వామి రామానంద తీర్థకు ఆర్యసమాజ్‌తో అవినాభావ సంబంధం ఉన్నది. దీంతో ముస్లిం ప్రజానీకం నిజాం సర్కారుకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి పెద్ద ఆటంకంగా మారింది.

పరిపాలనలో సంస్కరణల కోసం కాంగ్రెస్ సత్యాగ్రహాలకు పిలుపునిచ్చింది. నైజాం సర్కార్ 1937లో రాజ్యాంగ సంస్కరణల కోసం 23 మంది హిందువులు, 5 మంది ముస్లింలతో కమిటీ ఏర్పాటు చేసింది. కాంగ్రెసు సత్యాగ్రహాన్ని విరమించుకుంది. కాని ఆర్య సమాజ్ సత్యాగ్రహాన్ని అలాగే కొనసాగించింది. సత్యాగ్రహం పేరుతో ఉస్మానాబాద్ ప్రాంతంలో పెద్ద ఎత్తున మతకలహాలు జరిగాయి. హైదరాబాదు సంస్థానంలో ఆర్యసమాజ్ ప్రభావం ఉన్న 80 గ్రామాలలో, సంస్థానం వెలుపల ఉన్న 70 గ్రామాల్లో పెద్ద ఎత్తున మతహింస ప్రజ్వరిల్లింది. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలు ప్రజలందరినీ ఐక్యం చేసి పోరాటాలు చేస్తుంటే, ఆర్యసమాజ్, హిందూ మహాసభలు మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను విడదీసే పనిలో నిమగ్నమయ్యాయి.

మరోవైపు నిజాం ప్రభుత్వం పట్ల కాంగ్రెస్ మెతకగా వ్యవహరించడాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ వాదులు సైతం కమ్యూనిస్టులతో సంబంధాలు ఏర్పరచుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ బలపడింది. ఆంధ్ర మహాసభ విప్లవీకరించబడింది. కమ్యూనిస్టు పార్టీ నిజాం వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసింది. దున్నేవాడికే భూమి, వెట్టిచాకిరి నిర్మూలన ఎజెండా పైకి వచ్చాయి. పల్లెపల్లెకు సంఘం జండా, ఎజెండా చేరిపోయాయి. సంఘం అండ ప్రజలలో ధైర్యం నింపింది. భూస్వాముల భూములను ప్రజలు పంచుకున్నారు, దున్నుకున్నారు. వడ్డీ వ్యాపారులకు అక్రమ వడ్డీలను చెల్లించడం నిలిపివేశారు. దొరల గడీలలో వెట్టిచాకిరి మానేసారు.

కౌలు, లెవి, వెట్టిచాకిరి పేరుతో భూస్వాములు సాగించే దోపిడీ, దౌర్జన్యాలకు గ్రామాలలో ప్రజలు ఎదురు తిరగడం ప్రారంభమైంది. పటేల్, పట్వారీలను కౌలు, లెవిలు వసూలు చేయడానికి గ్రామాలకు రాకుండా గ్రామ రక్షక దళాలు అడ్డుకున్నాయి.

అధికారం చేజారిపోతుందని, భూములు పోతున్నాయని భూస్వాములకు అర్థం కాసాగింది. దీంతో భూస్వాములలో అసహనం పెరిగిపోతోంది. పోలీసులతో, తన అనుచరులతో ఎదురుతిరిగిన ప్రజలపై భౌతిక దాడులు, హత్యలకు పాల్పడడం పెరిగింది. హత్యలను, దాడులను ఎదుర్కోడానికి ప్రజలు ఎదురు దాడులు ప్రారంభించారు. 1944లో విసునూరు రామచంద్రారెడ్డి ధర్మాపురం గ్రామ శివారులోని తండాలో

గిరిజనులు సాగుచేసుకుంటున్న 70 ఎకరాల సాగు భూమిని ఆక్రమించడానికి తన అనుచరులను పంపించాడు. ఠానునాయక్ నాయకత్వంలో గిరిజనులు తిరుగుబాటు చేసి తమ భూములను కాపాడుకున్నారు. పగతో రగిలిపోయిన రామచంద్రారెడ్డి పోలీసుల సహకారంతో ఠానునాయక్‌ను బండికి కట్టేసి సజీవదహనం చేసిన దుర్మార్గమైన ఘటన జరిగింది. అయినా ప్రజలు భయపడలేదు మరింత కసితో రగిలిపోయారు.

గ్రామాలు భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలతో పరవళ్లు తొక్కాయి. 3000 గ్రామాలలో 10 లక్షల ఎకరాలు భూములు పంచుకున్నారు. గ్రామ రాజ్య కమిటీలు ఏర్పాటు చేసుకుని, తమ పాలన తామే చేసుకుంటున్నారు. చరిత్రలోనే మొదటిసారిగా తమను తాము పరిపాలించుకునే అవకాశం పొందారు. గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేసుకుని తమను తాము కాపాడుకునే వ్యవస్థను నిర్మించుకున్నారు. సారాయి దుకాణాలు బందుచేసి, రాత్రిపూట బడులు పెట్టుకొని చదువు నేర్చుకుంటున్నారు. కమ్యూనిస్టుల అండతో ప్రజలు భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని, వినని ప్రజారాజ్యం అనే నూతన ప్రపంచ నిర్మాణం వైపు పయనిస్తున్నారు.

మరోవైపు హైదరాబాద్ నగరంలో మగ్దూంమొహియుద్దీన్ నాయకత్వంలో ఆలం కుంద్ మీర్, గులాం హైదర్, హసన్ అలీ మిర్జా, మీర్జా హైదర్ హుస్సేన్, రాజ్ బహదూర్ గౌర్ వంటి వారు హైదరాబాద్ కామ్రేడ్స్ అసోసియేషన్, ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్‌లు ఏర్పాటుచేసి పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులని, కార్మికులను, విద్యావంతులను ఐక్యం చేసి నిజాం రాచరికానికి వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. గ్రామాలను, పట్టణాలతో అనుసంధానం చేసి రైతాంగ పోరాటాలు, కార్మిక పోరాటాలను, ప్రజా పోరాటాలను సమ్మిళితం చేసి నైజాం రాజును గద్దె దించేందుకు, భూస్వామ్య విధానాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు కమ్యూనిస్టు పార్టీ తీవ్రమైన కృషి చేస్తున్నది. ఈ క్రమంలోనే గ్రామ గ్రామాన ఆందోళనా పోరాటాలు ఉధృతం అయ్యాయి.

1946 జూలై 4న కడవెండి గ్రామంలో ప్రజల శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శన కమలమ్మ దొరసాని గడి ముందుకు రాగానే ప్రదర్శనపై విసునూరు రామచంద్రారెడ్డి గుండాలు కాల్పులు జరిపారు. కాల్పుల్లో దొడ్డి కొమరయ్య అక్కడిక్కడే మరణించాడు. కొమరయ్య బలిదానం తెలంగాణ పల్లెల్లో నిప్పు రాజేసింది. ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. భూస్వాములు ఆగడాలను అరికట్టడానికి ప్రతిఘటన చేయకుండా ఉండలేమని ప్రజలు పార్టీ పైన ఒత్తిడి పెంచారు. ఈ పరిస్థితులే తెలంగాణ సాయుధ పోరాటానికి దారితీసాయి. భూస్వాముల భౌతిక దాడులు, పోలీసుల ఆగడాలను నుండి ప్రజలు తమని తాము రక్షించుకోవడానికి ఆయుధాలు చేతపట్టాలని 1946 సెప్టెంబర్ 11న కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది.

**3) మూడవ దశ (1946 సెప్టెంబర్ 11 నుండి 1948 సెప్టెంబర్ 17 వరకు) :-**

తెలంగాణ యుద్ధ రంగంలోకి దిగింది. కమ్యూనిస్టుపార్టీ పిలుపు నందుకొని తెలంగాణ పల్లెలన్నీ సాయుధమయ్యాయి. కారంపొడి, రోకలి బండలు, గుతపకర్రలు, ఒడిశెలు, పలుగు, పార, గొడ్డలి, కొడవలి వంటి సాంప్రదాయ వస్తువులు ఆయుధాలుగా చేసుకొని గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేసుకున్నారు.

నైజాం పోలీసులు, భూస్వాముల గుండాలు, పటేళ్లు, పట్వారీలు గ్రామాలకు రాకుండా ప్రజలు తమ గ్రామాలను తామే ఏలుకున్నారు. భూములను పంచుకున్నారు. తరతరాలుగా పేరుకుపోయిన వడ్డీల నుండి విముక్తి చెందారు. వెట్టిచాకిరి పీడను వదిలించుకున్నారు. పోలీస్ స్టేషన్ల, న్యాయస్థానాల పీడ విరగడైంది. తమ భూముల్లో తాము పండించుకున్న పంటలు ఎవరికీ కౌలు, లెవీ చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రజలే అనుభవించడం ప్రారంభమైంది. ప్రజా తిరుగుబాటును తట్టుకోలేని జాగీర్దారులు, దొరలు, పటేళ్ళు, పట్వారీలు పల్లెల్ని వదిలి పట్టణాలకు పారిపోయారు. బాంచన్ దొర, కాల్మొక్త దొర అని వంగి వంగి దండాలు పెట్టిన తెలంగాణ మట్టి మనుషులు బందూకులు చేతబట్టి, ఎర్రజెండా భుజాన పెట్టి కులము, మతము మరిచిపోయి ఐక్యంగా భూస్వామ్య దురాగతాలకు ఎదురు నిలబడితే, తోక ముడిచిన భూస్వాములు బండెనుక బండి గట్టి పట్టణాలకు పలాయనం చిత్తగించారు. నిజాం మిలిటరీ సహకారం కోరారు. నిజాము మిలిట్రీ గ్రామాల్లోకి చేరి భూస్వాముల, వారి తొత్తుల సహకారంతో గ్రామాల్లో మహిళలనీ, పిల్లల్ని చెరబట్టి కమ్యూనిస్టుల ఆచూకీ చెప్పాలని చిత్రహింసలు పెడుతున్నారు. సామూహిక హత్యలు చేస్తున్నారు. అయినా ఉద్యమం సాగుతూనే ఉంది. భూస్వాముల కిరాయి గుండాలను, నైజాం మిలిటరీని కమ్యూనిస్టుపార్టీ దళాలు ధైర్యంగా ప్రజల సహకారంతో ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో 1947 ఆగస్టు 15న ఇంగ్లాండు భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. 1947 నవంబర్ 29న "యథాతథ ఒప్పందం" అని ఒక సంవత్సరం యథాతథ స్థితి కొనసాగించేలాగా భారత ప్రభుత్వంతో నిజాం సర్కార్ ఒప్పందం కుదుర్చుకున్నారు. నిజాం స్వతంత్ర దేశంగా హైదరాబాద్ సంస్థానాన్ని కొనసాగించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ప్రజలలో భారత యూనియన్లో కలవాలనే కోరిక బలంగా ఉంది. ప్రజలు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఉద్యమాన్ని తీవ్రం చేశారు.

హైదరాబాద్‌లోకి ఎలాంటి ఆహార పదార్థాలు రాకుండా, ఆదాయం రాకుండా దిగ్బంధనం చేశారు. ఆదాయం తగ్గిపోయి, మిలట్రీకి పాలు, కూరగాయలు ఇతర ఆహార పదార్థాలు అందక నైజాం సర్కార్ మిల్ట్రీ ఆత్మస్థైర్యం దెబ్బతింది. ప్రజాఉద్యమానికి నైజాం సర్కారు చేతులెత్తేసే దశకు చేరుకున్నది. భారత ప్రభుత్వంతో రాజీ ఒప్పందం చేసుకున్నప్పటికీ కమ్యూనిస్టుల ఉద్యమంతో తమ అధికారం నిలిచే పరిస్థితి లేదని నిజాంకు అర్థమైంది. భూస్వాములకు తమ కాళ్ల కింది నేల కదిలిపోయింది. తమ చేతుల్లోని భూములు, ఆధిపత్యం, సంపద ప్రజల చేతుల్లోకి పోవడం ఊహించి వణికిపోయారు. దీనిని ఎలాగైనా అడ్డుకోవాలనుకున్నారు.

మతతత్త్వ సంస్థ అయినా మజ్లీస్‌కు నాయకుడిగా ఉన్న ఖాసీంరజ్వీతో మంత్రాంగం జరిపి భూస్వాముల వద్ద ఉన్న ప్రైవేటు సైన్యాన్ని, ఖాసీం రజ్వీ అనుచరులుగా ఉన్న మత ఛాందసులను కలిపి రజాకార్ (స్వయం సేవకులు) అనే ఒక ఛాందస సైన్యాన్ని ఏర్పాటు చేశారు. దానికి ఖాసింరజ్వీ కమాండర్, విసునూరు రామచంద్రారెడ్డి

డిప్యూటీ కమాండర్. రజాకార్ అనే అరబిక్ పదానికి "స్వయం సేవకులు" అని అర్థం. నైజాం రాచరికాన్ని, భూస్వాముల ఆధిపత్యాన్ని కాపాడటం కోసం ఏర్పడిన స్వయంసేవకులె రజాకార్లు. 1948 ప్రారంభంలో ఏర్పడిన రజాకార్లు (స్వయం సేవకులు) భూస్వాముల గడీలలో ఆశ్రయం పొందుతూ, భూస్వాముల సహకారంతో గ్రామాల మీద పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్రజాఉద్యమాన్ని అణచివేయాలని తీవ్ర ప్రయత్నం చేశారు. రాచరికాన్ని, భూస్వామిక విధానాన్ని కాపాడాలని అనైతిక కార్యకలాపాలు సామూహిక హత్యలకు, మహిళలపై అత్యాచారాలకు, దుర్మార్గ చర్యలకు పాల్పడ్డారు. బైరాన్ పల్లి దురాగతం ఈ క్రమంలో జరిగిందే. అయినా ప్రజలు రజాకార్ల దుర్మార్గాలను ఎదిరించి హైదరాబాద్ దిగ్బంధనాన్ని కొనసాగించారు. గ్రామాల్లోకి భూస్వాములు రాకుండా తరిమికొట్టారు. హైదరాబాద్లో మిల్ట్రీకి ఆహారం కొరత ఏర్పడేలా చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ హైదరాబాద్ సంస్థానంలో 'ఇమ్రోజ్' పత్రికలో అనేక వ్యాసాలు రాస్తూ ప్రజలను చైతన్యపరిచారు. గ్రామాల నుండి ఆహార పదార్థాలు నిలిచిపోవడంతో స్థానికంగా ఉన్న రజకుల గాడిదలతో బిర్యానీ వండి సైన్యానికి పెట్టడాన్ని తెలియజేస్తూ రాసిన "గధోంకా బిర్యాని దోభీయోంక పరేషాని" అనే వార్త సంచలనం రేపింది. హైదరాబాదులో మిలటరీ ఎదుర్కొంటున్న ఆహార కొరతను బయటి సమాజానికి తెలియజేసింది. దీనిని సహించలేని నిజాం సర్కార్, రజాకార్లు షోయబుల్లాఖాన్‌ను దారుణంగా హత్య చేశారు.

నైజాం సర్కార్ సైన్యం, రజాకార్లు కలిసి కమ్యూనిస్టుల నాయకత్వంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచలేకపోయారు. నిజాం రాజరికం కూలిపోయే దశకు చేరుకుంది. కమ్యూనిస్టుల ప్రాబల్యం విపరీతంగా పెరిగిపోసాగింది. దీనిని కొత్తగా ఏర్పడ్డ నెహ్రూ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోయింది. తెలంగాణలో కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజాఉద్యమం విజయవంతం అయితే దేశంలో మరిన్నిచోట్ల ఇలాంటి తిరుగుబాట్లు వస్తాయనే భయం కేంద్ర ప్రభుత్వానికి పట్టుకుంది. భూస్వాములు, పెట్టుబడిదారులు, మత ఛాందసులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. కమ్యూనిస్టులను ఆదిలోనే అడ్డుకోవాలని పథక రచన చేశారు. ఆ పథకంలో భాగమే "ఆపరేషన్ పోలో". 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ సంస్థానంను భారత సైన్యం కర్నూలు, సోలాపూర్, విజయవాడ మూడు వైపుల నుండి ముట్టడి ప్రారంభించింది. హైదరాబాద్ సంస్థానం మొత్తం సైనిక బలం 24,000 అందులో శిక్షణ పొందిన వారు కేవలం 6,000 మాత్రమే. నైజాం సర్కార్ సైన్యాలు రజాకార్లు కలిసి తుల్జాపూర్, నలదుర్గ, ఉస్మానాబాద్, ఒమేగా ఈ నాలుగు కేంద్రాలలో స్వల్పంగా ప్రతిఘటించారు. రెండు రోజులలో నిజాం సేనలు చేతులెత్తేసాయి.

సెప్టెంబర్ 17నాటికి భారత సైన్యాలు హైదరాబాదు చేరుకున్నాయి. నైజాం నవాబ్ భారత సైన్యాలను ఆహ్వానించి భారత ప్రభుత్వానికి లొంగిపోయినట్టు ప్రకటన చేశారు. వాస్తవానికి అయితే కథ ఇక్కడితో ముగిసిపోవాలి కానీ కథ ఇక్కడితో ముగిసిపోలేదు.

**4) నాలుగవ దశ (1948 సెప్టెంబర్ 17 నుండి 1951 అక్టోబర్ 1 వరకు) :-**

సైనిక చర్య, విలీనం అనంతర పరిణామాలు మనకు స్పష్టంగా అర్థం కావాలంటే మూడు ప్రశ్నలకి సమాధానాలు వెతకాలి.

1) మొదటి ప్రశ్న :- భారత సైన్యాలు నిజాం రాజును గద్దె దించడానికే వస్తే నిజాం రాజును అరెస్ట్ చేసి జైల్లో పెట్టకుండా రాజ ప్రముఖ్‌గా ప్రకటించి, ఆయన చేతుల మీదుగానే 1950 జనవరి 26 వరకు ఎందుకు పరిపాలనను కొనసాగించారు?

నిజాం నవాబును గద్దె దించడానికి భారత సైన్యాలను పంపాము అని ఆనాటి కేంద్ర ప్రభుత్వం చెప్పింది. కానీ నైజాం సంస్థానం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన తర్వాత కూడా నిజాం నవాబునే గద్దెపై కూర్చోపెట్టారు. అంటే కేంద్ర బలగాలు నిజాం నవాబును గద్దె దించడానికి రాలేదని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంను అణిచేయడం కోసమే వచ్చాయనేది దీనిని బట్టి స్పష్టమవుతుంది.

2) రెండో ప్రశ్న : - భారత సైన్యాలు నిజాం నవాబు లొంగిపోయిన తరువాత కూడా గ్రామాల్లోకి ఎందుకు వెళ్లాయి? గ్రామాలలో శత్రువులు ఎవరు ఉన్నారు?

హైదరాబాద్ సంస్థానం భారత్ ఆధీనంలోకి వచ్చిన తరువాత సంస్థానంలోని ప్రజలందరూ కూడా భారత పౌరులుగా మారిపోయారు. ఏ నాగరిక దేశం కూడా తన పౌరులపైకి సైన్యాలను పంపదు. కానీ భారత ప్రభుత్వం తెలంగాణ సంస్థానంలోని జాగీర్దార్లు, జమీందార్లు, దొరలు, పటేల్, పట్వారీలు తదితర భూస్వాములకు అండగా నిలబడేందుకు సైన్యంను గ్రామాల్లోకి పంపించింది. అంటే భారత సైన్యాలు ఈ భూస్వాములను రక్షించడం కోసమే హైదరాబాద్ సంస్థానంలోకి వచ్చాయి అని స్పష్టం అవుతున్నది. అప్పటివరకు రూమీటోపీ, షేర్వాణీలతో పట్టణంలో ఉన్న దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీలు తెల్ల బట్టలు ధరించి, నెత్తిపై ఖద్దరు టోపీ పెట్టి మిల్ట్రీ సహకారంతో తిరిగి గ్రామాలలో చొరబడి సైన్యం సహకారంతో గ్రామాల్లో ఏం చేశారో చూద్దాం.

"భూస్వాములు పోలీసులను తీసుకొచ్చి గ్రామాలపై బీభత్సకాండ ప్రారంభించారు. అయ్యావారిగూడెం సమీపంలో చింతపల్లి భూస్వామి రామచంద్రారెడ్డి, పోలీసులు ఒక కుమ్మరిని కాల్చి చంపారు. చింతపల్లికి చెందిన హరిజన ఎల్లయ్యను, చెల్లాపురానికి చెందిన హరిజన లాలయ్యను, ఎల్లూరి తండాలో ఇద్దరు రైతులను, తాటిపర్తిలో పశువుల కాపరిని, వికారాబాద్లో ఇద్దరు యువకులను పోలీసులు కాల్చి చంపారు. వికారాబాద్ ప్రాంతంలోని తిరుమలపేట, మల్లాపురం, తుమాపర్తిపల్లె గ్రామాలపై పోలీసులు పెద్ద ఎత్తున దాడి చేశారు. రెండు వందల మందికి పైగా ప్రజలను కొట్టారు. ఇరవై మందికి పైగా స్త్రీలను చెరిచారు. క్రూరంగా రేప్ చేయబడినందున ఆరుగురు స్త్రీలు మృతి చెందారు" ('వీర తెలంగాణా విప్లవ పోరాటం గుణపాఠాలు' పేజీ 177)

నిజాం నవాబు పాలన పోయి భారత యూనియన్లో కలిస్తే పీడ విరగడ అవుతుంది అనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది.

భూస్వాములు మిలిటరీ, పోలీసుల సహకారంతో అత్యంత పాశవికమైన పద్ధతుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలపై దాడులు పెరిగాయి. 4 వేలమంది అమరులయ్యారు. దీనిని మనం ఏ రకమైన విమోచన అనుకోవాలి? బిజెపి చెప్తున్న విమోచన ఇదేనా?

3) మూడో ప్రశ్న :– ప్రజలు దున్నుకుంటున్న భూముల నుండి ప్రజలను దౌర్జన్యపూరితంగా వెళ్లగొట్టి భూస్వాములకు భూములు అప్పగించమని సైన్యానికి ఎవరు చెప్పారు?

"శత్రువు, రజాకార్ కాలంలో సైతం కనీవిని ఎరుగని అత్యాచారాలకు పూనుకున్నాడు. ప్రజలను ముళ్లపొదల్లో, నాగజెముడు పొదల్లో పడవేసి బరువైన మిలిటరీ బూట్లతో వాళ్లపై ఎక్కితొక్కటం, మండుటెండలో ప్రజలను ఫర్లాంగుల దూరం పాకేటట్లు నిర్బంధించటం, చెట్లకొమ్మల నుండి తలకిందులుగా వేలాడగట్టి బూటుకాళ్లతో బంతిని తన్నినట్లు తన్నటం, చెట్టు కొమ్మలపై నుండి తాళ్లు వదిలి తలకిందులుగా రాళ్లు, రప్పలున్నా నేలమీద పడేయడం, స్త్రీల తలలు గొరిగించడం, స్త్రీలపై అత్యాచారాలు చేయడం .......పంపిణీ చేయబడిన భూస్వాముల, దేశ్‌ముఖుల భూములను, పశువులను తిరిగి ఇచ్చి వేయవలసిందిగా ప్రజలపై ఒత్తిడి చేయడం.....వడ్డీ వ్యాపారస్తులకు, భూస్వాములకు పాత బాకీలన్నింటిని తిరిగి తీర్చవలసిందిగా బెదిరించడం ..... వినని వారిని దారుణంగా హింసించడం, చంపడం కొనసాగింది. ఈ నిరంకుశ దాడుల ఫలితంగా భూస్వాములు, వాళ్ళ ఏజెంట్లు తిరిగి తలెత్తుకున్నారు .....('వీర తెలంగాణా విప్లవ పోరాటం గుణపాఠాలు' పేజీ 155)

ప్రజలు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి సాధించుకున్నారు. కానీ సైనిక చర్య తరువాత జరిగిందేంటి? ప్రజలు తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న అనేక ఫలితాలను సైన్యం సహకారంతో భూస్వాములు కాలరాశారు. గ్రామ రాజ్యాలను కూల్చివేశారు. ప్రజలను దారుణంగా అణచివేశారు. ఇదేనా విముక్తి అంటే?

4) నాలుగో ప్రశ్న :– మిలటరీ సహకారంతో సాగిన మత మారణకాండకు బాధ్యులెవరు?

మత మౌఢ్యంతో సైన్యం, మత ఉన్మాద సంస్థ జరిపిన దారుణాలు తెలియాలంటే పండిత్ సుందర్‌లాల్ కమిటీ నివేదిక అధ్యయనం చేయాలి. విలీనం ప్రక్రియ పేరుతో మిలటరీ పోలీసు యంత్రాంగం మతోన్మాద సంస్థలు జరిపిన మారణకాండపై అనేక విమర్శల అనంతరం నెహ్రూ ప్రభుత్వం సుందర్లాల్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించింది.

సుందర్ లాల్ కమిటీ 1948 నవంబర్ నుండి డిసెంబర్ వరకు నెల రోజుల పాటు హింసాత్మక సంఘటనలు ఎక్కువగా జరిగిన తొమ్మిది జిల్లాల్లో పర్యటించింది. 21 పట్టణాలు, 23 ముఖ్యమైన గ్రామాలను సందర్శించింది. 109 గ్రామాలకు చెందిన 500 మంది సాక్షులను విచారించింది. 31 పబ్లిక్ మీటింగ్స్, 27 ప్రైవేట్ మీటింగ్స్ నిర్వహించి అభిప్రాయాలు సేకరించింది. హిందువులను, ముస్లింలను, కాంగ్రెస్ వాదులను, అధికారులను, విద్యాసంస్థల సిబ్బందిని, విద్యార్థులను, అభ్యుదయ రచయితల సంఘ సభ్యులను, హిందీ ప్రచార సభ సభ్యులను కమిటీ విచారించింది.

నిజాం రాజును, కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి రామానంద తీర్థను, మేజర్ జనరల్ జె.ఎన్ చౌదరి, సి.ఎస్. బాక్లే, ముఖ్య పరిపాలన అధికారులు డాక్టర్ మెల్కోటే, మెస్సర్స్, రాంచంద్రరావు, రామాచారి, కే విద్య, కే వెంకట్రావులను విచారణ జరిపి నివేదికను సమర్పించింది. ఉస్మానాబాద్, గుల్బర్గా, బీదర్, నాందేడ్ ఈ నాలుగు జిల్లాల్లో సుమారు 18 వేలమంది ముస్లింలను ఊచకోత కోసారని నివేదిక పేర్కొన్నది. అలాగే ఔరంగాబాద్, బీర్, నల్గొండ మరియు మెదక్ జిల్లాల్లో 3500 నుండి 4000 మంది వరకు హతమార్చబడ్డారు. మొత్తం సంస్థానంలో 30 వేలమంది ముస్లింలు చంపబడ్డారు. కేవలం హత్యలు మాత్రమే కాకుండా మహిళలను, పిల్లలను అపహరించడం. లూటీలు, దహనాలు, ధ్వంసం చేయడాలు, మసీదులను కూల్చడం జరిగాయి. బలవంతపు మతమార్పిడులు, మహిళలపై అత్యాచారాలు, ఇళ్లు, భూములు, ఆస్తులు ఆక్రమించుకోవడం జరిగినట్టుగా, సుమారు పది కోట్లకు పైగా ఆస్తులు ధ్వంసం అయినట్టుగా నివేదిక స్పష్టంగా పేర్కొన్నది. చేనేత వృత్తి దారులు, స్థానిక రైతాంగం, సాధారణ ప్రజలు ముస్లింలని కాపాడడానికి ప్రయత్నం చేసి మతోన్మాదుల దాడులకు గురైనట్లుగా నివేదికలలో చెప్పింది. ఈ మారణకాండకు ప్రధాన కారణం హైదరాబాద్ సంస్థానం వెలుపలి నుండి వచ్చిన వేలాది మంది సాయుధ శిక్షణ పొందిన, మనకు బాగా తెలిసిన నొటోరియస్ (అపఖ్యాతి పాలైన) హిందూ మతోన్మాద సంస్థకు చెందిన వారేనని నివేదిక పేర్కొంది. వారితోపాటు సైన్యంలో కొంతమంది మతమౌఢ్యులు, స్థానిక పోలీసులు కూడా ఈ దుర్మార్గంలో పాలు పంచుకున్నారని నివేదిక స్పష్టం చేసింది.

సైన్యం సహకారంతో మత ఉన్మాదం ఎలా వెర్రితలలు వేసింది కళ్లకు కట్టినట్టు నివేదిక చెప్పింది. హైదరాబాద్ సంస్థానంలో ముస్లిం, హిందూ మతాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ, మత ఉన్మాద సంస్థలను పెంచిపోషిస్తూ పాలకులు సాధారణ ప్రజలను ఎలా బలిపశువులను చేశారు అనేది చరిత్ర నేర్పుతున్న గుణపాఠం. విలీనానికి ముందు ముస్లిం మత ఉన్మాదులు, విలీనం తర్వాత హిందూ మత ఉన్మాదులు జరిపిన మారణకాండ దీనికి ప్రత్యక్ష నిదర్శనం. ఇది మన విలీన చరిత్ర.

ఈ చరిత్రంతా పాలకులకు తెలియంది కాదు, తెలియకుండా జరిగింది కాదు. ఎవరి ప్రయోజనాల కోసం ఇదంతా జరిగిందో విజ్ఞులైన ప్రజలు ఆలోచించాలి. విలీనానికి ముందు, విలీనం తర్వాత మతోన్మాదం, భూస్వాములు సాగించిన ఆగడాల నుండి సరియైన గుణపాఠాలు నేర్చుకోవాలి. తెలంగాణ బిజెపి ఉచ్చులో పడి మరోసారి మతకలహాల కుంపటిగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది. అందుకు రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం బలపడడమే ఏకైక మార్గం. ఆ దిశగా తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకు కదులుదాం. అదే నాలుగు వేల మంది అమరుల త్యాగాల నిజమైన నివాళి అవుతుంది.

## జాతీయ అక్షరయోధులు



నారాయణ్ సుర్వే

( 1926 - 2010)



6

సింగంపల్లి
అశోక్‌కుమార్

# స్వేద నారాయణ్ సుర్వే

దళిత ప్రజ్వలిత నారాయణ సుర్వే
అసమానత వ్యవస్థా అవస్థల సర్వే
కావ్యశక్తి శ్రమశక్తినుంచే రావాలన్న
సకల పీడిత అరుణారుణ అక్షర్వే

**'అందని చందమామలాంటి ఆహార అన్వేషణలో వడిలి పోయిన జీవితం నాది.
ప్రజలే నా విద్యాలయాలు, ప్రజల కష్టాలే నా కావ్య వస్తువు
అందరి కోసమే నేను, కావ్యశక్తి శ్రమశక్తి నుంచే రావాలి'...
సమాజ విజ్ఞానం, రాజకీయం, చరిత్ర, వీటి పరోక్షప్రభావం నా రచనలపై ఉంది.
పరుగెత్తవద్దు మార్పు చెందు అన్నది నా లక్ష్యం...
'మార్క్సును చదివాను, చదవడం కాదు అధ్యయనం చేశాను,
నాకో దారి కనిపించింది' అని చెప్పే నారాయణ్ గంగారాం సుర్వే
ప్రసిద్ధ భారతీయ మరాఠీ దళిత కవి, రచయిత, సంఘ సంస్కర్త.**

గంగారాం కుషాజీ సుర్వే అనే ఓకార్మికుడికి బొంబాయి నగరవీధుల్లో రోడ్డుమీద దొరికిన తల్లి వదిలేసిన అనాథ శిశువు నారాయణ సుర్వే. బాల్యం నుండి కార్మికులతో పెరిగారు. కార్మికుల కష్టాలు అనుభవించారు. పొట్టపోసుకోడానికి కూలి పనిచేస్తూ మునిసిపల్ పాఠశాలలో ప్యూన్‌గా, తరువాత బట్టల మిల్లులో సహాయకుడిగా పనిచేశారు. పనిచేస్తూనే ఏడోతరగతి వరకు చదివారు. తరువాత బడిపంతులయి, ఉపాధ్యాయుడిగా రిటైరయ్యారు. ఆ కాలంలోనే ముంబై వర్కర్స్ యూనియన్ ఉద్యమంతో కలిసి చురుకుగా పనిచేశారు.

పనిచేసుకుంటూనే ఉర్దూ, హిందీ సాహిత్యాలను అధ్యయనం చేశారు. మనువు వేదాన్ని కాక మనిషి స్వేదాన్ని చదివారు. కళాశాల మెట్టు తెలియకపోయినా మార్క్సిజం అధ్యయనంతో సమాజం తెరచిన పుస్తకం అయింది. మనిషయ్యారు, కవి అయ్యారు. ప్రపంచమంతా కమ్యూనిజం నెలకొనాలని కలగన్నారు. మరాఠీ, హిందీ, ఉర్దూ మాండలికాలతో పరిమళించారు. ప్రజ్వలించారు. పీడిత ప్రజల పక్షాన కలమై పీడకులపై గర్జించారు. గళమై గాండ్రించారు.

'ఐసాగిమీ బ్రహ్మ (1962), మాజే విద్యాపీఠ్ (1966)నా (11 అవార్డులు విద్యాలయం అందుకుంది), జహీర్‌నామా(1978), సనద్, మనుష్ కలవంత్, అని సమాజ్' వీరి ప్రసిద్ధ రచనలు. వీరి రచనలు భారతీయ భాషల్లోనేకాక ఇంగ్లీషు, స్పానిష్, జర్మన్ భాషల్లోకి అనువాదం పొందాయి. 'లోక వాఙ్మయ గృహ' పత్రికకు 1972లో సంపాదకులయ్యారు.

1973లో రష్యానుండి 'సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు, 1998లో ప్రభుత్వ పద్మశ్రీ అవార్డు, మహారాష్ట్ర ప్రభుత్వ కబీర్ సమ్మాన్ పురస్కారం లభించాయి.

'మహిళను తల్లిగా భావిస్తున్నా, దేవతగా గౌరవిస్తున్నా ఆమెకో అస్తిత్వం, వ్యక్తిత్వం లేదు. స్త్రీ జీవిత భాగస్వామి.ఆమె పట్ల ఇంతవరకూ సౌందర్య దృష్టి ఉండేది. ఆమె భోగవస్తువుగా ఉండేది. ఆమెకూ మనసు ఉంది. సంవేదన ఉంది. ప్రపంచంలో సగం పాలు ఆమెది. ఆమెను గురించి నా అభిప్రాయమది' అని చెప్పిన నారాయణ్ గంగారాం సుర్వే 15-10-1926 అక్టోబర్ 15న బొంబాయిలో జన్మించారు. 2010 ఆగస్టు 16న బొంబాయిలోనే అనారోగ్యంతో కన్ను మూశారు. నారాయణ సుర్వే ముఖచిత్రంతో 'ప్రజాసాహితి' 2001 డిసెంబరు సంచికను విశిష్ట సంచికగా ప్రచురించింది.

వ్యాసం

# దళితుల జీవన, స్థితిగతుల్లో ఎటువంటి మౌలిక మార్పులు తీసుకురాని 75 సంవత్సరాల భారత స్వాతంత్ర్యం!

- జి.వి. భద్రం

ఈ ఆగస్టు 15 నాటికి, దేశానికి 'స్వాతంత్ర్యం' వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతోంది. ఈ సందర్భాన్ని ఆసరా చేసుకొని, దేశాధికారాన్ని చేబట్టి గత 8 సంవత్సరాలుగా పరిపాలిస్తున్న బి.జె.పి. ప్రభుత్వం 'ఆజాదీకా అమృత్ మహోత్సవమ'నే సంబరాలను నిర్వహించే ఏర్పాటు హడావిడిలో మునిగిపోయింది. దేశమంతటా ఎక్కువ సంఖ్యలో, ప్రతీ యింటిపైనా త్రివర్ణ పతాకం ఎగరేయటం, ప్రపంచమంతటా వివిధ దేశాల్లో భారతీయులున్నచోట, మనదేశపు ఓడలపై (వాటిని అక్కడి రేవులకు పంపించి) త్రివర్ణ పతాకం ఎగురవేసి, భారత స్వాతంత్ర్యపు 75 సంవత్సరాల వజ్రోత్సవ వేడుకలు జరపటం, దేశమంతటా వివిధ ప్రాంతాలలో స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన (తాను ఎంచిన) ఫొటో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేయటం, ప్రత్యేకించి ఆగస్టు 14న, దేశ విభజన సందర్భంగా జరిగిన బీభత్సాన్ని గుర్తుచేస్తూ, 75 పునరావాస కేంద్రాలకు మవునంగా ఊరేగింపులు జరపటం లాంటి కార్యక్రమాలను నిర్వహించే ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా దేశంలోని యువతలో, నేటితరాలవారిలో దేశభక్తిని రగుల్కొల్పుతాననీ, దేశ ప్రజలలో ఐక్యత పెంపొందిస్తాననీ, దేశ ప్రజలలో వున్న దేశభక్తి భావాన్ని మరింతగా యినుమడింపజేస్తాననీ బి.జె.పి ప్రభుత్వం బడాయి ప్రచారం కావిస్తోంది. భారత స్వతంత్ర పోరాటంలో తనకుగానీ, తన పూర్వీకులైన జనసంఘ్‌కు కానీ యిసుమంతైనా పాత్ర లేకపోయినా, ఇంతవరకూ స్వాతంత్ర్య పోరాటానికి, స్వాతంత్ర్య సాధనకూ తానే ఏకైక ప్రతినిధిగా వ్యవహరిస్తూ, స్వాతంత్ర పోరాట కీర్తిని అనుభవిస్తున్న జాతీయ కాంగ్రెసు పార్టీ నుండి, ఆ కీర్తిని తాను లాగేసుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ స్వాతంత్రోద్యమ వేడుకల నిర్వహణకు బి.జె.పి. పాలకులు పూనుకొంటున్నారన్నది స్పష్టంగానే అర్థమవుతోంది. అంతేకాక, ఈ సందర్భాన్ని బి.జె.పి. పార్టీ తమ నాయకుడు, వి.డి. సావర్కార్‌ను, గాంధీతో సమాన స్థాయిలో నిలబెట్టడం కోసం, తన ఒకే ప్రజ, ఒకే దేశం అన్న 'అఖండ హిందూ రాజ్యం' సుస్థిరపరచాలన్న కార్యక్రమాన్ని, లక్ష్యాన్ని ముందుకు తీసుకొనిపోవటానికి ఉపయోగించు కొంటున్నదని అర్థం అవుతోంది.

దేశ విభజన సందర్భంగా జరిగిన ఘోరాల్లో కేవలం పాకిస్తాన్ సరిహద్దులు దాటి భారతదేశంలోకి నిరాశ్రయులుగా హిందువులు మాత్రమే రాలేదు. అదే సందర్భంలో భారతదేశం నుండి ఘోరాల పాలపడి, అంతే సంఖ్యలో ముస్లింలు కూడా భారత సరిహద్దులు దాటి పాకిస్తాన్‌లో ప్రవేశించారన్నది చారిత్రక సత్యం. దేశ విభజన కారణంగా ఉమ్మడి భారతదేశంలోని ఎందరో హిందువులూ, ముస్లింలూ కూడా అల్లర్లలో యిరుక్కొని ఆ విద్వేష మత దాడులకు గురై, మాన ప్రాణాలను పోగొట్టుకున్నది చారిత్రక సత్యమే!

కానీ బిజెపి తలపెట్టిన దేశ విభజన నాటి బీభత్సాన్ని గుర్తుచేసుకొనే మొట్టమొదటి "మౌన ఊరేగింపుల ద్వారా" దేశంలోని యువతకు, దేశ విభజన నాటి బీభత్సానికి ముస్లింలు, పాకిస్తాన్‌లే బాధ్యులన్నట్లు చూపిస్తూ, హిందువులు మాత్రమే ముస్లింల చేతులలో అత్యాచారాలు, దాడులు తదితర ఘోరాలకు గురయినారన్నట్లు చరిత్ర వక్రీకరణకు పాల్పడుతూ, హిందూ యువతలో మత విద్వేషాన్ని నింపే నీచమయిన కుట్రకు పాల్పడుతోంది. 2022 నుండి ఆగస్టు 14ను దేశ విభజన బీభత్సాన్ని గుర్తుచేసుకునే రోజులా గుర్తింపబడుతుందని ప్రధాని మోడీ ఘనంగా ప్రకటించాడు. ఆ రకంగా తన హిందూత్వ అజెండాను ముందుకు తీసుకుపోవటంతోపాటు, రాబోయే సార్వత్రిక ఎన్నికలలో లాభం పొందాలని బిజెపి చూస్తోంది. వివిధ రాష్ట్రాలలో అధికారంలో వున్న వివిధ ప్రాంతీయ పార్టీలు కూడా దేశ స్వాతంత్ర్యం గురించి తమవైన స్వంత వ్యాఖ్యానాలు, వివరణలతో ప్రజలను ఆకట్టుకొని, రాబోయే సార్వత్రిక ఎన్నికలలో లాభం పొందటం కోసం, 75వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు.

పాలక పార్టీలు, పాలకవర్గాలూ, పాలకవర్గ అనుకూలమైన కార్పొరేట్ సంస్థలూ, యీ 75వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల గురించి ఎంతగా ఊదరగొట్టినా, దేశ ప్రజలు - ప్రత్యేకించి దేశంలోని శ్రామిక వర్గాలకు చెందిన ప్రజలు, యీ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను గురించి ఉత్సాహం ఎంతమాత్రమూ చూపించటంలేదు. వారి, వారి దుర్భర జీవన పరిస్థితులు వారికి స్వాతంత్ర్యం అన్నదానికి ఎటువంటి అర్థం లేకుండా చేశాయి. పేదరికం, నిరుద్యోగిత, అందుబాటులో లేని విద్యా, వైద్య సౌకర్యాలు ఎటువంటి అదుపూ లేకుండా క్షణక్షణం పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రజల జీవితాలకు జీవనాధారంగా వున్న వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడి, జీవనాధారం కోసం రోజు కూలీలుగా గ్రామీణ పేదలు, సుదూర ప్రాంతాలకు వలసలకు వెళ్ళి అతి కష్టమైన (శ్రమాధికమైన) పనులు చేస్తూ, దిక్కుమొక్కు లేని అనాథలుగా జీవనం గడపాల్సిన దుస్థితిలో ఉన్నారు. అభివృద్ధిపేరిట నిరాశ్రయులను చేయటం, రోజురోజుకూ పెరిగిపోతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హింస, ఎటువంటి అదుపూ లేకుండా దళితులపై, ప్రత్యేకించి ముస్లిం ప్రజానీకంపై సాగుతున్న మతోన్మాద దాడులూ, క్షణక్షణం పెరిగిపోతున్న నిర్బంధం, నిర్బంధ చట్టాలు, కనీసం తాము అనుభవిస్తున్న దుర్భర జీవన స్థితిగతుల

గురించి బయటకు వెల్లడించటాన్ని నేరంగా, దేశద్రోహంగా చూపిస్తూ, తమ భావప్రకటనా స్వేచ్ఛను సైతం హరిస్తూ, జైలుపాలు చేస్తున్న నిర్బంధ పరిస్థితులు ప్రజలను తమకు నిజంగా స్వాతంత్ర్యం వచ్చిందా అనే ప్రశ్న వేసేట్లు జేస్తున్నాయి. ఒకవేళ అటువంటి స్వాతంత్ర్యం వచ్చి వుంటే, ఆ స్వాతంత్ర్యం ఎవరికి వచ్చింది అని ఆలోచించేట్లు చేస్తున్నాయి. తమ నిత్య జీవితానుభవంలో లేశమంతైనా లేని స్వాతంత్ర్యం ఏ రకమయిన స్వాతంత్ర్యం అని ప్రశ్నించేట్లు చేస్తున్నాయి.

ఇటువంటి నేపథ్యంలో, దేశంలో 16% పైగా వున్న అణగారిన ప్రజానీకంగా వున్న దళిత ప్రజానీకానికి, వారి జీవన స్థితిగతుల్లో యీ 75 సంవత్సరాల స్వాతంత్ర్యం అన్నది ఎటువంటి పరిణామాలను తీసుకువచ్చింది. ఎటువంటి మార్పు తీసుకువచ్చింది అని సమీక్షించు కోవటం ద్వారా, దేశంలో యీ 75 సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి అన్నది వారికి ఏ రకమయిన వాస్తవ అభివృద్ధిని చేకూర్చింది అని అర్థం చేసుకోవటానికి, వాస్తవ స్థితిని అవగాహన చేసుకోవటానికి ఉపయోగకరంగా వుంటుంది.

ఆగస్టు 15, 1947కు ముందుకాలంలో, బ్రిటిష్‌వారి ప్రత్యక్ష వలసపాలనా కాలంలో, దళితుల స్థితిగతులకు సంబంధించిన పలు వివరాలు, ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి', ముల్క్‌రాజ్ ఆనంద్ వ్రాసిన 'అంటరానివాడు' నవలలోనూ, దయాపావర్, ఓంప్రకాశ్ వాల్మీకి, శరణ్‌కుమార్ లింబాలె లాంటి తదితర దళిత రచయితలు వ్రాసిన ఆత్మకథలులోనూ మనముందు పుష్కలంగానే వున్నాయి.

ఆనాడు దళితులను 'పంచములు'గానూ, అనంతర కాలంలో గాంధీగారు ఆ కులాలను ఆధ్యాత్మీకరించి 'హరిజనులు'గా పిలిచారు. తదనంతరకాలంలో దళిత పాంథర్స్ ఉద్యమం ద్వారా, సమాజానికి (వర్ణాశ్రమ) అట్టడుగునున్న పీడిత కులాలను 'దళితులు'గా వ్యవహరిస్తున్నారు. దళిత భావం విస్తృతమైన అర్థంతో అవగాహనతో నేడు ఉపయోగిస్తున్నారు.

నాడు అణగార్చబడిన, ఆ పీడిత కులాలవారి స్థితిగతులను నేటి ఆధునిక, 21వ శతాబ్దంలోని దళితుల స్థితిగతులతో పోల్చి చూడటం వలన, ఆగస్టు 15, 1947 నాటి 'స్వాతంత్ర్యం' యీ 75 సంవత్సరాలుగా వారి పట్ల ఎలా పరిణమించిందో దాని వాస్తవ స్వభావ స్వరూపం ఏమిటో, దళితుల జీవన వాస్తవికతపై ఆధారపడి అంచనా కట్టగలుగుతాము. అంతేకాక, నేడు ఎటువంటి కర్తవ్యాన్ని చేబట్టవలసి వుంటుందో కూడా అర్థం చేసుకోగల్గుతాము.

భారత సమాజంలో పంచములను అట్టడుగున వుంచారు. వేల సంవత్సరాల కాలంగా వీరిని బానిసలుగా అణచిపెట్టి వారిని పశువులకన్నా హీనంగా పరిగణించే ఒక అమానవీయ సంస్కృతి భారత సమాజంలో ప్రతిష్టించబడింది.

ఊరికి దూరంగా మురికివాడలలో వీరు నివసిస్తూ అగ్రకుల సమాజానికి వేతనాలు లేని సేవకులుగా భారత సమాజంలో నిర్బంధంగా మనుగడ సాగించాల్సిన పరిస్థితులు వీరిపై విధించారు. "మాల మాదిగ పల్లెల చుట్టూ పారవేయబడిన ఎముకల నుండీ పశుకళేబరాలను కోసిన స్థలములలో విడువబడ్డ మురికినుండీ తోళ్ళూనడానికి నానవేసిన గాబుల నుండీ, దండెముల మీద ఆరవేసిన కుళ్ళుమాంసపు పురుగుల నుండీ గౌలు బయలు దేరి నలు దిక్కులా వ్యాపిస్తున్నది"...... "ఈ ఛండాలములవల్లనే వీండ్లకు ఛండాలురని పేరు వచ్చింది." (మాలపల్లి).

మాలమాదిగ పల్లెల్లో నాలుగు నెలలు పూర్తయిన భోజనమంటే జొన్నన్నం, గోంగూర, కారం, యివి కడుపునిండా తినటం. నాలుగు నెలలు అర్ధభోజనం, మిగిలినరోజులు కటిక ఉపవాసం..... దొరికితేనే నాగజెముడు పండ్లూ, బొద్దాకూ, చచ్చిన గొడ్ల మురికి మాంసం తిని కడుపు నింపుకోవటం" (మాలపల్లి).

".....ఊరికి చివర గ్రామాన్నీ, ఎరుకలు నివసించే గూడేన్ని విడదీస్తూ మధ్యలో ఒక చెరువు వుంది. ఆ చెరువు గట్టుమీద చుహ్రాలు (ఎరుకలు) నివసించే గుడిసెలున్నాయి. గ్రామానికి చెందిన మహిళ లందరూ – యువతులూ, వృద్ధ మహిళలూ, కొత్తగా పెళ్ళైన పెళ్ళికూతుర్లూ, అందరూ – చుహ్రాల యిళ్ళ వెనకాల గల చెరువు' గట్టుమీదనే పరదాలు కట్టుకొనే (ముఖానికి) బహిర్భూమికి వెళ్తారు. ఆ సమయంలోనే వారు తమ గ్రామానికి చెందిన విషయాలన్నింటినీ తీరిగ్గా చర్చించుకొంటారు. అందువలన ఎక్కడ చూసినా అశుద్ధమేగాక, నిరంతరం యిక్కడ దుర్గంధం వ్యాపించి వుండి, ఎవరినైనా ఒక్క నిముషంలో ఊపిరాడనంతగా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. గూడెంలోని సన్నని సందుల్లో పందులూ, కుక్కలూ, ఒంటిమీద బట్టల్లేనిపిల్లలూ తిరుగుతూ వుంటారు. ప్రతిరోజూ ఈ సందుల్లో పోట్లాటలు జరుగుతుంటాయి. ఇటువంటి వాతావరణంలో నేను పెరిగాను". (ఓం ప్రకాష్ వాల్మీకి, 'జూథన్' నవల).

".....కుటుంబంలో ప్రతి వ్యక్తీ ఏదో ఒక పనిచేస్తాము. అయినా కూడా మాకు ఒక్కరోజు కూడా కడుపునిండా భోజనం దొరకదు. మేము టాగాలకు (అగ్రకులాలవారికి) అన్ని రకాల పనులు చేస్తాము – పొలంపనులు, సాధారణ సేవలు, పారిశుద్ధ్యపనులు – లాంటి అన్ని పనులూ చేస్తాము. మేము తరచుగా ఎటువంటి కూలి పొందకుండానే పనిచేయవలసి వస్తుంది. ఇలా కూలి చెల్లించకుండా, తిండిగింజలైనా యివ్వకుండా చేయాల్సిన పనిని ఎవ్వరం చేయనిరాకరించలేము. ఇందుకు బదులుగా మాకు ముట్టేది – తిట్లూ, శాపనార్ధాలూను..... వాళ్ళు మమ్ములను మా పేర్లతో పిలవరు. మాకన్నా చిన్నవయస్సు వాళ్ళైనా మమ్మల్ని "ఒరే ఎరకలోడా! అరే ఎరకలోడా! అనే పిలుస్తారు." (ఓం ప్రకాష్ వాల్మీకి).

"అంటరానితనం చాలా ఎక్కువగా, ఎటువంటి అదుపూ ఆజ్ఞా లేకుండా పాటిస్తున్నారు. కుక్కలను, పిల్లులను, గేదెలను ఎడ్లను, పశువులను ముట్టుకునే అగ్రకులాలవారు మమ్మల్ని ముట్టుకుంటే మైలబడిపోతారట! వారు మమ్ములను సాటి మానవులుగా చూడరు. మేము కేవలం ఉపయోగకరమైన వస్తువులం (వారి దృష్టిలో) మాత్రమే. మా ఉపయుక్తత కేవలం వారి కవసరమైన పనులు చేసిపెట్టేంతవరకే! మమ్ములను వాడుకొని, ఆనక విసిరివేస్తారు." (ఓంప్రకాష్ వాల్మీకి)

దుర్భర దారిద్ర్యం కారణంగా, తిండి దొరకని యీ పంచములు విధి లేని పరిస్థితుల్లో చనిపోయిన పశువుల మాంసాన్ని తినేవారు. దళిత నాయకుడు అంబేద్కర్, హరిజనోద్ధారకుడు గాంధీలు వీరిని చచ్చిన పశువుల మాంసం తినొద్దని పిలుపిచ్చినా, దుర్భర దారిద్ర్య కారణంగా చనిపోయిన మాంసాన్ని తినకుండా విడనాడటం వారికి సాధ్యం కాలేదు.

"దేశంలోని ఏ ప్రాంతమైనా కావొచ్చును. ఏ ఊరైనా కావొచ్చును కాని అంటరానివారి అనుభవాలన్నీ ఒకే రకమైనవి. వారిపట్ల చూపించే క్రూరత్వం మాత్రం ఒకే రకమయినది.

– సామాజిక బహిష్కరణ ఊరుకు దూరంగా దళిత గూడేలు, త్రాగునీటి చెరువుల్లో, బావుల్లో దళితులను నీరు తెచ్చుకోనీయకపోవటం, దళితులకు విడిగా స్మశానాలు, బావులు, గ్రామాల్లో చనిపోయిన పశువులను దళితులే విధిగా యీడ్చుకు పోవల్సి వుండటం, గ్రామాల్లో దళితులకు క్షవరం చేయటానికి నిరాకరించటం – యివన్నీ అంటరానితనం యొక్క సార్వత్రిక లక్షణాలు – దళితుల అనుభవాలు" (శరణ్‌కుమార్ లింబాలె).

వారికి రహదారుల్లో నడిచే స్వేచ్ఛలేదు. సమాజం వారిపై విధించిన పనితప్పు వారికి వేరే వృత్తి ఎంచుకొనే స్వేచ్ఛలేదు. అంటరానివారిని, ముట్టుకొంటే సవర్ణు మైలబడతారు. అందువలన పంచములు వీధుల్లో నడిచివెళ్ళేటప్పుడు 'అయ్యా పంచముడిని వస్తున్నాను (జాగ్రత్తపడండి!) అని విధిగా అరవాల్సి వుంది. ఏ కారణంచేతనైనా, అంటరానివాని పొరపాటు లేకపోయినా, అతడ్ని తగిలినందుకుగాను ఆ అంటరానివానిపైననే దాడిచేస్తారు. ఛండాలంగా తిడతారు. అన్ని పాయిఖానాలు – మురుగు కాలువలూ శుభ్రం చేసే పాకీపనివారైన అంటరానివారు, పేటల్లోని, అగ్రకులాలవారి యింటి వెనుక సందుల్లోని మురుగు కాలువలూ, పాయిఖానాలు శుభ్రం చేస్తూ, ఆ మురికి కాలువల వద్దే నుంచొని, 'అమ్మా పాకీవాణ్ణొచ్చాను, శుభ్రం చేశాను, ఒక రొట్టె పెట్టండి!' అని అడుక్కోవల్సిన దుస్థితి గురించి ముల్క్‌రాజ్ ఆనంద్, 'అంటరానివాడు' నవలలో వివరించాడు. అంతేకాక అగ్రవర్ణాలవారు తిండి తిన్నాక, కంచంలో మిగిల్చి పారవేయాల్సిన ఎంగిలి తినుబండారాలనే, తాము తెచ్చుకొని తమ కడుపులు నింపుకోవాల్సిన, అమానవ – అవమానకర పరిస్థితులను గురించి, ప్రత్యేకించి అంటరానితనంలో యిమిడి వున్న క్రూరత్వాన్ని గూర్చి, ఆ నవలలో ఆయన బట్టబయలు చేశారు.

హిందూ మతానికే చెందినవారుగా యీ అంటరానివారిని పరిగణిస్తున్నప్పటికీ, హిందూ సమాజం వీరికి ఆలయ ప్రవేశాన్ని ఏవిధంగా నిషేధించిందీ, పంచములు తమ తమ దేవాలయాలను ప్రత్యేకంగా కట్టుకోవల్సిన పరిస్థితిని గురించి కూడా పలువురు రచయితలు తెలియచేశారు.

1947కు పూర్వం, తోటి మానవులచేతనే అంటరానివారిగా పరిగణింపబడుతూ, నికృష్టమైనదుర్భర దారిద్ర్యంతో, కనీసం తిండికి కూడా లేని దుస్థితిలో, అణచబడిన పంచముల జీవన స్థితిగతులు యింతగా అమానవీయంగా దారుణంగా వుండేవి.

భారత సామాజిక వ్యవస్థలో గల యీ అంటరానితనానికి గల కారణంపై ఒక సాధారణమైన సామూహికమైన ఏకాభిప్రాయం వుంది. అది ఏమిటంటే : రెండవ శతాబ్ద ప్రారంభంలో (క్రీస్తు పూర్వం) భారతదేశంలోకి ప్రవేశించిన ఆర్యులు అనబడేవారితో వివిధ దేశీయ ప్రజాసమూహాలతో, భూమి యాజమాన్య (స్వంతదారీతనం) సంబంధమైన వివాదాలు, ఘర్షణల ఫలితంగా చాతుర్వర్ణ వ్యవస్థ రూపొందింది. దాని పర్యవసానమే అంటరానితనం.

బ్రాహ్మలకూ, బుద్ధిష్టులకు (బౌద్ధులకూ) మధ్య ఆధిపత్యం కోసం జరిగిన మహా పోరాటం తర్వాతనే అంటరానితనం బ్రాహ్మలు అవలంబించటం ప్రారంభమయిందని అంబేద్కర్ సిద్ధాంతీకరించాడు. బౌద్ధులపై తాము సాగించే సైద్ధాంతిక పోరాటంలో విజయం పొందటం కోసం బ్రాహ్మలు యజ్ఞాయాగాదుల్లో ఆవులను బలియివ్వటం మానివేసి, ఆవు మాంసాన్ని తినటం మానివేశారనీ, అప్పటినుండి ఆవుమాంసాన్ని తినేవారిపై అంటరానితనాన్ని విధించారన్నది అంబేద్కర్ వివరణ. ఈ అంటరానితనం క్రీస్తు అనంతరపు (ఎ.డి.) 400 సంవత్సరంలో పుట్టుకొచ్చిందన్నది ఆయన అభిప్రాయం.

ఈ 'అంటరానితనం' సమస్యను సమసమాజ స్థాపన అవగాహనతో విశ్లేషించిన ప్రముఖ విప్లవ నాయకుడు తరిమెల నాగిరెడ్డిగారి అభిప్రాయం ప్రకారం : "అంటరానితనం సమస్య గ్రామీణ ప్రాంతాలలోని భూమి సంబంధాల సమస్యతో ముడిపడి వుంది. ఇంత ఎత్తున ఇంత విస్తృతంగా సమస్య వుండటమన్నది ప్రధానంగా షెడ్యూలు కులాలవారి ఆర్థిక దుస్థితికి ప్రతిబింబం. అలాగే ఫ్యూడల్ ఆర్థిక సంబంధాలింకా బలంగా వున్న ఆర్థిక సమాజానికి ప్రతిబింబం." ('తాకట్టులో భారతదేశం' పేజీ. 405. నాలుగవ ముద్రణ : 2013).

మొత్తంగా చూసినపుడు యీ అంటరానితనం అన్నది, ఫ్యూడల్ భూసంబంధాలపై ఆధారపడి వున్న సామాజిక, ఆర్థికవ్యవస్థ యొక్క ప్రతిరూపంగా అర్థం చేసుకోవల్సివస్తోంది. ఆ కారణం చేతనే, యీ అంటరానితనం అన్నది సామాజిక న్యాయానికి సంబంధించిన సామాజిక అంశమేనని నొక్కి చెప్పిన అంబేద్కర్ సైతం, ఈ సమస్యకు పునాది ఆర్థికవ్యవస్థ అని గ్రహించబట్టే, 1950లలో, భారత కమ్యూనిస్టు పార్టీతో కలిసి, ప్రభుత్వ భూములను భూమిలేని పేద దళితులకు భూమిని పంచిపెట్టాలనే పోరాటాలలో పాల్గొన్నారు, వాటిని నిర్వహించారు.

1947, ఆగస్టు 15కు ముందుకాలంలో దళితులు ప్రధానంగా అంటరానితనం, దుర్భర పేదరికం, అగ్రకులాలవారి అణచివేత పీడన లాంటి సమస్యలతో తల్లడిల్లిపోయారు.

ఆగస్టు 15, 1947 'స్వాతంత్ర్యం' వచ్చిన నాటినుండీ నేటివరకూ సాగిన 75 సంవత్సరాల కాలంలో దళితుల జీవన స్థితిగతులలోనూ, సామాజిక న్యాయంలోనూ ఎటువంటి మార్పులు సంభవించాయి. వాటి స్వభావ, స్వరూపాలేమిటి అన్నది యిప్పుడు చూద్దాం!

ఆగస్టు 15, 1947 నాడు దేశానికి సంభవించిన 'స్వాతంత్ర్యం' అనంతరం ప్రజల్లో జాతీయస్ఫూర్తి దృఢపడింది. 'స్వాతంత్ర్యం' ప్రజల్లో ఆశావహత్వాన్ని తీసుకొచ్చింది. ప్రజలు తాము అనుభవిస్తున్న సమస్యలన్నీ పరిష్కరింపబడతాయని భావించారు. స్వాతంత్ర్యం తమకు స్వేచ్ఛను తెచ్చిందని భావించారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా, అధికారం కేంద్రీకరింపబడటం ద్వారా, ప్రజాసంక్షేమ పథకాల ద్వారా, విద్యావ్యాప్తి ద్వారా తమ జీవితాల్లో మౌలికమైన మార్పులు సంభవిస్తాయని ప్రజలు ఆశించారు. తమ హక్కులూ, అర్హతలు, స్వేచ్ఛలు ప్రజాస్వామ్య పాలనలో పరిరక్షింపబడతాయని భావించారు. ప్రజలందరికీ సమానమైన విలువ వుంటుందని భావించారు. 'స్వతంత్ర్య భారతదేశం' నవంబర్ 26, 1949న ఆమోదించిన 'నూతన రాజ్యాంగం' అంటరానితనాన్ని చట్టబద్ధంగా రద్దుచేయటంతో, దళితులు భారత సామాజికవ్యవస్థలో,

తామూ సమానులుగానే పరిగణింపబడతామనీ, తమ పట్ల ఎటువంటి కులవివక్షత అమలుజరపబడదని భావించారు.

భూమిలేని, ఏ సంపదాలేని దళితులు ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. వీరు కేవలం ఆర్థిక దోపిడీకేగాక, అనాదిగా వున్న సామాజిక కులవ్యవస్థ వల్ల కూడా సామాజిక పీడనకు గురవుతున్నారు. మనదేశపు వ్యవసాయ కార్మికులలో అత్యధిక భాగం అంటరాని కులాలకు చెందినవారే. ఈ కులాలపై అమలుచేయబడుతున్న సాంఘిక బహిష్కరణ పద్ధతులు, అమెరికాలోని నల్లజాతి నీగ్రోలపై తెల్లజాతివారి వైఖరికంటే దారుణంగా వున్నాయి. ఆగస్టు 15, 1947 స్వాతంత్ర్యానంతరం కూడా దేశంలోని సామాజిక, ఆర్థిక పరిపాలనారంగంలో ఎలాంటి మౌలికమైన మార్పులూ సాధించబడలేదు. అందువల్లనే భారత ఆర్థికవ్యవస్థ ప్రధానంగా అర్ధఫ్యూడల్ స్వభావంతోనే కొనసాగుతోంది. కొన్ని అంశాలలో రూపంలో కొంత మార్పు వున్నప్పటికీ కుల పద్ధతిలో మౌలికంగా మార్పు సంభవించలేదు. పంచాయితీరాజ్ వ్యవస్థా, సస్య విప్లవం అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాలలో సరుకుల ఉత్పత్తి విధానం అభివృద్ధి ఇవన్నీ కులవ్యవస్థపై ఆధారపడిన సనాతన పునరుద్ధరణవాద, ఛాందసవాద సామాజిక సిద్ధాంతాల అండదండలతో, బడా భూస్వాముల పెట్టుబడిదారీవర్గాల ప్రాబల్యం పెరగటానికే తోడ్పడ్డాయి. అందువలన గ్రామీణ ప్రాంతాలలో ఈ ఉన్నత శ్రేణికి (అగ్రవర్ణాలకు) చెందినవారి అధికారం పెరగటం వలన భారతదేశం స్వతంత్రం అయిన సమయంలో కంటే అనంతరకాలంలో కులవ్యవస్థ మరింత బలంగా రూపొందింది. పటిష్టవంతంగా తయారైంది. అందువల్లనే దేశంలో అంటరానితనం ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే వుంది. గ్రామీణ ప్రాంతాల్లో మోరటైన పద్ధతుల్లో యీ అంటరానితనం పాటింపబడుతూనే వుంటే, టౌన్లు, పట్టణాలలో కొంత ప్రచ్ఛన్నమైన సున్నితమైన పద్ధతుల్లో కొనసాగుతోంది. ఫ్యూడల్‌వ్యవస్థ యొక్క పట్టువలన ఈ అంటరానితనాన్ని మానివేయటానికి, త్యజించటానికి సమాజం సంసిద్ధంకావటంలేదు. సంపద (భూమి) స్వంతదారులైన అగ్రకులాలవారే గ్రామీణ ప్రాంతమంతా తమ పెత్తనాన్ని సాగిస్తున్నారు. తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. తమ పట్టుతో దళితులను శాశ్వతంగా బిగించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం, గ్రామీణ ప్రాంతాలలో గల ఈ ధనాఢ్య, బలాఢ్య ఫ్యూడల్ వర్గాల యీ ప్రయత్నాలకు మద్ధతునిచ్చే వ్యవస్థగా నెలకొల్పబడింది కానీ, అందుకు వ్యతిరేకంగా వుండే రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థను నెలకొల్పలేదు.

అయితే స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో విస్తరించిన రవాణావ్యవస్థ, నెలకొల్పబడుతున్న పారిశ్రామికరంగం కారణంగా, దళితులలో కొద్దిమంది ఈ రంగాలలో అట్టడుగు అధిక భౌతిక శ్రమ (సేవక శ్రమ) చేయాల్సిన యితరులు ఎవ్వరూ చేయటానికి సమ్మతించని స్వీపర్లు, ఫ్యూన్లు తోటమాలులు లాంటి పనుల్లోను, రైల్వేలు లాంటి సంస్థల్లో శ్రామికులు లాంటి ఉద్యోగాలలోనూ, ప్రభుత్వ ఆస్పత్రిలో తోటీలు, స్వీపర్లు, స్కావెంజర్లు, మంత్రసానులు లాంటి ఉద్యోగాలలో చేరటం జరిగింది. సైనిక, పోలీసు విభాగాలలో అట్టడుగుస్థాయి ఆర్డర్లీలలాంటి సేవలు చేసే ఉద్యోగాలలో దళితులు చేరారు. పంచాయితీలు, మున్సిపాల్టీలు, నగరపాలకసంస్థలల్లో పారిశుద్ధ్య కార్మికులుగానూ చేరారు. అంటరానితనపు అనేకమైన అవమానాలు, దూషణలూ, వివక్షతలను భరిస్తూనే క్రమంగా నిలదొక్కుకొని (ఆర్థికంగా) తమ సంతానానికి ప్రభుత్వం స్కూళ్ళ ద్వారా విద్యను గరిపించి, కనీస స్థాయి విద్యావంతులును చేశారు. ఐ.ఐ.టి. లాంటి ప్రాథమికస్థాయి పారిశ్రామిక విద్యాసంస్థలలో చదివించి, వారికి పరిశ్రమల్లో అట్టడుగు స్థాయి ఉద్యోగాలు పొందే అర్హతలను చేకూర్చారు.

పల్లెల్లో పనిచేసే వ్యావసాయక కూలీలైన దళితులలో కొందరు ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంక్షేమ హాస్టల్లో వుంచి తమ పిల్లలను చదివించి, సగటు విద్య గడించేటట్టు చేశారు. అందువలన ప్రభుత్వం ఏర్పాటుచేసిన రిజర్వేషన్ల ఫలితంగా కొందరు వివిధ ప్రభుత్వ సంస్థల్లో కార్యాలయాల్లో క్రిందిస్థాయి ఉద్యోగాలు సంపాదించారు. వివిధ దళిత పేటల్లో బస్తీల్లో ఏర్పాటు చేయబడ్డ దళిత పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయ (ప్రాథమిక) ఉద్యోగాలూ పొందగలిగారు.

ఈ పరిణామాలు దళితుల్లో చైతన్యం ఏర్పడటానికి కారణమయ్యాయి. క్రమక్రమంగా వారు గతంలోని అశుభ్ర, అనారోగ్యపు అలవాట్ల నుండి బయటపడ్డారు. చచ్చిన పశువుల మాంసాన్ని తినటం కూడా క్రమంగా మానివేశారు. తమ పేటల్లో పరిశుభ్రత వాతావరణం ఏర్పరుచుకొనేవైపు మళ్ళారు. ప్రభుత్వ పంచాయితీరాజ్ కల్పించిన అవకాశాలను వాడుకొని తమ పల్లెల్లో రోడ్లు వేసుకొన్నారు. తమ స్వంత చెరువులు, బావులు, గుళ్ళను నిర్మించుకొన్నారు. సాధ్యమైనంత మేరకు హుందాగా గౌరవప్రదంగా జీవించాలనే అవగాహనకు వచ్చారు. తమపై సాగే వివక్షత, అత్యాచారాలను నిరసించే చైతన్యాన్ని పొందారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయకూలీలు తమ కూలిరేట్లు పెంచాలన్న ఆందోళనలకు దిగారు. తామూ మానవులమేనని, ఎవరికీ లొంగి అవమానకరంగా జీవించమనే, తమ అస్థిత్వాన్ని నొక్కి ప్రకటించటం మొదలుపెట్టారు. ప్రభుత్వం అమలుజరిపిన అరాకొరా భూసంస్కరణల ద్వారా, తమకు లభించిన అరాకొరా భూములను సేద్యం చేసుకోవటం మొదలుపెట్టారు.

ఈ పరిణామాలను గ్రామీణ ప్రాంతపు భూస్వామ్య, బలాఢ్య, అగ్రవర్ణ పెత్తందారీ వర్గాలువారు, తమ పట్ల దళితులు చూపిస్తున్న తిరస్కారంగానూ, అమర్యాదగానూ భావించారు. వీరిని అలాగే వదిలిపెడితే, తమ ఆధిపత్యం, పెత్తనం, సమాజంపై గల పట్టును కోల్పోతామని భావించారు. అందువలననే వారు దళితులెవరైనా చదువుకొన్నా, మంచి బట్టలేసుకొన్నా, ప్రభుత్వ ఉద్యోగాలలో పనిచేస్తున్నా సహించలేకపోయారు. ఈ చిన్న చిన్న కారణాలనే సహించలేని గ్రామీణ ఫ్యూడల్ పెత్తందారీ అగ్రకులాలవారు వారిపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. వ్యవసాయ కూలీ పెంచమన్నందుకు వారిపై దౌర్జన్యం, దాడులు జరిపారు. భూసంబంధమైన వివాదాలు సృష్టించి (దళితుల స్వాధీనంలో వుండి, వారు సాగుచేసుకొంటున్న భూముల) దళితులపై దాడులకు పాల్పడి గ్రామాలకు గ్రామాలనే దహనం చేశారు. స్త్రీలు, వృద్ధులన్న విచక్షణ లేకుండా వారిపై క్రూరమైన హింసలు జరిపారు. స్త్రీలను లైంగికంగా వేధించి, వారిపై అమానుష అత్యాచారాలను జరపటమేగాక, ఆ మహిళలను సంహరించే రాక్షస ప్రవృత్తిని చూపించారు.

ఆఖరుకు తమ కులాచారం ప్రకారం వివాహ సందర్భంగా, వరుడు (దళిత) గుర్రంపై ఊరేగటం లాంటి సందర్భాలలో కూడా వారిపై భౌతికంగా దాడులు చేయటం సాగించారు.

ఇటువంటి సందర్భాలలో పాలనావ్యవస్థగానీ, పోలీసువ్యవస్థ గానీ, అగ్రకులాలవారి దురహంకారపూరిత దాడులకు గురవుతున్న బాధితుల రక్షణకు పూనుకోవటం బదులు, యీ దారుణాలు జరిపిన పెత్తందారీ వర్గాలవారికే మద్దతునిస్తూ, యిటువంటి సంఘటనల గురించి ఫిర్యాదు చేసిన బాధితులైన దళితులనే అక్రమ కేసుల్లో యిరికించే క్రమం చేబట్టింది. అతికష్టంమీద కోర్టుకు చేరిన దళితులపై హింస, దౌర్జన్యం కేసులు సైతం ఏళ్ళకు, ఏళ్ళు విచారణకు రాకుండా నేరస్థులను స్వేచ్ఛగా తిరగనియ్యటమైనా జరుగుతోంది. కీలవేన్మణి చుండూరు కేసుల్లో జరిగిన మాదిరి, అంటరానివారైన దళితుల గూడేల్లోకి, సవర్ణులైనవారు ప్రవేశించి వారిపై దాడులను, హింసను జరిపారంటే నమ్మశక్యంగా లేదన్న కారణంతోనో, తగు సాక్ష్యాలు లేవన్న కారణంతోనో దోషులైనవారిని, నేరస్థులైన అగ్రవర్ణ పెత్తందార్లను భేషరతుగా వదిలిపెట్టేయటమేనా జరుగుతోంది.

వ్యక్తులయిన దళితులపై హింస, దాడులు జరిపే స్థితి నుండి, సామూహికంగా దళితుల గ్రామాల, గూడేలపైన దాడులు జరిపి, వారి యిళ్ళకు నిప్పంటించి, ధ్వంసం చేసేవిధంగా, దళితులపై జరిగే హింస, దాడులు పరిణామం చెందాయి.

అంబేద్కర్ భావించినట్టుగా "ఒకే ఓటు ఒకే విలువ" అన్న రాజకీయ స్వాతంత్ర్యం అన్నది దళితులకు దక్కకుండా పోయింది. రిజర్వేషన్ల ఫలితంగా పంచాయితీ మెంబర్లుగానో, పంచాయితీ ప్రెసిడెంట్లుగానో దళితులు ఎన్నికైనా, గ్రామీణ ప్రాంతాల్లో అగ్రవర్ణాల పెత్తందార్లు కుర్చీలలో కూర్చొని, ఎన్నికైన దళిత సభ్యులను నేలపై కూర్చోపెట్టి, వారే పెత్తనం చలాయించటం అన్నది దేశంలోని గ్రామీణ ప్రాంతమంతటా ఒక సామాన్య విషయంగా తయారైంది. చట్టసభల్లో పార్లమెంటులో కొందరు దళితులు సభ్యులుగా ఎన్నికైనప్పటికీ, ఆ రకంగా ఎన్నిక కావటం అన్నది దళితవర్గాల సాధికారితగా చూపెట్ట బడుతున్నప్పటికీ, ఆయా సభల్లో మెజార్టీగా వున్న అగ్రవర్ణసభ్యులు పెత్తనం క్రిందనే, అగ్రవర్ణ ప్రాబల్యం క్రింద నడపబడుతున్న పాలకవర్గ పార్టీల నియంత్రణ క్రిందనే ఆ దళిత సభ్యులు అణిగిమణిగి పడివుండే స్థితిని మనం చూస్తూనే వున్నాం. మాటవరసకు మాత్రమే దళితులు నాయకత్వ స్థానాలలో వున్నా, వారు ఏ పదవిలో వున్నా కేవలం, అగ్రవర్ణ పాలకుల చేతిలో కీలుబొమ్మలుగానే పడివుంటున్న స్థితిని గమనిస్తూనే వున్నాం.

దేశంలో నిర్వహింపబడుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామిక పాలనా వ్యవస్థ, దేశంలోని కులవ్యవస్థను బలోపేతం చేయటానికే ఉపయోగపడింది కానీ, కుల నిర్మూలన వైపుకు అణుమాత్రంగా కూడా పయనించ లేకపోయింది. ఆ రకంగా దళితుల సాధికారిత అన్నది ఒక ప్రహసనంగా మారింది. ఈ పద్ధతి ద్వారా (పార్లమెంటరీ) ప్రభుత్వ అధికారానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బహుజన సమాజ్‌పార్టీ ప్రభుత్వం కూడా దళితుల జీవన స్థితిగతుల్లో ఎటువంటి ప్రధానమైన మెరుగైన మార్పులను తీసుకురాలేక పోయింది. హిందుత్వవాద వ్యతిరేక సిద్ధాంతాలపై ఆధారపడి, రాష్ట్ర ప్రభుత్వాధికారానికి వచ్చిన డి.ఎం.కె, ఎ.ఐ.డి.ఎం.కె. ప్రభుత్వాలూ దళితుల స్థితిగతుల్లో ఎటువంటి ప్రభావవంతమైన మార్పులు తీసుకురాలేకపోయాయి. కీలవేన్మణి, కంచికచర్ల, పెదఓగిరాల, చుండూరు, కారంచేడు, లక్ష్మింపేటలలో దళితులపై, స్వతంత్రానికి పూర్వకాలం జరిగినమాదిరే, స్వాతంత్ర్యానంతర కాలంలో కూడా దారుణ మారణకాండ, హింస నిరాఘాటంగా, ఎటువంటి అదుపూ లేకుండా అగ్రవర్ణ పెత్తందార్లు జరపటాన్ని మనం చూస్తూనే వున్నాం. ఉత్తరాది రాష్ట్రాలలో కూడా దళితులపట్ల జరిగిన అంతకుమించిన దారుణ ఘటనలు అనేకమయినవాటిని మనం గమనిస్తూనే వున్నాం.

ఈ క్రమంలోనే 1990వ దశకంలో పెట్టుబడిదారీ నయా ఉదారవాద విధానాలు సాకున సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ప్రవేశపెట్టబడ్డాయి. దళిత మేధావులుగా చలామణీ అయ్యే కొందరు మేధావులు యీ ప్రపంచీకరణ దళితుల అభివృద్ధికి అనేక అవకాశాలు కల్పిస్తుంది కనుక ప్రపంచీకరణ దళితులకు మేలు చేకూర్చుతుందని అభిప్రాయపడ్డారు. దళిత సమస్యలను విమర్శనాయుతంగా విశ్లేషించిన దళిత సాహిత్యకారులైన శరణ్‌కుమార్ లింబాలే లాంటివారు సైతం "ప్రపంచీకరణ వలన, ప్రపంచమంతటా జరిగే ప్రజాస్వామ్య ఆచరణల గురించీ, హక్కుల కోసం, హక్కులు పొందే అర్హతల గురించీ, చైతన్యాన్ని పొందుతున్నామనీ, ప్రపంచీకరణ ప్రజల హక్కులను, స్వేచ్ఛలను తగ్గించటానికి బదులు వాటిని పెంపొందిస్తున్నాయనీ" అభిప్రాయపడ్డారు.

అయితే అనుభవంలో (దళితుల) జరిగిన పరిణామాలు యీవిధంగా వున్నాయి : ప్రపంచీకరణ విధానాల వలన దేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముకగా వున్న వ్యవసాయరంగం తీవ్రమయిన సంక్షోభంలోకి నెట్టబడింది. ఫలితంగా వ్యవసాయ కూలీలుగా జీవనాధారం పొందుతున్న భారీ సంఖ్యలో వున్న గ్రామీణ భారతంలోని దళితులు, సుదూర ప్రాంతాలకు జీవనోపాధి వెతుక్కుంటూ రోజువారీ కూలీలుగా పొట్టచేత బట్టుకొని యితర రాష్ట్రాలకు వెళ్ళవలసి వచ్చింది. వారు నిర్మాణ రంగంలో అధిక శ్రమభారం వున్న కూలీలుగానూ, ప్రమాదకరమైన పనులు నిర్వహించే కూలీలు (దినసరి) గానూ పనిచేయవలసి వచ్చింది.

మరోవైపు ప్రపంచీకరణ పర్యవసానంగా, విదేశీ పెట్టుబడితో మనదేశంలో నెలకొల్పబడిన బహుళజాతి కంపెనీలలో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా ఎటువంటి హక్కులూ రక్షణ లేని కార్మికులుగా నియమించబడే అవకాశాలను పొందారు. బహుళజాతి ఆటో పరిశ్రమలోనూ, ఎగుమతికి ఉద్దేశింపబడిన దుస్తుల తయారీ పరిశ్రమల్లోనూ, భద్రతలేని ప్రమాదకరమైన రసాయన మందుల కంపెనీలలో క్యాజువల్ ఉద్యోగులుగా వీరికి అవకాశాలు లభించాయి. అసంఘటితరంగంలో ఎటువంటి సామాజిక భద్రతాలేని సెక్యూరిటీ గార్డు (కాపలాదారుల) లాంటి తక్కువస్థాయి ఉద్యోగాలలో చేరే అవకాశాలు లభించాయి. సేవా తదితర రంగాలలో అత్యధిక శ్రమ పడాల్సిన బరువు పనుల్లోనూ, పట్టణాల – నగరాల మున్సిపాలిటీలలో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులుగానూ వీరికి అవకాశాలు లభించాయి. బీహార్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాల నుండి పెద్దపెట్టున దళితులు ఉపాధికోల్పోయి

అంతర్రాష్ట్ర వలసలకు పోతున్నారు. అక్కడ ఎటువంటి సదుపాయాలూ లేని, మురికివాడల్లో దిక్కులేని అనాథలుగా బ్రతుకులీడుస్తున్నారు. ఈరకంగా ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల నుండి దళితులు అంతర్రాష్ట్ర వలస కూలీలుగా పయనమైపోవటానికి మరొక ప్రధాన కారణం కూడా వుంది. తమ తమ ప్రాంతాలలో తమపై అగ్రవర్ణ పెత్తందారీశక్తులు అనుక్షణం జరిపే అంటరానితనం, హింస, అత్యాచారాలు, పీడన, భౌతికదాడులు, అవమానాల నుండి తప్పించుకోవటం కోసం కూడా యీ దళితులు అంతర్రాష్ట్ర వలసలకు పోతున్నారన్నది ఒక తిరుగులేని సామాజిక వాస్తవంగా వుంది. ఈ రకంగా ప్రపంచీకరణ వలన దళితులకు లభించిన అవకాశాల యొక్క నాణ్యత, గ్రామీణప్రాంత వ్యవసాయ కూలీల జీవన, పని నాణ్యతకన్నా నాసిరకంగానే వుంది. అంతేకాదు ఈనాడు మనం ప్రతిరోజూ నిర్మాణరంగంలోనూ, వివిధ పారిశ్రామిక సంస్థల్లోనూ, మున్సిపాల్టీలలోనూ ప్రమాదాలు జరగటం, వాటిల్లో కార్మికులు మరణించటం లేదా అంగవికలురవ్వటం చూస్తూనే వున్నాం. అలా ప్రమాదాలపాలయి మరణించే, శాశ్వత అంగవికలురయ్యే, అనారోగ్యం పాలుబడే కార్మికులందరూ అంతర్రాష్ట్ర వలసలకు వచ్చిన దినసరికూలీలు, క్యాజువల్, కాంట్రాక్టు కార్మికులే కావటం అన్నది ప్రధానంగా మనం గమనించాల్సిన అంశం. ప్రపంచీకరణ విధానాలు, కార్మికుల భద్రతను, బాధ్యతను యజమానులు పట్టించుకోనవసరం లేకుండా చేశాయి. అందువలన యీ పనిప్రదేశ, పారిశ్రామిక ప్రమాదాలకు గురయి మరణించేవారిలో, బాధితులవుతున్న వారిలో దళితులే చాలా ఎక్కువమంది కావటం అన్నది కూడా గమనార్హమైన అంశం. ఇదేవిధంగా వ్యవసాయరంగంలో కూలీలుగా పనిచేస్తూ, రసాయనిక మందులు జల్లే పనిలో విష రసాయనాల వాతబడీ, ప్రవేశపెట్టబడిన వ్యావసాయిక యంత్రాలలో చిక్కుకొనీ, ఆటోల్లోనూ – ట్రాక్టర్లలోనూ వ్యవసాయ కూలిపనులకు వెళ్తున్న సందర్భాలలోనూ ప్రమాదాలలో మరణించే, అనారోగ్యవంతులయ్యేవారిలో ఎక్కువమంది దళిత కులాలకు చెందిన వ్యవసాయకూలీలే అన్నది కూడా గమనార్హమైన అంశమే.

ప్రపంచీకరణ – ప్రైవేటీకరణ విధానాల అమలు ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య దారుణంగా కుదించబడటమేగాక, ఉద్యోగాల నాణ్యత కూడా తగ్గించబడటంతో, దళితులకు కల్పించబడిన రిజర్వేషన్ సౌకర్యం కూడా గణనీయమైన సంఖ్యలో దళితులకు ఉపయోగంలోకి రాకుండా పోయింది. 44% ప్రభుత్వోద్యోగాలు టెంపరరీ ఉద్యోగాలుగా మారటంతో, ఆ ఉద్యోగాల నాణ్యత కూడా తగ్గిపోయింది.

విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవులు అందుబాటులోకి రావటంతో ఈ అవకాశాలనుపయోగించుకొని కొందరు దళితులు తమ ఆర్థిక స్థితిని అభివృద్ధి చేసుకొన్నారు. వారు భూమి, ఇళ్ళు లాంటి తదితర ఆస్తులను కొనుక్కోగలిగారు. కొందరు స్థానిక రాష్ట్ర, కేంద్ర రాజకీయ, పాలనావ్యవస్థల్లో ఉన్నత పదవులస్థాయికి చేరుకొన్నారు. ఆ రకంగా దళితుల్లో చిన్న ఉన్నతస్థాయి వర్గం పుట్టుకువచ్చింది. ఇలా మధ్యంతర దొంతరగా పుట్టుకువచ్చిన దళిత ఉన్నతవర్గానికి చెందినవారు నూతన సాంకేతికతకు అనుగుణంగా మారుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో సవర్ణులు – దళితులు కలిసి వుండే నివాస ప్రాంతాలు చాలా అరుదుగా వున్నా, అటువంటి సమ్మిళిత (దళితులు – సవర్ణులు ఒకేచోట నివసించే) నివాస ప్రాంతాలు యిప్పుడు ఉనికిలోకి వస్తున్నాయి. అయినప్పటికీ ఉన్నతస్థానంలో వున్న అధికారులుగా వున్న దళితులూ, కోటీశ్వరులైన దళితులు సైతం కులవివక్షతకు గురవుతూనే వున్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో అత్యున్నత విద్యనభ్యసిస్తున్న దళిత విద్యార్థులు సైతం కులవివక్షత, కుల అణచివేతలకు గురవుతున్నారు. రోహిత్ వేముల లాంటివారి అనేక ఘటనలు యీ విషయాన్నే సూచిస్తున్నాయి. మరోవైపు ఉన్నతవర్గంగా పుట్టుకొచ్చిన దళిత ఉన్నతవర్గాలవారిని, దోపిడీ పాలకవర్గాలు – సామ్రాజ్యవాదానికి ఊడిగం చేస్తున్న బడా పారిశ్రామిక పెట్టుబడిదారులు, గ్రామీణ అగ్రవర్ణ భూస్వామ్య శక్తులూ – తమతో సహకరించేవారిగా దళితులను కలుపుకొనే (కోఆప్ట్ చేసుకొనే) ఏజెంట్లుగా తయారు చేసుకొంటున్నాయి.

నేటికీ గ్రామీణ ప్రాంతాలలో భూమిలో 55%లో పదిశాతం జనాభా గల అగ్రకులాలవారి చేతిలోనే వుండటం వలన, గ్రామీణ దళితులకు నామమాత్రంగా భూమి వుండటం వలన, ప్రధానంగా భూ సమస్యకు సంబంధించిన వివాదాల రూపంలో, దళితులపై హింసా, దౌర్జన్యం, దాడులు, సామూహిక అత్యాచారాలు, పీడనా సాగుతూనే వున్నాయి. అంటరానితనం గతంలోకన్నా ఎక్కువగా సాగుతోంది. దళితులు మత అస్తిత్వాన్నీ హక్కులను బలంగా ప్రకటించుకోవటం దేశ ద్రోహంగా కూడా పరిగణించబడి వారిపై తీవ్రమయిన నిర్బంధం విధించబడుతోంది. ఇందుకు ఉదాహరణ భీమా–కోరేగావ్ సంస్మరణను నిర్వహించినవారిపై ప్రభుత్వం విధించిన తీవ్రమయిన నిర్బంధం, ఎటువంటి విచారణ లేకుండా జైలుపాలు చేయటం, స్టాన్‌స్వామి లాంటి హక్కుల కార్యకర్తలను సౌకర్యాలు కల్పించకుండా (జైలులో) దారుణ మరణానికి గురిచేయటం.

ఈనాడు మున్నెన్నడూ లేనంతగా దేశమంతటా దళితులపై హింసా దౌర్జన్యాలు, దాడులూ సాగుతున్నాయి. అంటరానితనం పాటింప బడుతోంది. కులవివక్షత పాటింపబడుతోంది. అగ్రకులాల – అభివృద్ధి నిరోధకశక్తుల దుర్మార్గాలు, దారుణాలు పెచ్చరిల్లిపోతున్నాయి. పాలనా వ్యవస్థ మద్దతుతోనే ఎటువంటి అదుపూ లేకుండా పేట్రేగిపోతున్నాయి.

ప్రపంచమంతటా జరుగుతున్న మాదిరిగానే, మనదేశంలో కూడా మితవాద, అభివృద్ధి నిరోధక, అగ్రకుల దురహంకార, హిందూత్వవాద శక్తులు ప్రజ్వరిల్లుతున్నాయి. ఇది సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పర్యవసానంగా సంభవించిన పరిణామమే. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలతోపాటు, ప్రపంచమంతటా యీ ఫాసిస్టు శక్తులు పునరుజ్జీవిస్తూ బలోపేతమవుతున్నాయి. సామ్రాజ్యవాద దోపిడీ, అణచివేతలు పెరిగిపోతున్నాయి. మనదేశంలో సంభవిస్తున్న యీ పరిణామాలను కూడా యిందులోని భాగంగానే చూడాల్సి వుంది.

పరిశీలిస్తే అంటరానితనాన్ని కులవివక్షతను పాటించి, అవలంబించటం ద్వారా అగ్రకుల ఫ్యూడల్ శక్తులు దళితులను మానసికంగా చంపి, వారు ఎదురుతిరగకుండా శాశ్వతంగా వారిని తమ దాసులుగానూ, బానిసలుగా చేసే వ్యూహాన్ని పాటిస్తున్నాయని అర్థమవుతోంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ద్వారా దళితులలో హక్కుల అర్హతల చైతన్యం ఏమేరకు వచ్చిందో అంచనాకు రావటంలేదుకానీ, అది దళితుల్లో కల్పించిన అపసవ్య విరుద్ధ (నెగెటివ్) చైతన్యం మాత్రం ప్రస్ఫుటంగా కన్పడుతోంది. దళితుల సమస్య తక్షణమే, యితర సమస్యల పరిష్కారంతో నిమిత్తం లేకుండా, కేవలం తమ సమస్యే పరిష్కారం కావాలనీ, అది కూడా ప్రస్తుతం దేశంలో నెలకొనివున్న రాజకీయ, సామాజిక, ఆర్థికవ్యవస్థ పరిధిలో, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిధిలో పరిష్కారం కావాలనే – తమ వలె దోపిడీకి, పీడనకు, నిర్బంధానికి వివక్షతకూ గురయ్యే యితర సామాజిక సెక్షన్ల ప్రజలతో ఐక్యంగా పోరాడితే తప్ప తమ సమస్య పరిష్కారం కాదన్న స్పష్టమయిన అవగాహన కల్పించని – అపసవ్య విరుద్ధ చైతన్యాన్ని మాత్రమే ప్రపంచీకరణ అందించిందనీ, అదే ప్రపంచీకరణ భావజాలం అందించిన చైతన్యమనీ, అనుభవంలో అర్థమవుతోంది.

ప్రపంచీకరణ కారణంగా అభివృద్ధిచెందిన సాంకేతికత ఆధారంతో, అహారాన్ని సరఫరా చేసే సంస్థలైన స్విగ్గీలాంటి సంస్థలు, దళితుల ద్వారా ఆహారాన్ని (వంటకాలను) అందిస్తే తాము ముట్టుకోము, బహిష్కరిస్తామని అగ్రకులాలవారు ప్రకటించటాన్ని బట్టి చూస్తే, అంటరానితన భావం యీ అధునాతన 21వ శతాబ్దిలో ఎంతగా వేళ్ళూనుకొందో అర్థం చేసుకోవచ్చు.

మొత్తంగా చూసినపుడు ఈ డెబ్బై ఐదు సంవత్సరాల దేశ స్వాతంత్ర్యం దళితుల జీవన స్థితిగతులలో ఎటువంటి మౌలికమయిన, గణనీయమైన మార్పు తీసుకురాకపోగా, దళితుల సమస్యలను – అంటరానితన నిర్మూలన, కులవివక్షత, కుల అణచివేత సమస్యలను మరింతగా క్లిష్టతరం చేసిందని అనుభవంలో రుజువయింది.

ఇటీవలనే 350 మంది దళితులు, 'నాణేల యాత్ర'ను ఆగస్టు 7న ప్రారంభించి, ఆగస్టు 8న ఢిల్లీలో ముగించతలపెట్టారు. వారు ఒక లారీ నిండా 20 లక్షల రూపాయి నాణేలను, మరొక ట్రక్కునిండా ఒకవైపు అంబేద్కర్ మరోవైపు బుద్ధుడి బొమ్మ ముద్రించిన, యిత్తడి నాణేలతో యీ యాత్ర ప్రారంభించారు. ఆగస్టు 8న ఢిల్లీ నగరంలో ఆ యాత్రను ఆపి, ఆ నాణేలను కొత్తగా నిర్మించే పార్లమెంటు కాంప్లెక్సు భవనానికి విరాళాలుగా యిచ్చి, ప్రభుత్వం నుండి కనీసం 25 సంవత్సరాలలో, రాబోయే 100వ స్వాతంత్ర దినోత్సవం నాటికైనా అంటరానితనపు ముప్పును నిర్మూలిస్తామన్న వాగ్దానాన్ని పొందుదా మనుకొన్నారు. కానీ 7వ తేదీ రాత్రి హరియానా సరిహద్దుల్లో పోలీసులు పెద్దఎత్తున మోహరించి, భారీ వాహనాలతో చుట్టుముట్టి, అవసరమైతే వారిపై టియర్ గ్యాస్ ఉపయోగించటానికి సంసిద్ధంగా వచ్చి ఆ దళితుల యాత్రను అడ్డుకొన్నారు. వారి యాత్రను ముందుకు సాగటానికి అంగీకరించటల్లేదని, హోంశాఖ యిచ్చిన లేఖను చూపిస్తూ షహజాన్‌పూర్ వద్ద వారిని అడ్డుకొన్నారు. దాంతో ఆ దళిత కార్యకర్తలు వెనుకకు వెళ్ళిపోయారు. వారు తమ నాణేల లారీలపై అంబేద్కర్ భారత రాజ్యాంగాల విగ్రహాలను పెట్టారు. అయినా పాలకులు వారిని పట్టించుకోలేదు. వారి యాత్రను సాగకుండా అడ్డుకొన్నారు.

ఆ సందర్భంగా, ఆ దళిత కార్యకర్తలు వేసిన ప్రశ్నలను బట్టే, ఈ 75 సంవత్సరాల 'స్వతంత్ర' భారతదేశంలో దళితులకు ఒనగూరిన దేమిటో స్పష్టంగా అర్థమవుతుంది. వారు సంధించిన ప్రశ్నలు యివే.

1. దళితులపై హింస పెరుగుతూపోతూ వుంటే యిదేమి స్వాతంత్ర్యం?

2. దళితులపై సాగే యీ హింస తగ్గిపోతుందన్న సూచనలేమీ కనబడనపుడు, యిదేమి అభివృద్ధి?

# ఇంద్రకుమార్ మేఘ్వాల్ మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలి!

– జనసాహితి

**భారతదేశం** అభివృద్ధిపథంలో తారాజువ్వలా దూసుకుపోతూందని, 'ఒకే' దేశం, 'ఒకే' ప్రజలుగా జీవించాలని మోసకారి మాటలతో పాలకులు ప్రజలను వంచిస్తున్నారని రాజస్థాన్‌లో జరిగిన ఇంద్రకుమార్ మేఘ్వాల్ అనే దళిత విద్యార్థి మృతి తేటతెల్లం చేసింది. తొమ్మిదేళ్ళ బాలుడు దాహం తీర్చుకోవటానికి కుండలోని మంచినీళ్ళు తాగినందుకు "భారతీయులందరూ నా సహోదరులు" అని రోజూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించే ఉపాధ్యాయుడి చేతిలో తన్నులు తిని 23 రోజులపాటు బ్రతకటానికి ప్రయత్నం చేసి 'పాడులోకపు నికృష్ట వీధుల్లోబడి' వెళ్ళిపోయాడు. రాజస్థాన్‌లోని జిలోర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సైలా తాలూకా సూరానా గ్రామంలోని సరస్వతీ విద్యాలయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇటువంటి సంఘటనలు దళితులపట్ల వివక్షా, అణచివేతలు రూపుమాపలేదని అవి రూపం మార్చుకుని వెంటాడుతున్నాయని అర్థమయ్యేట్లు చేస్తున్నాయి. వెలివాడల సంస్కృతి సభ్య సమాజాన్ని వెక్కిరిస్తోంది. దళితుల ప్రాణం విలువ ఒక గ్లాసుడు మంచినీళ్ళు, ఒక మామిడికాయ, చిన్న సంతోషాలు. కీలవేన్మణి నుండి కంచికచర్ల కోటేశు, కొండమ్మల మీదుగా ఎన్ని దుర్మార్గాలను, అవమానాలను ఈ దేశంలోని దళితులు భరిస్తున్నారో. పొరపాటున చేయి తగిలితే చుండూరు, కూలి అడిగితే కారంచేడు, తన భూమిలో తన పంటను కోసుకున్నా లక్ష్మింపేటలు నరమేధాలవుతున్నాయి. దళితుల మీద పెరుగుతున్న అత్యాచారాల, అణచివేతల లెక్కలు సమాజపు అసమానతల స్వరూపాన్ని నగ్నంగా వెల్లడి చేస్తున్నాయి. దళితులపై రోజురోజుకీ పెరుగుతున్న దాడులూ, హత్యలు, అత్యాచారాలను, అణచివేత, వివక్షలను ఖండిస్తున్నాం! కులవివక్షనూ, అణచివేతలనూ పెంచి పోషిస్తున్న విధానాలపై పోరాడుదాం!!

ఇంద్రకుమార్ మేఘ్వాల్ మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని జనసాహితి డిమాండ్ చేస్తోంది.


## పుస్తక పరిచయం

# 'స్వీయచరిత్రలు వలసకాలపు ఆంధ్ర సమాజం'

– రవి

**అమెరికాలోని** విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలోని ఆసియా భాషాసంస్కృతుల శాఖలో ఆచార్య వెల్చేరు నారాయణరావుగారి పర్యవేక్షణలో పిహెచ్‌డి పట్టా కోసం వకుళాభరణం రాజగోపాల్ 2004లో ఆంగ్లంలో సమర్పించిన సిద్ధాంత వ్యాసాన్ని డాక్టర్ దుర్గెంపూడి చంద్రశేఖరరెడ్డి తెలుగులోకి అనువదించగా, 'స్వీయచరిత్రలు : వలసకాలపు ఆంధ్రసమాజం' పేరున 'ఎమెస్కో' వారు ప్రచురించారు.

బ్రిటిష్ వలసకాలం నాటి ఆంధ్రా ప్రాంతంలో కొందరి ఆత్మకథలను పరిశోధించి 'పాత కొత్తల మధ్య, సాంప్రదాయం ఆధునికతల మధ్య, ప్రాచ్యం పాశ్చాత్యాల మధ్య, దేశీయ ఆలోచనలు, వలసభావజాలం మధ్య వున్న పరస్పర ఘర్షణను ప్రతిబింబించి ఎత్తిచూపే విశ్లేషణను ఆయన ఈ పత్రాలలో చేపట్టారు.




వలస పాలకులు మనదేశం వచ్చేనాటికి దేశం భిన్నరాజ్యాలు, సంస్థానాలుగా విడివడి వుంది. యుద్ధాలు, రాజీలు జరిగి పై స్థాయిలో రాజులు, సంస్థానాధీశులు మారినా ప్రజల జీవితాలలో పెద్ద మార్పులేమీ లేకుండా 'నిలువనీరు' లాగా స్వయంపోషక గ్రామీణ ఆర్థికవ్యవస్థ గిడసబారిపోయి వుంది.

దేశ ప్రజల కష్టార్జితాన్నీ, దేశంలో వనరులనూ దోచుకునేందుకు పోటీపడిన వివిధ వలస దేశాలలో, చివరికి బ్రిటిష్ వలసవాదులు పైచేయి సాధించారు. కుట్రపూరితంగా 1757 ప్లాసీ యుద్ధంలో విజయం సాధించిన నాటినుండి వివిధ రూపాలలో దేశంలోని అనేక ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకుంటూ, ఈస్ట్ఇండియా కంపెనీ పాలన నెరుపుతూ వచ్చారు. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని అణచివేసి దేశంలో తమ పాలనను స్థిరపరచుకున్నారు.

దేశాన్ని, దేశంలో వనరులను దోచుకెళ్ళటమే వారి ప్రధాన ఉద్దేశ్యమైనప్పటికీ, వారి ద్వారా దేశంలో ప్రవేశించిన ఆధునిక భావాలు, వ్యవసాయంలో తెచ్చిన మార్పులు, విద్యాలయాల స్థాపన, ముద్రణా, రవాణా సౌకర్యాలు మొదలైనవన్నీ క్రమంగా ప్రజల ఆలోచనలపై, భావాలపై ప్రభావం చూపాయి. వలస పాలకులు వారి అవసరాల కోసమే అయినా విద్యాలయాలను స్థాపించటం, కొందరికి ఉద్యోగాలు కల్పించటం వంటి వాటిని సమాజంలో అప్పటికే ఉన్నత శ్రేణిలోనున్న బ్రాహ్మణవర్గం అధికంగా వినియోగించుకుంది. వారికి విధేయంగా వుంటూ అనేకమంది ఉన్నతస్థానాలలోకి ఎగబాకారు కూడా.

పురావస్తు తవ్వకాలలో లభించే శిల్పాలు, చెక్కడాలు, వంటపాత్రలు, ఇటుకలు మొదలైన అంశాలు కూడా చరిత్ర రచనకు తోడ్పడతాయని డిడి కొశాంబి పేర్కొంటాడు. అలాగే చరిత్ర పేరిట నమోదు చేయనప్పటికీ పురాణాలు, జానపదాలు, కాల్పనిక సాహిత్యం వంటివాటిని శాస్త్రీయంగా అధ్యయనం చేయటం ద్వారా ఆనాటి సమాజాలలో మానవ సంబంధాలను ఆయన సూత్రీకరించాడు.

వకుళాభరణం రాజగోపాల్ వలసకాలపు ఆంధ్ర సమాజంలో ఎంపిక చేసుకొన్న కొందరి స్వీయ చరిత్రలను బేరీజు వేస్తూ పరిశోధనాత్మక అధ్యయనం సాగించి, గతకాలపు ఫ్యూడల్ సమాజాలనాటి 'నిలువనీటి' స్థితి నుండి ప్రజల లేదా ఆయా విభాగాల వారి ఆలోచనల్లో వచ్చిన మార్పులను నమోదు చేశారు.

వెన్నెలకంటి సుబ్బారావు, ఏనుగుల వీరాసామయ్యలు రచించిన ఆత్మకథలను 19వ శతాబ్దిలో తెలుగు మేధావుల ఆత్మకథా రచనలకు తొలి ఉదాహరణలుగా పేర్కొంటూ రాజగోపాల్ వాటిని విశ్లేషించారు.

ఒంగోలుజిల్లా వంగరలో 1784లో నియోగి బ్రాహ్మణ కుటుంబంలో వెన్నెలకంటి సుబ్బారావు జన్మించారు. అప్పటికే సుబ్బారావు తండ్రి జోగన్న కంపెనీ ప్రభుత్వంలో చిన్న పని సంపాదించాడు. చిన్న వయస్సులోనే తన తండ్రి చనిపోవటంతో సుబ్బారావు కూడా తండ్రి మార్గాన్ని ఎంచుకున్నాడు. లెక్కలు రాయటం, లేఖలు రాయటం వంటి ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యం అలవర్చుకున్నాడు. ఉద్యోగావకాశాల కోసం ఆంగ్లభాష నేర్చుకోవాలనే ఆకాంక్ష భారతీయుల్లో వేగంగా పెరుగుతూ వచ్చింది. మొదట నెలకు ఒక మద్రాసు పగోడా

(సుమారు నాలుగు రూపాయలు)తో ఉద్యోగం ప్రారంభించి 1829లో పదవీ విరమణ నాటికి ఎనభై పగోడాల జీతం పొందే స్థాయికి ఎదిగాడు. తమ కులస్థులను, బంధువులను అనేకమందిని కంపెనీ ప్రభుత్వ ఉద్యోగాలలో చేర్చాడు. 'సామర్థ్యం, విశ్వసనీయతతో పాటు పై అధికారులపట్ల విధేయత, గౌరవభావాలను సమృద్ధిగా' కలిగి వుండటంతో ఇది సాధ్యమైంది.

ఈ కాలంలో జరిగిన మరొక పరిణామం కంపెనీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూమిశిస్తు నిర్ణాయక పద్ధతి రైతులకు, భూస్వాములకు భారంగా పరిణమించటంతో రైతులు పన్నులు చెల్లించలేకపోయేవారు. అలా వేలానికి వచ్చిన భూములను సుబ్బారావు కొనుగోలు చేశాడు. భూములు కొని బంధువులకివ్వటం, విపరీత ధనవ్యయం అలవాట్లతో ఏమీ మిగుల్చుకోలేకపోయాడు.

సుబ్బారావు తన 55 ఏళ్ళ జీవితంలో నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు. ముగ్గురు భార్యలు అతనికంటే ముందే చనిపోయారు. సుబ్బారావు కాశీయాత్రకు వెళ్ళిరావటానికి 13 నెలల సమయం పట్టింది. సాధారణ కుటుంబం నుండి అతి కింది స్థాయిలో ఉద్యోగంలో ప్రవేశించి సుబ్బారావు సదర్ అదాలత్‌లో దుబాసీగా విజయవంతమైన ఉద్యోగ జీవితం గడిపాననే భావనే ఆయనను ఆత్మకథ రాయటానికి ప్రేరేపించి వుంటుంది.

సుబ్బారావు సమకాలీనుడైన ఏనుగుల వీరస్వామయ్య (1780–1836) మద్రాసు నగరంలో పెరిగాడు. అక్కడి సుప్రీంకోర్టులో ప్రధాన దుబాసీగా పనిచేశాడు. ఈయన రాసిన కాశీయాత్ర చరిత్ర వంటి రచనను గత శతాబ్దాలలో కాశీయాత్ర చేసినవారెవరూ రాయలేదు. కాగితమూ, ముద్రణా అందుబాటులోకి రావటంతోపాటు చదవగలిగిన వారి సంఖ్య పెరగటం కూడా దీనికి కారణం. వీరస్వామయ్య తెలుగు పుస్తకం అచ్చుకాకమునుపే తమిళ అనువాదం అచ్చయింది. మరాఠీలోకి అనువాదమైంది.

19వ శతాబ్దం ప్రారంభానికి క్రైస్తవం భారతదేశంలో పెద్దఎత్తున ప్రవేశించింది. యూరోపియన్ యూనియన్ వలసవాద ప్రోత్సాహం సమాజంలో వేళ్ళూనుకొని వున్న వర్ణవ్యవస్థ నేపథ్యంలో మతమార్పిడులు విస్తృతంగా జరిగాయి. విభిన్న మతాలవారు ముఖాముఖి ఒకరితో ఒకరు తలపడ్డారు. వీరస్వామయ్య తన కాశీయాత్రా క్రమంలో బ్రాహ్మణుల నియమాలలోనే వివిధ తేడాలను గమనించాడు. 'జాతి కేంద్ర వాదాన్ని వ్యతిరేకిస్తూ, తమ ఆచారాలకు భిన్నమైనందువల్ల ఇతర ప్రాంతాల ప్రజలను తప్పుపట్టకూడ'దంటాడు. అందరినీ సృష్టించే దేవుడొక్కడే కాబట్టి మనం ఇతరులపట్ల స్పృహతో ఉండాలి, వారిని అంగీకరించాలని' ఆయన ప్రకటించాడు. అయినా, హిందూమత విశ్వాసాల వ్యవస్థనే ఆయన బలంగా సమర్థిస్తూ వచ్చాడు. భర్తను, కుటుంబాన్ని సేవించి తరించటమే స్త్రీల జన్మ లక్ష్యమనే భావం కలిగి వుంటాడు. 'హిందువులు చేసిన తప్పులకు గాను ఈశ్వరుడు వారిని ముస్లిం పాలనతో శిక్షించాడు. ఆ తర్వాత హిందువులను క్షమించి వారికి ఇంగ్లీషు పాలనను ప్రసాదించాడ'ని వీరాస్వామయ్య సూత్రీకరించాడు.

బ్రిటిష్ అనుకూల వైఖరితోనున్న వీరస్వామయ్య, హిందూ జాతీయ దృక్పథమనదగిన దాన్ని వ్యక్తీకరించాడని రాజగోపాల్ అభిప్రాయపడ్డారు.

ప్రముఖ ఆధునిక సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం (1848–1919) ఆత్మకథ స్వీయచరిత్ర, తరువాతి కాలపు ఆత్మకథలకు ఆదర్శంగా నిలిచింది. సాహిత్యాన్ని ఆయన సంఘసంస్కరణ కార్యకలాపాలకు సాధనంగా వినియోగించాడు. వితంతు వివాహాలు చేశాడు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడాడు. వీరేశలింగం తన ఆత్మకథను అంతకు ముందు ఎవరూ చేయని విధంగా తన భార్యకు అంకితమిచ్చాడు – తన ఆత్మకథలో పలుచోట్ల ఆమె తోడ్పాటును ప్రశంసించాడు.

బ్రాహ్మణ వంశంలో పుట్టిన వీరేశలింగానికి, ఆంగ్ల పాఠశాలలో చేరిన తర్వాత భూతపిశాచాలు, జ్యోతిష్యం వంటివాటిపై విశ్వాసం సడలింది – 'వివేకవర్ధిని' పత్రిక ద్వారా క్రియాశీల రచనలు చేశాడు – వితంతు వివాహాలను నిర్వహించాడు – దీనికి హాజరైనవాళ్ళలో అనేకమంది ప్రాయశ్చిత్తం చేసుకునేవారు. వితంతువివాహాలు భారీ పోలీసు రక్షణలో జరిగేవి. ఈ విధులకు కొన్నిసార్లు క్రైస్తవ, ముస్లిము పోలీసు సిబ్బందిని నియమించేవారు. మధ్యతరగతి ప్రజల్లో కొందరు మౌనంగానే ఈ సంస్కరణను సమర్థించారు. వీరేశలింగం అభిప్రాయంలో కేవలం నూరేళ్ళ ఆంగ్లేయులపాలన – భారతీయులకు ఆధునిక సాంకేతిక ప్రయోజనాలను, చట్టబద్ధమైన పాలనను అందించింది; ఆస్తికీ ప్రాణానికీ రక్షణ కల్పించింది; సమానత్వానికి పూచీ తీసుకుంది; సాంఘిక రంగంలో గతకాలపు మూఢభావాలను ఎదిరిస్తూ, ఏటికి ఎదురీదుతూ మహిళాభ్యున్నతికోసం సంస్కరణలను సాగించినప్పటికీ, పాలకులపట్ల ఆయన విధేయ దృక్పథాన్నే ప్రదర్శించాడు. అయినప్పటికీ, వీరేశలింగం సంస్కరణ వారసత్వం సాహిత్యంలోనూ కొనసాగింది.

అలాగే విజయనగరం జమిందారీకి చెందిన హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు (1864–1945) 'నా ఎరుక' ఆత్మకథను సుప్రసిద్ధ సాంప్రదాయ కవి చెళ్ళపిళ్ళ వెంకటకవి (1870–1950) ఆత్మకథలను రాజగోపాల్ విశ్లేషించారు.

ఆదిభట్ల నారాయణదాసు తన ఆత్మకథ రచించిన కాలంలో వలసపాలన ప్రభావం ఆయన ప్రాంతంలో జన జీవితంలో ఇంకా పూర్తిగా వేళ్ళూనుకోలేదు. అజ్జాడ గ్రామంలో ఆదిభట్ల వంశంవారికి అగ్రహారం నుండి ఏడాదికి 500 రూ॥ ఆదాయం వచ్చేది. నారాయణదాసు బాల్యంలో వలస ప్రభుత్వ విధానాలవల్ల సంభవించిన మార్పులతో కుటుంబ ఆర్థిక పరిస్థితులు చెడిపోయాయి. దీనితో విజయనగరం వలస వెళ్ళి అన్నగారి ఇంట వుండి పాఠశాల విద్యనభ్యసించాడు.

19 సం॥ల వయస్సులో ఒక హరికథను గమనించటం ద్వారా కేవలం పాడటం, ఉపన్యాసాలివ్వటంకన్నా సంగీత, సాహిత్యాలు ఒక్కచోటే ప్రదర్శించటం ద్వారా ప్రజలను బాగా రంజింపచేయవచ్చునని గ్రహించాడు. హరికథను జీవిత లక్ష్యంగా ఎంచుకున్నాడు. వేశ్యాసంపర్కం, దుర్వ్యసనాలకు లోనయ్యానని నిజాయితీగా ఆయన తన ఆత్మకథలో చెప్పుకున్నాడు. వలసపాలనలో పెరుగుతున్న పట్టణాలలో, సంప్రదాయ కళాకారులు తమ ప్రదర్శనలకు టిక్కెట్లు అమ్మడం రూపంలో కళల వ్యాపారీకరణ ప్రారంభమైంది. నారాయణదాసు వితంతు వివాహాలను వ్యతిరేకించాడు. పట్టణాల పెరుగుదలతో వివిధ కులాలవారు విచక్షణారహితంగా కలిసిపోతున్నారని, పాత జీవనశైలిని కోల్పోతున్నామనీ విశ్వసించాడు.

చెళ్ళపిళ్ళ వెంకటకవి గోదావరిజిల్లా రాజమండ్రి తాలూకా జమీందారీ కడియం గ్రామంలో జన్మించాడు. తన గ్రామంతో పాటుగా ఫ్రెంచివారి వలస యానాంలో పెరిగి పెద్దవాడయ్యాడు. ఈయన తన ఆత్మకథను పద్యరూపంలో రెండు భాగాలుగా రచించాడు. పేదరికం, రుణభారం కారణంగా వీరి కుటుంబం యానాంకు వలస వెళుతుంది. అక్కడ పాఠశాలలో తెలుగుతోపాటు ఆంగ్లభాష నేర్చుకున్నాడు. ఆర్థిక పరిస్థితులలో చదువుకోవటం ఇబ్బందిగా మారింది. కృష్ణాజిల్లాలో ఉచితంగా భోజనం పెట్టి, విద్య నేర్పించే గురువు వద్దకు చేరాడు. అక్కడ దివాకర్ల తిరుపతిశాస్త్రిని తొలిసారి కలిశాడు. ఇద్దరూ అక్కడే వ్యాకరణ పాండిత్యం నేర్చుకున్నాడు. వీరిరువురూ కలసి అవధానాలు చేయటం ప్రారంభించారు. ఇవి ఖ్యాతిని, ధనాన్ని ఆర్జించిపెట్టాయి.

పాశ్చాత్య ప్రభావానికి లోనైన భారతీయులు తమ మతానికి దూరమై 'కర్మ' మీద విశ్వాసం కోల్పోయారని వెంకటశాస్త్రి భావన – ఆయన ప్రజాస్వామ్య రాజకీయాలను, మెజారిటీపాలనను, రాజకీయాలలో నాయకత్వ స్థానాలకు క్రిందివర్గాలు, స్త్రీలు ఎదగడాన్ని వ్యతిరేకిస్తాడు. అస్పృశ్యుల దేవాలయ ప్రవేశాన్ని, 'హరిజనులు' అని పేరుపెట్టి గౌరవస్థానమియ్యటాన్ని నిరసించాడు. బాలికావిద్యను వ్యతిరేకించాడు. కులవ్యవస్థను సమర్థించాడు.

వెంకటశాస్త్రి, నారాయణదాసులు తీసుకున్న సంప్రదాయ దృక్పథం సమాజంలోని కొందరు అల్పసంఖ్యాకుల దృక్పథం మాత్రమే. ప్రధాన స్రవంతి జాతీయవాద దృక్పథం సామాజిక పరిణామం, సంస్కరణల పక్షంలో బలంగా వున్నాయి.

ఎవరి దృష్టికీ రాని ఒక స్త్రీ ఆత్మకథగా 1934 సం॥ ప్రచురితమైన ఏడిదము సత్యవతి రాసిన 'ఆత్మచరితము'ను రాజగోపాల్ విశ్లేషించారు. చిన్నవయసులోనే భర్తను కోల్పోయి వితంతువైన తర్వాతే ఆమె తన జీవన పరిస్థితులను వర్ణిస్తూ ఈ ఆత్మకథ రాసింది. స్త్రీలను హీనంగా చూడడం, వితంతువులకు గుండు గీయటం వంటి అణచివేత చర్యలు, దురాచారాలకు వ్యతిరేకంగా తాను ఆత్మకథను రాస్తున్నట్లు చెప్పింది. హరికథల్లో కలియుగంలో పతివ్రతలు లేరని నిందించటాన్ని, భర్త మరణించగానే జుట్టు తీసేయించి, ముతక బట్టలు కట్టటాన్ని ఆమె తప్పుపట్టారు. క్రూరుడూ మాయగాడూ అయిన భగవంతునిపై విశ్వాసం వుంచటం కంటే ఇతర మానవులకు సహాయం చేస్తున్న, అందరికీ స్పష్టంగా కనిపిస్తున్న మనుషులపై విశ్వాసముంచటం మంచిదనిపిస్తుందని సత్యవతి భావన. ఆమె తన ప్రాపంచిక దృక్పథాన్ని నిర్మించుకోవడానికి ఆంధ్ర సమాజంలోనూ, సంస్కృతిలోనూ ఆమెకు లభించిన మేధాపరమైన వనరుల గురించి ఇంకా పరిశోధన సాగాలని రాజగోపాల్ అంటారు.

చివరిగా జాతీయవాది చిలకమర్తి లక్ష్మీనరసింహం (1867–1945) ఆత్మకథను రాజగోపాల్ విశ్లేషించారు. గుంటూరు నుండి వలస వచ్చి పశ్చిమగోదావరిజిల్లా వీరవాసరంలో వారి కుటుంబం స్థిరపడింది. కంటిచూపు సరిగాలేక ఉపాధ్యాయ వృత్తిని చేపట్టలేకపోయినా ఆంగ్లభాషను కూడా నేర్చుకొని ఉభయ భాషా పండితుడయ్యాడు. 'గయోపాఖ్యానం'తో పాటు అనేక నాటకాలు రచించాడు. సాంఘిక సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడని దశలో 1887లో విక్టోరియా మహారాణి స్వర్ణోత్సవ సంబరాలను స్తుతిస్తూ పద్యాలు రాశాడు. కందుకూరి ప్రభావం ఈయనపై బలంగా వుంది. బిపిన్ చంద్రపాల్ ప్రసంగాలతో చిలకమర్తి ఉత్తేజితులయ్యారు. 1908లో స్థాపించిన జాతీయ కళాశాలలో మత విద్య పరస్పర వైషమ్యాలను కలిగిస్తుందని భావిస్తూ చిలకమర్తి దానిని వ్యతిరేకించాడు.

ఈవిధంగా రాజగోపాల్ 272 పేజీల ఈ పుస్తకంలో విస్తార అధ్యయనం చేసి, వివిధ వ్యక్తుల ఆత్మకథలను విశ్లేషిస్తూ తులనాత్మక పరిశీలన చేస్తూ ఒక అభిప్రాయానికి వచ్చేందుకు ప్రయత్నించారు. ఈ ఆత్మకథలు రాసినవారు వ్యక్తులుగా వారు ఎదుర్కొన్న పరిస్థితులకు తోడు బాహ్యంగా, నూతనంగా వచ్చిన భావాలు ప్రభావితం చేశాయనటంలో సందేహం లేదు. ఆయా నిర్దిష్ట కాలపరిమితుల్లో, ఆనాటికి వారి భావాలు, ఆచరణ సమాజాన్ని ముందుకు నడిపించేదా, కాదా అనేదే పరిశీలించుకోవాలి. వలస పాలకుల పాలనా ప్రభావం, వారి ద్వారా ప్రవేశపెట్టబడిన ఆంగ్లభాష, విద్యాబోధనలతోపాటు ఆయా కాలాల్లో ఆయా ప్రాంతాల్లో ప్రజల పోరాటాలు కూడా వారి ఆలోచనలు రూపుదిద్దుకోవటంలో తోడ్పడతాయి. 19, 20 శతాబ్దాలలో ప్రధానంగా తెలుగులో వచ్చిన కొన్ని ఆత్మకథలను విశ్లేసించుకోవటం బాగానే వున్నా, సాధారణ రచనకు, సిద్ధాంత పత్రాలుగా రాసిన వాటి పరిమితికి మధ్య వ్యత్యాసం తప్పనిసరిగా వుంటుంది. పైగా ఇది ఆంగ్లభాష నుండి అనువదించటంతో కొన్ని పదాలు పాఠకులకు అర్థం కావటం కష్టమౌతుంది. (ఉదా : 'క్వాచిత్కంగా', ఆంతరిక, తుల్యత్వం, నిష్పన్నం, మూలమట్టు, క్రమీకరణం, అంతర్నిహితం, పునఃకథితం, పునస్సందర్భీకరణం, అనుద్దిష్ట, బృహద్వ్యవస్థ మొ॥) భాషాసంబంధమైన ఈ విషయాలపట్ల జాగ్రత్త వహించటం అవసరం.

**స్వీయ చరిత్రలు : వలసకాలపు ఆంధ్ర సమాజం**
**వకుళాభరణం రాజగోపాల్**
**సంపాదకులు : డా॥ డి. చంద్రశేఖరరెడ్డి**
**ముద్రణ : ఫిబ్రవరి, 2022. మూల్యం : రూ.200/–**
ప్రతులకు : ఎమెస్కో బుక్స్ ప్రై.లి.
**హైదరాబాదు, విజయవాడ.**

పాట

# అజాదీకా అమృత్ మహోత్సవం

- వెంకట్. జి

**అజాదీకా** అమృత్ మహోత్సవం
ఆత్మనిర్భర భారత్ పరాధీన దేశం
దాస్యశృంఖలాల నుండి భరతజాతి స్వేచ్ఛకోరి
అలుపెరుగక పోరాడిన అమరులారా వందనం ॥ ఆ ॥

బీర్సముండ అల్లూరి భగత్సింగ్ పౌరుషం
శత్రువులకు తలవంచని ధిక్కరించు సాహసం ॥ శ ॥
అజరామరమైనది అమరుల త్యాగం
ఆ త్యాగాలకు అణువణువున నీరాజనం ॥ అజా॥ 2

మనిషి మనిషికీ నడుమ కుతంత్రాల సమరం
సమానత్వ భావనయే సమాధైన స్వార్థం ॥ స ॥
కత్తుల వంతెనపై కాలినడక ప్రయాణం
రక్తసిక్తమవుతున్నది ప్రజాస్వామ్యం గమనం ॥ ర ॥
ధనస్వామ్యం దాహానికి దగ్ధమైన జనస్వామ్యం
అనునిత్యం అణచివేత దౌర్జన్యం సాగుతోంది ॥ అజా ॥ 2

కులమతాల కుమ్ములాట అధికారం పెనుగులాట
మతం మత్తు తలకెక్కిన రాజకీయ ఉన్మాదం ॥ మ ॥
బూజుపట్టిన భావాలకు మూర్ఖత్వం రంగుపులిమి
మానవత్వమే మరచిన మతమారణహోమం ॥ మా ॥
బలిపశువుగ మారకురా భవిష్యత్తును చూడుమురా
వివేకాన్ని వదులుకునీ వినాశనం చెందకురా ॥ అజా ॥ 2

కార్పొరేట్ సింహాలను కార్పెట్లతో స్వాగతించి
పబ్లిక్రంగాన్ని చంపి పబ్లిగ్గా పాతరేసి ॥ ప ॥
అభివృద్ధి జపమాలతో అప్పుల కుప్పగా మార్చి
సామ్రాజ్యవాదులకు దళారులీ పాలకులు ॥ సా ॥
జాతీయవాదం పేరుతో దేశప్రజల మాయజేసి
నిజాలను నిలదీస్తే నిలువునా కాల్చినారు ॥ అజా॥ 2

పోర్టులు ప్రాజెక్టులపై బూర్జువాల పెత్తనం
బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యం ॥ బ ॥
వనరులను దోచిపట్టి ఖనిజాలను కొల్లగొట్టి
మైనింగ్ మాఫియాకు మంత్రిపదవి కట్టబెట్టి ॥ మై ॥
జాతీయ సంపదలు జాగిలాల పాలాయెను
గిరిజనుల గోడు వినే నాథుడే కరువాయెను ॥ అజా ॥ 2

దిగుమతులకు హద్దులేదు ఎగుమతుల వృద్ధి లేదు
పారిశ్రామిక ప్రగతి కనిపించదు పురోగతి ॥ పా ॥
జాతీయ బ్యాంకులను దర్జాగా కొల్లగొట్టి
చోరులైన కుబేరులకు విదేశాల్లో విలాసాలు ॥ చో ॥
ప్రపంచబ్యాంకు షరతులకు శిరసు వంచి అప్పులు
బడుగు జనుల గుండెలపై రుణభారం తిప్పలు ॥ అజా ॥ 2

మార్కెట్ ధర మాయలాడి ట్రేడింగుల మోసకారి
మట్టివాసనెరుగనోడి కార్పొరేట్ చట్టాలు ॥ మ ॥
వ్యవసాయం పీకనులిమి అన్నదాత వెన్ను విరిచి
అప్పులతో దిక్కుతోచక అలమటించు రైతన్నలు ॥ అ ॥
వ్యవసాయం దండగనే దగుల్బాజీ నినాదాలు
రైతన్నల ఉసురు తీసి శవాలుగా మార్చినారు ॥ అజా ॥ 2

శ్రమజీవుల బ్రతుకంతా అదనపు విలువ దోపిడి
కార్మికుల జీవితాల్లో కమ్ముకున్న పెనుచీకటి ॥ కా ॥
హక్కులను కాలరాచి చట్టాలతో కట్టేసిరి
ఉద్యమాల ఊసెత్తితే అరెస్టులు నిర్బంధం ॥ ఉ ॥
నిరుద్యోగమధికమాయె అధిక ధరల భారమాయె
యువత నిర్వీర్యమాయె దినం దినం గండమాయె ॥ అజా ॥ 2

కార్పోరేటు ఫాసిజం క్రూరమైన రాజ్యహింస
ప్రజాస్వామ్య మనుగడకు పెనుసవాలు విసురుతోంది ॥ ప్ర ॥
ధరణీతలమంత నేడు దురాత్ముల దురాగతం
కలలుగన్న భారతం కల్లలాయె జీవితం ॥ క ॥
అమరులారా మీ త్యాగం వృధాకాదు ఇది సత్యం
ప్రజాతంత్ర పోరాటమె పీడితజన కర్తవ్యం ॥ ప్రజా ॥ 2

వ్యాసం

# పాలక వర్గాల చేతిలో పాచికగా మతం

- ప్రసన్న

**సర్వసత్తాక,** సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర దేశంగా ప్రకటించుకున్న భారతదేశం బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందామని చెప్పుకోవడం మొదలై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశమంతా ఆజాదీ కా అమృత మహోత్సవ్ పేరిట సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సంబరాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న పార్టీ ప్రారంభించింది. ఇది నాణేనికి ఒకవైపు. రెండోవైపున దారిద్ర్యం, నిరుద్యోగం, ఆత్మహత్యలు, అధిక ధరలు, వివక్షలు, అసమానతలు దేశవ్యాప్తంగా మూడురంగుల జెండాల కంటే చాల ఎత్తున ఎగురుతూ, ఆకాశాన్ని తాకడానికి రెపరెపలాడుతూ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. గత డెబ్బై ఐదు సంవత్సరాలుగా అదుపు లేకుండా పెరిగిన ఈ అవలక్షణాలతో పాటు దేశంలో శత కోటీశ్వరుల సంఖ్యతో పాటు, విచ్చలవిడిగా దోచుకోవడానికి విదేశీ పెట్టుబడులు కుడా దేశంలో కుప్పలుతెప్పలుగా పెరిగాయి.

ఈ దోపిడిని భరిస్తూ, ఈ సమస్యలతో సతమతమౌతూ కూడా దేశ ప్రజలు పాలకుల పిలుపునందుకుని, దేశంపట్ల తమకున్న దేశభక్తిని చాటుతూ, ఆరోజొక పండుగలా అమృత మహోత్సవాలలో పాల్గొన్నారు. ఘర్ మే తిరంగా అంటూ ఇళ్ళపై జెండాలు ఎగరవేశారు. స్వాతంత్ర్యం పొందిన నాటి ఆశలు, ఆకాంక్షలు ఏనాటికైనా నేరవారాలన్న కోరిక, నెరవేరకపోతాయా అన్న ఆశతో ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు. పాలకులు మాత్రం కులం, మతం, ప్రాంతం, పేరిట పౌరుల ఆలోచనలను మొద్దుబార్చటంలో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ప్రజలు తమ జీవితాలను కుదిపేస్తున్న సమస్యలను సైతం పక్కనపెట్టి, ఆ సమస్యలకు వ్యతిరేకంగా పోరాడి పరిష్కారాలు సాధించుకోగల తమ శక్తిని తామే మర్చిపోయేలా చేశారు. ఫలితంగానే పాలకుల మంత్రదండాలకు అనుగుణంగా తలలు ఆడిస్తున్న బొమ్మలుగా ఈ 75 సం॥ల నాటికి ప్రజలను మిగిల్చారు. గత డెబ్బై ఐదేళ్లుగా ఈ దేశపాలకవర్గాల అరాచక రాజకీయ వైకుంఠపాళీలో మతం పాచికను వాడి ప్రజలను ఎలా ఓడిస్తున్నారు? ఏ మాయ పాచికతో ప్రజలను ఎలా ఓడించారు? అనేది కనీసం రేఖ మాత్రంగానైనా చర్చించాల్సిన సందర్భాన్ని ప్రస్తుత మతోన్మాద పాలకులు మనకి కల్పించారు.

శతాబ్దాలుగా ఈ దేశంలో సామాన్య జనం మతాలకి అతీతంగా, సుహృద్భావం మధ్య కలిసి మెలిసి శ్రమిస్తున్నారు. ఎక్కడైనా రెండు విభిన్న మతాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణలు తలెత్తినా, అవి వ్యక్తిగత స్థాయిలోనే జరిగేవి. ఒకే మతానికి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఘర్షణలకు, విభిన్న మతాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణకు గుణాత్మకంగాను, పరిమాణాత్మకంగాను ఏ వ్యత్యాసమూ ఉండేది కాదు. ఈ సామరస్యం కష్టజీవులైన శ్రామిక ప్రజలలో ఉండే సహజ లక్షణం. ఐతే తమ దోపిడీ ప్రయోజనాల కోసం శ్రామిక ప్రజల జీవితాలలో కల్లోలాన్ని సృష్టించి, పాలకులు తమ పబ్బం గడుపు కుంటున్నారు. తమ కడగండ్లకు కారణం వారి దోపిడీ విధానాలేనని, తామంతా ఐక్యమై, ఈ దోపిడిని అంతం చేయగాలుగు తామనే చైతన్యం ప్రజలలో తలెత్తకుండా చేయడానికి పాలకులు అతి బలమైన ఆయుధంగా తమ ఉన్మాద రాజకీయాల కోసం మతాన్ని విద్వేషంగా మార్చి వాడుతున్నారు.

పాలకులకు మతానికి ఉన్న సంబంధం ఈ దేశానిదో, ఈ శతాబ్దానిదో కాదు. వర్గ సమాజం ఉనికిలోకి వచ్చింది మొదలు మతం పాలక వర్గం చేతిలో పాచికగా ఉపయోగపడటం చరిత్ర పొడవునా కనిపిస్తుంది. పాశ్చాత్యంలో చర్చికి, మధ్యప్రాచ్యంలో ఖలీఫాకీ నిన్న మొన్నటి వరకు రాజ్యంతో ఉన్న బంధం కూడా మనందరికీ తెలుసు. అన్ని మతాలు రాజుకి దైవాంశ సంభూతుడి హోదా ఇచ్చి దైవభావంపై గుత్తాధికారాన్ని పొందాయి. ప్రజలను పాలకుల దోపిడీ పట్ల అణిగిమణిగి ఉండేలా తీర్చిదిద్దిన తంతంతా బహిరంగంగా, నగ్నంగా జరిగిన తతంగమే. ఐతే నేటి భారతంలో మతానికి రాజ్యానికి మధ్య ఉన్న సంబంధం యొక్క ప్రత్యేకత ఏమిటంటే ఈ మత రాజ్యం లౌకిక రాజ్యం పేరిట చెలామణి కావడం. తమ విషబీజాలను దేశంలోని వివిధ మత ప్రజల నడుమ విద్వేషాలు వ్యాప్తిచేస్తూ విశాల ప్రాంతంపై వెదజల్లుతూ కొనసాగుతున్న ఫ్యూడల్ విషవృక్షానికి నీరుపోసి పెంచినది సామ్రాజ్యవాద బ్రిటీష్ పాలకులే కావడం యాదృచ్ఛికంకాదు. తమ దోపిడీకి సహకరించే, తమ స్వార్ధ ప్రయోజనాలకు గొడుగు పట్టే మతోన్మాద శక్తులను చేరదీసి, పెంచి పోషించడం రెండు వందల సంవత్సరాల ముందుచూపుతోనే జరిగింది.

1856 నాటికే అయోధ్య వివాదంలో వలస పాలకులు జోక్యం చేసుకున్నారు. స్థానిక వివాదాన్ని పెద్దది చేసి, హిందువులను రెచ్చగొట్టడానికి ఆవు కొవ్వును, ముస్లింలను రెచ్చగొట్టడానికి పంది కొవ్వును ఎన్ఫీల్డ్ తూటాలకు పూసారు. 1905లో మత ప్రాతిపదికన బెంగాల్‌ను విభజించారు. కార్మిక వర్గ చైతన్యంతో తొణికిసలాడుతున్న

కాన్పూర్ నుండి 1931లో షహీద్ భగత్‌సింగ్ హత్య తర్వాత పెద్ద ఎత్తున పెల్లుబికే తిరుగుబాటును ఊహించిన వలస పాలకులు వెనువెంటనే అక్కడ మత కలహాలు రెచ్చగొట్టారు. నిజాం రాజ్యంలో ఏకంగా రజాకార్ల పేరిట మత సైన్యాన్నే ఏర్పాటు చేసి ప్రజా ఉద్యమాల మీద దాడికి ఉసిగొల్పారు. నేటి బంగ్లాదేశ్‌లోని ఒకప్పటి విప్లవకారుల కేంద్రమైన చిట్టగాంగ్‌కు సమీపంలోని నౌఖలీలో 1946 నవంబర్‌లో ముస్లిం మతోన్మాదులు పాల్పడ్డ హింస... ఇలాంటివన్నీ కూడా భారతదేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టడం ద్వారా ప్రజలను చీల్చి, తమ దోపిడిని శాశ్వతం చేసుకునే ఎత్తుగడలే. ఇందుకోసం 40 ఏళ్ళక్రితమే 1905 నాటి వందేమాతరం ఉద్యమం తర్వాత బ్రిటీష్ పాలకులు వ్యూహం మార్చి ఈ దేశపు భూస్వామ్య వర్గాలతో జతకట్టి, ముస్లిం లీగ్‌కూ, హిందూ మహా సభకు జన్మనిచ్చారు. బ్రిటిష్‌వారి ఈ ముద్దుబిడ్డలిద్దరూ ఒకరితో ఒకరు పోటీ పడుతూ తమ జనకుల మనోవాంఛలను నెరవేర్చడానికి తమ శాయశక్తులా కృషి చేశారు. జాతీయోద్యమ కాలంలో అనేకసార్లు కమ్యూనిస్టులపై, చివరికి కాంగ్రెస్‌పై కూడా నిషేధం విధించిన బ్రిటిష్ పాలకులు RSSపై గానీ, ముస్లింలీగ్‌పై గానీ ఏ రోజూ నిషేధం ఆలోచన కూడా చేయలేదు. బ్రిటిష్ పాలకుల ఈ వైఖరి మతోన్మాదులకు – సామ్రాజ్యవాదానికి మధ్య ఉన్న బంధాన్ని స్పష్టంగా మనకు చూపుతుంది. ఈ కూటమి యొక్క సమష్టి కృషి ఫలితమే ఈ రోజు దేశంలో పెరిగిపోతున్న మౌఢ్యం, విద్వేషం, వగైరాలు అన్నీ.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత భారతదేశంలో పెల్లుబుకుతున్న కార్మిక వర్గ పోరాటాలు, అంతర్జాతీయ పరిస్థితుల రీత్యా ఈ దేశాన్ని ప్రత్యక్షంగా పాలించడం ఇక సాధ్యం కాదనే నిర్ణయానికి వచ్చిన బ్రిటీష్ ముష్కరులు తమ బిడ్డలైన ఆర్ఎస్ఎస్, ముస్లింలీగ్‌ల ప్రయోజకత్వాన్ని పరీక్షించడానికి దేశ విభజన పేరుతో మొదటి పరీక్ష పెట్టారు. రెండు దేశాలకు, రెండు మతాలకు చెందిన సుమారు 20 లక్షల మరణాలు, 2 కోట్ల మంది వలసలు, మరి కొన్ని కోట్ల క్షతగాత్రులను ఇరుదేశాలకు మిగిల్చి ఈ ఇద్దరు మతోన్మాదులు తమ ప్రయోజకత్వాన్ని చాటుకున్నారు. బ్రిటిష్ పాలకులు ధైర్యంగా తెర వెనక్కి తప్పుకున్నారు. అలా సామ్రాజ్య వాదులచే శ్రీకారం చుట్టబడిన భారత్ – పాక్ ఘర్షణలు, నేటికీ సామ్రాజ్యవాదుల ఆయుధ పరిశ్రమను పోషిస్తున్నాయి. ఈ సరిహద్దు ఘర్షణలు దేశం లోపల మెజారిటీ – మైనారిటీ మత ఘర్షణలుగా ప్రతిబింభిస్తున్నాయి. ఈ అమృతోత్సవాలకు కారణమైన 75 సంవత్సరాల ఘన చరిత్ర, ఈ దేశానికి వచ్చిందనుకుంటున్న స్వాతంత్ర్యపు తొలిరోజులు ఇలా మతోన్మాద ఘర్షణలతో ప్రారంభమయ్యాయి.

దేశంలో 90% పేద, మధ్యతరగతి ప్రజలే ఉన్నప్పటికీ ముస్లిం మైనారిటీలలో ఈ శాతం మరింత ఎక్కువగా ఉంది. ఈ పేదరికం కారణంగా ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే వర్గాలలో వీరు ప్రధానమైన భాగంగా ఉన్నారు. అవే సమస్యలతో వారితో కలిసి జీవిస్తున్న హిందువులు వీరితో భుజం కలిపి పోరాడితే తమ మనుగడే ప్రశ్నార్ధకమౌతుంది. అందుకే ఒకవైపు మతాల మధ్య అనుమానపు బీజాలు నాటడం ద్వారా, ఘర్షణలు రెచ్చగొట్టడం ద్వారా వీరి మధ్య ఐక్యతను అసాధ్యం చేయాలని పాలకులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు మత మైనారిటీలపై అత్యధిక అణచివేతను ప్రయోగిస్తున్నారు. ఈ హింసను సాకుగా చూపి మైనారిటీలలోని అతివాదశక్తులు తమ ఉగ్రవాద కార్యకలాపాల వైపు ప్రజలను ఆకర్షిస్తున్నారు. నెహ్రూ చెప్పినట్లు "మెజారిటీ మతోన్మాదం సమాజాన్ని నాశనం చేస్తుండగా, మైనారిటీ మతోన్మాదం తనను తానే నాశనం చేసుకుంటుంది."

అధికారమార్పిడి తర్వాత దేశంలో ఏదో ఒక మూల మత ఘర్షణలు జరగని రోజు లేదు. పైకి చూడటానికి ఇవన్నీ చెదురుమదురు ఘటనలుగానే కనిపించినప్పటికీ, వీటన్నింటి మధ్య అంతర్గతంగా ఒక సమన్వయము, ప్రతి సందర్భం వెనుక పాలకవర్గపు తక్షణ, దీర్ఘకాల ప్రయోజనాలు ఉన్నాయి. 1947 నాటికి రాజకీయ ప్రభావం పెద్దగా లేని, దేశంలో హిందువులు మైనారిటీగా ఉన్న ప్రాంతాలలో మాత్రమే పునాది గల RSS రాజకీయ రంగంలో తమ భవిష్యత్తుకు దారులు వేసుకునే క్రమంలో, హిందువులను తమ వెనక సమీకరించుకోవడం ద్వారా రాజకీయ ఎదుగుదలను ఆశించి, దొరికిన ప్రతిసారీ అవకాశాన్ని చేజిక్కించుకుని అనేక సార్లు దేశంలో మతోన్మాద హింసను రెచ్చగొట్టింది. దేశ విభజన సందర్భంగా తలెత్తిన విద్వేష జ్వాలలు అప్పుడప్పుడే సద్దుమణుగుతున్న నేపథ్యంలో, అప్పటివరకు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వేలు పట్టుకుని నడుస్తున్న మతోన్మాదులు, తమ హింసాత్మక, మత విద్వేష ఆలోచనలకు విరుద్ధంగా, పాలకవర్గాలకు ఉపకరించే మోతాదులోనే అయినా, మత సామరస్యం, అహింసలను ప్రచారం చేస్తున్న గాంధీని హత్య చేయడం ద్వారా, దేశంలో తమ స్వతంత్ర కార్యాచరణను ప్రారంభించారు. ఈ చర్యతో RSSను నిషేధించిన నెహ్రూ ప్రభుత్వం, రాజకీయాల జోలికి రాబోమనే పూచీకత్తు తీసుకుని వారి మీద నిషేధాన్ని తొలగించింది. రాజకీయంగా తమకు మరో ముఠా పోటీ రానంతవరకు మతోన్మాదంతో తమకు ఎలాంటి పేచీ లేదనే సందేశాన్ని అప్పటి నెహ్రూ ప్రభుత్వం అందించింది. భారతదేశంలో మతోన్మాదుల వికృత కార్యాచరణలో పెద్ద పెద్ద సంఘటనలు ఊపిరిపోసుకున్నాయి.

గుజరాత్‌లోని అహ్మదాబాద్ ప్రాంతంలో అప్పటివరకు కలిసి మెలిసి బతుకుతున్న దళిత ముస్లిం శ్రామిక ప్రజల మధ్య మతత్వ అగ్గి రాజేసారు పరివార్ మూకలు. అక్కడి సాధువులు పెంచుకుంటున్న ఒక ఆవు ఒక ముస్లింని పొడవడంతో ప్రారంభమైన వ్యక్తిగత ఘర్షణను, మొత్తం రాష్ట్రానికి వ్యాపింపజేసి, రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది మరణానికి కారణమైంది.

అస్సాంలోని నాగోన్ జిల్లా నెల్లి ప్రాంతంలో 1983 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చెలరేగిన హిందూ ముస్లిం ఘర్షణల్లో సుమారు 10,000 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని అంచనా. అస్సాంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మత ఘర్షణల వల్లే ఎన్నికలలో తిరిగి గెలవగలిగింది. ఈ హింసపై వేసిన తివారీ కమిషన్ నివేదిక ఇప్పటికీ

వెలుగు చూడకపోవడం ఈ ఘటన వెనుక ఉన్న కుట్ర కోణాన్ని బహిర్గతం చేస్తుంది.

మహారాష్ట్రలోని భివాండిలో 1984 మే నెలలో స్థానిక మసీదు మీద కాషాయ పతకాన్ని ఎగురవేయడం ద్వారా భివాండితో పాటు పూనా, బొంబాయి కార్మిక వాడలలో కూడా మత ఘర్షణలను రెచ్చగొట్ట గలిగారు ఈ అల్లర్లలో కూడా కొన్ని వందల మంది ప్రాణాలు కోల్పోగా, వెయ్యికి పైగా క్షతగాత్రులయ్యారు.

కేంద్ర పాలకుల ఏకపక్ష, కేంద్రీకృత విధానాలకు వ్యతిరేకంగా పంజాబ్ ప్రాంతానికి స్వయంప్రతిపత్తి కోరుతున్న ఖలిస్తాన్ ఉద్యమానికి స్థానిక ప్రజల జాతీయ ఆకాంక్షలకు క్రమంగా మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో బింద్రన్ వాలే తదితర ఉగ్రవాదుల ఏరివేత సాకుతో పంజాబ్ ప్రజానీకాన్ని భీతావహుల్ని చేసేందుకు ఆపరేషన్ సన్ డౌన్, ఆపరేషన్ బ్లూ స్టార్‌లను నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం చేపట్టింది. సిక్కులు పవిత్రంగా భావించే స్వర్ణ దేవాలయం మీద దాడిచేసి, దాదాపు 20,000మందిని బలిగొన్న ఈ చర్య తమ మతస్వాతంత్ర్య హక్కును హరించడమే కాక, మొత్తం సిక్కు జాతిని అవమానించడంగా పంజాబ్ ప్రజానీకం భావించింది. తమపై జరిగిన ఈ హింసకు ప్రతిగా సిక్కులలోని ఇందిరాగాంధీని ఆమె కావలిదార్లే హత్య చేయడం జరిగింది. ఈ సందర్భంలో మొత్తం సిక్కులకు వ్యతిరేకంగా ఇతర మతాల ప్రజలను నాటి కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టిన కారణంగా దేశవ్యాప్తంగా దాదాపు 4 వేలమంది సిక్కులు హత్య చేయబడ్డారు. ఈ ఉన్మాదం నేపథ్యంలోనే 1984 పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే అత్యధిక స్థానాలలో విజయం సాధించింది. ఈ ఎన్నికలలో ఆర్ఎస్ఎస్ కాంగ్రెసుపార్టీని బలపర్చటం గమనార్హం! తెలుగుదేశం, అన్నా డి.ఎం.కే. మినహా మరే ప్రాంతీయ పార్టీ కూడా కాంగ్రెస్‌కు స్థానికంగా పోటీ కూడా ఇవ్వలేకపోయాయి.

1986లో హిందూ మతోన్మాదుల కోసం బాబ్రీ మసీదు తలుపులు తెరిచి, అందుకు ప్రతిగా, ముస్లిం మతోన్మాదులను బుజ్జగించడానికి ముస్లిం మహిళలకు మనోవర్తిని నిరాకరించే చట్టం చేసిన రాజీవ్‌గాంధీ రెండు మతోన్మాదాలను ఉపయోగించుకునే విషయంలో నిజంగానే బ్రిటిష్ పాలకులకు వారసుడనిపించుకున్నాడు.

ముస్లింలీగ్ పాకిస్తాన్‌కు పరిమితమైనప్పటికీ, పాకిస్తాన్ పాలకుల ప్రోత్సాహంతో, భారత పాలకులు అనుసరిస్తున్న అణచివేత రాజకీయాలకు ప్రతిగా, కాశ్మీరీల జాతీయ ఆకాంక్షలను ఉపయోగించుకుంటూ కాశ్మీర్‌లో అతివాద శక్తులు పెరగడం ప్రారంభమైంది. మొత్తం కాశ్మీర్ జనాభాలో 4%గా ఉన్న కాశ్మీర్ పండిట్లు స్థానిక వ్యవసాయ భూమిలో 30%కు యజమానులుగా ఉన్నారు. ఈ వైరుధ్యాన్ని వర్గ సంఘర్షణ ద్వారా పరిష్కరించే ఎజెండా ఎవరి వద్ద లేకపోవడంతో, ముస్లిం మతోన్మాద శక్తులు ఈ వాతావరణాన్ని ఉపయోగించుకున్నాయి. ఈ శక్తుల పెరుగుదల, వీరి మతోన్మాద హింసాత్మక చర్యల కారణంగా 1988-91 మధ్య మరియు ఆ తరవాత కాలంలో సుమారు 650 మంది కాశ్మీరీ పండిట్లు హత్యకు గురయ్యారు. దాదాపు లక్ష మంది వలస వెళ్ళిపోయారు.

1990లో BJP చేపట్టిన రామ జన్మభూమి రథయాత్రకు రెండు స్పష్టమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి... తను రాజకీయంగా ఎదగడంతో పాటు, జనాన్ని ఏమార్చడంలో కాంగ్రెస్ కంటే తానే మెరుగు అని తన సామ్రాజ్యవాద ప్రభువుల వద్ద నిరూపించుకోవడం. రెండు... అప్పుడు చర్చల స్థాయిలో ఉన్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ రథచక్రాలకు భారత శ్రామికవర్గాన్ని మరింత బలంగా కట్టివేయగల డంకెల్ ప్రతిపాదనల నుండి జనం దృష్టిని మళ్ళించడం. ఈ ప్రయోజనాలు నెరవేర్చడం కోసం ఇప్పుడైతే ఎంచక్కా ఏ.సి. గదుల్లో కూర్చున్న ఐ.టీ. సెల్ కార్యకర్తలు అవలీలగా సుదూర ప్రాంతాలలో విద్వేషాలు రెచ్చగొట్టగలుగుతున్నారు కానీ, ఆనాడు సామజిక మాధ్యమాలు అందుబాటులో లేక, పాపం అద్వానీ, ఊరూరా కాలికి బలపం కట్టుకుని తిరగాల్సి వచ్చింది. చివరికి పాలక వర్గాలలోని ఒక ముఠాను దించి, మరో ముఠా అధికారం చేపట్టడానికి కూడా మత ఘర్షణలు రెచ్చగొట్టడం మన హైదరాబాద్‌లో చూశాం.

1992 బాబ్రీ కూల్చివేత తరువాత ముంబైలో జరిగిన మత ఘర్షణలలో కనీసం 1200 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని శ్రీకృష్ణ కమిషన్ అంచనా వేసింది. మృతుల్లో అత్యధికులు సహజంగానే ముస్లిం నిరుపేదలు. ఈ దాడులకు కూడా మహారాష్ట్రలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగపు సంపూర్ణ సహకారం ఉంది.

1999లో భజరంగ్ దళ్ నాయకుడు దారాసింగ్ నాయకత్వంలో మతమార్పిడులకు పాల్పడుతున్నాడనే సాకుతో గ్రహం స్టెయిన్‌నూ, అతని ఇద్దరు పిల్లలనూ సజీవంగా దహనం చేశారు.

2002 నాటికి 11 సంవత్సరాల కేశుభాయిపటేల్ పాలన సమయంలో ఏర్పడ్డ ప్రజా వ్యతిరేకత నుండి బయట పడడానికి మార్గాల కోసం ఎదురుచూస్తున్న BJP, అయోధ్య నుండి రైలులో తిరిగి వస్తున్న కరసేవకుల బోగీకి గోద్రాలో నిప్పంటింపజేసి, ఆ మిషతో గుజరాత్‌లోని ముస్లిం శ్రామిక జనావాసాలపై దాడులకు తమ కార్యకర్తలను ఉసిగొల్పింది. వార్తాపత్రికలలో స్థానిక ముస్లింలు హిందూ మహిళలను కిడ్నాప్‌లు, రేపులు చేస్తున్నారని, హిందువులను అంతం చేయడానికి పాకిస్తాన్ గూఢచారులతో, ఉగ్రవాదులతో చేతులు కలిపారనీ తప్పుడు కథనాలు సృష్టించి సామాన్య హిందువులను ముస్లింలపైకి రెచ్చగొట్టారు. ప్రభుత్వ యంత్రాంగం రెచ్చిపోయి ముస్లింలపై దాడికి తెగబడుతున్న లంపెన్ శక్తులకు మద్దతుగా నిలబడింది. ఫలితంగా 2000కి పైగా హత్యలు, 2500కి పైగా క్షతగాత్రులు, లక్షల మంది నిర్వాసితులతో గుజరాత్ భీతావహంగా తయారైంది. సామాన్య హిందువులను ఈ స్థాయిలో రెచ్చగొట్టడం ద్వారా, ఈ దాడులకు నాయకత్వం వహించడం ద్వారా రెండువైపులా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయటం ద్వారా గుజరాత్ అసెంబ్లీ చరిత్రలోనే అత్యధిక సీట్లను BJP కైవసం చేసుకుంది. ఆ ప్రభావంతోనే గత 3 దశాబ్దాలకు పైగా గుజరాత్‌లో BJPకి ఏకచత్రాధిపత్యం సాధ్యమైంది.

2007లో క్రైస్తవులు ఒరిస్సాను వదలి వెళ్లిపోవాలనే నినాదంతో, క్రైస్తవ గ్రామాలు అనేకం తగులబెట్టబడ్డాయి. 2008 ఆగస్టులో స్థానిక హిందూ సన్యాసి స్వామి లక్ష్మణానందను మావోయిస్టు పార్టీ హత్య

చేసింది. ఈ హత్యను RSS తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి పన్నిన దుష్ట పన్నాగం కారణంగా ఒరిస్సాలోని కంధమాల్ ప్రాంతంలో క్రైస్తవులపై అత్యంత పాశవికంగా హింసలు, దాడులు జరిగాయి. లక్ష్మణానందను స్థానిక క్రైస్తవులే హత్య చేశారనే దుష్ప్రచారంతో హిందువులను రెచ్చగొట్టడం జరిగింది. 600 గ్రామాలు ధ్వంసం చేయబడ్డాయి. 500 హత్యలు, 18000 క్షతగాత్రుల కన్నీటికి ఈ హింస కారణమైంది.

ఒక క్రమంలో ఈ 75 సంవత్సరాల మత రాజకీయాలను మనం పరిశీలిస్తే మనకు అర్ధమయ్యే సారాంశం ఇదే! ఈ దేశంలో అధికారం చెలాయిస్తున్న దళారీ పెట్టుబడిదారీవర్గం సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చటం కోసం మతోన్మాదాన్ని ఆశ్రయిస్తుంది. ఒకటి.... ఎన్నికల మాయాజూదంలో తమ ప్రత్యర్థి ముఠాపై నెగ్గడానికి పాచికగా మత విభజన రాజకీయాలను వాడటం; రెండు... శ్రామికవర్గం సంఘటితమై తమ దోపిడీ పునాదులను పెకలించకుండా ఉండాలంటే ఏదో ఒక సాకుతో వారి మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి – చీల్చి – ఉంచాల్సిన అవసరం ఉండటం; మూడు.... దేశ ప్రజల మీద, ముఖ్యంగా శ్రామికవర్గం మీద నిర్బంధాన్ని పెంచదలచుకున్నప్పుడు, మత కలహాలు తానే కావాలని రెచ్చగొట్టటం!!.

చరిత్ర యొక్క ఈ క్రమాన్ని శాస్త్రీయ దృష్టితో పరిశీలించడం ద్వారా మనం భవిష్యత్తును కొంతమేర ఊహించవచ్చు. 1990 నాటికి భాజపా భారత పార్లమెంటులో 89 సీట్లతో మూడో స్థానంలో ఉంది. ఆ సందర్భంలో ప్రచురించిన 'అయోధ్యలో రావణ కాష్టం' పుస్తకానికి వ్రాసిన ముందుమాటలో జనసాహితి ఇలా హెచ్చరించింది. "నిజమైన లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు, విప్లవ వర్గాలు చురుకుగా కదిలి రానున్న ప్రమాదాన్ని నివారించలేకపోతే, శ్రామిక మధ్యతరగతి జీవుల మౌలిక సమస్యలనాధారం చేసుకుని ఉద్యమించలేకపోతే, మతతత్వ భావజాలానికి ప్రజానీకంలో స్థానం లేకుండా చేయగల సాంస్కృతిక పోరాటాన్ని నిర్వహించలేకపోతే – మరిన్ని తరాల వెనుకబాటుతనానికి, రక్తపిపాసుల హింసారాజ్యానికి అవకాశం ఇచ్చినవారు కాగలుగుతారు." ఆ తర్వాత ఏం జరిగిందో మనం చూశాం. చూస్తున్నాం. రక్త పిపాసుల హింసా రాజ్యం రానే వచ్చింది.

ఇప్పటికైనా ప్రగతిశీల శక్తులు శాస్త్రీయ సామ్యవాద సిద్ధాంతాన్ని ఐక్యంగా జనం మధ్యకు తీసుకువెళ్ళి శ్రామిక జనాన్ని ఏకం చేయడం, శ్రామిక జనావళి మధ్య సహజంగా ఉండే అంతర్గత సామరస్యాన్ని తిరిగి నెలకొల్పడం ద్వారా ఈ మాయాజూదం నుండి ప్రజలను బయట పడవేయకపోతే, పాలకవర్గాలు తమ పాచికలను విసురుతూనే ఉంటారు. శ్రామిక వర్గాన్ని ఓడిస్తూనే ఉంటారు.

కొనఊపిరితో ఉన్న వర్ణ వ్యవస్థను బ్రతికించి రామరాజ్యం పేరుతో శ్రామిక వర్గాన్ని అగ్రకుల భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాలకు స్వచ్ఛంద విధేయులుగా మార్చాలనేది వీరి అసలు అజెండా. ఎన్నికలలో తమ ప్రత్యర్థి ముఠాలను ఓడించడానికి మతాన్ని వాడుకోవడం అనేది తాత్కాలిక ఎత్తుగడ మాత్రమే. ఒకే దేశం, ఒకే సంస్కృతీ, ఒకే భాష, ఒకే మతం,.... ఇలా చివరికి ఒకే అధికారం స్థాపించి విశాల దేశంలో శ్రామికవర్గాన్ని దోచడానికి, అణచడానికి, ఎలాంటి ప్రతిఘటన లేని వేతన బానిస సమాజాన్ని బలంగా స్థాపించడమే ఈ "ఒకే" మంత్రం సారం.

మతాన్ని పాలకవర్గాలు ప్రజల మధ్య ఘర్షణలకి, అణచివేతలకి మాత్రమేకాక, నిచ్చెనమెట్ల కులవ్యవస్థ అనే సామాజిక చట్రాన్ని కాపాడ టానికి కూడా ఉపయోగిస్తాంది. ఈ కులవ్యవస్థ దుష్ప్రభావాలన్నిటికి కూడా మతం ఆలంబనగా వుంది.

పాలకుల ఈ మతోన్మాద కేళినే దేశభక్తిగా వారు ప్రచారం చేయడమే కాక మధ్యతరగతి బుద్ధిజీవులను సైతం నమ్మించగలుగుతున్నారు. వీరి నిర్వచనం ప్రకారం దేశభక్తి అంటే ఈ దేశ పాలకులు ఏమి చేసినా సమర్ధించడం. పాకిస్తాన్ పాలకులతో బాటు అక్కడి సామాన్య జనాన్ని, భారతీయ ముస్లిములనూ ద్వేషించడం. పన్నుల పేరిట కొల్లగొడుతున్నఈ దేశ ప్రజల శ్రమ శక్తిని మన ప్రజల అభివృద్ధికి కాక రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టి, రక్షణ బడ్జెట్ పేరుతో సామ్రాజ్యవాద ఆయుధ పరిశ్రమలకు దోచిపెట్టడం. ఇది దేశభక్తి కాబోదనీ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలను అణచడం కోసం పోలీస్ వ్యవస్థను పెంచి పోషించడం ద్వారా కాక సామాన్య జనానికి ఉపాధి కల్పించడానికి ప్రజాధనాన్ని ఖర్చు చేస్తే శాంతిభద్రతలు నెలకొంటాయని, ఏ దేశంలోనైనా మెజారిటీ అంటే అక్కడి జనాభాలో 90%పైగా ఉండే శ్రామిక, మధ్యతరగతి ప్రజలనీ, మైనారిటీ అంటే జనాభాలో 10% కూడా లేకుండా దేశ ప్రజల శ్రమశక్తిలో అత్యధిక భాగాన్ని దోచుకుంటున్న పాలకులనీ, మనం ఓడించాల్సింది ఈ పాలక సోమరి మైనారిటీలననీ ప్రజలందరికీ అర్ధమయ్యేలా చెప్పడమే ఈనాడు నిజమైన దేశభక్తి ఔతుంది.

మన దేశంలో మతాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకునే రాజకీయ నాయకులున్నట్లే, వారి కుట్రలతో ప్రేరేపితమయ్యే ఉన్మాద మూకలు ఉన్నట్లే, ఇవేవీ పట్టించుకోకుండా కలిసి మెలిసి శ్రమించే కోట్లాది శ్రామికులు కూడా ఉన్నారు. మత ఘర్షణల సందర్భంలో వారిని రక్షించడానికి వీరు, వీరిని రక్షించడానికి వారు ప్రాణాలకు తెగించి పోరాడిన ఘటనలు, ప్రాణాలు అర్పించిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. మత సామరస్యం సాధించడానికి కృషి చేస్తున్న ప్రగతిశీల శక్తులున్నాయి. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం లాంటి వర్గ పోరాటాలలో కులాలకు, మతాలకు అతీతంగా శ్రామిక ప్రజలంతా సమైక్యంగా పోరాడిన ఉదాహరణలు ఉన్నాయి. ఈ శ్రామిక ప్రజలను సమైక్యంగా వర్గ పోరాటాలలోకి నడిపించడం ద్వారానే ఈ దేశంలో ఉన్న మతోన్మాద ఫ్యూడల్ శక్తులతో పాటు, వారికి అండగా నిలబడుతున్న దళారీ పెట్టుబడిదారీ వర్గాన్ని, వారి యజమానులైనసామ్రాజ్యవాదాన్ని ఓడించగలుగుతాం. అభివృద్ధికర, మత సామరస్యపూరిత శ్రామిక ప్రజల ప్రజాతంత్ర రాజ్యాన్ని సాధించగలుగుతాం. ●

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

- శీలా సుభద్రాదేవి

**అలలుఅలలుగా** ముడతలు పడిన దేహమంతా
డెబ్బైఅయిదేళ్ళ వసంతాలలో తడిసి ముద్దై
ఏడు దశాబ్దాల గ్రీష్మాలలో
ఎండి నెర్రెలు విచ్చిన చర్మమూ
ఇదే నేటి మాత చిత్రం!

ఒకనాటి వసంతాల పులకింతల్నో
ఆనాటిహేమంతాలమంచు పలకరింపుల్నో
మదికి తెచ్చుకుంటూ
భారంగా అడుగులో అడుగేసుకుంటూ
అలసిన చూపుల్ని నలుదెసలా ఎగరేస్తూ
ఏమూలనుంచైనా తనచూపందుకునే కంటికోసమో
తనకోసం ఆలోచించే మనసుకోసమో
తన కోసం
తన మాట కోసం
ఒక పలకరింపు కోసం
నిర్విరామ నిరీక్షణలతో
చిట్లిన కలల్ని ఏరుకొని
సొమ్మసిల్లుతున్న రెప్పల్లో నింపుకొని
ఈదేశమంతా తడుముకుంటూ తలుచుకుంటూ
తిరిగి తిరిగి ఎంత తిరిగినా ఎంతచుట్టినా
ఏం మిగిలింది నిర్వేదం నిరుత్సాహం తప్ప

ఒకప్పుడు తన పుట్టినరోజున
బాహ్యదేహాన్ని పులకరింపజేసిన క్షణాలు
అంతటా పండుగ వాతావరణం
రంగుల తోరణాల అలంకరణలు
కీర్తినిచాటే ఉద్విగ్నగీతాలు
ఉప్పొంగే ఉత్సాహ భరిత నృత్యహేలలూ
ఊరంతా ఊగే పూలహారాల సయ్యాటలూ
రెపరెపలాడే పతాకాల మనోహరవిలాసాలూ
గాలినిండా పుష్పవర్షాల సురభిళాలూ
వీధుల నిండా హర్షాతిరేకాల ప్రాంగణాలు
కాని ఇప్పుడంతా మొక్కుబడి సంబరాలేకదా
తూతూమంత్రాల ఉపన్యాసాల హోరులేకదా
ఎవరి గోల వారిదిప్పుడు
కన్నతల్లి నే ఏడాదికో మాటు
తలచుకొనే కాలం కదా ఇది
ఇక ఈ తల్లిఊసు ఎవరిక్కావాలి!?

చేతుల మీద సంకెళ్ళగాట్లు
గుండెల్లో గుచ్చుకున్న కత్తిపోట్లు
ఉండుండి సలుపుతూనే ఉన్నాయ్
స్వేచ్ఛా పోరాటోద్యమంలో చేదుజ్ఞాపకాలు
మరకలుమరకలుగా యింకా నిలిచే ఉన్నాయ్
దేహం శక్తిని పుంజుకొని యింకా తేజోవంతం కానేలేదు
ఎప్పటికప్పుడు మతదాడులతోనో
కులకుంపట్ల కొట్లాటలతోనో
రేగిన గాయాలు బాధిస్తూనేవున్నాయ్
ఉండుండి రక్తం మరిగి చెమటై ఇగిరిపోతూనే వుంది
నిలువునా కొల్లగొట్టిన సాంస్కృతిక చైతన్యం
నివురుగప్పిన నిస్తేజమైపోతూనేవుంది
తల్లిని మరచిపోతున్న పిల్లల్ని చూసి
కుమిలి కుమిలి నలిగి నలిగి
డెబ్బైఅయిదేళ్ళ శరీరం వడలిపోతూనే వుంది
దుఃఖం దేహమంతా అల్లుకు పోతూ
ఇంటిదొంగల దాడితో మరింత కృశించి పోతూనే వుంది
చూస్తూ చూస్తుండగానే కళ్ళముందే
వర్తమాన సామాజిక చిత్రపటం
యింకా యింకా మరింతగా మసకబారిపోతోంది. (ఇంకా వుంది)

వ్యాసం

# డెబ్బై అయిదేళ్ల రాజకీయ భారతం 'అమృతాన్ని' ఎవరిచేత తాపించింది?

– ఐ.టి.ఆర్.వి. శివాజీరావు

**మనం** నిద్రపోయేటప్పుడు తప్ప మిగిలిన అన్ని సందర్భాలలోనూ రాజకీయం తన ప్రమేయాన్ని, ప్రభావాన్ని మనపై చూపించని సమయం గానీ సందర్భం గానీ వుండవని అంటారు.

సామాన్య జనం తమ జీవితాన్ని నిర్దేశించేది ఖర్మ అని దేన్నైతే అనుకుంటారో అది నిజానికి ఖర్మ కాదు రాజకీయమే! మన ఖర్మకి మనం బద్ధులం కాదు మన రాజకీయ విధానాలకు మనం బద్ధులం.

ఉపరితలంలో కనిపించే రాజకీయ అంశాలను నిర్దేశించేదీ, శాసించేదీ పునాదిలో ఆర్థికం అయితే పునాదిలో ఉండే ఆర్థిక సారాన్ని పీల్చుకొని ఎదిగిన రాజకీయం తిరిగి ఆ ఆర్థికాన్ని, ఇతర అన్నిరంగాలను శాసిస్తుంది.

మనకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై అయిదేళ్ళు గడిచిందని జబ్బలు చరుచుకుంటున్నాం. ఆజాదీ కా అమృత్ ఉత్సవ్‌ని దేశమంతటా జరుపుకునే సందర్భంలో వున్నాము. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఇంటింటా జాతీయ జెండాలు ఎగరేసి డెబ్బై అయిదేళ్ల రాజకీయ స్వాతంత్ర్యాన్ని, అది అందించిన ఫలాలు ఏమిటో సమీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నాము.

ఈ సందర్భంగా చిన్నప్పుడు విన్న కథ ఒకటి గుర్తుకు వస్తున్నది. ఆ కథ పూర్తిగా గుర్తులేదు కానీ అందులో ఒక తల్లి తన సొంత కొడుక్కి బెల్లం బూరెలు పెడుతుంది, సవతి కొడుక్కి మాత్రం పేడ బూరెలు పెడుతుంది. చూడ్డానికి రెండూ రూపంలో ఒకేలా కనబడతాయి కానీ వాటి పొట్ట విప్పి చూస్తే ఒక దాంట్లో పప్పు మరొక దాంట్లో పేడ కనపడతాయి. అంటే సారంలో తేడా అన్నమాట.

డెబ్బై అయిదేళ్ల స్వాతంత్ర్యంలో వివిధ ప్రభుత్వాలు అవలంబించిన రాజకీయ విధానాలు ఈ దేశంలో ఏ వర్గాలకి ఏయే ప్రయోజనాలను అందించాయో వాటి రూప సార లావణ్యాలను ఈ ఆజాదీ కా అమృత్ ఉత్సవ్ సందర్భంగా బేరీజు వేసుకోవాల్సి వుంది.

1947 ఆగస్ట్ 15 అర్ధరాత్రి యూనియన్ జాక్ దిగిపోయి మన జాతీయ పతాకం రెపరెపలాడింది. ప్రతీ భారతీయుడు ఆ సన్నివేశం చూసి ఉప్పొంగిపోయి ఉంటాడు. అంతవరకూ తనని బంధించిన అదృశ్య సంకెళ్లు ఒక్కసారిగా తెంచుకున్న భావన కలిగి ఉంటుంది. ఈ స్వాతంత్ర్యం మాది ఇక నుండీ ఇది అందించే ఫలాలు మావి అని మనస్ఫూర్తిగా ప్రతి భారతీయుడు భావించిన సందర్భమది.

భారతదేశం యావత్తూ ఒక జాతిగా నిర్మాణం చెందడానికి ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉపయోగించగలవని ప్రతి భారతీయుడు భావించిన తరుణమది.

అందుకే స్వాతంత్ర్యం సాధించిన కొన్నాళ్ళవరకూ సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలను, అసెంబ్లీలకు, పార్లమెంటు భవనాన్ని తిరనాళ్ళలా వెళ్లి సందర్శించేవారట. నేరుగా లోపలికి ప్రవేశించి మూలమూలలా ఆసక్తిగా తిలకించేవారట. ఇకనుంచి అవన్నీ తమ స్వంతం, తామే వాటికి అధినాయకులం, తామే వాటి నిర్దేశకులం అనే భావన వాళ్ల గుండెలనిండా నిండిపోయి ఉండి ఉంటుంది. ఇకనుంచీ ఆ కార్యాలయాల్లోకి తాము పంపించిన ప్రతినిధులు, తమచే నియమించబడే అధికారులు తమ భవిష్యత్తును అతి జాగరూకతతో తీర్చి దిద్దుతారనే గొప్పనమ్మకం, నిశ్చింత ఆనాడు వాళ్ళని ఆవహించి వుంటాయి. ఆ విధంగా ఆనాడు సామాన్య ప్రజలు రాజ్య వ్యవహారాలకు కొంత అంతరాయం, చికాకు కలిగించేవారట.

ఈ నాటి సామాన్య పౌరుడు పార్లమెంట్ భవనం అటుంచి ఒక మామూలు పంచాయతీ ఆఫీస్‌లోకి ఏ జంకూ గొంకూ లేకుండా ప్రవేశించగలడా?! మరి ఆనాడు స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో మామూలు ప్రజలు అలా ఎలా చేయగలిగారు!

బహుశా అలా వెళ్లగలగడం తమ హక్కుగా భావించి వుంటారు. ఎందుకంటే ఎందరో తమవంటి మామూలు ప్రజలు, సామాన్యులు చేసిన అసామాన్యమైన త్యాగాల కారణంగా ఒనగూడిన స్వేచ్ఛ, అనంతర కాలంలో కూడా తమకు అంతటి అధికారాలను అందిస్తుందని నమ్మి వుంటారు.

కానీ 75 యేళ్లుగా రాజ్యాంగం ద్వారా సర్వాధికారాలు దఖలు పరచబడినవని ప్రచారం చేసిన రాజకీయం దేశపు సామాన్య పౌరుడికి భ్రమల్లో కూడా అవి మిగల్చలేదు. నేడు ఆ సర్వాధికారి అయిన సామాన్యుడు, తలమీద వున్న తుండుగుడ్డ గౌరవ సూచకంగా తీసి చేతుల్తో పట్టుకుని రోజుల తరబడి తన పనులకోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూ, అధికారుల కటాక్ష వీక్షణాల కోసం పడిగాపులు పడుతూ ఉంటాడు. ఇదీ ఇన్నాళ్ళ రాజకీయ స్వాతంత్ర్యం సామాజిక జీవితాన్ని పరిణామం చెందించిన తీరు. ఒకప్పుడు ఇది "మాది" అని అనుకున్నదానికి వెలుపల నిల్చొని నేడు "దేహి" అని దేబిరించుకుంటున్న మలుపులో సామాన్య ప్రజలు వున్నారు.

1947 ఆగస్ట్ 15 అర్ధరాత్రి మనం సాధించుకున్నది సమానమైన ఓటుహక్కు అనే స్వాతంత్ర్యం మాత్రమేనని, మనమింకా ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యం సాధించుకోవాల్సి వుందని అంబేద్కర్ ఆనాడే చెప్పాడు. అంటే ఆయన ఉద్దేశ్యం ఆనాడు మనం సాధించుకున్న రాజకీయ స్వాతంత్ర్యం చాలా పరిమితమైనది అని!

వెళ్ళిపోతూ కూడా భారతదేశాన్ని, ఇక్కడి సంపదను పూరికే అలా చూస్తూ వదలబుద్ధి కాలేదు సామ్రాజ్యవాదులకి. అందుకే తమకు అనుకూలంగా వ్యవహరించే ఒక వర్గాన్ని పెంచి అది వారు చేసుకున్న ఉత్తుత్తి పోరాటాలను అసలైన స్వాతంత్ర్య పోరాటంగా చిత్రించి తదుపరి వాళ్ళ పోరాటం కారణంగానే తాము వెళ్లిపోతున్నాము అని నమ్మించి, ఆ స్వాతంత్ర్యాన్ని వాళ్ళ చేతుల్లో పెట్టి నిష్క్రమించారు.

ఆవిధంగా సామ్రాజ్యవాదులు, ఈ దేశంలోని బడా బూర్జువాలతో కుమ్మక్కై, ఇరు వర్గాలు నమ్మకం వుంచగలిగే ఉమ్మడి అభ్యర్థి నెహ్రూ చేతికి, నెహ్రూ ప్రతినిధిగా వున్న కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పగించారు.

అయితే నెహ్రూ ఎవరి ప్రతినిధి అన్నది నిర్ణయించడానికి గీటురాయి ఏమిటి? నెహ్రూ అటు సామ్రాజ్యవాదులకు ఇటు బడా బూర్జువా వర్గానికి మధ్య వారధిలా పని చేశాడన్నదానికి సాక్ష్యం ఏమిటి? అన్నపుడు ఆయన రాజకీయ కార్యాచరణ, దాని నుండి రూపొందిన రాజకీయ విధానాలు ఎవరికి ఏ మేరకు మేలు కలిగించాయో, మరెవరికి అవి కీడు చేశాయో చరిత్ర మన ముందు ఉంచింది.

అంతేకాక అతను అవలంబించిన రాజకీయ విధానాలు ఏ ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందడానికి ఊతమిచ్చాయి, ఆ ఉత్పత్తిశక్తులు ఎవరి అధీనంలో ఉన్నాయి అనేది చూస్తే మనకి నెహ్రూవియన్ విధానాల పరమార్థ మేమిటో, ఆ తర్వాత వచ్చిన లాల్‌బహదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీ నుంచి నేడు నెహ్రూవియన్ విధానాలను తీవ్రంగా విమర్శిస్తున్న మోడీ అనుసరిస్తున్న రాజకీయ విధానాల వరకు ఏమిటో ఎవరికొరకో అర్థమవుతుంది.

"That government is best which governs least" – Henry David Thoreau ఏ ప్రభుత్వమైతే అతి తక్కువ పరిపాలన చేస్తుందో అది ఉత్తమమైన ప్రభుత్వం అన్నాడు అమెరికాకు చెందిన ఆలోచనాపరుడు హెన్రీ డేవిడ్ థోరూ. ఆయనే ఇంకా ఇలా అంటాడు

"That government is best which governs not at all"

"అసలు పరిపాలించకుండా వుంటే అది మరింత ఉత్తమమైన ప్రభుత్వం" అన్నాడు. ఇపుడున్న ప్రభుత్వాల రాజకీయ విధానాలు చూస్తూవుంటే ఆ మాటలు ఆయన ఎందుకన్నాడో అర్థమవుతుంది.

ఈ సంగతి చెబుతున్నపుడు గతంలో సోషల్ మీడియాలో తిరిగిన ఒక కథ గుర్తుకొస్తుంది. అంతేకాక పైన డేవిడ్ థోరూ చెప్పిన మాట ఇప్పటి పరిపాలకులకు ఎంత అతికినట్టు సరిపోతుందో చూడండి.

ఒక సామాన్య చీమ తనమానాన తాను పనిచేసుకుంటూ పోతూ ఉందట. ఈ లోగా ఒక రాజకీయం నేర్చుకున్న చీమ ఈ చీమను చూసిందట.

"అయ్యో! చీమా, చాలా కష్టపడుతున్నావు. నీ కష్టం చూస్తుంటే నా గుండె తరుక్కుపోతుంది. నీ కష్టానికి త్వరలోనే నేను ఒక విధానపరమైన పరిష్కారం కనుక్కుంటాను", అని అన్నదట.

ఆ మాటలకు ఆ సామాన్య చీమ" అయ్యా! ఇందులో కష్టమేముంది. నా పని నేను చేసుకుంటున్నాను. పైగా ఒక దేశ పౌరుడిగా అది నా భాధ్యత కదా!", అని అన్నదట.

"లేదు.. లేదు.. నువ్వెంత కష్టపడుతున్నావో నీకు తెలీదు. నీ పని పరిస్థితులు మెరుగుపడాలి. నీ కష్టానికి తగిన గుర్తింపు ఉండాలి. నిన్ను సరిగ్గా ఆర్గనైజ్ చేసే వాళ్లుండాలి", అని ఆ నాయకుడి చీమ వెళ్ళిపోయిందట.

ఈ చీమ మామూలుగా పని చేసుకుంటుందట. ఆ మర్నాడు మరొక చీమ వచ్చిందట. ఈ శ్రామిక చీమ వద్దకు వచ్చి

"ఏయ్ శ్రామిక చీమా" అని పిల్చిందట.

పనిచేసుకుంటున్న చీమ "ఎవరు బాబూ తమరు?" అని అడిగిందట.

"నేను కొత్తగా ఇక్కడికొచ్చిన అధికారిని. ఇక మీదట నువ్వు నా క్రింద పని చెయ్యాల్సి ఉంటుంది"

ముందురోజు రాజకీయ నాయకుడి చీమ చెప్పిన మాటలు గుర్తొచ్చి తన పని విధానంలో మార్పు తీసుకు రావడానికి ఈయనను పంపాడని అనుకొని, అందులో తన మేలు కూడా వుందని నమ్మి

"అలాగే", అని అన్నది వినయంగా.

ఈ అధికారి చీమ పనికి నిర్దిష్టమైన పనిగంటలు ఉండాలని, క్రమశిక్షణగా పని చేయాలని లేకపోతే డెరిలిక్షన్ ఆఫ్ డ్యూటీ కింద పరిగణించి పనిష్మెంట్ ఇస్తానని పైగా ఇదంతా శ్రామిక చీమ మేలుకోసమేనని చెప్పింది.

"ఓహో" అనుకొని శ్రామిక చీమ మరింత వినయంగా పని చేసుకుంటూ పోయింది.

ఆ మర్నాడు ఇంకొక అధికారి చీమ వచ్చింది. అది "నేను క్వాలిటీ కంట్రోల్ అధికారిని. ఒళ్ళు దగ్గర పెట్టుకొని పని చెయ్యకపోతే చీరేస్తా జాగ్రత్త", అని వెళ్ళిపోయింది. ఇలా మరొక చీమ, మరొక చీమ ఒక పెద్ద వ్యవస్థ రూపు దిద్దుకుంది. ఇపుడు శ్రామిక చీమ తను ఉత్పత్తి శక్తిగా వేరొకరి అధీనంలోకి వెళ్ళిపోవడమే కాక రాజకీయ చీమ నుంచి మొదలుకొని మొత్తం అధికార యంత్రాంగాన్ని మేపే భాధ్యతంతా దానిమీదే పడింది. పైగా వారు వేసే శిక్షలను కూడా ఎదుర్కొంటూ కొద్ది కాలానికే చిక్కి శల్యం అయిపోయింది.

ప్రజలు, ఇప్పటి ప్రభుత్వాల కింద నలిగిపోతున్న తీరు చూస్తుంటే థోరూ అన్న విధంగా అసలు ప్రభుత్వమే అవసరం లేదేమో అనిపిస్తుంది.

★ ★ ★ ★ ★

1920ల నాటికే ప్రపంచ వ్యాపితంగా తమ అధీనంలో వున్న వలస దేశాల్లో వెల్లువెత్తుతున్న ప్రజా ఉద్యమాలు, మరోపక్క విప్లవం విజయవంతం అయి సోవియట్ యూనియన్‌లో పాలన కార్మికవర్గం చేతిలోకి రావడం వంటి పరిణామాలు సామ్రాజ్యవాదులు తమ ఎత్తుగడలు మార్చుకునేలా చేశాయి. తమ వలస దేశాల్లో అవలంబించాల్సిన రాజకీయ ఎత్తుగడలు, వ్యూహాలను ఆనాటి నుంచీ ఏర్పరుచుకోవడం సామ్రాజ్యవాదులు మొదలుపెట్టారు. తమ కనుసన్నల్లో మెలిగే, తమ అదుపులో ఉండే ఉద్యమాలను పెంచి పోషించడం మొదలు పెట్టారు. అలా పుట్టిందే భారత జాతీయ కాంగ్రెస్. నువ్వు తిట్టినట్టు తిట్టు, నేను కొట్టినట్టు కొడతాను అని ఒప్పందాల మేరకు ఉద్యమాన్ని అంగీకరించి, కొన్ని సంస్కరణలు ప్రజలకు ఎంగిలి మెతుకుల్లా వెదజల్లడం మొదలు పెట్టింది బ్రిటిష్ ప్రభుత్వం.

ఆ సంస్కరణలు తాము చేసిన పోరాటం కారణంగానే సాధ్యమయ్యాయని ప్రజలను బలంగా నమ్మించగలిగింది కాంగ్రెస్. అందుకు నిరాడంబరతతో, కొల్లాయి కట్టుకొని, ఏ కోరికలు లేని ఋషి

పుంగవుడిగా గాంధీ అవసరం అయ్యాడు. గాంధీ తన నాయకత్వంలోని జాతీయ ఉద్యమాలు ఏమాత్రం పరిధి దాటకుండా జాగ్రత్తగా చూసుకునేవాడు. ఆ పోరాటాలలో కార్మిక వర్గం ఏమాత్రమైనా చైతన్యం సంతరించుకుని ఉద్యమాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటుందేమోనని కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం బెంగటిల్లిపోయేవి. ఒకవేళ ఉద్యమంలో అటువంటి సూచనలు ఏమాత్రం పొడగట్టినట్టు కనిపించినా ఏదో రకంగా ఉద్యమాన్ని విరమించే ఎత్తుగడలు కాంగ్రెస్ నాయకత్వం పన్నేది.

1946లో జరిగిన నావికాదళ సమ్మెను బ్రిటిష్ ప్రభుత్వం అణిచివేయడంలో వారికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇచ్చింది. "దేశం ఇలాంటి 'అల్లరి మూకల' చేతుల్లో పడడం చూస్తూ 125 సంవత్సరాలు బ్రతకడంకన్నా మంటల్లో పడి మరణించడం మేలు" అన్నాడు గాంధీ.

గాంధీ కార్మికవర్గాన్ని ఏ విధంగా చూసాడో, బ్రిటిష్ వాళ్ళు బెదిరిపోతే, ఈయన ఒణికిపోయాడు. కార్మికవర్గ పాత్రను నిరసించడంలో బ్రిటిష్ వారితో మమేకం అయ్యాడు.

గాంధీకి, గాంధీ ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్‌కు వారి వెనుక వున్న జాతీయ బూర్జువా వర్గానికి విదేశీ పాలకుల కన్నా దేశంలోపల వున్న కార్మికవర్గం అంటేనే భయం. ఎందుకంటే కార్మికవర్గం నిజమైన అర్థంలో చైతన్యవంతం అయితే అక్కడితో ఆగదని వాళ్లకు స్పష్టంగా తెలుసు. అదే సంగతి సామ్రాజ్య వాదులకూ తెలుసు. అందుకే దేశాన్ని అల్లరి మూకల చేతుల్లో పడకుండా నావికాదళ తిరుగుబాటును తీవ్రంగా అణిచివేసారు.

ఆఫ్రికా మరియు ఆసియా ఖండాలలో వెల్లువెత్తుతున్న ప్రజా ఉద్యమాలను, తిరుగుబాట్లను అణిచివెయ్యగల శక్తి సన్నగిల్లిన సామ్రాజ్యవాదం, అప్పటికే అవమానకరమైన రీతిలో చావు తప్పి కన్ను లొట్టబోయిన విధంగా రెండవ ప్రపంచ యుద్ధంలో గెలిచినప్పటికీ ఆర్థికంగా సైనికపరంగా నష్టపోయిన బ్రిటన్ వలస దేశాల పట్ల తన రాజకీయ విధానాన్ని మార్చుకోక తప్పలేదు. ఆ విధంగా అధికారం భారత బడా బూర్జువావర్గం చేతిలో పెట్టి తమ పారిశ్రామిక, ఆర్థిక అవసరాలు, మార్కెట్లు సుస్థిరం చేసుకొని బ్రిటిష్ సామ్రాజ్యం నిష్క్రమించింది.

నెహ్రూ మొదటి ప్రధానమంత్రిగా, లార్డ్ మౌంట్ బాటెన్ చివరి గవర్నర్ జనరల్‌గా భారత దేశపు రాజకీయ భవిష్యత్తు 1947 ఆగస్ట్ అర్థరాత్రి నిర్ణయమైంది. ఐ.సీ.ఎస్ వంటి పోస్టులు రద్దుచేస్తామని, అంతంత జీతాలు వారికి అనవసరమని అన్న నెహ్రూ ఆచరణలో వాటిని రద్దు చెయ్యలేదు. తరవాతి సంవత్సరాలలో కూడా బ్రిటిష్ జనరల్స్, సైన్యాధ్యక్షులు ఈ దేశాన్ని పర్యవేక్షిస్తూ వున్నారు. మన రాజకీయ నాయకత్వం తన లొంగుబాటును స్వాతంత్ర్యం తర్వాత కూడా కొనసాగించింది. బ్రిటిష్, అమెరికా బూర్జువావర్గం భారతదేశంతో తమ సంబంధ బాంధవ్యాలు అనివార్యం అని ప్రకటించుకున్నారు.

అదే సమయంలో భారత్ బడా బూర్జువావర్గం బ్రిటన్, అమెరికాలలో పర్యటించి గారితో రహస్య ఒప్పందాలు కుదుర్చుకుని వచ్చారు. ఆ క్రమంలో రూపొందింది బాంబే ప్రణాళిక. భారత బడా బూర్జువాలందరూ కలసి ఈ డ్రాఫ్ట్‌ని భారత ప్రభుత్వం ముందు పెట్టారు. ఈ దేశంలో తాము పరిశ్రమలు నెలకొల్పడానికి తమకు ఏమేమి రక్షణలు, రాయితీలు కల్పించవలసిన వున్నదో ఆ ప్రణాళికలో పొందుపరిచారు. మరోపక్క విదేశీ సంస్థలతో మిలాఖత్ ఒప్పందాలు కుదుర్చుకుని ఈ జాతీయ బూర్జువావర్గం దళారీ వర్గంగా అభివృద్ధి చెందింది.

మరోపక్క భూ సంస్కరణలు అమలుచేస్తుందని ఎదురు చూసిన ప్రజలకు అది అడియాశగానే మిగిలిపోయింది. భారత్ యూనియన్లో కలవ నిరాకరించిన నిజాంకు వ్యతిరేకంగా ప్రజలు సాయుధ తిరుగుబాటు మొదలుపెడితే నిజాం మీద యుద్ధం పేరుతో తెలంగాణాలోకి ప్రవేశించిన యూనియన్ సైన్యాలు, నిజాం మీద కాక నిజాంతోనూ, ప్రజలను చాలా దారుణంగా హింసించిన రజాకార్లతోనూ, తెలంగాణ దొరతనంతోనూ తల పడి గ్రామ స్వరాజ్యాలను ఏర్పాటు చేసుకొని, పదిలక్షల ఎకరాల భూమిని పంచుకున్న పేదలను రైతులను, వారికి నాయకత్వం వహించిన కమ్యూనిస్ట్ కార్యకర్తలను 4 వేలమందిని కాల్చిపారేసాయి.

గ్రామాలు వదిలి పారిపోయిన దొర దేముళ్లను తిరిగి గఢీలలో ప్రతిష్టించి, వారి భూములను వారికి తిరిగి ఇప్పించింది, వారి రక్షణకు సైన్యాలను కాపలా పెట్టింది నెహ్రూ ప్రభుత్వం. అదే సమయంలో కమ్యూనిస్ట్ కార్యకర్తలను వందల మందిని వెంటాడి వేటాడి చంపింది భారత సైన్యం. ప్రజాచైతన్యం తమ ఉనికికి ఎంత ప్రమాదమో నెహ్రూకు బాగా తెలుసు అందుకే చివరిదాకా శత్రువుగా వున్న నిజాం కంటే, ప్రజా ఉద్యమాలనే బద్ధ శత్రువుగా భావించాడు ఆయన.

పైకి సోషలిస్టననీ, కాంగ్రెస్‌లో ఉన్న కమ్యూనిస్టననీ మాట్లాడినా ఆచరణలో ఆయన ఈ దేశపు బడా బూర్జువావర్గపు ప్రతినిధిగా వాళ్ళు (నక్క ముదిరి తోడేలు అయినట్టుగా) ఒక దళారీ వర్గంగా మారడానికి అవసరమైన రాజకీయ విధానాలు చట్టబద్ధంగా రూపొందించడంలో తన తోడ్పాటును సంపూర్ణంగా అందించాడు.

మరోపక్క సాధారణ ప్రజల జీవన సంక్షోభం తీవ్రమవుతున్నకొద్దీ వారిలో అసంతృప్తి అనేక నిరసనల రూపంలో పెల్లుబికింది భారత బూర్జువా వర్గానికి కొన్ని సంస్కరణలు చేపట్టక తప్పలేదు. నెహ్రూ హయాంలో అనేక ప్రాజెక్టులు నిర్మించడం, పబ్లిక్‌రంగ సంస్థలను స్థాపించడం వంటి చర్యలు చేపట్టారు. అయితే ఇదంతా భారత కార్మిక వర్గం మేలుకోసం జరిగిందనే భ్రమల్లో వుంచి బ్యాక్‌డోర్ గుండా విదేశీ పెట్టుబడులు దేశంలోకి ప్రవహించడానికి అవకాశమిచ్చారు. ఈ విధంగా గుత్తపెట్టుబడి దేశంలోకి ప్రవహించి దేశపు మూల్గులను పీల్చడానికి దారులు ఏర్పరిచారు. వీటిని ఆసరా చేసుకొని బడా బూర్జువావర్గం విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ అయి దేశ వనరులు విదేశాలకు తరలిపోవడానికి తన పాత్ర తాను పోషించి అందుకు ప్రతిగా తన వాటా తాను పొందుతున్నది. శవాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు ఒక చెయ్యి వేసినవాడికి ఆఖర్న ఇంత సారా పోస్తారు. ఈ రకంగా జాతీయ బూర్జువాలోని ఉన్నతవర్గం తన జాతీయ స్వభావాన్ని వదిలిపెట్టి దళారీ స్వభావాన్ని సంతరించుకుంది. అందుకు దానికి గుత్త పెట్టుబడి మోచేతి నుంచి కారిన ఎంగిలి అంబలి లభించింది.

ఈ దేశ ప్రజలకు జవాబుదారీగా వుండవలసిన రాజకీయ నాయకత్వం వారికి చిట్టి పొట్టి సంస్కరణలతో సరిపుచ్చి విదేశీ గుత్త పెట్టుబడులకు వనరులు దోచిపెట్టడం మొదలుపెట్టింది. పాలకవర్గాలను సంక్షోభ తీవ్రత తాకినపుడు, దాని నుంచి బయటపడడానికి చైనా

బూచినో, పాకిస్థాన్ బూచినో చూపించి సాధారణ అమాయక సైనికులను తమ రాజకీయ ప్రయోజనాలు పరిరక్షించుకోవడానికి బలిపెట్టే రాజ తంత్రానికి పూనుకోవడం భారత పాలకవర్గాలకు పరిపాటిగా మారింది. ఆ యుద్ధభారాలను ప్రజల మీద మోపి వారి జీవనాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేశారు. నాటి నెహ్రూ కాలంలో చైనా, పాకిస్థాన్ యుద్ధాలు మొదలుకొని, ఇందిర హయాంలో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధాలు, బంగ్లాదేశ్ విమోచన, బీ జె పి వాజపేయి ప్రధానమంత్రిగా వున్నప్పుడు జరిగిన కార్గిల్ యుద్ధము, మోడి ఆధ్వర్యంలోని పుల్వామా ఘటనలు, పాకిస్థాన్ పై జరిపిన సర్జికల్ స్ట్రైకులు ఈ కోవకు చెందినవే!

★ ★ ★ ★ ★

ఇందిర అంటే ఇండియా, ఇండియా అంటే ఇందిర అనిపించుకున్న ఇందిరాగాంధీ పరిపాలనలో భారతదేశం మరింత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంది. మరోపక్క టాటాల, బిర్లాల ఆస్తులు ప్రపంచ కుబేరుల స్థాయికి చేరుకుంటున్నాయి ఇంకోపక్క నూతన ధీరూబాయ్ అంబానీ వంటివాళ్ళు ఇందిరాగాంధీ ఇచ్చిన రాయితీలతో, బ్యాంక్‌లు ఇచ్చిన తీర్చనవసరం లేని అప్పులతో బూర్జువావర్గంగా జాతీయ ఆదాయంలో తమ వంతు వాటాను సుస్థిరం చేసుకున్నారు.

ఇందిరాగాంధీ పరిపాలనలో ప్రజల ఆహార భద్రత కరువై రోజూ అమెరికా నుంచి గోధుమలు వస్తేనే ఇక్కడ భారతీయులకు తిండి లేదంటే పస్తులు అన్న చందంగా తయారయ్యింది. ఆ క్రమంలోనే ఆకుపచ్చ విప్లవానికి తెరతీశారు. ఏం.ఎస్.స్వామినాథన్‌ని ముందుపెట్టి భారతదేశం వ్యవసాయరంగంలోకి పెద్ద ఎత్తున అమెరికా తన పురుగు మందులను, ఎరువులనూ, అధిక దిగుబడినిచ్చే వంగడాలతో మన వ్యవసాయరంగంలో చొరబడింది. అంతవరకు వ్యవసాయరంగం పెద్దగా మదుపు అవసరంలేని రంగంగా వుండేది. కానీ వ్యవసాయక విప్లవం పేరుతో వ్యవసాయ రంగంలో చేపట్టిన సంస్కరణలు తెరవెనుక అమెరికన్ ఎరువులు, పురుగుమందులు విత్తన కంపెనీలకు కొత్త మార్కెట్‌ను సృష్టించడమే కాక భారత వ్యవసాయ రంగం యొక్క స్వావలంబనను పెద్ద ఎత్తున దెబ్బతీసింది. అప్పటిదాకా పెట్టుబడులు పెద్దగా లేని వ్యవసాయరంగం ఆ తర్వాత పంట ఖర్చులు పెరిగిపోయి తడిపి మోపెడయ్యాయి. మరోపక్క ప్రభుత్వం నుంచి మద్దతుధర పెద్దగా లేకపోవడంతో గిట్టుబాటు లేక రైతాంగం నలిగిపోవడం మొదలయ్యింది.

అంతేకాక పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం అన్ని రంగాల ప్రజల్లో పెద్ద ఎత్తున అసంతృప్తి పెరిగిపోయింది. ఈ సంక్షోభం నుంచి బయట పడడానికి రాజభరణాల రద్దు, బ్యాంక్‌ల జాతీయం, ఇరవై సూత్రాల వంటి చిట్టిపొట్టి సంస్కరణలు ప్రవేశపెట్టింది. అయినప్పటికీ తీవ్రమైన రాజకీయ సంక్షోభం ఎదుర్కోక తప్పలేదు. ఫలితంగా భారతదేశం ఎమర్జెన్సీ అనే చీకటిలో మగ్గిపోవాల్సి వచ్చింది.

★ ★ ★ ★ ★

ప్రపంచ వ్యాపితంగా వచ్చిన ఆర్థిక సంక్షోభాల ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక సంక్షోభాలు మూడవ ప్రపంచ దేశాల్లో రాజకీయ విధానాలను తీవ్రంగా ప్రభావితం చేసాయి. అభివృద్ధిచెందిన దేశాలు పునరావృతమయ్యే తమ ఆర్థిక సంక్షోభాలను మూడవ ప్రపంచ దేశాల మీదకి నెట్టివేసే ఎత్తుగడే సరళీకృత ఆర్థికవిధానాలు. ఈ విధానాలు స్వేచ్ఛగా ఆయా దేశాల్లోకి ప్రవహించాలంటే అక్కడి రాజకీయ విధానాలు అందుకు అనుగుణంగా మారాల్సి వుంటుంది. అందుకే మన దేశంలో తొంభైల ముందు పరిపాలించిన రాజీవ్‌గాంధీ తొంభైల తర్వాత పరిపాలించిన పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లు తమ రాజకీయ విధానాలను పునర్నిర్మించవలసి వచ్చింది. మారిన రాజకీయ విధానాలే అందుకు అనుగుణమైన ఆర్థిక విధానాలను దేశంలో రూపొందించాయి.

ఈ విధానాలు ప్రజల శ్రమ శక్తిని కారుచౌక వనరుగా మార్చి. ఇక్కడి భూములను, అడవులను, వనరులనూ పూర్తి స్థాయిలో కొల్లగొట్టడానికి అవకాశమిచ్చాయి.

ఈ విధానాలు మనదేశంలో అపర కుబేరులను గణనీయంగా పెంచి ఆ మేరకు ప్రజల జీవన స్థాయిలను దిగజార్చేసాయి. ఈ విధానాలు దేశంలోకి ప్రవేశించిన తర్వాత రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు లక్షల్లోకి మారాయి. గ్రామాలు కుదేలయిపోయాయి. ప్రజలు గ్రామాల నుంచి విపరీతంగా వలసలు పోవడం మొదలుపెట్టారు. భూముల నుంచి రైతులు గెంటివేయబడ్డారు, అడవుల నుంచి ఆదివాసీలు విస్తాపనకు గురయ్యారు.

ప్రపంచీకరణ నాలుగవ దశలో మోడీ భారతదేశ ప్రధాన మంత్రి కావడం యాదృచ్ఛికమేమీ కాదు. సంక్షోభాల నుంచీ తమను బైట పడవెయ్యగల నాయకులను ఏరికోరి ఎంచుకుంటుంది సామ్రాజ్యవాదం. భారత దేశంలో అందుకు నూటికి నూరు మార్కులు సంపాదించుకున్న నాయకుడు మోడీయే!

ఒక పక్క తీవ్ర జాతీయవాదం రెచ్చగొడుతూనే మరో పక్క ఆ ముసుగులో దేశాన్ని దేశ వనరులను తెగనమ్మడానికి పూనుకున్నాడు మోడీ.అందుకు తగ్గ రాజకీయ విధానాల రూపకల్పన అవసరమైంది. ఒకవేళ అవసరమైతే పార్లమెంటులో చర్చ అవసరం లేకుండానే చట్టాలు చేయడానికి పూనుకుంటున్నాడు. నిన్న మొన్న చేసిన వ్యవసాయ చట్టాలు దీనికి ఉదాహరణ. అంటే మరింత దూకుడుగా వ్యవహరించి సామ్రాజ్య వాదులకు మరింత నమ్మిన బంటుగా వుండదలుచుకున్నాడు. అయితే ప్రపంచీకరణ విధానాలు అమలు చేయడానికి దేశంలో తీవ్రజాతీయ వాద రాజకీయాలు అవసరం కావడం ఒక వైరుధ్యం.

దాదాపు ఇరవై రెండు వేలమంది వివిధ ఉద్యమ కారులు, హక్కుల కార్యకర్తలు ఉపా, దేశద్రోహ చట్టాలు మోపబడి జైళ్లలో వున్నారు. అదే సమయంలో రేపిస్ట్‌లు, మత కలహాలు రెచ్చగొట్టినవాళ్ళు, నేరస్థులు బయట యధేచ్ఛగా తిరుగుతున్నారు.

డెబ్భై అయిదేళ్ల రాజకీయ స్వాతంత్ర్యంలో ప్రపంచ స్థాయి కుబేరులు పెరిగిపోతుంటే మరోపక్క జనాభాలో 70కోట్ల మంది ప్రజలు మూడు పూటలా తిండి లేక ఆకలితో మాడుతున్నారు. ప్రజల జీవన ప్రమాణా సూచీలో, ఆహారభద్రత సూచీలో, ఆకలి సూచీలో సమస్త రంగాలలోనూ ప్రపంచంలో అత్యంత వెనుక బడిన దేశాల కన్నా వెనుకబడి వున్నాము. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్న మన దేశంలో ప్రజలకు ఓట్ల సమయంలో ఇంకే విధంగానూ రాజకీయాల్లో భాగస్వామ్యం లేకపోవడం సిగ్గుపడాల్సిన విషయం. ●

స్పందన

# విరాటాచార్యుల అరాచకపర్వం

\- మనస్విని

**విరాటపర్వం, ఆచార్య.....**

రెండూ దారుణంగా ఫ్లాప్ అయిపోయిన సినిమాలే అయినప్పటికీ, చాలా చర్చ రేపిన సినిమాలు కూడా. చిరంజీవి హీరోగా నటించిన 'ఆచార్య' ఎలాగూ వాణిజ్యపరమైన విలువలతో నిర్మించబడినదే కాబట్టి దాని సంగతి కాస్త పక్కనపెడితే.... ఆర్టు సినిమాగా, కథానాయిక ప్రాధాన్యత ఉన్న సినిమా అనే, కొత్త ప్రయోగం అనే, వివిధ "ట్యాగులు" ధరించి మనముందుకొచ్చిన సినిమా 'విరాటపర్వం'. తూము సరళ అనే అమ్మాయి జీవితం ఆధారంగా తయారుచేసుకొన్న కథ మా సినిమా అంటూ చెప్పుకొచ్చింది చిత్రబృందం. నిజంగా సినిమాలో చూపించిన నిజం ఏమిటో చూద్దాం.

1990 ప్రాంతంలో తెలంగాణాలో, పోలీసులకూ, నక్సలైట్లకూ మధ్య జరుగుతున్న కాల్పుల సన్నివేశంలో కథానాయిక వెన్నెల (సాయిపల్లవి) జన్మించడం, అదే సమయంలో ఒక మహిళా నక్సలైటు చనిపోవడంతో సినిమా ప్రారంభం అవుతుంది. తండ్రి (సాయిచంద్) ప్రజాకళాకారుడు కావడం, కుటుంబంలోని కొంత ప్రజాస్వామిక వాతావరణం వలనా, వెన్నెల మిగతా ఆడపిల్లలకంటే కొంత స్వేచ్ఛగా పెరుగుతుంది. తన స్నేహితురాళ్ళ ద్వారా "అరణ్య" అనే వ్యక్తి రచించిన పుస్తకాలు చదివి అతని రాతల పట్ల (ఈ రాతలన్నీ శ్రీశ్రీ 'మహాప్రస్థానా'నికి కాపీలాగే అనిపించాయి నాకైతే) తద్వారా అతని పట్ల ఆకర్షితురాలవుతుంది. అరణ్య అంటే దళనాయకుడు రవన్న (రానా) అని తెలుసుకొని, అతని కోసం (రాహుల్ రామచంద్ర) బావతో పెళ్ళిని రద్దుచేసుకొని ఇంటినుండి బయలుదేరుతుంది. అలా బయలుదేరిన వెన్నెల, రవన్నని కలిసే ప్రయత్నంలో పడిన కష్టాలూ, రవన్నపై ఆమెకున్న ప్రేమ అందరి ఆడపిల్లల్లాంటి ఆకర్షణ కాదూ.... చాలా ఉన్నతమైనది అని నిరూపించడానికి దర్శకుడు చాలానే కష్టపడ్డాడు. చివరికి రవన్నపై ప్రేమతో, విప్లవంలో చేరినట్లు చూపారు. (విప్లవంపై ప్రేమతో చేరారు అంటే అర్థం ఉందిగానీ, రవన్నపై ప్రేమతో చేరడం ఏంటిసార్?) చివరికి పోలీసులు పన్నిన కుట్ర వలన, సాటి కామ్రేడ్లు ఈమెను ఇన్‌ఫార్మరుగా అనుమానించటంతో రవన్నే వెన్నెలను షూట్ చేస్తాడు. తరువాత నిజం తెలుసుకొని అతను దుఃఖిస్తుండగా సినిమా ముగుస్తుంది.

ఇక రెండవ సినిమా "ఆచార్య".... దీని గురించి ఎంత తక్కువ మాట్లాడుకొంటే అంత మంచిది. టూకీగా కథేంటంటే.... "సిద్ధ" (రామ్‌చరణ్), "ఆచార్య" (చిరంజీవి) దళంలోని మరో నక్సలైటు దంపతుల బిడ్డ. పోలీసులతో ఎదురుకాల్పుల్లో ఈ దంపతులిద్దరూ చనిపోగా, ఆచార్య ఈ అబ్బాయిని దగ్గర్లోని సిద్ధవనంలో వదిలేయగా, పాదఘట్టం గిరిజనులు పెంచి పెద్దచేస్తారు. సిద్ధ పెద్దవాడయ్యాక అతనిని తమలో చేర్చుకొందాం అనుకున్న దళం అతనికి తెలియకుండానే సిద్ధకు కాపలాకాస్తూ ఉంటుంది. (అసలు ఇదేం విచిత్రమైన దళమో, ఈ పెదరాయుడు తరహాలో ఎటువంటి విప్లవ పరిచయం లేనివాడ్ని దళంలోకి తీసుకోవాలనుకోవడం ఏంటో?) కానీ సిద్ధ అక్కడ పాదఘట్టాన్ని కాపాడే క్రమంలో (కొన్ని యాక్షన్ సీన్లూ, ఫైట్లూ, లేక హాస్య సన్నివేశాల అనంతరం) చనిపోతాడు. ఆవిధంగా, తన కామ్రేడ్ మరణానికి ప్రతీకారంగా నక్సలైటు ఆచార్య సింగిల్ హాండెడ్‌గా ఒక ఐటమ్‌సాంగ్‌కి కూడా డ్యాన్సువేసి మరీ ఎలా విలన్ల ఆట కట్టించాడో అన్నదే సినిమా కథ. ఈమాత్రందానికి నక్సలైట్ బ్యాగ్రౌండ్ ఎందుకురా బుజ్జీ! అని మనకనిపించినా, సినిమా తీసినవాళ్ళకి ఇంతకన్నా చెత్త ఐడియా రానందుకు ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకొందాం!

నక్సలైటు నేపథ్యం పెట్టి, విప్లవం అనీ, సమసమాజం అనీ, మార్క్స్ అనీ, లెనిన్ అనీ చాలా పెద్ద పెద్ద విషయాల్నే పంచ్ డైలాగులుగా మార్చేశారు కాబట్టి ఈ రెండు సినిమాల గురించీ మాట్లాడక తప్పడంలేదు.

విరాటపర్వం విషయానికి వస్తే సినిమాకు ప్రేరణ అయిన "సరళ" జీవితంలో ఎక్కడా "ప్రేమ" అన్న ప్రస్తావనే లేదు. ఆమె కుటుంబీకులు చెప్పిన సమాచారం ప్రకారం, ఇంటరు చదువుతున్న సరళ విప్లవం పట్ల ఆకర్షితురాలయ్యే నక్సలైట్లలో కలిసిపోయిందని తెలుస్తుండగా (ఆధారం : అంతర్జాలం) దర్శకుడు మంచి మసాలా ప్రేమకథని దీని చుట్టూ అల్లుకొన్నాడు. విప్లవానికి ఆకర్షితురాలయిన సరళను, విప్లవ నాయకునికి ఆకర్షితురాలయిన వెన్నెలగా మార్చడానికి దర్శకునికి ఏం హక్కు ఉందని? అక్కడితో ఆగకుండా వెన్నెల పాత్ర ద్వారా, మార్క్స్, లెనిన్‌లు ప్రేమించలేదా? వాళ్ళు ప్రేమించగా లేనిది నేను ప్రేమిస్తే తప్పేంటి? అని వితండవాదం చేయించి ఏం చెప్పాలనుకొన్నాడు అసలు? ఒక వెన్నెలనే కాకుండా హక్కుల ఉద్యమకారిణి శకుంతల టీచర్ (నందితాదాస్) కూడా ఒక నక్సలైటు నాయకునిపై ప్రేమతోనే విప్లవంలోకి వచ్చినట్లు చూపించారు. అంటే ఎవరో ఒకర్ని ప్రేమిస్తే తప్ప స్త్రీలు ఉద్యమాల్లోకి రారు అనా? ఏదోవక వ్యక్తిగత స్వార్థం ఉంటే గానీ స్త్రీలు నలుగురి కోసం నడుంబిగించరు అనా? పోరాటాల చరిత్ర ఉన్న మహిళల్ని కించపరుస్తూ, ఆడపిల్లలకు సమాజం పట్ల స్వంత వ్యక్తిత్వం, ఆలోచనలు, అభిప్రాయాలు లేనట్లు కేవలం ప్రేమల కోసమే జీవితం అని చెప్పటం ఏ విలువలను ప్రచారం చేయటానికి?

పారిస్‌కమ్యూన్ నుండి మొన్నటి జార్జి ఫ్లాయిడ్ రేసిస్ట్ హత్యకు వ్యతిరేకంగా నినదించినవారి వరకూ ఎంతోమంది మహిళలు మగవారితో భుజం కలిపి అన్యాయాన్ని ఎదిరించి నిలబడ్డం కనిపించడంలేదా? లేక యే బూర్జువా విలువలు చెరిగిపోతాయేమోనన్న భయంతో మీరే కళ్ళూ, చెవులూ మూసుకొంటున్నారా? ఇదేకాక, కథానాయకుడు తన తల్లిని కలిసిన సన్నివేశంలో కూడా, "అమ్మా! నన్ను కన్నందుకు విప్లవాభివందనాలు!" అని తల్లిపై కవితను చదివితే, అందుకు బదులుగా ఆ తల్లిచేత "శాంతి! యుద్ధంలో లేదు బిడ్డా! ఆడదాని ప్రేమలో ఉంది!" అని అనిపించారు? అంటే అసలు దర్శకుని ఉద్దేశ్యం ఏమిటి? విప్లవాన్ని వదిలేసి అందరూ ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకోవాలి అనా? జమీందారుల దౌర్జన్యాలు, దోపిడీ, పీడన, కష్టించేవారిపై తరతరాలుగా సాగుతున్న అణచివేత ఇవన్నీ కట్టుకథలు అనుకొంటున్నారా? పీడిత వర్గానికి సాయంగా నిలబడినవాళ్ళు బుద్ధిలేనివాళ్ళు అనుకొంటున్నారా? ఇవన్నీ ఆలోచించేముందు కనీసం కథానాయిక తండ్రిగా నటించిన సాయిచంద్ సినిమాల్లో "మా భూమి" అనే సినిమా ఒకటి ఉందనీ, దాన్ని చూసుంటేనన్నా తెలిసి ఉండేది తెలంగాణా చరిత్ర ఏంటో, అక్కడి పరిస్థితులేంటో, సరళ జీవితానికి నేపథ్యం ఏంటో అని. ఇదేదీ పట్టించుకోకుండా, వర్గభేధాలు రూపుమాపాలని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పాటుపడుతున్నవారికి సిద్ధాంతాలేమీ లేని, ఆశయాలు, ముందుచూపు తెలియని వెర్రిబాగులవాళ్ళగా ఊహించుకొని ప్రేమించండి, డ్యూడ్ పోయేదేముంది? అని డైలాగులు చెప్పించి ఏదో ఉద్ధరించేశాం అనుకోడానికి మనసెలా ఒప్పుతోంది? సినిమా అంతటా ఇలాంటి పూర్తి వ్యతిరేకమైన విషయాలెన్నిటినో విప్లవ భావజాలానికి అంటగట్టే ప్రయత్నం జరిగింది.

ఇక విరాటపర్వానికి మించి "ఆచార్య" కూడా విప్లవాన్ని దిగజార్చడానికి తనవంతు కృషి చాలా నిజాయితీగానే చేసిందని చెప్పాలి. ఆ ప్రయత్నంలో భాగంగా, నక్సలైటు డ్రెస్‌లో ఉన్న చిరంజీవి, చేతికి ఎర్రతువాలు కట్టుకొని "చానా కష్టం వచ్చిందే మందాకినీ" అంటూ తిరగలేని మెలికలు తిరుగుతూ డ్యాన్సుచేయడం, కల్లుతాగడం లాంటి "వెల్ డైరెక్టెడ్, వెల్ పర్‌ఫార్మ్‌డ్" సన్నివేశాలెన్నో ఉన్నాయి ఈ సినిమాలో. ఇక, "కామ్రేడ్" అని చిరంజీవి అనే మాట ఏదో సినిమాలో "కబాలి రా!" అని రజనీకాంత్ అన్నట్లుగానే ఉంటుంది. ఆవిధంగా వేలాదిమందిని కలుపుకొని ముందుకెళ్ళాల్సిన విప్లవాన్ని 1, నేనొక్కడినేగా, వన్‌మ్యాన్ షోగా ఈ సినిమాలు సక్సెస్‌ఫుల్‌గా దిగజార్చేశాక కమ్యూనిజం పునాదుల నుండీ వ్యతిరేకించే కులమత బేధాలూ, పురుషాధిక్యత, అర్థంలేని హీరోయిజం లాంటి విషయాలన్నిటిని కమ్యూనిజానికే అంటగట్టి ఎటువంటి శేషమూ మిగల్చకుండా 100% కమ్యూనిజాన్ని అవమానించారు.

అంటే నక్సలిజాన్ని మనం వ్యతిరేకించకూడదా? కీర్తించాలా? అంటారమో? విప్లవం, సమసమాజం అనే మాటలు పంచ్ డైలాగులు కాదు. ఈ సినిమాల్లో చూపిస్తున్నట్లు హీరోయిజం, ఫైట్లు, పాటలు కాదు. వాటికి కొన్ని వందల, వేల సంవత్సరాల చరిత్ర, సంఘర్షణలు ఉన్నాయి. ఈ భావాల వెనుకున్న లోతును, చరిత్రను, ఆశయాల బరువును అర్థం చేసుకోకుండా, నోటికొచ్చిన స్క్రిప్టులు రాస్తూ, చేతికొచ్చిన సినిమాలను తీస్తూ తమ వ్యాపార ప్రయోజనాలకు విప్లవాన్ని పక్కదారి పట్టించడం తప్ప మరొకటి కాదు.

చేగువేరా పోస్టర్లు రూములో అతికించుకొని ఏదో పెద్ద రివల్యూషనరీగా ఫీలవ్వడం, బాధ్యతారాహిత్యమే, "నా చావు నేను ఛస్తా" అన్నట్లు ఉండడమే హీరోయిజంగా సినిమాలు తీసుకుపోతున్న దర్శకులందరికీ ఒకటే ప్రశ్న. "విప్లవం" అనే పదాన్ని ఉపయోగించే ముందు కనీసం ఇంతకుముందు, భారతీయ సినిమాలేవైనా ఈ విషయాన్ని చర్చించాయా అని తెలుసుకొనే ప్రయత్నం చేశారా?!.... చరిత్రనూ, వాస్తవాల్ని తెలుసుకొనే కృషి ఏమైనా చేశారా? సినిమాలో పాత్రలు మాట్లాడే భాష నుండీ, వేషధారణ, ఆహార్యం వరకూ ప్రతిదీ ఒకటికి పదిసార్లు సరిచూసుకొనే మీరు, విప్లవం విషయంలో మొత్తం కథాసారాన్నే ఎందుకని పక్కదోవ పట్టించేస్తున్నారు? విప్లవాన్ని ప్రేమించిన అమ్మాయి కథని వ్యక్తిగత ప్రేమ కోసం జరిగిన కథగా మార్చే హక్కు ఎవరిచ్చారు? ఒక మామూలు పక్కా కమర్షియల్ రివెంజ్ స్టోరీలో నక్సలైటు నేపథ్యం అవసరం ఏముంది? అంటే డబ్బుకోసం, అర్థంలేని ఎలివేషన్స్, హీరోయిజం చూపించడానికి ఎంతకైనా దిగజారుతారా? విప్లవాలని, కమ్యూనిజాలని భ్రష్టుపట్టించాలని మీరెంతగా ప్రయత్నించినా అశేష శ్రామిక, పీడిత జనసమూహమే పెట్టని కోటరా కమ్యూనిజానికి అని తెలుసుకోండి.

ఒకవైపు పీడక - పీడిత వర్గాల మధ్య వైరుధ్యాలు ఆకాశాన్నంటుతూ ఎదురెదురు పడుతున్నాయి. మరోవైపు నెత్తురు మండే శక్తులు నిండే సైనికుల వలె ఉరకలెత్తుతున్న యువశక్తి మార్పు అనివార్యం అంటుంది. ఇటువంటి సమయంలో వ్యవస్థ పునాదుల్ని బద్దలుకొట్టుకుంటూ రావాల్సిన మార్పుకి, విప్లవానికి వేరేదో అర్థాన్ని అంటగట్టడం, యువత కళ్ళకి వెండితెర అడ్డుకట్టాలనుకోవడం ఉద్దేశపూర్వకమైన చర్యకాక మరేమిటి?

ఇప్పటికే పాన్ ఇండియా సినిమా అనే ముసుగులో RRR లాంటి సినిమాలు స్వాతంత్ర్యోద్యమ చరిత్రను పక్కదారి పట్టించేస్తుండగా ఇటువంటి సినిమాలు మరింత ముందుకెళ్ళి విప్లవం అనే మాటనూ, దాని వెనకున్న చరిత్రనూ, సిద్ధాంతాన్ని ఖూనీ చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అన్నిటికంటె బాధాకరమైన విషయం ఏమిటంటే, సినిమాలో హీరో దేవుణ్ని వ్యతిరేకించాడనీ, హీరోయిన్ డైలాగుల్లో మార్క్స్, లెనిన్, మావో తదితరుల పేర్లు వినిపించాయనీ, మొత్తం మూలభావాన్ని తప్పుదారి పట్టించిన వాస్తవాన్ని విస్మరించడం, సోషల్ మీడియా అంతటా ఈ విరాటపర్వంను ఆకాశానికెత్తడం, కొంతమంది విజ్ఞులు సైతం పప్పులో కాలేయడం బాధాకరమైన విషయం.

"పద్మావత్" లాంటి ప్రో - హిందూ సినిమాల గురించి "మా చరిత్రను మంటగలిపేస్తున్నారంటూ గగ్గోలు పెడుతున్న పరిస్థితి మనముందు ఉంది. మరి విత్తనంలోనే పురుగును పెట్టినట్లుగా విప్లవం అనే మాటను తప్పుడు అర్థాన్ని అంటగట్టి నాటుతున్న ఈ విషబీజాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందా?! లేదా?!.... ఎన్నాళ్ళని అబద్ధపు ప్రచారాలని భరిద్దాం!....

కవిత

# అమృతానందాలు

– పినాకిని

ఎగరేయండి! ఎగరేయండి!
ఇంటింటిపై జెండా ఎగరేయండి!
ఎగరేయండి! ఎగరేయండి!

దేశమంటే మట్టికాదోయ్!
దేశమంటే మనుషులోయ్!
ఈ రెండు లైన్లు జెండా దిమ్మ
నుదిటిపై కొత్తగా రాయించండి.

కాకుంటే నాదో కండిషన్....
మేకిన్ ఇండియా కాదు రంగుడబ్బా
మేడ్ ఇన్ ఇండియా కావాలి.
జెండాకు కట్టే దారం నైలాన్ వద్దు
స్వదేశీ జూట్‌మిల్లు తయారీ తేవాలి.
జెండాలోకి గుప్పెడు పూలు కావాలి.
ప్లాస్టిక్ పూల విషం వెదజల్లొద్దు.
నీ చేతితో పెంచిన గులాబీ మొక్కలవో
వీధిలో మీ చేతుల్తో పాదు చేసి నీళ్లు పోసి
పెంచిన తురాయి పువ్వులో అయి ఉండాలి.

ఎగరేయండి! ఎగరేయండి!
ప్రతి ఇంటా ఓ జెండా ఎగరేయండి!
ఏ అప్పులూ లేని మీ సొంత ఇంటిపై మాత్రమే
సగర్వంగా జెండా ఎగరేయండి.
ఇళ్ళు లేనోళ్లంతా మీ మెడలో
ఇళ్లు కావాలని ఒక బోర్డు తగిలించుకొని
ఎగరేయండి! జెండా ఎగరేయండి!

కౌలు భూములు కాని, తాకట్టులో లేని
మీ సొంత పొలంగట్లపై కూడా ఎగరేయండి!

ఒక్క సెంటైనా భూమిలేని వాళ్లంతా
గుంపులు గుంపులుగా వెళ్లి
ఊరికి ఉత్తరాన స్మశానంలో ఎగరేయండి.
దింపుడు కల్లంలో నిలబడి
75 ప్రదక్షిణలు చేయండి.
జెండాకు సెల్యూట్ చేయండి.
దేశమంటే మట్టికాదోయ్!
దేశమంటే మనుషులోయ్!
అంటూ గురజాడ గీతాన్ని
బిగ్గరగా ఆలపించండి.

జెండా గాల్లో ఎగిరితేనే సరిపోదు మిత్రమా!
జనం గుండెల్లో కూడా ఎగరాలి.
ఎగరేయండి! ఎగరేయండి! జెండా ఎగరేయండి!

ఉసూరుమంటున్న ఐడిపిఎల్
మొండి గోడలపై ఎగరేయండి
పనిలోపనిగా పాడుబడ్డ
ఉస్మానియా హాస్పిటల్‌పై మొలచిన
మర్రిచెట్టుక్కూడా ఒక జెండా కట్టండి.

మర్చిపోకండి సార్లూ....
మీ కాన్వాయ్ ఆ దారిన పోయేటప్పుడు
ఒక్కసారి తలెత్తి చూడండి.

రంగు లేక వెలవెలబోతున్న
బిఎస్ఎన్ఎల్ బిల్డింగ్‌పై కూడా
రంగుల జెండా ఎగరేయండి.

ప్రజలారా!
మీ రక్తం చెమటలతో నిర్మించుకున్న

రైల్వేస్టేషన్లలో బస్టేషన్లలో రోడ్ల పొడవునా
రైలు పట్టాలకటూ ఇటూ
రక్షణ జెండాలు ఎగరేయండి!

వందేళ్ల సంబురాలదాకా బతకనిస్తారో లేదో
ఇంటింటా ప్రతిజ్ఞ చేసి రక్షించుకుంటామని
వందల జెండాలు ఎగరేయండి!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ముందు
ఉక్కు సంకల్ప జెండా ఎగరేయండి!
నవరత్నాలను కాపాడుకుంటామని
9 అడుగుల పోరాటజెండాలెగరేయండి!

అమ్ముడుపోని ధాన్యపు రాశుల ముందు
రైతు తలపాగా జెండాగా ఎగరేయండి.
ఆ నిరసన జెండాలో....
నవధాన్యాలూ మూటగట్టి ఎగరేయండి.
మరో వందేళ్లు విత్తనాల్ని కాపాడుకుంటామని,
ఎగరేయండి! ఎగరేయండి! జెండా ఎగరేయండి!

నదులమీదా సముద్రతీరాల పొడవునా
అడవిలో చెట్టు చెట్టుపై ఎగరేయండి!
రేపటికి ఏవి మిగులుతాయో
ఏవి కనుమరుగవుతాయో
ప్రతి చెట్టుకి కాపలాగా పెట్టండి జెండాక్రను
ఎగరేయండి! జెండాను ఎగరేయండి!

అన్నింటికన్నా దేశభక్తితో....
అగ్నివీరుల ఆధునిక చేతులతో
ఆకాశమంత ఎత్తు జెండాలు దేశ
సరిహద్దుల పొడవునా ఎగరేయండి!

ఎగరేయండి జెండా ఎగరేయండి
కనిపించకుండా పోయిన చెరువుల జ్ఞాపకార్థం
స్మారకస్తూపాలు కట్టి వాటి పలకలపై
'ఇక్కడ ఒక ఆకుపచ్చని సమాజం ఉండేది'
అని రాసి పక్కనే ఒక జెండా ఎగరేయండి!

మర్చిపోకండి మిత్రమా! మర్చిపోకండి
బలవన్మరణానికి బలైన లక్షల రైతులను
మనసునిండా స్మరిస్తూ రెండు నిమిషాలు
మౌనం పాటించడం మర్చిపోకండి.

ఎగరేయండి జెండా ఎగరేయండి
మూతబడ్డ ప్రతి స్వదేశీ ఫ్యాక్టరీ
పొగగొట్టాలను వెతికి తెచ్చి
పేరుపేరునా సంతాపజెండా ఎగరేయండి.

ఉపాధి కోల్పోయిన కార్మికులంతా
ఒక నిమిషం నిశ్శబ్దంగా.....
ఎగిరే జెండా ముందు నిలబడండి చాలు
బహుళజాతి బూట్ల చప్పుడు వినిపిస్తుంది.

ఎగరేయండి! ఎగరేయండి!
ఇప్పుడే ఎగరేయండి!
రేపటిరోజున.... ఏ దేశంలోనైనా
ఎగరవేయడానికి జెండా దిమ్మలు
ఇళ్ళూ వాకిళ్ళు స్కూళ్ళు సినిమాహాళ్లు
శిథిలాలుగా మారచ్చు ఉక్రెయిన్‌లా....
సామ్రాజ్యవాదుల యుద్ధాల బీభత్సాన్ని
తలుచుకుని మీ పిల్లలతో ఎగరేయించండి.
ఎగరేయండి! జెండా ఎగరేయండి!

నూరేళ్ల జెండా పండుగ నాటికి
ఎగరేయడానికి మీ చేతిలో తాడూ
మీటరు జెండాగుడ్డనూ కొనలేకపోవచ్చు
ఇప్పుడే ఎగరేయండి! ఎగరేయండి!

పది అడుగులు ఎత్తులో ఎగిరే జెండాను
డాలరు ఎనభైకి దిగిన రూపాయి సంకేతంగా
ఎనిమిదడుగులు అవనతం చేయండి!
అపుడు మీకేమనిస్తుంది?
నాకైతే తల తెగి నేలపై పడ్డట్టనిపిస్తుంది.

జెండా అంటే....
మూడడుగుల గుడ్డముక్కకాదని
తరతరాల ఆత్మగౌరవమనిపిస్తుంది.
దేశమంటే..... మట్టికాదని
దేశమంటే..... మనుషులనీ తెలుస్తుంది.

# సంతాపాలు

**ప్రసిద్ధ చరిత్రకారుడు బ్రజదులాల్ చటోపాధ్యాయ (బి.డి. చటోపాధ్యాయ)** తన 83వ ఏట 2022 జులై 13న మరణించారు. ఆయన 1939 డిసెంబర్ 5న జన్మించారు. ఆయన చరిత్ర ఆచార్యులుగా బర్ద్వాన్, విశ్వభారతి (శాంతినికేతన్) విశ్వవిద్యాలయాల్లో పనిచేశారు. కాని అత్యధిక కాలం ఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో బోధించారు. ప్రాచీన తొలి మధ్యయుగాల చరిత్రపై సాధికారికత కల పండితుడాయన. భారతీయ నాగరికత బహుకోణాలతో కూడిన బహుళ జాతికి సంబంధించినదని ఆయన తన గ్రంథాలలో ప్రతిపాదించారు.

**అజ్మీరు వీరభద్రయ్య :** పద్యకవి, చరిత్ర పరిశోధకులు, తెలుగు ఉపాధ్యాయులు అజ్మీరు వీరభద్రయ్య తన 85వ ఏట 2022 జులై 9న జగ్గయ్యపేటలో మరణించారు. ఆయన 1938లో విజయవాడ జిల్లా వత్సవాయి మండలం మక్కపేటలో జన్మించారు. ఎస్ఎస్ఎల్సి జగ్గయ్యపేట సమీపాన గల పెనుగంచిప్రోలులో చదివారు. 1963లో ఖమ్మం జిల్లా కల్లూరు సమితి పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేరి, 1997లో రిటైరయ్యారు.

ఆయన 1970లో విప్లవ రచయితల సంఘం ఖమ్మం జిల్లా కన్వీనర్గా పనిచేశారు. అప్పట్లో ఆయన రాసిన కవిత 'పీడితులారా ఏకంకండి' నిషేధానికి గురైంది. ప్రజానాట్యమండలి నాటకాల్లో నటించారు. ఆ తర్వాత క్రమంగా ఆధ్యాత్మికతవైపు మరలారు. జగ్గయ్యపేటలో రసమయి సాహితీసమితి స్థాపించి యువ రచయితలను ప్రోత్సహించారు. 2009, 2010, 2011లలో ఆ సంస్థ వార్షికోత్సవాల సందర్భంగా మూడు విశిష్ట సాహిత్య సంచికలను వెలువరించారు. కొమర్రాజు లక్ష్మణరావు జీవితచరిత్ర రాశారు. సామాజిక అంశాలు ఇతివృత్తంగా అనేక పద్య గ్రంథాలు రచించారు. 2014 సమైక్య రాష్ట్రం కోసం, తెలుగు భాష పరిరక్షణ కోసం ఉద్యమించారు.

**పద్యకవి పువ్వాడ తిక్కన సోమయాజి** 2022 జులై 19న విజయవాడలో తన 83వ యేట మరణించారు. ఆయన కవి పాదుషా పువ్వాడ శేషగిరిరావు కుమారునిగా 1939 అక్టోబరు 14న మచిలీపట్నంలో జన్మించారు.

ఆయన జీవిత భీమా సంస్థలో పనిచేసి డివిజన్ స్థాయి అధికారిగా పదవీ విరమణ చేశారు. కృష్ణాజిల్లా రచయితల సంఘానికి అండదండగా వుండేవారు. 'ఆమ్రపాలి', 'పిబరేరామరసమ్', 'సువర్ణ సౌరభం', 'కవనలేఖని' మొదలగు పద్యకావ్యాలు రచించారు.

**కార్టూనిస్టు 'పాప' (కొయ్యశివరామరెడ్డి)** తన 78వ యేట 2022 జులై 23న హైదరాబాదులో మరణించారు. ఆయన కాకినాడలో 1944 ఆగస్టు 14న జన్మించారు. కాకినాడలో తండ్రి ఇచ్చిన ప్రోత్సాహంతో చిత్రకళలో కృషిచేశారు. స్కూల్ ఫైనల్ విద్యార్థిగా వున్నపుడు వీరి మొదటి కార్టూన్ 'ఆంధ్రపత్రిక' సచిత్రవారపత్రికలో అచ్చయింది.

కళాశాల చదువు పూర్తయ్యాక విశాఖ టౌన్ప్లానింగ్ సర్వేయర్గా కొంతకాలం పనిచేసి కర్ణాటకలో ఫైన్ ఆర్ట్స్ కోర్సు చేసి హైదరాబాదులో ఎన్.జి.ఆర్.ఇ.లో చిత్రకారునిగా పనిచేశారు. బాపు సలహాపై కార్టూనిస్టు వృత్తిని ఎన్నుకొని, 1975లో రాజకీయ కార్టూనిస్టుగా 'ఈనాడు' పత్రికలో చేరారు. ఆ కాలంలో ముఖ్యమంత్రి అంజయ్య, ఆయన హెలికాప్టరు యాదగిరి మీద వేసిన కార్టూను పాఠకులను అలరించాయి. 1982లో ఫ్రీలాన్సర్ అయ్యారు. 'ఆంధ్రభూమి', 'ఆంధ్రప్రభ', 'సమయం' పత్రికల్లో కార్టూన్లు వేసారు. 'ఈవారం' వారపత్రిక నడిపారు.

**బాలసాహిత్యవేత్త రెడ్డి రాఘవయ్య** హైదరాబాదులో 2022 జులై 24న తన 82వ యేట మరణించారు. ఆయన తెనాలి వద్ద ప్యాపర్రు గ్రామంలో 1940 జులై 1న జన్మించారు. నిడుబ్రోలులో ఎస్.ఎస్.ఎల్.సి., ఆ తర్వాత ఐ.ఐ.టి.లో శిక్షణ పొంది బెంగుళూరు హిందుస్తాన్ ఏరోనాటిక్స్లో మెకానిక్గా చేరి హైదరాబాద్ శాఖలో ఇంజనీరుగా 2000లో రిటైరయ్యారు.

బాలసాహిత్యంపై విశేష కృషి చేసి దాదాపు 35 పుస్తకాలు రాశారు. 1955 డిశంబర్ 25 – 'విశాలాంధ్ర' దినపత్రికలోని చిన్నారి లోకం శీర్షికలో వీరి తొలికథ 'సలహా' ప్రచురింపబడింది. బాలసాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, ఇంకా ఇతర అవార్డులు అందుకున్నారు.

**ప్రముఖ శిల్పి, చిత్రకారుడు సి.వి.ఎన్. పట్నాయక్ (చౌదరి సత్యనారాయణ పట్నాయక్)** తన 97వ యేట 2022 ఆగస్టు 11న విశాఖపట్నంలో మరణించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా బాదం గ్రామంలో 1925 డిసెంబరు 6న జన్మించారు.

చిత్రకారుడు అంట్యాకుల పైడిరాజు సలహాతో ఆయన 1950లో మద్రాసులోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్లో డిప్లమా పూర్తిచేసి గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శిల్పాచార్యునిగా పనిచేశారు. రిటైరైన తర్వాత తన కుమారుని వద్ద విశాఖలో 2009లో స్థిరపడ్డారు. ఆయన దేవీప్రసాద్, ధన్పాల్, ఫణికుమార్ల వద్ద చిత్రకళనభ్యసించారు. రాజస్థాన్కు చెందిన వనస్థలి విద్యాపీఠంలో మ్యూరల్ పెయింటింగ్ (గోడలపై సీలింగ్పై చిత్రకళ)ను నేర్చుకున్నారు. 30 చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కాంస్య శిల్పకళపై ఒక గ్రంథాన్ని రచించారు.

వారి కుమారుడు రవిశంకర్, కోడలు సంగీత కూడా శిల్పులే. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు లలితకళల విభాగంలో శిల్పాచార్యునిగా పనిచేసిన రవిశంకర్ రెండేళ్ళక్రితం కోవిడ్తో మరణించారు.

**రచయిత, సైన్సు ప్రచారకుడు నందాఖరే** తన 76వ యేట 2022 జులై 22న పూనేలో మరణించారు. ఆయన నాగపూర్లో 1946లో జన్మించారు.

వారి పూర్తిపేరు అనంత యశ్వంత్ ఖరే. కలంపేరు నందాఖరే. ఇంజనీరింగ్ చదివి తన తండ్రి వ్యాపార సంస్థలోనే పనిచేసి 2001లో రిటైరయ్యారు. 1981–1992 మధ్య మరాఠీ విజ్ఞాన పరిషత్తులో క్రియాశీల కార్యకర్తగా పనిచేసి, పాఠశాలల్లో విజ్ఞానశాస్త్ర అవగాహన కార్యక్రమాలలో పాల్గొన్నారు. 1998–2017 మధ్య 'అజ్బా సుధారక్' అనే పత్రిక సంపాదకవర్గంలో పనిచేశారు. 2014లో 'ఉద్యా' (రేపు)ను ప్రచురించారు. 2021లో సాహిత్య అకాడమీ ఇచ్చిన బహుమతిని తిరస్కరించారు. నవలలు, అనువాదాలు, ఆత్మకథ కలిపి మొత్తం 25 గ్రంథాలు రచించారు.

# చైతన్యవాహిని

**'రచయిత** అయిన ప్రతివాడూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందోనని ఆలోచించవలసిన అవసరం ఉందని భావిస్తాను. మంచికి హాని చెడ్డకు సహాయం చేయకూడదని నేను భావిస్తాను. ఇది తెలుసుకొందికి తెలియచెప్పటానికి నేను ఇదంతా రాశానని' చెప్పుకున్న రావిశాస్త్రి శతజయంతి సందర్భంగా 'ప్రజాసాహితి ప్రచురించిన రావిశాస్త్రి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ' 'క్షీణదోపిడీ వ్యవస్థపై సెర్చ్‌లైట్ రావిశాస్త్రి సాహిత్యం' అంటూ జనసాహితి సాహిత్య సభలను పలుచోట్ల నిర్వహించింది. అందులో భాగంగా....

**30-7-2022, విజయవాడ :** శిఖామణి సెంటర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో సాయంత్రం 6 గం॥లకు రావిశాస్త్రి సాహిత్యంపై సభ జరిగింది. ఈ సభకు వేములపల్లి రాధిక (జనసాహితి, విజయవాడ) అధ్యక్షత వహించారు. రావిశాస్త్రి జీవిత విశేషాలను, ఆమె తన అధ్యక్షోపన్యాసంలో వివరించారు. రిటైర్డు జిల్లా జడ్జి దుగ్గిరాల సత్యనారాయణరెడ్డి 'ప్రజాసాహితి' రావిశాస్త్రి ప్రత్యేక సంచికను ఆవిష్కరించి, రావిశాస్త్రి సాహిత్య పరామర్శ చేశారు. అరసం జాతీయ నాయకులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రావిశాస్త్రి సాహిత్య ప్రాసంగికతను వివరించారు. రావిశాస్త్రి సాహిత్యంపై అరసం ప్రచురించిన పుస్తకాలను చూపిస్తూ వివరించారు. సాహితీస్రవంతి వొరప్రసాద్ మాట్లాడుతూ రావిశాస్త్రి కథలను, నవలలను వాటి రచనాశైలినీ చర్చించారు. విరసం అధ్యక్షులు అరసవెల్లి కృష్ణ రావిశాస్త్రి జీవిత విశేషాలను తడుముతూ ఆయన సాహిత్యంలో స్త్రీ పాత్రలు గురించి వచ్చిన విమర్శలనూ – పేద ప్రజల పక్షాన నిలచిన ఆయన సాహిత్యం గురించి తెలియచేశారు. జనసాహితి అరుణ రావిశాస్త్రి రాసిన పొట్టి పిట్టకథలను పరిచయం చేశారు. ఆ కథలలో ఆయన తడిమిన జీవితాల్లోని సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను వివరించారు.

శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్‌కుమార్ రావిశాస్త్రిపై రాసిన కవితను చదివి విన్పించారు. చివరగా జనసాహితి అధ్యక్షులు దివికుమార్ మాట్లాడుతూ – నలభై సంవత్సరాలపాటు నిర్విరామంగా రచనలు చేసిన రావిశాస్త్రి సాహిత్యం అంతా పేద ప్రజల పక్షాన, వారిలోని లంపెన్ మనస్తత్వం – దానిని పెంచి పోషిస్తున్న సమాజంలోని రుగ్మతలను తెలియ చేసిందన్నారు. ఖచ్చితమైన కొలతలతో రూపొందిన ఆయన కథలలో ఒక వాక్యం తీసివేయలేము, చేర్చలేము అన్నట్లు వుంటాయని విమర్శకులు అనేవారన్నారు. సత్యం చెప్పేవాడిని హత్యచేసి అమాయకుడిని ఉరితీసే రాజకీయ పోలీసు న్యాయవ్యవస్థల తీరు తెన్నులను 60 ఏళ్ళ క్రితమే 'నిజం' నాటకంగా ఎక్స్‌రే తీసి, సమాజం ముందు దృశ్యమానం చేసినవాడు రావిశాస్త్రి అన్నారు. విరసం ఏర్పడిన తొలి సం॥లలో ఆయన ఉపాధ్యక్షుడిగా కొంతకాలం ఉన్నారనీ, ఆయన చివరిశ్వాస వరకు ప్రజలపక్షాన రాస్తూనే వున్నారన్నారు.

**7-8-2022, ఒంగోలు :** రావిశాస్త్రి శతజయంతి సందర్భంగా జనసాహితి ప్రకాశం జిల్లా శాఖ స్థానిక మల్లయ్య లింగం భవనంలో నిర్వహించిన సాహిత్య సభకు డాక్టర్ జి.వి. కృష్ణయ్య అధ్యక్షతవహించారు. సాంప్రదాయక రచయితలు అలగాజనంగా భావించే శ్రామిక ప్రజల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని రావిశాస్త్రి రచనలు చేశారన్నారు. సమాజంలో అసమానతలు ఉన్నన్నాళ్ళూ, శ్రామిక ప్రజల పోరాటాలకు ఆయన రచనలు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

ఈ సభలో ప్రకాశం యూనివర్సిటీ ఆచార్యులు ప్రొఫెసర్ హర్ష ప్రీతమ్ మాట్లాడుతూ ఈ వ్యవస్థ పేదలు – శ్రామికులను అన్యాయంగా ఎలా నేరస్తులుగా నిరూపించి శిక్షలు విధిస్తుందో 'నిజం' నాటకం ద్వారా రావిశాస్త్రి కళ్ళకు కట్టినట్లు చూపించారన్నారు. కొన్ని దశాబ్దాల క్రితం రావిశాస్త్రి వ్యవస్థ మీద చేసిన వ్యాఖ్యానాలు నేటికీ సజీవంగా ఉన్నాయని, వ్యవస్థ స్వభావాన్ని ప్రజానుకూలంగా మార్చాలని కోరుకునే ప్రతి ఒక్కరూ ఆయన సాహిత్యాన్ని తప్పకుండా అధ్యయనం చేయాలని ఆయన కోరారు. తెలుగు సాహిత్యానికి ఉత్తరాంధ్ర అందించిన ఆణిముత్యాలలో గురజాడ, గిడుగు, కాళీపట్నం రామారావు, చాగంటి సోమయాజులు, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు లాంటి ఉద్దండుల సరసన మరో మహా రచయిత రావిశాస్త్రని సృజన సాహితీ నాయకులు దివాకర దత్తు పేర్కొన్నారు. ప్రపంచ సాహిత్యంలోని ప్రముఖ రచనలన్నిటినీ టీనేజ్ లోనే చదివేసిన రావిశాస్త్రి ఆ జ్ఞానంతో రచనలు చేసి 'ఆంధ్ర చెకోవ్' అని శ్రీశ్రీ తో పిలిపించుకోగలిగాడని, మంచికి చెడు చేయని – చెడుకు మంచి చేయని రచనలు మాత్రమే చేసిన రావిశాస్త్రి మనందరికీ ఆదర్శప్రాయుడన్నారు.

కల్పిత పాత్రల చుట్టూ, పురాణ పురుషుల చుట్టూ తిరుగుతున్న తెలుగు సాహిత్యానికి సమాజాన్ని పరిచయం చేసి, సామాన్యుడిని కథానాయకుడుగా నిలబెట్టిన గురజాడ, శ్రీశ్రీల ఒరవడిలో రావిశాస్త్రి మరో ముఖ్యమైన ప్రజా రచయిత అని ప్రముఖ కవి ఉన్నం జ్యోతి వాసు నివాళులర్పించారు. జనసాహితి జిల్లా నాయకులు ఏసుదాసు మాట్లాడుతూ తెలుగుభాషలో సజీవమైన సామాజిక సాహిత్యాన్ని రావిశాస్త్రి, శ్రీశ్రీ, జాషువా గురజాడ వంటి రచయితలు సృష్టించారన్నారు. వదరూ అందించిన స్ఫూర్తితో కొనసాగటమే వారికి అందించే నిజమైన నివాళి అన్నారు.

ఈ సభలో రచయిత్రి రాజ్యలక్ష్మి, జనసాహితి నాయకులు శాంతికుమార్, డీవీ, ప్రగతిశీల మేధావుల వేదిక కన్వీనర్ పంగులూరి గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

**14-8-2022, అనకాపల్లి :** ప్రజారచయిత, సామాజిక న్యాయవాది రాచకొండ విశ్వనాథశాస్త్రి శతజయంతి సందర్భంగా, అనకాపల్లి జిల్లా & మండలం, బవులవాడ గ్రామంలోని ఆర్.వి.ఎస్. (రావిశాస్త్రి) నగర్‌లో కార్మికులు, శ్రామికప్రజల మధ్య రావిశాస్త్రి శతజయంతిసభ జరిగింది. ఈ సభను జనసాహితి మరియు ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధం అనకాపల్లి జిల్లా క్వారీ క్రషర్స్ కార్మికసంఘం నిర్వహించాయి.

ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా నాయకులు కోన మోహన్‌రావు సభకు అధ్యక్షత వహించగా, జనసాహితి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఓవీవీయస్ రామకృష్ణ మాట్లాడుతూ, ప్రజారచయిత, సామాజిక న్యాయవాదైన రావిశాస్త్రిగారి పేరును మా కాలనీకి 1997లోనే ఆర్‌విఎస్ నగర్‌గా పెట్టుకోవడం గర్వించదగ్గ విషయమని, దేశంలోనూ, ప్రపంచంలోనూ ఇటువంటి గౌరవం ఒక ప్రజారచయితకు దక్కడం చాలా గొప్ప విషయమన్నారు. రావిశాస్త్రిగారు ఏ అట్టడుగు జనం కోసమైతే నిరంతరం కోర్టుల్లో పోరాడారో, వాళ్ళకు జరుగుతున్న అన్యాయాలను, దోపిడీ పైనే కథావస్తువులుగా స్వీకరించి రచనలుగా మలిచారన్నారు. ఇక్కడున్నవారంతా వలస కార్మికులుగా అనేక చోట్ల నుంచి పొట్ట చేతపట్టుకొని వచ్చి క్వారీ, క్రషర్ కార్మికులుగా, కంపెనీల్లో కూలి పనులు చేసుకునేవారిగా, భవన నిర్మాణ కార్మికులుగా వున్నారన్నారు. ప్రభుత్వాల మోసపూరిత విధానాలతో కార్మికుల, రైతుల, సామాన్యుల జీవితాలు కష్టభరితంగా మారుతున్నాయనీ, పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత కుబేరులుగా మారుతున్న ఈ వ్యవస్థే సమస్త ప్రజల బాధలకు కారణమన్నారు. దాన్ని ఎదిరించేందుకు ఐక్యతతో పోరాడే చైతన్యాన్ని రవిశాస్త్రిగారి రచనలు మనకు అందిస్తాయన్నారు.

జనసాహితి జిల్లా అధ్యక్షులు ఐ.టి.ఆర్.వి. శివాజీరావు మాట్లాడుతూ ఆజాదీకా అమృత మహోత్సవం పేరుతో పాలకులు పండుగలు చేస్తున్న పరిస్థితుల్లో, రోజురోజుకీ ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు తీవ్రంగా పెరుగుతున్నాయని, కరోనా కాలంలో కోట్లాదిమంది కార్మికుల పనులు లేక పస్తులతోనూ, లక్షలాదిమంది వైద్యం అందక పిట్టల్లా రాలిపోతుంటే, అంబానీ, ఆదానీల ఆస్తులు మాత్రం గంటకు 200 కోట్లు పెరిగాయని, ఇది మన ప్రభుత్వాలు ప్రజాసంపదలను కార్పొరేట్లకు దోచిపెట్టడంతోనే సాధ్యమైందన్నారు. ఈ సమాజంలో చట్టం, న్యాయం, రాజ్యాంగం డబ్బున్నోడికే సేవ చేస్తుందని, పేదోడిని అణచివేస్తుందని ఆనాడే రావిశాస్త్రిగారు చెప్పారని "సొమ్ములు పోనాయండి" నవలలోని అంశాలను వివరించారు.

ఓపిడిఆర్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె. గౌరీశంకర్ రావిశాస్త్రి అమరులైనపుడు 'ప్రజాసాహితి' ప్రచురించిన ప్రత్యేక సంచికలోని ఛాయరాజ్ రాసిన "ఛాత్రి బావుకు దండాలండీ" రచనను చదివి వినిపించారు. జనసాహితి జిల్లా కార్యదర్శి ఎస్. నూకాచారి "ఆరు సారా" కథల్లోని "మాయ" కథ సంభాషణలు చదివి వినిపించారు. ఇవి సభికులందరి మనసులను హత్తుకొని ఆలోచింపజేశాయి.

ఇంకా ఈ కార్యక్రమంలో బౌలువాడ గ్రామపంచాయితీ సర్పంచ్ మజ్జి వెంకట అప్పారావు, కాలనీ వార్డు మెంబర్ రెహమాన్, క్వారీ కార్మికుల సంఘం నాయకులు గడి సూర్యారావు, సిహెచ్ రమేష్, కార్మికులు, కాలనీ ప్రజలు, మహిళలు, వివిధ గ్రామాల నుండి రావిశాస్త్రి అభిమానులు, పిడిఎస్‌ఓ నాయకులు పాల్గొన్నారు. సభ ఆరంభంలో కళాకారులు శ్రమ సౌందర్యంపై, ప్రజాకళాకారులకు జోహార్లు అర్పిస్తూ పాటలు పాడారు.

**19-8-2022, తుంపాల :** రావిశాస్త్రి స్వగ్రామమైన తుంపాలలో ఆయన శతజయంతి మరియు 'ప్రజాసాహితి' వెలువరించిన రావిశాస్త్రి శతజయంతి సంచిక ఆవిష్కరణసభను జనసాహితి నిర్వహించింది. ఈ సభకు జనసాహితి అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎస్.నూకాచారి ఆహ్వానం పలుకగా శివాజీరావు అధ్యక్షత వహించారు.

ఈ సభలో రావిశాస్త్రి శతజయంతి సంచికను ఆవిష్కరించిన ఆర్కే హాస్పిటల్స్ ఎం.డి, డాక్టర్ వి. కృష్ణమూర్తి రావిశాస్త్రితో గల అనుబంధాన్ని పంచుకున్నారు. మొదటిసారిగా తన బంధువు ఇంటిలో తనకు ఆరుసారా కథల పుస్తకం దొరికిందని, మొదటిసారిగా అలాంటి కథలు,అందులోని వ్యక్తులు, అలాంటి భాష తనకు పరిచయం అయ్యాయని, ఆ కథలు చదివిన తర్వాత ఆ పాత్రలు మనల్ని వెంటాడతాయని, ఆ రచనలు చేసిన రావిశాస్త్రిని ఎలాగైనా కలుసుకోవాలని అపుడే నిర్ణయించుకున్నానన్నారు. ప్రపంచ సాహిత్యంలో గోర్కీ, డికెన్స్, చేహూవ్ వంటి రచయితలు వుండవచ్చు కానీ వాళ్లకు రావిశాస్త్రి లేడని మనకు మాత్రమే ఉన్నాడనీ అన్నారు. లంపెన్ వర్గం తయారవడానికి వ్యవస్థే కారణమని, అందుకు పాలనాంగాలన్నీ ఎలా దోహదపడతాయో రావిశాస్త్రి కోర్టులో న్యాయవాద వృత్తి చెయ్యడం వలన ప్రత్యక్షంగా చూసే అవకాశం కలిగిందని, తను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తులనే తన కథల్లో పాత్రలుగా మలిచారన్నారు. తాను విశాఖలో స్థిరపడడానికి విద్యార్థి దశలో తాము చేసిన ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన స్టీల్ ప్లాంట్ ఒక కారణమైతే, మరొక కారణం రావిశాస్త్రి అన్నారు. ముఖ్యంగా రావిశాస్త్రి కథలను విద్యార్థి యువజనులకు పరిచయం చెయ్యవలసి వుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి మాట్లాడుతూ కొకు లాంటి వాళ్ళు మధ్య తరగతి జీవితాలను కథా వస్తువులుగా స్వీకరిస్తే రావిశాస్త్రి అధోజగత్ సహోదరుల జీవితాలను కథలుగా, నవలలుగా నాటకాలుగా మలిచాడని అన్నారు. 'వేతన శర్మ' కథలో వేతన జీవులుకు వున్న కారణాలుతో రాజ్యంతో కుమ్మక్కై ఉద్యమానికి ఎలా ద్రోహం చేశారో వివరించారని అన్నారు. ఈ కథ 56 రోజులు జరిగిన ఎన్ జీ వో సమ్మె సందర్భంగా రాశారని అయితే ఆనాడు ఈ కథపై విమర్శలు వచ్చాయని గుర్తు చేశారు. విజయవాడలో 2022 ఫిబ్రవరి 3న బీఆర్‌టీఎస్ రోడ్డులో జరిగిన నాలుగు లక్షల మంది ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికవర్గం జరిపిన మెరుపు సమ్మె ప్రభుత్వంతో మిలాఖాత్ అయిన

ఉద్యోగవర్గ నాయకుల కారణంగా నిర్వీర్యం అయిపోయిందని ఈ ఘటన మరోసారి వేతన శర్మ కథను గుర్తుకు తెచ్చిందన్నారు. రావిశాస్త్రి తన రచనల ద్వారా ఆచరణ ద్వారా మధ్యతరగతి వర్గం ఎటు నిలబడాలి అన్నది స్పష్టం చేశారన్నారు.

అనంతరం నర్సీపట్నం డిగ్రీ కాలేజి తెలుగు అధ్యాపకులు శ్రీమతి వి.కే.టి.మహాలక్ష్మి మాట్లాడుతూ, రావిశాస్త్రి ఇంట్లో కూర్చొని వున్న తెలుగు కథని ముస్తాబు చేసి వీధిలోకి తీసుకువచ్చారన్నారు. ఆయన చివరి నవల 'ఇల్లు' చదివితే భయం వేస్తుందనీ, ఆయన రాసిన వర్షం, మెరుపు వంటి కథల్లో మానవ ఉద్వేగాలను ఎంతో సున్నితంగా చెప్పారన్నారు.

రావిశాస్త్రి కుమారుడు ఉమాకుమార శాస్త్రి, తన తండ్రి జీవిత విశేషాలను సభికులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆహ్వానించడం ద్వారా తమ తండ్రి ఊరుకు అందర్నీ రప్పించిన జనసాహితికి ధన్యవాదాలు తెలియజేసుకున్నారు.

జనసాహితి రచయిత గౌరీ శంకర్ ప్రసిద్ధ కవి చాయారాజ్ రాసిన ఏకాంకిక 'దండాలండీ బావు – ఛాత్రి బావుకు దండాలు'ను ప్రదర్శించారు.

జనసాహితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఓవీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ రావిశాస్త్రి కథల్లోని శిల్పం, శైలి, కవిత్వం అంటూ ఇటువంటి వాటిని వస్తువు నుంచి వేరుచేసి మాట్లాడుతున్నారన్నారు. రావిశాస్త్రి వ్యక్తిగత జీవితం గురించి విశేషాలు మాట్లాడుతున్నారు, దీని మాటున ఆయన సామాజిక జీవితాన్ని, ఆచరణను, ఆయన విలువలను కప్పి పుచ్చుతున్నారని అన్నారు. ఇది రావిశాస్త్రికి తీరని అన్యాయం చేసినట్టేనని అన్నారు. రావిశాస్త్రి సాహిత్యాన్ని ఏ ఆశయం కోసమైతే రచించారో, ఏ సమాజాన్ని కాంక్షించారో, ఆ ఆశయం కోసం నిలబడేవాళ్ళు, ఆ సమాజాన్ని కోరేవారు అందుకు సామాజిక ఆచరణలో పాల్గొనేవారే ఆయనకు నిజమైన వారసులు అని అన్నారు.

న్యాయవాది పిళ్ళా హర్‌శ్రీనివాస్ మాట్లాడుతూ రావిశాస్త్రి విగ్రహం ఆయన సొంత వూరైన తుంపాలలో పెట్టాలని ప్రతిపాదించారు. సీనియర్ న్యాయవాది రావిశాస్త్రితో తన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ఈ సభలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు, తుంపాల గ్రామ పెద్దలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

## అణుబాంబుల విధ్వంసంపై స్లైడ్ షో కార్యక్రమాలు

రెండో ప్రపంచయుద్ధం సమయంలో 1945 ఆగస్టు 6, 9 తేదీలలో అగ్రరాజ్యం అమెరికా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకీలపై అణుబాంబులను ప్రయోగించింది. 76 ఏళ్ళక్రితం జరిగిన ఈ అణుబాంబుల దాడి ఫలితంగా సంభవించిన విధ్వంసం ఈనాటికీ అక్కడ ప్రజలను, ఆ విషాదం ప్రపంచ ప్రజలను వెంటాడుతూనే వుంది. యుద్ధం వద్దు! శాంతి కావాలి!!, అణ్వాయుధాలు కాదు, అన్న వస్త్రాలు కావాలి!! అని, బడుగు దేశాలపై, పీడిత ప్రజలపై అమెరికా సామ్రాజ్యవాదం చేస్తూన్న ఆధిపత్యాన్ని దాడులను, యుద్ధాలను వ్యతిరేకిద్దాం! అని, దేశ ప్రజల జీవనోపాధిని, పర్యావరణాన్ని సర్వనాశనం చేసే అణుకర్మాగారాల నిర్మాణాలను అడ్డుకుందాం! అనే పిలుపులతో హిరోషిమా – నాగసాకీ డేల సందర్భంగా కలకత్తాలోని 'ముందడుగు' సంస్థకి చెందిన బాలాజీ హిరోషిమా – నాగసాకీ అణువిధ్వంసంపై ప్రదర్శించే స్లైడ్ షోలను జనసాహితి పలుచోట్ల నిర్వహించింది. ఈ స్లైడ్‌షోలను 'ప్రజాసాహితి' సంపాదకులు నిర్మలానందకు అంకితమిస్తూ 'ముందడుగు' సంస్థ నిర్వహించింది.

**9-8-2022, విజయవాడ :** వన్‌టౌన్ గొల్లపాలెం గట్టు దగ్గర గల అరుణ కాన్వెంట్ స్కూలులో 8, 9, 10 తరగతుల విద్యార్థులతో ఈ షో నిర్వహించబడింది. విద్యార్థులకు జనసాహితి ప్రధాన కార్యదర్శి అరుణ నాగసాకీ డే – ఎందుకు జరుపుకుంటున్నామో, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ ప్రజలను అనారోగ్య పీడితులుగా ఎలా మారుస్తున్నారో, సహజవనరులను కొల్లగొడుతూ సామ్రాజ్యవాదుల కనుసన్నలలో మన పాలకులు ఎలా దోపిడీ చేస్తున్నారో వివరించారు. అనంతరం ఐకా బాలాజీ, తారకేశ్వర్ స్లైడ్ షోలను పిల్లలను సమన్వయం చేసుకుంటూ నిర్వహించారు. విరసం అరసవెల్లి కృష్ణ, గొల్లపాలెం గట్టు కార్పొరేటర్ సత్తిబాబు, అరుణ కాన్వెంట్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడారు. 8, 9, 10 తరగతుల పిల్లలు ఈ షోపై తమ అభిప్రాయాలను తెలియచేశారు. అరుణ కాన్వెంట్ దుర్గారావు ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు.

**9-8-2022, విజయవాడ :** వన్‌టౌన్ టైలర్‌పేటలో సాయంత్రం 6:30 గం॥లకు అణువిధ్వంసంపై స్లైడ్ షోలను నిర్వహించారు. ముందుగా జనసాహితి ప్రధానకార్యదర్శి అరుణ నాగసాకీ డే గురించి వివరించారు. అలాగే ఆరోజు ఆదివాసీదినం. ఆ సందర్భంగా ఆదివాసీలను అడవుల నుండి గెంటివేసే పాలకుల విధానాల గురించి వివరించారు. స్లైడ్ షో ప్రారంభంలో ఆదివాసీ పాటలను ప్రదర్శించారు. ఐకా బాలాజీ, తారకేశ్వర్‌లు స్లైడ్ షోలను ఆ ప్రాంతపు ప్రజలకు అర్థమయ్యే భాషలో వివరించారు. జనసాహితి మీసాల ఏడుకొండలు వందన సమర్పణ చేశారు.

**10-8-2022, ఒంగోలు :** జనసాహితి ఆధ్వర్యంలో హిరోషిమా, నాగసాకి అణు విధ్వంసంపై ఒంగోలులోని శ్రీ హర్షిని డిగ్రీ కళాశాలలో స్లైడ్ షో మరియు లఘుచిత్రాల ప్రదర్శన జరిగింది. "ముందడుగు" విద్యా విజ్ఞాన సాహిత్య వేదికకు చెందిన ఐకా బాలాజీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అణురియాక్టర్ల వలన ఉన్న ప్రమాదం, అణుధార్మికత ప్రభావం, భవిష్యత్ మానవ సమాజం పై కలిగించే దుష్ప్రభావాలను వివరించారు. సైన్స్ మానవ వికాసానికి ఉపయోగపడాలి గాని, వినాశనానికి కారణం కాకూడదు అన్నారు. ఈ కార్యక్రమానికి జనసాహితి కోశాధికారి డాక్టర్ శాంతికుమార్ సంధానకర్తగా వ్యవహరించారు. కవి రచయిత మంచికంటి, రాజ్యలక్ష్మి, కాలేజీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీ హర్షిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు సహాయ సహకారాలు అందించారు.

**11-8-2022, విజయవాడ :** గుణదల, గంగిరెద్దులదిబ్బపై గల అభ్యాస విద్యాలయంలో ఉదయం 11 గం॥లకు అణువిధ్వంసంపై స్లైడ్ షో జరిగింది. జనసాహితి అరుణ ఆ కార్యక్రమాన్నీ 'ముందడుగు' సంస్థ సభ్యులను పిల్లలకు పరిచయం చేశారు. 7,8,9,10 తరగతుల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం తర్వాత విద్యార్థులు చాలా సృజనాత్మకంగా ఈ స్లైడ్ షోపై స్పందించారు. అభ్యాస విద్యాలయం ఉపాధ్యాయుడు వందన సమర్పణ చేశారు. అభ్యాస విద్యాలయం కృష్ణ, మాలతిలు కార్యక్రమానికి సహాయ సహకారాలందించారు.

**11-8-2022, విజయవాడ :** గుణదల రాజారామ్మోహన్‌రాయ్ హైస్కూలులో మధ్యాహ్నం 3 గం॥లకు అణువిధ్వంసంపై స్లైడ్ షో జరిగింది. స్లైడ్ షో గురించి, పర్యావరణ విధ్వంసం గురించి - పాలకులు అనుసరిస్తూన్న విద్యా వ్యతిరేక విధానాల గురించి పిల్లలకు జనసాహితి అరుణ వివరించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులతో ఐకా బాలాజీ, తారకేశ్వర్‌లు స్లైడ్ షో ద్వారా ఇంటరాక్టు అయ్యారు. విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజారామ్మోహనరాయ్ ఉపాధ్యాయిని వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఓ కోశాధికారి భాను, ప్రజానాట్యమండలి పిచ్చయ్య పాల్గొన్నారు. పిచ్చయ్య తన పాటతో విద్యార్థులను ఉత్తేజపర్చారు.

**12-8-2022, శ్రీకాకుళం :** జనసాహితి శ్రీకాకుళం జిల్లాశాఖ నిర్వహణలో 'ముందడుగు' సంస్థ (కలకత్తా) సహకారంతో శ్రీకాకుళం జిల్లాలో మూడురోజులపాటు కార్యక్రమాలు జరిగాయి. కలకత్తా బాలాజీ టీం స్లైడ్ షో, ఫిలిం ఫెస్ట్ నిర్వహించారు. దీనిలో భాగంగా రెండవ ప్రపంచయుద్ధ సమయంలో జపాన్‌పై సామ్రాజ్యవాద అమెరికా ప్రయోగించిన అణుబాంబు ఎంతటి విధ్వంసం సృష్టించిందో తెలియజేస్తూ 'హిరోషిమా - నాగసాకి అణువిధ్వంసం'పై స్లైడ్ షో ప్రదర్శన 12-8-22న ఉదయం గవర్నమెంట్ హైస్కూల్, జలుమూరు నందు, మధ్యాహ్నం ఎం.పి.యు.పి. పాఠశాల, చిన్నఒమ్మిడి నందు; 13-8-22న ఉదయం ప్రగతి పబ్లిక్ స్కూల్, ప్రియా అగ్రహారం నందు, మధ్యాహ్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిలకపాలెం నందు నిర్వహించడం జరిగింది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ భావాలను స్పందన రూపంలో తెలియచేశారు.

14-8-2022 ఆదివారం ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శ్రీకాకుళం పి.ఎస్.ఎన్.ఎం. హైస్కూలు నందు "మార్పు కోసం మంచి సినిమా" సందేశాత్మక చిత్ర ప్రదర్శన ఏర్పాటుచేసి 20 వివిధ భాషా లఘుచిత్రాలు ప్రదర్శించారు. ప్రతి లఘు ప్రదర్శన అనంతరం సభికులతో చర్చించారు.




**సరళ సుందర సునిశిత మమత : (కవిత్వం)**

బెంగాలీ మూలం : మమతా బెనర్జీ; తెలుగు అనువాదం : సామాన్య.

1/8 డెమ్మీలో 117 పుటలు. వెల : రూ. 100/- మొదటిముద్రణ : జూలై 2020. ప్రచురణ : పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్-500036. సెల్ : 98487 87284.

**కవిత్వ పరామర్శ : ('సురక్ష' పోలీసు పత్రికలో వచ్చిన విమర్శనా వ్యాసాలు)**

రచన : డా॥ సి. హెచ్. సుశీలమ్మ

1/8 డెమ్మీలో 188 పుటలు. వెల : రూ. 150/- మొదటిముద్రణ : 26 నవంబర్ 2020. ప్రచురణ : శ్రీ సిహెచ్. లక్ష్మీనారాయణ పబ్లికేషన్స్, 4/3, అశోక్‌నగర్, గుంటూరు. సెల్ : 83338 68879.

ప్రతులకు : డా॥ సి. హెచ్. సుశీలమ్మ, 214, నారాయణాద్రి, ఎస్.వి.ఆర్.ఎస్. బృందావనం, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500035.

**ఊడలు : (సాంఘిక నాటకం)**

రచన : చింతాడ రామారావు (సిరా)

1/8 డెమ్మీలో 81 పుటలు. వెల : రూ. 150/- మొదటిముద్రణ : ఏప్రియల్ 2020. ప్రచురణ : సాహితీ స్రవంతి ప్రచురణ.

ప్రతులకు : చింతాడ రామారావు, డో.నెం. 8-52, తిలక్‌నగర్, చినబొందిలపురం దగ్గర, శ్రీకాకుళం - 532001. సెల్ : 98660 87709. మరియు ప్రజాశక్తి, విశాలాంధ్ర, నవోదయ పుస్తకాల షాపుల్లో.

**మాట : (దీర్ఘకవిత)**

రచన : చిన్ని నారాయణరావు.

1/8 డెమ్మీలో 131 పుటలు. వెల : రూ. 150/- మొదటిముద్రణ : అక్టోబర్ 2010. ప్రచురణ : మల్లెతీగ ముద్రణలు, విజయవాడ. ప్రతులకు : చిన్ని నారాయణరావు, 27-1-171, శ్రీ నికేతనమ్, ఆదిత్య నగర్, చిల్డ్రన్ పార్క్ వీధి, నెల్లూరు - 524002. సెల్ : 94402 02942. మరియు అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో.

**నెల్లూరు సంగతులు, చరిత్ర :**

రచన : ఈతకోట సుబ్బారావు.

1/8 డెమ్మీలో 304 పుటలు. వెల : రూ. 280/- మొదటిముద్రణ : డిశంబరు 2020. ప్రతులకు : ఈతకోట సుబ్బారావు, 24/1697, 2వ వీధి, రవీంద్రనగర్, నెల్లూరు - 524004, సెల్ : 94405 29785.

**కల్లోల కరోన : (ఆటవెలది పద్య శతకం)**

రచన : చెన్నుపాటి రామాంజనేయులు

1/8 డెమ్మీలో 40 పుటలు. మూల్యం : అభిమానం.

మొదటిముద్రణ : జనవరి 2021. ప్రతులకు : చెన్నుపాటి రామాంజనేయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఫ్లాట్ నెం : 106, శివసాయి రెసిడెన్సీ, నాగులపాడు రోడ్డు, అద్దంకి, ప్రకాశంజిల్లా. సెల్ : 99123 09463.

**నన్ను మాట్లాడనివ్వండి : (కవిత్వం)**

రచన : మల్లాప్రగడ రామారావు

1/8 డెమ్మీలో 71 పుటలు. వెల : 90/- మొదటిముద్రణ : అక్టోబరు 2020. ప్రచురణ : ప్రియమైన రచయితలు, సింహాచలం (పోస్టు) విశాఖపట్నం - 530028. సెల్ : 99511 71696. ప్రతులకు : విశాలాంధ్ర, నవచేతన, విశాఖ సాహితి, విశాఖ ప్రియమైన రచయితల సాహిత్య సంక్షేమ సంఘం(రి)ల యందు.

**కొత్త సూర్యుళ్ళు మొలిచితీరాలి : (కవిత్వం)**

రచన : రావి రంగారావు

1/8 డెమ్మీలో 128 పుటలు. వెల : రూ.100/- మొదటిముద్రణ : డిశంబరు 2020. ప్రచురణ : రావి రంగారావు సాహిత్య పీఠం, గుంటూరు. ప్రతులకు : నర్రా ప్రభావతి (కన్వీనర్), రావి రంగారావు సాహిత్య పీఠం, 101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్, 5వ లైను, ఈస్ట్ గోరంట్ల, గుంటూరు - 522034, మొబైల్ : 92475 81825.

**కరోన వైరస్ : ముందు జాగ్రత్తలే.... మందు - వ్యాక్సిన్**

రచన : టి. సేవాకుమార్ (సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (SHO))

1/8 డెమ్మీలో 56 పుటలు. వెల : రూ.60/- ప్రథమముద్రణ : ఆగస్టు 2020. ప్రచురణ : డాక్టర్ తాతా సేవాకుమార్, 2/1, బ్రాడీపేట, గుంటూరు - 522002. ఫోన్ : 0863-2242995, 2332465. ప్రతులకు : ఎస్.హెచ్.ఒ. క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్, ఎస్.హెచ్.ఒ. బిల్డింగ్, 2/1, బ్రాడీపేట, గుంటూరు - 522002. ఫోన్ : 98483 91212, 75697 02090. మరియు ధర్మా క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్, ధర్మా భవన్, 2వ లైను, రామిరెడ్డి తోట, ఓల్డ్ క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు - 522001. ఫోన్ : 0863 - 2332465, 82475 44703.

**దూరమెంతైన : (కవిత్వం)**

రచయిత : గోపగాని రవీందర్.

1/8 డెమ్మీలో 120 పుటలు. వెల : రూ.100/- మొదటిముద్రణ : డిశంబరు 2019. ప్రచురణ : పాలపిట్ట బుక్స్, హైదరాబాదు. ప్రతులకు : గోపగాని రమణశ్రీ, 40-18-38/1, ఝాన్సీనగర్, బాబాహోటల్, పెన్షన్‌పూర్ దగ్గర, మమునూర్, వరంగల్ - 506005. మొబైల : 94409 79882.

**విజయవాడ సందర్భనం :**

రచన : చలపాక ప్రకాశ్

1/8 డెమ్మీలో 224 పుటలు. వెల : రూ.200/- మొదటిముద్రణ : 2020. ప్రచురణ : చలపాక ప్రకాశ్, 1-4/3-36, సంజయ్‌గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ - 520012. సెల్ : 92474 75975. ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌వారి అన్ని శాఖలలో.

**మా ఊరి మట్టి : (కవిత్వం)**

రచన : పొన్నాడ వరాహ నరసింహులు

1/8 డెమ్మీలో 116 పుటలు. వెల : రూ.100/- మొదటిముద్రణ : మార్చి 2021. ప్రచురణ : విశ్వసాహితి, ఆముదాలవలస - 532185, శ్రీకాకుళం జిల్లా. ప్రతులకు : పొన్నాడ లక్ష్మి, సాహితినగర్, బి.ఆర్.నగర్, ఆముదాలవలస - 532185. శ్రీకాకుళం జిల్లా. సెల్: 85000 13743. కె. జనార్ధనరావు, సెక్రటరీ, విశ్వసాహితి, సాహితీనగర్, బి.ఆర్.నగర్, ఆముదాలవలస. సెల్ : 94928 58623. మరియు అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో.

**ఎలియనేషన్ వాద : దళిత కవితాసంకలనం 2020**

సంపాదకుడు : నేతల ప్రతాప్‌కుమార్

1/8 డెమ్మీలో 148 పుటలు. వెల : రూ.150/- మొదటిముద్రణ : అక్టోబర్ 2020. ప్రచురణ : అంబేద్కర్‌వాద రచయితల సంఘం (అంరసం), ఆంధ్ర, తెలంగాణ. ప్రతులకు : నేతల పద్మాప్రతాప్, అంబేద్కర్ అధ్యయన కేంద్రం, డో.నెం. 3-152, శ్రీరాంనగర్, పైడిపర్రు, తణుకు, పశ్చిమగోదావరి - 534211. ఫోన్ : 95504 36286. మరియు అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో.

**మళ్ళీ ఎప్పుడొస్తావక్కా....? : కథాసంకలనం**

రచన : చందు సుబ్బారావు

1/8 డెమ్మీలో 124 పుటలు. వెల : రూ.120/- రెండవ ముద్రణ : 2019. ప్రచురణ : సమత పబ్లిషర్స్. ప్రతులకు : సమత పబ్లిషర్స్, విశాలాంధ్ర, ప్రజాశక్తి, ఎమెస్కో ఇతర పుస్తక విక్రయ కేంద్రాలలో.

**జాతీయ విద్యా విధానం 2020ని ఎందుకు వ్యతిరేకించాలి : (ప్రముఖ విద్యావేత్తల ఆలోచనాత్మక వ్యాస సంకలనం)**

సంకలనకర్త : ఎనిశెట్టి శంకర్

1/8 డెమ్మీలో 128 పుటలు; ఆర్థిక సహాయం : రూ.50/- మొదటిముద్రణ : అక్టోబర్ 2020.

**మతహింసే ఆయుధంగా : సి.ఎస్.ఎస్.ఎస్. నివేదికకు స్వేచ్ఛానువాదం**

రచన : ఎనిశెట్టి శంకర్

1/8 డెమ్మీలో 40 పుటలు; వెల : రూ.20/- మొదటిముద్రణ : అక్టోబర్ 2020.

**జాతీయవాదం చారిత్రక నేపథ్యం :**

ఆంగ్లం : రొమిలా థాపర్ (ప్రముఖ చరిత్రకారిణి)

అనువాదం : ఎనిశెట్టి శంకర్

1/8 డెమ్మీలో 32 పుటలు. వెల : రూ.15/- మొదటిముద్రణ : జూలై 2020.

పై మూడు పుస్తకాల ప్రచురణ : స్నేహ ప్రచురణలు, నిజామాబాద్.

ప్రతులకు : తుర్లపాటి లక్ష్మి, ఫ్లాట్ నెం : 104, శారదా సుందర్ రెసిడెన్సీ, బాపునగర్, చౌడి దగ్గర, సరూర్ నగర్, హైదరాబాద్ - 500035. మొబైల్ : 98666 30739, 97042 25469.

కవిత

# అమృత మహోత్సవం


- చల్లా రామఫణి

ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడాల్సిన అగత్యం ఏర్పడింది
దైవభక్తి లేనివాణ్ణి నాస్తికుడంటారు
మరి దేశభక్తి లేకపోతే ఏమంటారో?
రాక్షస మంత్రి విషకన్యను తయారుచేయడం
నేను అనుక్షణం కళ్ళారా చూస్తున్నాను!
కలియుగ కాదంటే అది కాటేస్తుంది!
ఇప్పుడు గోబెల్స్ పార్లమెంట్ వేదికగానే మాట్లాడుతున్నాడు
మన ఓట్లే వాడికి విటమిన్లు పోషకాలు
నీ పిల్లలకి తిండి లేకపోతే ఏంటి?
వాళ్ళు వరదల్లో కొట్టుకుపోతే ఎక్కడికెళ్ళాలి?
సామాజిక మాధ్యమాల్లోనైనా సమాజం మధ్యలోనైనా
ఇప్పుడు దేశభక్తి ఎవరికుందో
ఎవరికి లేదో నీ భక్తోమీటర్‌తో కొలిచెయ్యచ్చు
అప్పట్లు మా శిష్యుల్ని అడిగాను
నా దేశభక్తి నిరూపించుకోవడానికి.....
గీతాంజలి రాసింది మణిరత్నం అన్నాడొకడు
వందేమాతరం రాసింది ఎ.ఆర్.రెహ్మాన్ అన్నాడింకొకడు
జాతీయ జెండా ఎవరు తయారుచేశారురా అని అడిగాను
ఇంకెవరు సుభాష్ చంద్రబోస్ అనేశాడు
నా దేశభక్తికి వాడు పెట్టిన విషానికి విరుగుడు లేదు
ఇప్పుడు మనం దేశభక్తి గురించే మాట్లాడుకోవాలి
డిపిలు మార్చుకోమని
అందరూ దేశభక్తి బూస్టర్ డోసులు
తప్పకుండా వేయించుకోవాలని సర్కారువారి ఫర్మానా!
డబ్బయి ఐదేళ్ళ ఆజాదీ కా అమృత మహోత్సవ
ప్రజాస్వామ్య సెక్యులర్ దేశంలో
నా జీవితం నేను అమ్ముకున్న ఓటు విధించిన జరిమానా!
ఇప్పుడు దేశభక్తిని గురించి మాట్లాడాల్సిన
సమయం ఆసన్నమైంది
ఇళ్ళు కూలగొట్టి గుళ్ళు కట్టే జమానాలో
బళ్ళు కూలగొట్టి మాల్స్ కట్టే మహాద్భుత వినోదాల
భూతల స్వర్గంలో
ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడాల్సిన అవసరం
ఎంతైనా ఉంది

అధికారం అవినీతికి రక్షణ కవచం అయిపోయిన రోజుల్లో
నా ఖాతాలో సర్కారువారు ఉచితంగా వేసే డబ్బుల కోసం
సన్యాసిలా సముచితంగా ఎదురుచూస్తూ
ఒక్కసారి కళ్ళు ముక్కూ మూసుకుని
స్వాతంత్ర్య సమరయోధుల్ని
తలచుకుని దేశభక్తికి పునరంకితం కావలసిన అవసరం
ఇప్పుడు అత్యవసరం!
అసలు అంకితమైనదెపుడని మీరడిగితే
నా దేశభక్తిని శంకించినట్టే!
ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడుకోవలసిందే!
అవినీతి వరదల్లో ఈదేవాడికి జీవితాల్ని ముంచేసే వరదల్ని
పట్టించుకునే తీరికెక్కడిది?
వాడి బతుకు ప్రాజెక్టుకు వరం అధికారం!
నాకెప్పుడూ గాలి పోగేసిన నవరత్నాలు
వాడి బతుకెప్పుడూ వజ్ర వైఢూర్యాలు
ఇల్లంతా కరెన్సీ వరద
కేడీల నుంచి తప్పించుకుంటూ ఆన్‌లైన్లో
విమానం కొనుక్కో
ఎప్పుడైనా పారిపోవలసి రావచ్చు!
ఎవరూ గుర్తు పట్టకుండా భారతీయుడిలా
మేకప్ వేసుకోవడం నేర్చుకో!
ఇప్పుడు కదా దేశభక్తిని గురించి మాట్లాడాల్సింది!
ముప్పు మాత్రం చైనావాడు తయారుచేసిన
జెండా గుడ్డ గోచీ పెట్టుకుని
బుద్ధిగా జపం చేసుకుని దేశభక్తి పాఠాల ప్రవచనాలు
నీ సామాజిక మాధ్యమాల గోడల మీద వాంతి చేసుకో!
దేశభక్తి కథలు తలచుకుంటూ ఒక సంవత్సరం నిద్రపో!
దేహభక్తితో చరవాణి చర్మ సంపర్క సుఖంతో
పగటి కలల కౌగిళ్ళలో కళ్ళు వాచిపోయేలా నిద్రపో!
డబ్బై ఆరవ సంవత్సరంలో కుంభకర్ణ నిద్ర లేచి
మళ్ళీ డిపి మార్చుకోవాలిగా!

PRAJA SAAHITI August & September 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 60 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

# మహోజ్జ్వల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం



ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI